www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి

శుక్రవారం | 16-3-2018 | పేజీలు: 16 + 20 | వెల: రూ. 5.00 | సంపుటి: 58 సంచిక: 330 | శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: చతుర్దశి సా. 6.18 తదుపరి అమావాస్య; నక్షత్రం: శతభిషం రా. 6.45 తదుపరి పూర్వాభాద్ర; వర్జ్యం: రా. 1.24 నుంచి 3.04 వరకు; దుర్ముహూర్తం: ఉ. 8.50-9.38, మ. 12.48-1.36; అమృతఘడియలు: ఉ. 11.05-12.47; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.27; సూర్యాస్తమయం: 6.22 | విజయవాడ సిటీ*


Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai

మీ ఆటలు సాగవు!

మోదీ... మీకు భయపడాలా?

ఇవ్వాల్సినవి అడిగితే దాడి చేస్తారా?





"రాష్ట్రాల్లోని నాయకత్వాన్ని బలహీనపరచడం వీరికి అలవాటైపోయింది. కేసులు ఉన్నవారైతే వారి చెప్పు చేతల్లో ఉంటారు. నాకు భయం లేదు. నలభై సంవత్సరాల్లో ఎన్నో సంక్షోభాలు చూశా. ఎప్పుడూ భయపడలేదు. భయం నా జీవితంలోనే లేదు. ప్రజల కోసం ముందుకుసాగుతాను"

"ఈ క్లిష్ట సమయంలో మనకు చేసిన అన్యాయంపై మోదీని నిలదీయాలి. కానీ జనసేన అధినేత ఏం చేస్తున్నారు? హక్కుల కోసం పోరాడుతున్న నన్ను బలహీనపరచాలని చూస్తారా? నాలుగేళ్లు ఏమీ మాట్లాడకుండా... ఎప్పుడూ కనబడని అవినీతి, ఇతర విషయాలు ఇప్పుడే కనబడుతున్నాయా?"

తమిళనాడు తరహాలో రాష్ట్రంలో జోక్యమా?.. రెచ్చగొట్టి పంపిస్తారా?

ఎన్డీయే సర్కారుకు ఇదే హెచ్చరిక.. భయపడం... మరింత రెచ్చిపోతాం

వైసీపీని నమ్మితే జీవితాలు తాకట్టే.. వారివి నాటకాలు, చీకటి ఒప్పందాలు

పవన్... ఇన్నాళ్లూ లేని అవినీతి ఇప్పుడే కనిపించిందా?.. ఇదేమి చోద్యం

నన్ను బలహీన పరచడమంటే.. అన్యాయం చేసిన వారిని బలపరచడమే

ఎవరు లాలూచీ పడుతున్నారో చెబుతా..చంద్రబాబు చంద్ర నిప్పులు

మోదీపై బహిరంగంగా ఢీ అంటే ఢీ.. వైసీపీ, జనసేనపై ధ్వజం

అమరావతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆటలు ఇకసాగవని ముఖ్యమంత్రి చంద్రబాబు తేల్చి చెప్పారు. తనకు నలభై ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని... ప్రజల అండ ఉన్నంత వరకూ ఎవ్వరికీ భయపడాల్సిన అవసరమే లేదని ఉద్ఘాటించారు. మోదీకీ, కేంద్ర ప్రభుత్వానికి భయపడే ప్రసక్తే లేదని తెలిపారు. మొట్టమొదటిసారిగా బహిరంగ వేదికపై నుంచి మోదీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గురువారం ఆయన విజయవాడలో 'ఆదరణ' పథకాన్ని ప్రారంభించారు. బీసీల అభ్యున్నతి కోసం రాష్ట్రం ప్రభుత్వం చేపట్టిన కార్యాచరణను వివరిస్తూనే... ఒక్కసారిగా కేంద్రంపై విరుచుకుపడ్డారు. విపక్ష వైసీపీని, రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన జనసేననూ దునుమాడారు. "ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు. విభజన చట్టంలో ఉన్నవన్నీ మనకు దక్కాల్సిందే. ఇది అడిగితే... తమిళనాడులో చేసినట్లుగానే, మన రాజకీయాల్లో జోక్యం చేసుకుంటున్నారు. బీజేపీ ఏమీ చేయలేక వేరే వాళ్లను రెచ్చగొడుతోంది. డబ్బులు ఇవ్వాల్సింది మోదీ. అన్యాయం చేసింది కేంద్ర ప్రభుత్వం. మోదీని నిలదీయాల్సిన వాళ్లు నన్ను నిలదీస్తున్నారు. ఇదెక్కడి న్యాయం?" అంటూ పరోక్షంగా పవన్ వైఖరిని

మిగతా 11వ పేజీలో...

టీడీపీపై మహా కుట్ర

ఇందులో కొందరు పెద్దలు.. స్థానికులు.. పవన్ కల్యాణ్ పావు కావడం దురదృష్టకరం

ఆయన ఆరోపణలు అర్థరహితం.. నవ్యాంధ్రలో అవినీతి గణనీయంగా తగ్గింది

జగన్ చేసిన ఆరోపణలే ఇప్పుడు పవన్.. నేను కేంద్రంపై పోరాడుతుంటే.. వీళ్లు నాపైన!

ఎంపీలతో టెలికాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలు 11

జగన్‌తోనే పవన్



నేను పవన్ కల్యాణ్‌తో మాట్లాడాను

తాను తెలుగుదేశంతో లేనన్నారు

ఎన్నికలయ్యాక మాకే మద్దతిస్తానన్నారు

వైసీపీ ఎంపీ వరప్రసాద్ స్పష్టీకరణ

సాయంత్రానికి మాట మార్పు

తాను అలా అనలేదంటూ ఖండన

న్యూఢిల్లీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జనసేన అధిపతి పవన్ కల్యాణ్ తెలుగుదేశం పార్టీపై ఇప్పుడు విరుచుకుపడ్డారు సరే! కానీ... తన మద్దతు జగన్‌కే అని ఎప్పుడో చెప్పేశారా? ఎన్నికల తర్వాత తమ పార్టీ ఎమ్మెల్యేలు జగన్‌కే అండగా ఉంటారని మాట ఇచ్చేశారా? ఈ ప్రశ్నలన్నింటికీ స్వయంగా వైసీపీ ఎంపీ వరప్రసాద్ 'అవును' అని బదులిచ్చారు. తాను టీడీపీతో ఎంత మాత్రమూ కలిసి లేనని, అవసరమైతే జగన్‌కే మద్దతిస్తానని పవన్ తనకు స్పష్టంగా చెప్పారన్నారు. గురువారం ఉదయం ఢిల్లీలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల పవన్ కల్యాణ్ తనకు ఫోన్ చేసి ఒకసారి కలుద్దామంటే వెళ్లి కలిశానని చెప్పారు. వైసీపీపై ఎందుకు విమర్శలు చేస్తున్నారని పవన్‌ను అడిగానన్నారు. 'మాది అవినీతి పార్టీ అంటున్నారు. పోలవరం సందర్శనకు మేము వెళ్తున్నామని తెలిసి, అంతకంటే ముందే మీరు అక్కడికి వెళ్లి ప్రభుత్వానికి మద్దతుగా మాట్లాడారు. దాంతో మీరు టీడీపీతో ఉన్నారని విమర్శలు వచ్చాయి' అని పవన్‌కు చెప్పానన్నారు. అందుకు పవన్ స్పందిస్తూ... 'అలాంటిదేమీ లేదు. అవసరమైతే ఎన్నికల తర్వాత

మిగతా 5వ పేజీలో...

పవన్ వెనుక కాదు..

పవన్‌తోనే ఉన్నాం

బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్ వ్యాఖ్య

అసెంబ్లీ లాబీల్లో ఇదే చర్చ

ఉత్సాహంగా బీజేపీ ఎమ్మెల్యేలు 5

అన్న.. కాంగ్రెస్‌కు తాకట్టు పెట్టారు

ఈయన ఎవరికి తనఖా పెడతారో?

చిరంజీవి వల్ల కాపులు పాతికేళ్లు వెనక్కి

బీజేపీ పావుగా మారిన పవన్ కల్యాణ్

కేంద్రం కుట్రలో భాగంగానే దాడి

నారాయణ, చినరాజప్ప, కళా ధ్వజం



తాత, తండ్రికి చెడ్డ పేరు

తీసుకురాను

అసెంబ్లీలో నారా లోకేశ్ ప్రకటన 5

పవన్ కల్యాణ్ వ్యాఖ్యలకు కౌంటర్

చంద్రబాబు నాకు రోల్‌మోడల్

అమ్మ త్యాగంతో నాన్నకు విజయాలు: లోకేశ్

నేడు వైసీపీ అవిశ్వాసం!

లోక్‌సభ స్పీకర్ కార్యాలయంలో నోటీసు

బీఏసీ భేటీలోనూ ప్రస్తావన 11

మద్దతివ్వాలని పార్టీలకు జగన్ లేఖ

నేతలకు అందించిన వైసీపీ ఎంపీలు

టీడీపీ నేత తోట నరసింహానికీ వినతి

టీడీపీ సై

వైసీపీ ప్రతిపాదనకు మద్దతు

ఎవరు పోరాడినా అండ

రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం

చంద్రబాబు కీలక నిర్ణయం

పట్టించుకోరనుకోవద్దు!

మాట్లాడకుండా ఊడిగం చేయాలా?

నిజం మాట్లాడితే శత్రువులే వస్తారు

నేనైనా, జనసేన కార్యకర్తయినా తప్పు చేస్తే ఖండించాల్సిందే 5

ప్రవాసాంధ్రుల సమావేశంలో పవన్

హోదా పోరులో జనసేనతోనే: లెఫ్ట్



విజయవాడలో పవన్ కల్యాణ్‌తో సమావేశమైన సీపీఎం నేతలు



ఎన్డీయేకు రామ్‌రామ్!

కమలంతో పూర్తిగా కటీఫ్!.. టీడీపీ కీలక నిర్ణయం

మంత్రులతో చంద్రబాబు చర్చ.. నేడు పొలిట్ బ్యూరో భేటీలో ప్రకటన

అమరావతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కమలంతో పూర్తిస్థాయిలో 'కటీఫ్' దిశగా తెలుగుదేశం పార్టీ అడుగులు వేస్తోంది. ఎన్డీయే కూటమి నుంచి తక్షణం బయటకు రావాలని నిర్ణయించుకుంది. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు జరిగే తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సమావేశంలో దీనిపై అధికారికమైన ప్రకటన చేయనున్నారు. గురువారం అసెంబ్లీలోని తన కార్యాలయంలో కొందరు మంత్రులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమై ఈ అంశంపై చర్చించారు. కేంద్రం వైఖరితో విసిగిపోవడంవల్లే ఈ నిర్ణయానికి వచ్చినట్లు చెబుతున్నారు. కేంద్ర మంత్రివర్గం నుంచి టీడీపీ కొద్ది రోజుల క్రితం బయటకు వచ్చిన విషయం తెలిసిందే. ఎన్డీయే కూటమి నుంచి మాత్రం బయటకు రాకుండా టీడీపీ నిగ్రహం పాటించింది. రాష్ట్రానికి సంబంధించి తాము లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి మరికొంత సమయం వేచి చూడాలని భావించింది. పార్లమెంటులో

మిగతా 5వ పేజీలో...

యూపీఏ.. కొత్తగా!

సంధానకర్తగా మారిన శరద్ పవార్

పవార్‌తో రాహుల్‌గాంధీ మంతనాలు

తదుపరి మమతా బెనర్జీతో సమావేశం

రాష్ట్రాల వారీగా కాంగ్రెస్ ఒప్పందాలు

28న పవార్ సారథ్యంలో విపక్షాల భేటీ

కేసీఆర్‌నూ పిలుస్తాం: ఎన్సీపీ వర్గాలు



శరద్ పవార్‌తో రాహుల్ (ఫైల్)

న్యూఢిల్లీ, మార్చి 15: ఉత్తరప్రదేశ్, బిహార్ ఉప ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్‌లో ఆశలను పెంచాయి. అందుకే.. ఈ ఎన్నికల్లో తమ అభ్యర్థులు ధరావత్తును కోల్పోయారన్న వాస్తవాన్ని పక్కనపెట్టి, జాతీయ స్థాయిలో బీజేపీకి వ్యతిరేకంగా కూటమి నిర్మాణాన్ని వేగవంతం చేయాలని నిశ్చయించింది. ఈ దిశగా సోనియాగాంధీ ఇటీవల నిర్వహించిన విందు సమావేశానికి ఎవరెవరు వచ్చారు, ఎలా స్పందించారన్నది స్పష్టంగా అవగతమయ్యాక కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ రంగంలోకి దిగారు. ఉపఎన్నికల ఫలితాలు వెలువడిన కొద్ది గంటలకే ఆయన నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) చీఫ్

మిగతా 2వ పేజీలో...

చంద్రబాబు సారథ్యంలో ఫెడరల్ ఫ్రంట్?

ఎన్డీయే నుంచి బయటకు

రిపబ్లిక్ టీవీ కథనాలు

పార్లమెంటులో ఎంపీల చర్చ

వైద్యుల రూరల్ సర్వీస్ రద్దు?

నేడు ప్రభుత్వానికి ప్రతిపాదన! 2

అన్నీ ఓకే అయితే ఈ ఏడాది నుంచే అమలు

ఎంసీఐ నిబంధనల మేరకే ఎస్ఆర్‌ల భర్తీ

రాష్ట్రంలో 400 మంది సరిపోతారని లెక్క

ప్రభుత్వానికి తగ్గనున్న ఆర్థిక భారం

రూ.75 వేలకు పారితోషికం పెంపు!

దయాలసిస్‌కు బ్రేక్!

అర్ధాంతరంగా నిలిపేసిన నిర్వహణ సంస్థ

8 గంటలపాటు రోగులకు ఇబ్బందులు 14

ఎనిమిది బోధనాస్పత్రుల్లో ఇదే పరిస్థితి

అధికారుల చొరవతో తప్పిన ప్రమాదం

పరీక్షల్లో 'పది'నిసలు

తొలిరోజు 99.52 శాతం హాజరు 2

ఏలూరులో చుక్కలు చూపించిన యాప్‌లు

బయోమెట్రిక్ హాజరు నమోదులో ఇబ్బందులు



సీత నోట 'నేతి' మాట



పరమాత్మ మనసుకు, మాటలకు అందనివాడు. 'యం వర్ణయితుం సాక్షాత్ శ్రుతిరపి మూకేవ మౌనమాచరతి' అన్నారు ఆదిశంకరులు. అనగా వేదం కూడా పరమాత్మని ప్రత్యక్షంగా వర్ణించలేక మూగదానివలె మౌనం వహించిందట. అయినా, పరోక్షంగా నిరూపించి నిర్వచించే ప్రయత్నం చేసింది. ఈ పద్ధతికి 'అతద్వ్యా వృత్తి' అని పేరు. బంగారు గనుల్లో స్వర్ణ రేణువులు రాయిరప్పలతో ఇతర ధాతువులతో కలిసి ఉంటాయి. ఆ రాళ్లను అగ్నిలో పుటం పెట్టి కరిగించి స్వర్ణకారులు దానిలోంచి బంగారం వేరు చేస్తారు. అదే పద్ధతిలో.. 'నేతి నేతి (న ఇతి-న ఇతి..)'.. అంటే 'ఇది ఆత్మ కాదు.. ఇది ఆత్మ కాదు' అని వేరు చేస్తూ దేహ, ఇంద్రియాది సర్వ జడ (దృశ్య) పదార్థాలనూ నిషేధించగా శేషించే చైతన్యమే సత్యమైన ఆత్మవస్తువు. రామచరిత్రలో వనవాసకాలంలో జరిగిన ఘటన 'అతద్వ్యా వృత్తి'కి సరసమైన, సుగమమైన దృష్టాంతం. రామచంద్రుడు సీతాలక్ష్మణ సమేతుడై దండకారణ్యంలో ప్రవేశించాడు. ఎందరో మహర్షులు శ్రద్ధాభక్తులతో ఆయన్ను స్వాగతించారు. తాపస రూపంలో ఉన్న సోదరులిద్దరూ మహర్షుల వెంట నడవగా.. సీత రుషి పత్నులతో ఆశ్రమానికి వచ్చింది. ఇంతలో ఒక పెద్ద ముత్తైదువ రామదర్శనానికి అక్కడికి వచ్చి సీత వద్దకు చేరుకుని ఆతురతతో.. 'అమ్మా, ఈ రుషులలో నీ భర్త ఎవరో చెప్పవా' అని కోరింది. జానకి చెప్పడానికి సిగ్గుపడగా.. ఒక్కొక్క రుషినీ చూపుతూ ఆయనేనా రాముడు? ఆయనేనా? అని అడుగుతూ వచ్చింది. సీత ఒక్కొక్కరినీ చూసి 'నేతి నేతి (కాదు.. కాదు)' అంటూ వచ్చింది. చివరికి ఆమె... "పక్కనే కూర్చున్న దూర్వాదళ శ్యాముడా నీ దేవుడు' అని ప్రశ్నించగా తల వంచి ఓర చూపులతో చెప్పకనే చెప్పింది సీతమ్మ తల్లి.

-తంగిరాల రాజేంద్రప్రసాద్ శర్మ

Paramjyothi
పరంజ్యోతి


త్యాగధనుడు అమరజీవి

ఒంటిపై పంచెతో... మెడలో అట్టపై రాసిన నినాదాల బోర్డుతో.. రోడ్ల వెంబడి తిరుగుతున్న ఆ యువకుడిని నాటి సమాజం పిచ్చివాడిగానే భావించింది. ఎన్నో సామాజిక సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసి ప్రజల్లో చైతన్యం వచ్చేందుకు అహర్నిశలూ కృషి చేసిన మహా మనీషి ఆయన. తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం డిమాండ్‌తో నిరాహారదీక్షకు కూర్చొని తన ప్రాణాలను సైతం తృణప్రాయంగా వదిలేసిన అతనే 'అమరజీవి' పొట్టి శ్రీరాములు.


1901 - 1952

1901 మార్చి 16న చెన్నపట్నంలో జన్మించిన శ్రీరాములు బాల్యం పేదరికంలోనే గడిచింది. 1925లో ముంబై వెళ్లి రైల్వేలో ఉద్యోగిగా చేరారు. కానీ ఐదేళ్లు కూడా తిరక్కుండానే తల్లిదండ్రులతో పాటు భార్యను కూడా కోల్పోయారు. అక్కడినుంచి సబర్మతి ఆశ్రమానికి వెళ్లి మహాత్ముడికి అనుంగు శిష్యుడిగా మారారు. తన కర్తవ్యాన్ని దీక్షతో నిర్వహిస్తూ ఆశ్రమంలో అందరి మన్ననలను, గాంధీజీ ఆదరాన్ని పొందగలిగారు. ఆయనతోపాటు ఎన్నో ఉద్యమాల్లో పాలుపంచుకున్నారు. క్విట్ ఇండియా ఉద్యమంలో అరెస్టయి జైలుశిక్ష కూడా అనుభవించారు. ఆ తరువాత మహాత్ముడి ఆదేశాల మేరకు నెల్లూరు చేరుకున్నారు. అక్కడ ఆయన చేపట్టిన అభ్యుదయ భావాల ప్రచారాన్ని మొదట్లో చాలామంది గుర్తించలేకపోయారు. అయితే అప్పటికే ఆంగ్లేయుల వద్ద పనిచేస్తోన్న వెలగపూడి సుందరరామదత్తు, ప్రముఖ న్యాయవాది పెళ్లకూరు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు శ్రీరాములు ఆశయాలను, సిద్ధాంతాలను ప్రజలకు తెలియజేయటంలో సహకరించారు.

రాజకీయాలను కూడా ఆధ్యాత్మికంగా ఆలోచించిన శ్రీరాములు... అందరికీ అర్థమయ్యేలా సరళమైన భాషలోనే మాట్లాడేవారు. సంఘసంస్కర్తగా అనేక సమస్యలపై పోరాటం చేసి విజయాలు సాధించారు. హరిజనోద్ధరణ, అస్పృశ్యత వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు విశేషమైన కృషి చేశారు. ఆలయాల్లో హరిజన ప్రవేశం, గ్రామ బావుల్లో అందరికీ సమాన హక్కు తదితర సామాజిక సమస్యలపై నిర


గుర్తుకొస్తున్నారు.
● నేడు పొట్టి శ్రీరాములు జయంతి

సన కార్యక్రమాలు చేపట్టి ప్రజాభిమానంతో, నిరాహారదీక్షలతో, శాంతియుతంగా విజయాలను సాధించేవారు. 1946లో మూలాపేటలో వేణుగోపాలస్వామి గుడి వద్ద హరిజనులకు ఆలయ ప్రవేశం కల్పించాలంటూ నిరాహారదీక్ష చేపట్టి విజయం సాధించారు. గాంధీజీ ప్రచార కమిటీకి కన్వీనర్‌గా విధులు నిర్వర్తిస్తూనే మద్రాసులో తెలుగువారికి అన్యాయం జరుగుతోందనే భావనతో అక్కడకు వెళ్లారు. అప్పటి శాసన సభాధ్యక్షులైన సాంబమూర్తి నివాసంలోనే ఆమరణ నిరాహారదీక్ష చేపట్టారు. తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని, భాషా ప్రయుక్త రాష్ట్రాలను అందించాలన్న ఆయన డిమాండ్లను నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు. దీక్షలో కూర్చున్న శ్రీరాములు ఆరోగ్య పరిస్థితి నానాటికీ క్షీణిస్తూ వచ్చింది. అయినా పలు ప్రాంతాల నుంచి వేలాదిగా వచ్చిన అభిమానులను ఆయన చిరునవ్వుతో పలకరించేవారు. దీక్ష 58వ రోజు(1952, డిసెంబరు 15)న పొట్టి శ్రీరాములు తుదిశ్వాస విడిచారు. ఆ తర్వాతే అప్పటి ప్రధానమంత్రి నెహ్రూ మొదటి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. గాంధీజీ సిద్ధాంతాలకు కట్టుబడిన ఆయన చివరకు తన జీవితాన్ని దేశంకోసం, ప్రజల కోసం అంకితం చేశారు. 'అమరజీవి'గా, తెలుగు ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడిగా నిలిచిపోయారు.

- నెల్లూరు, ఆంధ్రజ్యోతి

19న 'టెట్' ఫలితాలు

అమరావతి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్) ఫలితాలు ఈనెల 19న విడుదల కానున్నాయి. రాష్ట్ర మంత్రి గంటా శ్రీనివాసరావు ఫలితాలను విడుదల చేస్తారని ఏపీటెట్ కన్వీనర్ ఎ.సుబ్బారెడ్డి గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, షెడ్యూల్ ప్రకారం ఫలితాలను శుక్రవారమే (16న) విడుదల చేయాల్సి ఉంది.

ఏడబ్ల్యూఓ, ఏఎస్‌డబ్ల్యూవోల సెలెక్షన్ లిస్ట్ విడుదల

అమరావతి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్స్(7), అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్స్(12), అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్స్(5)పోస్టుల భర్తీకి సెలెక్షన్ జాబితాను ఏపీపీఎస్సీ విడుదల చేసింది. సివిల్ అసిస్టెంట్ సర్జన్స్(52) పోస్టులకు ఎంపికైనవారి జాబితాను కూడా విడుదల చేసింది. అభ్యర్థుల వివరాలను కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు ఏపీపీఎస్సీ సెక్రటరీ వై.వి.ఎస్.టి. సాయి తెలిపారు.

ఏపీకి 6.84 లక్షల ఇళ్లు

న్యూఢిల్లీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఆవాస్ యోజన(పట్టణ) కింద 312 ప్రాజెక్టుల్లో ఏపీకి 6,84,469 ఇళ్లు మంజూరు చేశామని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖమంత్రి హర్దీప్‌సింగ్ పూరి వెల్లడించారు. రాజ్యసభలో ఎంపీ కేవీపీ రామచంద్రరావు అడిగిన ఓ ప్రశ్నకు ఆయన గురువారం లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఈ ఇళ్ల నిర్మాణానికయ్యే రూ. 41,087 కోట్ల ఖర్చులో రూ.10,289 కోట్లు కేంద్రం భరిస్తుందని వివరించారు.

జర్నలిస్టులకు అపార్ట్‌మెంట్లపై కమిటీ

అమరావతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జర్నలిస్టులకు ట్రిపుల్ బెడ్‌రూం అపార్ట్‌మెంట్లు కేటాయించేందుకు అవసరమైన మార్గదర్శకాలను రూపొందించేందుకు ప్రభుత్వం నలుగురు సభ్యులతో కమిటీని నియమించింది. ఈ కమిటీకి చైర్మన్‌గా మంత్రి కాల్వ శ్రీనివాసులు, సభ్యులుగా మంత్రి నారాయణ, ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్, మెంబర్ కన్వీనర్‌గా సమాచార, ప్రజాసంబంధాల శాఖ ఎక్స్‌అఫిషియో సెక్రటరీ ఎస్.వెంకటేశ్వర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 2018-19 బడ్జెట్‌లో నిధుల కేటాయింపు చేయకపోవడంపై జర్నలిస్టుల్లో నిరసన వ్యక్తమైంది. దీంతో మేల్కొన్న ప్రభుత్వం బడ్జెట్‌లో లేకపోయినా దీనికోసం రూ.100కోట్లు ఇవ్వాలని నిర్ణయించింది. దీనిపై యనమల శుక్రవారం అసెంబ్లీలో ప్రకటించనున్నారు.

పోలవరంలో పర్యావరణ కమిటీ సమీక్ష

అమరావతి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో కేంద్ర కమిటీ రెండు రోజులుగా క్షేత్రస్థాయి పర్యటన చేస్తోంది. కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ డైరెక్టర్ కరియా పెరుమాళ్ నేతృత్వంలోని ద్విసభ్య కమిటీ... నిబంధనలమేరకే ప్రాజెక్టు నిర్మాణం జరుగుతుందా? అనే అంశాలను పరిశీలిస్తోంది. కాఫర్‌డ్యామ్, ఎడమ ప్రధాన కాలువ పనులను సమీక్షించింది.

పరీక్షలో 'పది'నిసలు

- తొలిరోజు 99.52% హాజరు
- ట్రాఫిక్‌లో చిక్కుకొని పరీక్షకు నలుగురు దూరం
- బయోమెట్రిక్ నమోదులో ఇబ్బందులు
- రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి మృతి

(న్యూస్ నెట్‌వర్క్-ఆంధ్రజ్యోతి)

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-1కు రాష్ట్రవ్యాప్తంగా 99.52 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. రాష్ట్రంలో 6,06,367 మంది విద్యార్థులు నమోదవగా, వారిలో 6,03,656 మంది తొలి పరీక్షకు హాజరయ్యారు. మొత్తం 2830 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. చిన్నచిన్న ఘటనలు మినహా తొలిరోజు పరీక్షలు సాఫీగా జరిగాయి. పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాటుచేసిన బయోమెట్రిక్ యంత్రాల ద్వారా ఇన్విజిలేటర్ల హాజరు తీసుకున్నారు. బయోమెట్రిక్ యంత్రాలు పనిచేయలేదని పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులోని పలు స్కూళ్ల నుంచి ఫిర్యాదులందాయి. విశాఖ జిల్లా నర్సీపట్నం శివారు పెదబొడ్డేపల్లిలో ట్రాఫిక్‌లో చిక్కుకుని నలుగురు విద్యార్థులు సకాలంలో పరీక్షకు హాజరుకాలేకపోయారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ సిబ్బంది లోనికి రానీయకపోవడంతో కోన సాయిరామ్, ఎం.పావని, మరో ఇద్దరు విద్యార్థులు ఏడుస్తూ ఇంటిముఖం పట్టారు. కడప జిల్లా రైల్వేకోడూరులోని ఐదు పరీక్ష కేంద్రాల్లో మాస్ కాపీయింగ్ జరిగినట్లు తెలిసింది. విశాఖ జిల్లాలో పరీక్షకు ముందు దైవదర్శనానికి వెళ్లి రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి మృతిచెండాడు. కశింకోట మండలం జి.భీమవరం పంచాయతీ శివారు సింగవరం గ్రామానికి చెందిన కిల్లాడ శ్రీనివాసరావు(15) తాళ్లపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థి. ఉదయాన్నే తండ్రి కాంతారావుతో కలిసి ద్విచక్ర వాహనంపై చింతలపాలెంలోని సాయిబాబా గుడికి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతిచెందాడు. కాంతారావు గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటనపై మానవ వనరులశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పరీక్షలు రాసేందుకు కాల్వలు, రైల్వే లైన్లు, జాతీయ రహదారులు దాటేటప్పుడు విద్యార్థులకు తోడుగా వెళ్లాలని తల్లిదండ్రులను కోరారు. శ్రీకాకుళం జిల్లా సంతకవిటి మండ లం మందరాడ పరీక్ష కేంద్రంలో పొదిలావు పవన్ అనే విద్యార్థి ఫిట్స్‌తో అపస్మారక స్థితికి చేరుకోగా ఆస్పత్రికి తరలించారు. విశాఖ నగర శివారు సాగర్‌నగర్ ప్రభుత్వ అంధుల పాఠశాలకు చెందిన తొమ్మిది మంది విద్యార్థినులు ఎంవీపీ కాలనీలోని పరీక్ష కేంద్రంలో సహాయకుల సాయంతో పరీక్షలు రాశారు.


తాడేపల్లిగూడెంలో టెన్త్ విద్యార్థులకు దిష్టి తీస్తున్న దృశ్యం

సులభంగా సీబీఎస్ఈ అకౌంటెన్సీ పరీక్ష

సీబీఎస్ఈ 12వ తరగతి కామర్స్ విద్యార్థులకు ప్రధాన సబ్జెక్టు అకౌంటెన్సీ పరీక్ష గురువారం ముగిసింది. ఈసారి ప్రశ్నపత్రంలో చాలా మార్పులు ఉన్నా.. మొత్తమ్మీద సులభంగానే ఉన్నట్లు విద్యార్థులు పేర్కొన్నారు. తికమకపెట్టే విధంగా ప్రశ్నలు అడిగారని అభిప్రాయపడ్డారు. సాధారణంగా 4 మార్కుల విభాగంలో అడిగే ప్రశ్నలను ఈ సారి 8 మార్కులకు ఇచ్చారు. పార్టనర్‌షిప్ ఫండమెంటల్స్‌కు సంబంధించిన ప్రశ్నలను మొదటిసారిగా 8 మార్కులకు అడిగారు. ఉపాధ్యాయులు మాత్రం ప్రశ్నపత్రం ఎన్‌సీఈఆర్‌టీ నిర్దేశించిన సిలబస్ పరిధిలోనే ఉందని, కాలిక్యులేషన్స్ తికమకపెట్టే విధంగా ఉన్నాయన్నారు. - దిక్సూచి డెస్క్

తండ్రి మరణం.. పరీక్ష


తండ్రి మరణించిన దుఃఖంలోనూ పరీక్షకు హాజరైన కర్రి కీర్తన

విశాఖ జిల్లా కె.కోటపాడు మండలం కింతాడ శివారు బత్తివానిపాలెం గ్రామానికి చెందిన కర్రి సన్యాసినాయుడు(49) అనారోగ్యంతో బుధవారం సాయంత్రం మరణించారు. ఆయన కుమార్తె కీర్తన దుఃఖాన్ని దిగమింగుతూ గురువారం పదోతరగతి పరీక్షకు హాజరైంది. పరీక్ష అనంతరం సన్యాసినాయుడు మృతదేహానికి కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

వైద్యుల రూరల్ సర్వీస్ రద్దు?

- నేడు ప్రభుత్వానికి ప్రతిపాదన!
- అన్నీ ఓకే అయితే ఈ ఏడాది నుంచే అమలు
- ఎంసీఐ నిబంధనల మేరకే ఎస్ఆర్‌ల భర్తీ
- రాష్ట్రంలో 400 మంది సరిపోతారని లెక్క
- ప్రభుత్వానికి తగ్గనున్న ఆర్థిక భారం
- రూ.75 వేలకు పారితోషికం పెంపు!



అమరావతి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్, పీజీ చదివిన విద్యార్థులు ఏడాది పాటు గ్రామీణ ప్రాంతాల్లో పనిచేయాలన్న (రూరల్ సర్వీసు) నిబంధనను రద్దు చేసే యోచనలో ప్రభుత్వం ఉంది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేసిన డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) శుక్రవారం ప్రభుత్వానికి సమర్పించే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్, ఏపీ, తెలంగాణ, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో మాత్రమే ఈ నిబంధన ఉంది. ఎంబీబీఎస్ పూర్తి చేసిన తర్వాత ఒక ఏడాది, పీజీ పూర్తి చేసిన తర్వాత మరో ఏడాదిపాటు వైద్య విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల్లో పనిచేయాలని 2012లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదించింది. ఆ సమయంలో జూనియర్ వైద్యులు దీన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. 60 రోజులపాటు విధులు బహిష్కరించడంతో దిగొచ్చిన ప్రభుత్వం ఎంబీబీఎస్ తర్వాత రూరల్ సర్వీస్ అవసరం లేదని, కేవలం పీజీ తర్వాత ఒక్క ఏడాది సర్వీస్ చేస్తే సరిపోతుందని సడలించింది. దీనికి వైద్యులు అంగీకారం తెలిపారు. నిబంధనైతే సడలించారు కానీ సవరణ ఉత్తర్వులు విడుదల చేయలేదు. ఫలితంగా ప్రస్తుతం ఎంబీబీఎస్ పూర్తయిన వారు వైద్యులుగా రిజిస్ట్రేషన్లు చేయించుకోలేక ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం జూనియర్ వైద్యులు ఇచ్చిన సమ్మె డిమాండ్లలో ఇదే ప్రధానమైంది. ప్రభుత్వానికి కూడా ఇబ్బందులు వస్తున్నాయని భావించిన అధికారులు ఈ నిబంధన రద్దు చేయాలనే నిర్ణయానికి వచ్చారంటున్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా రూరల్ సర్వీస్ రద్దు చేసే యోచనలో ఉంది. ఏపీలో మాత్రం ఈ విద్యా సంవత్సరం నుంచే అమలులోకి తీసుకురావాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

చోటు నచ్చితేనే వెళ్తున్నారు!

ఏపీలో 11 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, బోధనాస్పత్రులు ఉన్నాయి. వీటికి అనుబంధంగా మరో 12 ఆస్పత్రులు నడుస్తున్నాయి. ఎంసీఐ నిబంధనల ప్రకారం 100 ఎంబీబీఎస్ సీట్లు ఉన్న మెడికల్ కాలేజీల్లో 24 మంది సీనియర్ రెసిడెంట్లు (ఎస్ఆర్), 150 ఎంబీబీఎస్ సీట్లున్న మెడికల్ కాలేజీలో 30 మంది ఎస్ఆర్‌లు, 200 ఎంబీబీఎస్ సీట్లు ఉన్న మెడికల్ కాలేజీలో 39 మంది ఎస్ఆర్‌లు విధులు నిర్వహిస్తే సరిపోతుంది. ఆ విధంగా 23 బోధనాస్పత్రులకు కలిపి 400 మంది సీనియర్ రెసిడెంట్లు చాలు. కానీ వైద్య విద్యార్థులు కచ్చితంగా రూరల్ సర్వీస్ చేయాలన్న నిబంధన వల్ల 23 బోధనాస్పత్రుల్లో 1,400 మంది ఎస్ఆర్‌లు విధులు నిర్వహిస్తున్నారు.

ఆర్థిక భారం తగ్గుతుంది

రూరల్ సర్వీస్ రద్దు చేస్తే ప్రభుత్వానికి ఆర్థిక భారం తగ్గుతుంది. ప్రస్తుతం ఒక ఎస్ఆర్‌కు నెలకు రూ.45 వేల చొప్పున (కొత్తగా పెంచిన పారితోషికం ప్రకారం) ప్రభుత్వం అందిస్తుంది. ఇలా 1400 మందికీ నెలకు రూ.6 కోట్లకుపైగానే చెల్లిస్తోంది. ఏడాదికి ఈ బడ్జెట్ రూ.75 కోట్లుగా ఉంది. వాస్తవంగా ఉండాల్సిన 400 మంది ఎస్ఆర్‌లకు పారితోషికం రూ.70 వేల నుంచి రూ.75 వేలు చొప్పున పెంచి, ఆ సంఖ్య పెరగకుండా చూసుకుంటే ప్రభుత్వంపై ఏడాదికి రూ.36 కోట్ల భారమే పడుతుందని లెక్కలు వేస్తున్నారు. ఈ 400 మందిని కౌన్సెలింగ్ ద్వారా ఎంపిక చేయాలని, పైగా ఈ పనిని ఆయా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాళ్లకు అప్పగించే ప్రతిపాదన చేయనున్నారని తెలిసింది.

యూపీఏ.. కొత్తగా!

(మొదటిపేజీ తరువాయి..)

శరద్ పవార్‌ను కలిశారు. ఆయన కుమార్తె, ఎంపీ సుప్రియా సూలే ఇంట్లో ఈ భేటీ జరిగింది. ఉప ఎన్నికల ఫలితాలతో పాటు జాతీయ స్థాయిలో బీజేపీకి వ్యతిరేకంగా ఓ ఐక్య కూటమిని కూర్చడానికి తీసుకోవాల్సిన చర్యలపైనా, బీజేపీని రాష్ట్రాలవారీగా అడ్డుకునే వ్యూహంపైనా ఇద్దరూ చర్చించినట్లు సమాచారం. బీజేపీకి ఎదురుగాలి వీస్తోందనడానికి ఉప ఎన్నికల ఫలితాలే సంకేతమని, ఇదే ఊపులో ప్రతిపక్ష పార్టీలన్నీ యునైటెడ్ ఫ్రంట్‌గా ఏకం కావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రాహుల్, పవార్ ఓ అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ మేరకు 28న పవార్ సారథ్యంలో ప్రతిపక్ష పార్టీల సమావేశం జరగనుంది. పవారే దీనికి చొరవ చూపడం విశేషం. ఒకరకంగా బీజేపీ-వ్యతిరేక ఫ్రంట్ నిర్మాణానికి ఆయనే కేంద్ర బిందువుగా మారారు. అందులో భాగంగానే మమతా బెనర్జీని 28న భేటీకి రావాలని కోరారు. టీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కూడా పవార్ ఆహ్వానించవచ్చని ఎన్సీపీ వర్గాలు తెలిపాయి. ఆ సమావేశంలో ఐక్య కూటమి ఏర్పాటుపై నిర్దిష్ట కార్యాచరణ ఉండాలని రాహుల్-పవార్ భావిస్తున్నారు.

మమత కూడా..

ఈ నెల 28న జరిగే ప్రతిపక్షాల సమావేశంలోనే.. టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీతో రాహుల్ భేటీ కానున్నారు. మమత కూడా బీజేపీకి వ్యతిరేకంగా ఓ ఫ్రంట్ ఏర్పడాలన్న ఆలోచనలోనే ఉన్నారు. కాంగ్రెసేతర, బీజేపీయేతర కూటమి నిర్మిస్తానని కేసీఆర్ చెప్పగానే మొదట మద్దతు పలికింది మమతే. కాంగ్రెస్ నేతృత్వంలోని ఫ్రంట్‌లో చేరేందుకు ఇప్పటిదాకా ఆమోదం తెలిపిన పార్టీలు.. ఎస్పీ, బీఎస్పీ, ఎన్సీపీ, వామపక్షాలు. మరోవైపు బీజేపీకి చాలా కాలం పాటు మిత్ర పక్షంగా శివసేన- ఇపుడు బయటికొచ్చింది. శివసేనలో వచ్చిన ఈ మార్పును సానుకూలంగా మల్చుకోవాలని పవార్-రాహుల్ భావిస్తున్నట్లు సమాచారం.

పవార్‌నే ఎందుకు కలిసినట్లు?

పవార్‌నే మొదట కలవడం వెనుక రాహుల్‌కు నిర్దిష్ట కారణాలున్నాయి. 1999లో 13వ లోక్‌సభ ఎన్నికల సమయంలో.. 'ఇటాలియన్ అయిన సోనియా గాంధీ ప్రధాని పదవి చేపట్టడానికి వీల్లేద'ంటూ సీడబ్ల్యూసీలో తిరుగుబాటు చేసిన ముగ్గురు నేతల్లో పవార్ ముఖ్యులు. పీఏ సంగ్మా, తారిక్ అన్వర్ మిగతా ఇద్దరు. కాంగ్రెస్ బహిష్కరించాకే ఆయన ఎన్సీపీని స్థాపించారు. ఆ తరువాత 2004లో మన్మోహన్‌సింగ్ కేబినెట్‌లో వ్యవసాయ మంత్రిగా చేరారు. అందుకే, పవార్ నుంచి అభ్యంతరాలు రాకుండా.. ముందే ఆయన్ను మం చి చేసుకొనేందుకు రాహుల్ చేసిన ప్రయత్నంగా ఈ భేటీని చెబుతున్నారు. అంతేకాక పవార్ ప్రాం తీయ సమీకరణాలు బాగా తెలిసిన వ్యక్తి.

బాబు సారథ్యంలో ఫెడరల్ ఫ్రంట్

వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికల నాటికి వివిధ ప్రాంతీయ పార్టీలతో కూడిన ఫెడరల్ ఫ్రంట్‌కు ఏపీ సీఎం చంద్రబాబు నాయకత్వం వహించే అవకాశాలున్నాయంటూ రిపబ్లిక్ టీవీ గురువారం ఒక కథనాన్ని ప్రసారం చేసింది. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ.. ఇప్పటికే 7 పార్టీలు టీడీపీకి మద్దతు ప్రకటించాయని తెలిపింది. మే నెలలో చంద్రబాబు అధికారికంగా ఈ కూటమి గురించి ప్రకటిస్తారని పేర్కొంది. యూపీ ఉప ఎన్నికల ఫలితాల నేపథ్యంలో.. అఖిలేశ్ యాదవ్ (ఎస్పీ), మాయావతి (బీఎస్పీ)తో మాట్లాడిన అనంతరం ఎన్డీయే నుంచి కూడా వైదొలగనున్నట్లు చంద్రబాబు ప్రకటించే అవకాశం ఉందని తెలిపింది. దేశవ్యాప్తంగా వివిధ పార్టీలు ఏకమై ఫెడరల్ ఫ్రంట్ ఏర్పరిస్తే చక్కటి ఫలితాలు సాధించవచ్చంటూ పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో వివిధ ఎంపీల మధ్య చర్చలు ప్రారంభమయ్యాయి.

లోకం తీరు




సర్కస్‌లోనే కాదు.. రాజకీయాల్లో కూడా ఇది సాధ్యమేనన్నమాట!

ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
కడప	39.0	24.0
గుంటూరు	37.1	24.1
విజయనగరం	37.0	24.0
అనంతపురం	37.0	25.0
చిత్తూరు	36.9	24.7
విజయవాడ	35.8	24.8
విశాఖపట్నం	35.4	22.6
హైదరాబాద్	34.8	24.3

కోస్తా, సీమలకు వర్షసూచన

విశాఖపట్నం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ అరేబియా సముద్రంలో వున్న వాయుగుండం బలహీనపడి తీవ్ర అల్పపీడనంగా మారింది. దీని వైపు బంగాళాఖాతం నుంచి తేమగాలులు వీస్తున్నాయి. ఇదే సమయంలో ఎండ తీవ్రంగా ఉంది. ఈ రెండింటి ప్రభావంతో వచ్చే రెండు రోజుల్లో కోస్తాలో గోదావరి జిల్లాల నుంచి నెల్లూరు వరకు, రాయలసీమలో కడప, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో పలు చోట్ల ఉరుములు, ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయి. తెలంగాణలో కూడా అక్కడక్కడా ఉరుములు, ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా గురువారం రాయలసీమ, కోస్తాల్లో పలుచోట్ల ఎండ తీవ్రత కొనసాగింది. అనంతపురంలో 39.4 డిగ్రీలు నమోదైంది.



ఆర్జేడీ గెలుపు దేశానికే ప్రమాదం

అరారియాలో ఆర్జేడీ గెలుపు బిహార్‌కే కాదు.. యావద్దేశానికి ప్రమాదకరం. అరారియా జిల్లా ఉగ్రవాద స్థావరంగా మారుతుంది.


- కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్



భారత యువతకు రెడ్ కార్పెట్

భారత్‌లోని యువత, పరిశోధకులు, పారిశ్రామిక వేత్తలకు స్వాగతం. యూరప్‌లో అడుగుపెట్టాలని భావించేవారు ముందుగా ఫ్రాన్స్‌పైపు చూడాలి. భద్రత, ఆర్థిక శక్తి, పర్యావరణంతో పాటు వివిధ రంగాల్లో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని నిర్ణయించడానికి ఇరు దేశాలూ కృషి చేశాయి. సరికొత్త సాధనలకు ఇదే ఆరంభం.

- ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మెక్రాన్



ఫిట్‌నెస్‌తో మహిళల్లో చిత్తవైకల్యం దూరం

లండన్, మార్చి 15: మధ్య వయసులో ఉన్నపుడు మహిళలు శారీరకంగా దృఢంగా ఉంటే.. వారిలో చిత్త (మానసిక) వైకల్యం వచ్చే అవకాశం చాలా తక్కువగా ఉంటుందట. సాధారణ మహిళలతో పోలిస్తే ఫిట్‌గా ఉండే మహిళల్లో చిత్తవైకల్యం రావడం 11 ఏళ్లు ఆలస్యమవుతుందన్నారు గొథెన్‌బర్గ్ వర్సిటీ పరిశోధకులు. శారీరకంగా దృఢంగా ఉన్న మహిళల్లో చిత్తవైకల్యం వచ్చే అవకాశం 90% తగ్గినట్లు గుర్తించామన్నారు.

ప్లాటిపస్ పాలతో సూపర్‌బగ్స్‌కు చెక్

కాన్‌బెర్రా, మార్చి 15: యాంటీబయోటిక్‌లు పనిచేయకపోవడం వల్ల సూక్ష్మజీవులు సూపర్‌బగ్స్‌లా మారుతున్నాయి. ఇవి మానవ జీవితాలకు పెనుముప్పుగా వైద్యులు భావిస్తున్నారు. అయితే వీటిని అంతం చేసేందుకు ప్లాటిపస్ అనే జీవి పాలు దోహదం చేస్తాయని అంటున్నారు సీఎస్ఐఆర్ఓ పరిశోధకులు. ప్లాటిపస్ పాలల్లో గుర్తించిన ప్రోటీన్ ఉత్తమ యాంటీబయోటిక్‌గా పనిచేస్తుందని వారు చెబుతున్నారు.

వైద్యుల నిర్వాకంతో ఇద్దరు మృతి

- ప్రైవేటు ఆస్పత్రి నుంచి ఆరుగురు జీజీహెచ్‌కు తరలింపు
- తీసుకొచ్చిన గంటల వ్యవధిలోనే మరణాలు
- ఆస్పత్రి అధికారుల తీరుపై కలెక్టర్ ఆగ్రహం
- 13కు చేరిన అతిసారం మృతుల సంఖ్య
- నేడు జీజీహెచ్‌కు సీఎం చంద్రబాబు రాక?

గుంటూరు (మెడికల్), మార్చి 15: గుంటూరు ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారుల నిర్వాకంతో గురువారం రెండు అతిసారం మరణాలు సంభవించడం కలకలం రేపింది. ప్రైవేటు ఆస్పత్రిలో కోలుకుంటున్న తమ వారిని, మెరుగైన వైద్యసేవల పేరిట జీజీహెచ్‌కు బలవంతంగా తెప్పించి ఇక్కడి డాక్టర్లు పొట్టన బెట్టుకున్నారని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ విషయం తెలిసిన కలెక్టర్ కోన శశిధర్, వైద్యాధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సంఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తునకు ఆయన ఆదేశించినట్లు తెలిసింది. వివరాల్లోకి వెడితే.. రెండు వారాల కిందట గుంటూరులో ప్రబలిన అతిసారంతో పలువురు బాధితులు చికిత్సల కోసం గుంటూరు జీజీహెచ్‌లో చేరారు. వీరిలో 21 మంది ఆరోగ్యం క్షీణించింది. వీరందరినీ మెరుగైన చికిత్స కోసం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే వారిలో ఆరుగురిని బలవంతంగా మంగళవారం సాయంత్రం ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి 11 గంటలకు సింగంపల్లి నూకరాజు (63), రాత్రి 11.30 గంటలకు గంగాభవాని (60) మృతి చెందారు. కాగా.. ఇప్పటి వరకు గుంటూరులో అతిసారం బారిన పడి 13 మంది మృతి చెందారు. మరోవైపు.. అతిసారం బాధితులను పరామర్శించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం గుంటూరు రానున్నట్లు సమాచారం.

'హ్యాం'కు రాంరాం..

ఈపీసీ విధానంలోనే ఎల్పీఎస్ జోన్ల అభివృద్ధి

- నిర్మాణ సంస్థలు స్పందించకపోవడంతో సీఆర్డీఏ నిర్ణయం
- 5 జోన్లలో రిటర్నబుల్ ప్లాట్ల అభివృద్ధిలో జాప్యం!



అమరావతి, మార్చి15 (ఆంధ్రజ్యోతి): ఏపీ సీఆర్డీఏ ఒకటి తలిస్తే మరొకటి జరిగింది. రాజధానికి భూములిచ్చిన రైతులకు కేటాయించిన రిటర్నబుల్ ప్లాట్లతో కూడిన ఎల్పీఎస్ జోన్లలో కొన్నింటి అభివృద్ధిని 'హ్యాం (హైబ్రిడ్ యాన్యుటీ మోడల్)' విధానంలో చేపట్టే విషయంలో సంస్థకు నిరాశే ఎదురైంది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో మిగిలిన జోన్ల మాదిరిగానే వీటికీ ఈపీసీ (ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్) విధానంలోనే టెండర్లు పిలవాలని నిర్ణయించినట్లు భోగట్టా.

'హ్యాం' అంటే..

ల్యాండ్ పూలింగ్ స్కీం (ఎల్పీఎస్) నిబంధనల ప్రకారం రాజధానిలోని మొత్తం 13 ఎల్పీఎస్ జోన్లను 3 సంవత్సరాల్లో అత్యుత్తమ మౌలిక వసతులతో అభివృద్ధి పరచాల్సి ఉంది. భూగర్భ యుటిలిటీ లైన్లు, ప్రపంచస్థాయి రహదారులు ఇత్యాది సదుపాయాలను కల్పించాల్సి ఉన్నందున ఈ జోన్ల డెవలప్‌మెంట్‌కు ఒక్కొక్క దానికి వందల కోట్ల రూపాయలు అవసరమని అంచనా వేశారు. నిధుల కొరత నివారణతో పాటు పనులు వేగంగా జరిగేలా చూడాలనే ఉద్దేశంతో సీఆర్డీఏ ఈ జోన్ల అభివృద్ధిని వివిధ పద్ధతుల్లో చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా 1, 2, 3, 7, 10 జోన్లకు గతంలోనే 'ఈపీసీ' విధానంలో టెండర్లు పిలిచిన సీఆర్డీఏ మరొక 5 జోన్ల (4, 5, 9, 12, 12ఏ)ను మాత్రం 'హ్యాం' విధానంలో అభివృద్ధి పరచాలని భావించింది. ఈపీసీ విధానంలో ప్రాజెక్ట్ మొత్తం అంచనా వ్యయాన్ని సీఆర్డీఏనే భరించాల్సి ఉండగా, 'హ్యాం'లో మాత్రం 40 శాతాన్ని సీఆర్డీఏ భరిస్తే, మిగిలిన 60 శాతాన్ని కాంట్రాక్ట్ సంస్థే సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అవి పెట్టిన పెట్టుబడిని 15 సంవత్సరాల్లో బ్యాంకు వడ్డీ కంటే 3 శాతం ఎక్కువతో కలిపి సీఆర్డీఏ తిరిగి చెల్లిస్తుంది. ఈ విధానాన్ని జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) ఇప్పటికే అమలు పరుస్తూ సత్ఫలితాలను సాధిస్తుండడాన్ని ఈ సందర్భంగా సీఆర్డీఏ పరిగణనలోకి తీసుకుంది. అందులో భాగంగా.. మొత్తం రూ.10,745.11 కోట్ల అంచనా వ్యయంతో వాటికి గతేడాది నవంబరు నుంచి ఈ ఏడాది జనవరి మధ్య బిడ్లను ఆహ్వానించింది. అయితే.. గత నెల 28వ తేదీన టెక్నికల్ బిడ్లను తెరవగా 5 జోన్లకు కలిపి ఒక్కటంటే ఒక్క బిడ్ మాత్రమే (జోన్ 4కు) దాఖలైంది. మిగిలిన 4 జోన్లకు ఒక్కటి కూడా రాలేదు. ఎన్‌హెచ్ఏఐ మాదిరిగా అంచనాలపై 25 నుంచి 40 శాతం వరకూ అధికంగా చెల్లిస్తే పనులు చేద్దామని కొన్ని సంస్థలు భావించినప్పటికీ 10 శాతానికి మించి చెల్లించేందుకు సీఆర్డీయే అంగీకరించలేదని తెలిసింది.

ఆ 5జోన్లూ ఈపీసీ విధానంలోనే..

ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్లి, ఆయన అనుమతితో ఈ 5 ఎల్పీఎస్ జోన్లను కూడా మిగిలిన వాటి మాదిరిగానే ఈపీసీ విధానంలోనే అభివృద్ధి చేయించాలని సీఆర్డీఏ భావిస్తున్నట్లు సమాచారం. ఈపీసీ నిబంధనల ప్రకారం మొత్తం అంచనా వ్యయాన్ని తానే సమకూర్చుకోవాల్సి ఉన్నందున సదరు మొత్తాలను 'హడ్కో' వంటి సంస్థల నుంచి రుణరూపేణా పొందేందుకూ ఈ సంస్థ కసరత్తు చేస్తోంది. ఈ ప్రక్రియ పూర్తయి, సీఆర్డీఏ ఈ 5 ఎల్పీఎస్ జోన్లకు ఈపీసీ విధానంలో టెండర్లు పిలిచి, పనులను అప్పగించేందుకు ఎంత లేదన్నా కనీసం మరో 2 నుంచి 3 నెలలన్నా పట్టవచ్చునని భావిస్తున్నారు. అయితే.. అప్పటికి వర్షాకాలం ప్రారంభమవడానికి ఆట్టే సమయం ఉండదని, దీంతో పనులను వేగంగా చేపట్టడం సాధ్యం కాదని, ఫలితంగా ఈ జోన్ల అభివృద్ధి అనుకున్న దానికంటే ఆలస్యమవవచ్చునని అంటున్నారు.

చరిత్రలో నిలిచిపోయేలా లేపాక్షి ఉత్సవాలు

- 31న సీఎం జలహారతి: బాలకృష్ణ

హిందూపురం, మార్చి 15: లేపాక్షి నంది ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిద్దామని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పిలుపునిచ్చారు. ఈ నెల 31, ఏప్రిల్ 1వ తేదీల్లో నిర్వహించే లేపాక్షి ఉత్సవాలపై ఆయన అనంతపురంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఏడాదిలాగా కాకుండా ఈసారి హిందూపురం ప్రాంతానికి నీరిచ్చిన తర్వాతే ఉత్సవాలను నిర్వహించాలనే సంకల్పంతోనే వాయిదా వేసామన్నారు. హిందూపురం ప్రాంతంలోని అన్ని చెరువులకు నీరిచ్చి ఉత్సవాలను నిర్వహిస్తామని.. ఇందులో భాగంగానే ఈ నెల 31న ముఖ్యమంత్రి చంద్రబాబు జలహారతి ఇవ్వనున్నట్లు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ మానస పుత్రిక హంద్రీనీవా అని, దాని ద్వారా హిందూపురానికి నీరందించి ఉత్సవాలు నిర్వహించడం ఆనందంగా ఉందని బాలకృష్ణ తెలిపారు. చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉత్సవాలను నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం లేపాక్షి ఉత్సవాల లోగోను ఆవిష్కరించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ. 21.61 కోట్లు

తిరుమల: భక్తుల రద్దీ సాధారణ స్థాయిలో ఉన్నప్పటికీ తిరుమల శ్రీవారికి వారం రోజుల్లో రూ.21.61 కోట్ల ఆదా యం హుండీ ద్వారా వచ్చింది. సాధారణ రోజుల్లో రోజుకు రూ.కోటి నుంచి రూ.2.5 కోట్ల ఆదాయం శ్రీవారికి వస్తుంది. అదే రద్దీ రోజుల్లో అయితే రోజుకు రూ.2.50 నుంచి రూ.3 కోట్లు దాటుతుంది. కానీ ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు రద్దీ తక్కువగా ఉన్నా హుండీ మాత్రం కళకళలాడుతోంది. గడిచిన ఆరునెలల కాలంలో వారం రోజుల్లో ఇంత మొత్తంలో ఆదాయం లభించటం ఇదే మొదటిసారి. 9వ తేదీన రూ.2.94 కోట్లు, 10న రూ.2.55 కోట్లు, 11న రూ.2.59 కోట్లు, 12న రూ.3.51 కోట్లు, 13న రూ.3.24 కోట్లు, 14న రూ.3.69 కోట్లు, 15న రూ.3.10 కోట్లు వంతున భక్తులు హుండీలో కానుకలు సమర్పించారు.



ఆలయ నమూనా ఆకృతులు

శ్రీశైలంలో సుబ్రహ్మణ్యేశ్వరాలయం

250 కోట్ల అంచనాలతో శ్రీకారం.. 23 ఎకరాలు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం

విశాఖపట్నం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం శైవక్షేత్రం. భ్రమరాంబ, మల్లికార్జునస్వామి ఆలయాలు ఈ క్షేత్రంలో విరాజిల్లుతున్నాయి. అయితే.. పార్వతీపరమేశ్వరులు ఎవరికోసమైతే ఈ ప్రాంతానికి వచ్చారో.. ఆయన ఆలయం లేకపోవడం సరి కాదన్న ఒక వృద్ధుని బోధతో అక్కడ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి బీజం పడింది. రూ. 250 కోట్ల అంచనాతో.. 23 ఎకరాల్లో పూర్తిగా కృష్ణశిలలతో అద్భుతమైన ఆలయం రూపుదిద్దుకుంటోంది.

ఐదేళ్లనాటి సంకల్పం..

విశాఖకు చెందిన కాంట్రాక్టర్ భాస్కరరెడ్డి పదేళ్లుగా శ్రీశైలంలో ప్రతి శివరాత్రికి అన్నదానం నిర్వహిస్తున్నారు. ఐదేళ్ల క్రితం అన్నదానం అనంతరం ఓ వృద్ధుడి హితబోధతో శ్రీశైలంలో మల్లన్న ఆలయం చెంతనే సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం నిర్మించాలని సంకల్పించారు. ఆయనతో పాటు మరికొందరు దాతలు ఆలయ ఈవో, దేవదాయశాఖ కార్యదర్శులను పదేపదే సంప్రదించి ఎట్టకేలకు విజయం సాధించారు. క్షేత్ర మహిమకు ఎలాంటి భంగం వాటిల్లకుండా శృంగేరి పీఠాధిపతుల ఆశీస్సులతో మార్చి 8న శంకుస్థాపన కార్యక్రమం పూర్తిచేసుకుంది. ఇందుకోసం భ్రమరాంబిక ఆలయం పక్కనే 23 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. హైదరాబాద్‌కు చెందిన వీబీ టెక్నో క్రాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ బి.లక్ష్మీప్రభాకర్ నేతృత్వంలో ఢిల్లీకి చెందిన ఆర్కిటెక్ట్ 23 ఎకరాల్లో మాస్టర్ ప్లాన్‌కు రూపకల్పన చేశారు. దీనిలో రెండు ఎకరాల్లో మాత్రమే సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఉంటుంది. ఆలయం యావత్తూ 1.5 లక్షల టన్నుల కృష్ణ శిలలతో నిర్మిస్తారు. 23 ఎకరాల ప్రాంగణ తుదిరూపు ఆరు పత్రాలు కలిగిన కమలాకృతిలో ఉంటుంది. ప్రధాన దేవాలయంలో ఆరడుగుల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మూలవిరాట్టును సేనాని రూపంలో ప్రతిష్ఠిస్తారు. రూ.250 కోట్ల అంచనాతో రూపొందుతున్న ఈ ఆలయం నాలుగైదేళ్లలో పూర్తవుతుందని ఒకరైన విశాఖకు చెందిన భాస్కరరెడ్డి వెల్లడించారు. దేవుని సంకల్పాన్ని నెరవేర్చే కూలీలుగా తాము ఈ బృహత్కార్యానికి పూనుకున్నామని చెప్పారు.



హైకోర్టును ఆశ్రయించిన చింతమనేని

హైదరాబాద్: తనను దోషిగా నిర్ధారిస్తూ భీమడోలు మెజిస్ట్రేట్ కోర్టు ఇచ్చిన ఆదేశాలపై పశ్చిమగోదావరి జిల్లా, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం గురువారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ దశలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్యాలయ న్యాయవాది చేసిన అభ్యర్థన మేరకు ఈ వ్యాజ్యాన్ని న్యాయస్థానం శుక్రవారానికి వాయి దా వేసింది.రచ్చబండ కార్యక్రమంలో అప్పటి మంత్రి వట్టి వసంతకుమార్‌పై దాడి చేశారనే ఆరోపణలపై నమోదైన కేసులో గత నెలలో భీమడోలు కోర్టు చింతమనేనికి రెండు సంవత్సరాల జైలు శిక్ష విధించింది.

అప్పన్న ప్రసాదం కాంట్రాక్టు అన్యమతస్థులకు

- సింహాచలంలో మరో వివాదం

విశాఖపట్నం/సింహాచలం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): సింహాచలం పుణ్యక్షేత్రంలో మరో వివాదం రేగింది. ప్రసాదాల ప్యాకింగ్ కాంట్రాక్టర్ అన్యమతస్థుడన్న ప్రచారం భక్తులను కలవరానికి గురిచేస్తోంది. ఇక్కడ వంటశాలలో తయారయ్యే ప్రసాదం స్వామికి, అమ్మవారికి నివేదించాకే భక్తుల కోసం విక్రయశాలకు చేరుతుంది. ఇటీవల ఈ ప్రసాదం ప్యాకింగ్ కాంట్రాక్టును రాజమండ్రి ప్రాంతానికి చెందిన రాజ్ సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థకు అప్పగించారు. ఆ సంస్థ ఎండీ పేరు నట్టి ఏసుబాబు కావడం దుమారం రేపుతోంది. భక్తులకు విక్రయించే లడ్డూ, పులిహోర, డ్రైఫ్రూట్స్ ప్యాకింగ్ కోసం టెండర్లు ఆహ్వానించారు. అందులో తక్కువ రేటుకు టెండర్ దాఖలు చేసినందున ఏసుబాబుకు అప్పగించారు. అయితే దేవదాయ శాఖ నిబంధనల ప్రకారం టెండర్లు దాఖలు చేసే వారంతా హిందువులే అయి ఉండాలి. అయితే, కొత్తగా కాంట్రాక్టు కుదుర్చుకున్న వ్యక్తి పేరు ఏసుబాబు కావడం ఇప్పుడు వివాదాస్పదమవుతోంది. ఏ హిందువు అటువంటి పేరు పెట్టుకోరని, అలాంటిది అధికారులు కనీస పరిశీలన చేయకుండా ఎలా కాంట్రాక్టు అప్పగించారని భక్తులు ప్రశ్నిస్తున్నారు. అదేవిధంగా సదరు కాంట్రాక్టరు ఇప్పటివరకు దేవస్థానానికి రాకుండా ఇతరులతో పనులు చేయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అతను గతంలో డిఫాల్టర్‌గా నిలిచిన వ్యక్తికి చెందిన బినామీ అయివుండవచ్చునని ప్రచారం జరుగుతోంది. అధికారుల సహకారంతోనే ఈ వ్యవహారం ముందుకు నడిచిందనే విమర్శ ఉంది. ఈ విషయమై సింహాచల దేవస్థానం కార్యనిర్వాహణాధికారి రామచంద్రమోహన్‌ను వివరణ కోరగా దేవదాయ శాఖ నిబంధనల ప్రకారం దేవాలయంలో ఏ విధమైన విధులకు అన్యమతస్థులను అనుమతించే ప్రసక్తి లేదన్నారు. నిబంధనలకు అనుగుణంగా అందరికంటే తక్కువ ధరకు కోట్ చేసి కాంట్రాక్టు పొందిన సంస్థ ఎండీ నుంచి డిక్లరేషన్ కూడా తాము తీసుకున్నామన్నారు. తాను పూర్తిగా హిందువునని, మతం విషయంలో ఎటువంటి ఆరోపణలు ఎదురైనా చట్టపరమైన చర్యలకు బాధ్యుడనని లిఖితపూర్వకంగా అంగీకరించినట్టు చెప్పారు. ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఈ విషయమై తాము విచారణ చేపడతామని, వాస్తవమైతే కాంట్రాక్టు రద్దు చేసి, అతనిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.


ఉప ప్రకంపనలు

ఉత్తరప్రదేశ్, బిహార్ రాష్ట్రాల ఉప ఎన్నికల్లో బీజేపీ పరాజయం విపక్షాలకు ఎన్నడూ లేనంత శక్తినిచ్చింది. ఉత్తరప్రదేశ్‌లో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఖాళీచేసిన స్థానాలనే తిరిగి దక్కించుకోలేకపోవడం ఆ పార్టీకి తీవ్రపరిణామమే. గోరఖ్‌పూర్ ఏడాదిలోనే శత్రువుల వశం కావడం ఆదిత్యనాథ్‌కు అత్యంత అవమానకరం. గోరఖ్‌పూర్ మఠాధిపతిగా ఆ కారణంగానే మొన్నటి యూపీ ఎన్నికల్లో బీజేపీ అత్యధికస్థానాలు నెగ్గగలిగిందని చెప్పుకున్న ఆయనకు ఈ ఓటమి వ్యక్తిగతంగా పెద్ద దెబ్బ. ఆగర్భశత్రువులైన సమాజ్‌వాదీ పార్టీ, బహుజన సమాజ్ పార్టీలు తాత్కాలికంగా చేతులు కలపడంతోనే ఇంతటి అద్భుత విజయాలు లభించినందున కచ్చితంగా విపక్షాల్లో ఐక్యతను పెంచుతుంది. బిహార్‌లో మహాకూటమిని చీల్చి, లాలూను జైల్లోకి, నితీశ్‌కుమార్‌నైతే బీజేపీ తనవైపు తిప్పుకోగలిగింది కానీ, ప్రజలు జైలులో ఉన్న ఆర్జేడీ అధినేత పక్షానే నిలిచివున్నారని వాదించేందుకు అరరియా ఫలితం ఊతాన్నిస్తుంది.

సాధారణంగా ఉప ఎన్నికల్లో ఒకటిరెండు స్థానాలు కోల్పోయినంత మాత్రాన అధికారపక్షానికి వచ్చే నష్టమేమీ ఉండదు. ప్రజాభిప్రాయానికి అద్దంపట్టేవి కూడా కావు. కానీ, యూపీ ఫలితాలు రాజకీయంగా పెద్ద దుమారాన్నే సృష్టించాయి. మోదీ అనే ఓ మహాబలవంతుడు, యోగిపేరుతో ఆయనకు ధీటుగా ఎదుగుతున్నారని అంతా అనుకుంటున్న ఓ యోగి ఇలా పరాభవంపాలైపోతారని ఎవరూ ఊహించలేదు. ఎంతోమందికి ఆశ్చర్యాన్నీ, విపక్షాలకు అమితానందాన్నీ కలిగించిన ఈ పరిణామానికి మాయావతి అఖిలేశ్‌తో కలిసినంతనే సంకల్పించిన రాజకీయ ప్రయోగం మూల కారణం. మోదీ-యోగుల రాష్ట్రంలోకి అడుగుపెట్టేవరకూ వచ్చినా ఫలితం కట్టలు చూసుకున్న ఎస్పీ, బీఎస్పీలు ఒక్కసారిగా చేతులు కలిపితే దానికి ప్రభావం క్షేత్రస్థాయిలో ఏమేరకు ఉంటుందన్నది ఆమె ఈ ఎన్నికల్లో పరీక్షించారు. కేవలం వారం ముందు తీసుకున్న నిర్ణయంగా చెబుతున్నప్పటికీ, ఇరుపక్షాల నేతల్లోనూ ఎప్పటినుంచో ఈ ఆలోచన, దాని అవసరం, తమ దుస్థితిపై అవగాహన ఉన్నమాట నిజం. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఒంటరిగా యుద్ధంచేసి విజయం సాధించగలిగే స్థితిలో రెండు పార్టీలూ లేవన్నది నిర్వివాదాంశం. అధినేతల ఆలోచనలకు అనుగుణంగా క్షేత్రస్థాయి నాయకులు పనిచేయడమూ, మాయావతిమాటకు సై అని దళిత ఓటర్లు ఎస్పీ అభ్యర్థికి జై కొట్టడం విశేషమైన మార్పు. చాలా ఎన్నికల్లో అత్యున్నతస్థాయి అవగాహనలు, ఒప్పందాలు ప్రజాక్షేత్రంలో పనికిరాకుండా కొట్టుకుపోతుంటాయి. అధినాయకులు ఆసక్తితోనూ కక్షలు మరిచినంతమాత్రాన ఓటర్లు దీర్ఘకాలిక వైరాన్ని తక్షణమే పక్కనబెట్టరు. వరదలో చిక్కిన పాము ముంగిసల సహకారంగా ఆదిత్యనాథ్ దీనిని పోల్చినప్పటికీ, విపత్తును నాయకులతో పాటు ప్రజలు కూడా గుర్తించడంలోనే విశేషమున్నది. ఈ కలయిక ఇంతటి విపత్తు తెస్తుందని, తన పరువు తీయడంతో పాటు, వరుస మఠాధిపతులందరూ ఆ ప్రాంతంలో పాదుకొలిపినట్టూ చెబుతున్న ప్రతిష్ఠను కూడా బలహీనపరుస్తుందని యోగి ఊహించలేదు. కేవలం ఓట్ల లెక్కలతోనో, కూడికలూ తీసివేతలతోనో ఈ రెండు స్థానాల్లో వచ్చిన మార్పును విశ్లేషించడం కష్టం. మొన్నటి ఎన్నికల్లో ఎస్పీ-బీఎస్పీలకు వచ్చిన ఓట్లను కూడి, బీజేపీ ఓట్లతో తూకం వేస్తే ఈ ఫలితం రాదు. రెండు ప్రత్యర్థిశక్తుల కలయిక సృష్టించిన ఒక కొత్త ఉత్సాహం, కొత్త గాలి ఈ ఫలితానికి కారణమైంది. రేపో మాపో తమ పార్టీలు విలీనం కాబోతున్నాయంటూ దిగువస్థాయి నాయకులంతా అనుకొంటూ, ఆశించడం ఇప్పటికే ఆరంభమైంది. సమాజ్‌వాదీ పార్టీ ఇప్పుడు మాయావతి బద్ధశత్రువు ములాయం సింగ్ చేతిలో లేదు. మిగతా సామాజికవర్గాలను కూడా దగ్గర చేర్చుకొని యాదవపార్టీగా ఉన్న పేరును తుడిచేసే పనిలో ఉన్నారు అఖిలేష్. వృద్ధనాయకులందరినీ దూరంపెట్టి, కొత్త ఆలోచనలతో, వ్యూహాలతో సాగుతున్న ఈ యువకుడితో చేతులు కలపడం తెలుసుకుంటే మాయావతికి క్షేమమే కాదు.

బిహార్‌లో ఆర్జేడీ విజయం జైల్లో ఉన్న లాలూకు ఎంతో ఉపశమనాన్నిచ్చేదిగా ఉంటుంది. యూపీ మాదిరిగా ఇక్కడి ఫలితాలు రాజకీయ సమీకరణలను మార్చేంతటి కాకపోయినా, లాలూ కుమారుడు తేజస్వి యాదవ్ నాయకత్వానికి గుర్తింపునిచ్చాయి. నితీశ్-మోదీ అవిచ్ఛిన్న కలయికను ప్రజలు ఆమోదించలేదని, లాలూను వీరిద్దరూ కుట్రపూరితంగా జైలుపాలుచేసినట్టు ప్రజలు భావిస్తున్నారని చెప్పుకోవడానికి ఉపకరిస్తుంది. నితీశ్ వెన్నుపోటు నుంచి తేరుకోవాలనీ, లాలూ పార్టీ రాష్ట్రంలో బలంగా ఉన్నదని చాటిచెప్పుకోవడానికీ, కాంగ్రెస్‌తో చేతులు కలిపి సాగడానికీ మార్గం సుగమమవుతుంది. ఈశాన్యం సహా అనేక రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మంచి విజయాలు సాధిస్తూ, పొత్తులు ఎత్తులతో కొన్ని పీఠాలను వశం చేసుకుంటూ రాగలుగుతున్న బీజేపీ మొన్న రాజస్థాన్‌లోనూ, ఇప్పుడు యూపీలోనూ చవిచూస్తున్న ఓటమిల పట్ల ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఇన్నాళ్లు ఆకాశానికెత్తిన వ్యూహాలు ఉన్న వైరాలు, వైషమ్యాలు అపజయాలకు కారణాలవుతాయని, బీజేపీలో మోదీ-అమిత్‌షాలు తలుచుకున్నప్పుడే వ్యతిరేక ఫలితాలు వస్తాయని కొందరి నమ్మకం. మొన్న మొండిచేయి చూపిందనుకున్న ఈశాన్యం నేడు చేతికందినట్టూ మార్పుకేసరిన యోగినీ ఇలా లొంగదీయకుండా సార్వత్రిక ఎన్నికల నాటికి తమమాటకు తిరుగులేకుండా చేసుకోవడంపై అసలు లక్ష్యమని వారి వాదన. నిజానిజాలు అటుంచితే, ఈ ఫలితాలు అటు ఢిల్లీలోనూ ఇటు రాష్ట్రాల్లోనూ విపక్షాలకు ఎనలేని ఉత్సాహాన్నిచ్చి, చేయీచేయీ కలిపి పరుగు తీసే అవకాశాన్ని ఇచ్చినమాట వాస్తవం.

విశ్వాన్వేషి



బలహీన శరీరాల
దుర్బల మనస్సులకి
ఆత్మస్థైర్యాలున్నా అలవాటించే అల్లులకి

పరిగెత్తగలిగినా పడకకే
పరిమితమయ్యే సోమరులకి
తన జీవితాన్ని
వ్యక్తిత్వ వికాస పాఠం చేసినవాడు
సహాయ నిరాకరణలో శరీరం
సానుభూతి కోరని దృక్పథం
జీవితంతో నిరంతర పోరాటం
లోక క్షేమం కోసం ఆరాటం
విశ్వాంతరాళాల శోధనం
విధినే ధిక్కరించిన ధైర్యం
ప్రత్యక్ష జ్ఞానానికే పీఠం
పరోక్ష దైవానికి స్థానం లేదన్న స్థైర్యం

పొంచి ఉన్న మృత్యువుని సైతం
వేలి ఉంకెలా చేసిన సంకల్ప బలం
అననుకూల స్థితిని
అనుకూలంగా మార్చుకోవడమెలాగో
ఓటమి ఎదురొస్తుందన్నా
పోరాటపటిమను ప్రదర్శించడమెలాగో
అనంతమైన ఆత్మవిశ్వాసాన్ని
అలవరచుకోవడమెలాగో
జగతికి నేర్పినవాడు
కనుమరుగైనా
కందరాడనే
వేలి కొసలనే
కదిలించగలిగిన చాలు
అనంత గగన రహస్య ఛేదనం
సమున్నత జ్ఞాన శిఖరారోహణం
సార్థకమైన వాటి చెప్పిన
మేధా సంపన్నుడు

(ఆత్మశక్తికి ప్రతీక స్టీఫెన్ హాకింగ్‌కు అశ్రుతాంజలి)

■ నల్లపనేని విజయలక్ష్మి

అమరావతి దేశ రెండవ రాజధాని!

ఆంధ్రప్రదేశ్ ఈ దేశంలో అంతర్భాగం కాదా? ఈ ప్రశ్న ఇటీవల సామాన్యులు, మేధావులు, రాజకీయ నాయకుల నుంచి ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా వినిపిస్తోంది. ఆక్రోశంతో కూడిన ఈ అసాధారణ పరిస్థితి రాష్ట్రంలో నెలకొని ఉంది. ప్రజల ఆవేదనను అర్థం చేసుకున్న చంద్రబాబు ప్రపంచ స్థాయి రాజధాని నిర్మించాలని సంకల్పించి, అమరావతిని రాష్ట్రరాజధానిగా ప్రకటించి రైతుల నుంచి స్వచ్ఛందంగా 33వేల ఎకరాలు భూమిని సేకరించి అద్భుత రాజధాని నగర నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అయితే నాలుగు సంవత్సరాల తర్వాత కూడా రాజధాని అభివృద్ధికి నిధుల విడుదలలో సహా విభజన చట్టం, విభజన హామీల అమలుకు నోచుకోక పోవటంతో కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరి ఆంధ్ర ప్రజలను తీవ్ర ఆగ్రహావేశాలకు గురి చేస్తోంది. ఈ ఆవేదనకు ప్రతిరూపమే నేడు ఏపీలో జరుగుతున్న 'ప్రత్యేక హోదా' ఉద్యమ పోరు. ఉద్యమం. గత యూపీఏ ప్రభుత్వం ద్రోహంచేస్తే, ఇప్పటి ఎన్డీఏ ప్రభుత్వంసైతం తమను మోసం చేసిందని భావన రాష్ట్ర ప్రజానీకంలో సర్వత్రా ఏర్పడింది. కేంద్రం వైఖరి మార్చుకుని ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయవలసిన అవసరాన్ని గుర్తించకపోతే అది ఫెడరల్ వ్యవస్థ, దేశానికి బీజేపీ ప్రభుత్వం చేసిన చారిత్రక తప్పిదంగా మిగిలిపోతుంది. దేశ ఐక్యతకు ప్రాణ ప్రదమైన ఫెడరల్ స్ఫూర్తి దెబ్బతినకుండా కాపాడుకోవలసిన బాధ్యత ఈ దేశంలోని ప్రజాస్వామ్యవాదులందరిపైనా ఉంది.

శ్రీకృష్ణ కమిటీ బహిష్కరించడం దగ్గర నుంచి రాజకీయ పార్టీల ద్వంద్వ ప్రమాణాలతో నడిచిన సమైక్యాంధ్ర ఉద్యమం తీరు కూడా నేటి ఆంధ్రప్రదేశ్ దుస్థితికి కారణమని చెప్పుకోవచ్చు. తెలుగు తల్లి సెంటిమెంట్ మాటున యువతకు చారిత్రక వాస్తవాలు తెలియనీయలేదు. 'ఆరవ జోన్' వ్యవస్థను రాష్ట్రవిభజన జరిగినా జగడం ప్రజలను తప్పుదారి పట్టించారు. ఒక ప్రాంతప్రజల మనోభావాలను గాయపరిచేవిధంగా ఆమోదం పొందిన ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం పార్లమెంట్ చరిత్రలోనే ఒక చీకటి అధ్యాయం. విభజన అనివార్యమని తెలిసినప్పటికీ 'హైదరాబాద్ అభివృద్ధికి సీమాంధ్రుల భాగస్వామ్యం'పై బహిరంగ చర్చ జరగలేదు. వెరసి హైదరాబాదును జరిగిన అసమతుల అభివృద్ధిని సీమాంధ్రులు ఇలా ప్రయోజనం ... ఆంధ్రప్రదేశ్ ఇప్పుడే పుట్టినట్లు కేంద్రం భావించినా, 50 ఏళ్ళ అభివృద్ధి తమ తక్షణ హక్కుగా ఆంధ్రులు భావిస్తున్నారు. అర్ధశతాబ్దంపాటు అభివృద్ధి చేసుకున్న రాజధాని నగరాన్ని కోల్పోయిన భావన సీమాంధ్రుల హృదయాలను కలచివేస్తోంది.



పోరాటాలను సరిదిద్దుకునే శక్తి మన ప్రజాస్వామ్యానికి ఉంది. రాజ్యాంగ స్ఫూర్తితో ఈనాడు ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆవేదనను అర్థం చేసుకుని పరిష్కారం కనుగొనవలసిన బాధ్యత పార్లమెంటు పైన, ఈ దేశ రాజకీయపార్టీలన్నిటిపైనా ఉంది. అందుకు ఒక ఆలోచన, ఒక రాజ్యాంగబద్ధమైన పరిష్కారం ఈ దేశ విశాల ప్రయోజనాల దృష్ట్యా అవసరం. ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగిందని దేశంలోని దాదాపు అన్ని రాజకీయ

ఏడు దశాబ్దాల క్రితమే రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ హైదరాబాద్‌ను భారత రెండవ రాజధానిగా అభివృద్ధి చేయాలని సూచించారు. అనేక కేంద్ర ప్రభుత్వ సంస్థలతో హైదరాబాద్ ఇప్పటికే అభివృద్ధి చెందింది. అంబేద్కర్ ఆలోచనా స్ఫూర్తితో నేటి అవసరాలకు అనుగుణంగా ఉత్తర, దక్షిణ భారతదేశాన్ని అనుసంధానించే వారధిగా, ప్రఖ్యాత బౌద్ధక్షేత్రంగా భాసిల్లిన అమరావతిని దేశ రెండవ రాజధానిగా ప్రకటిస్తే స్వాతంత్ర్యానంతరం అది ఒక అద్భుత నిర్ణయంగా మిగిలిపోతుంది.

పక్షాలూ అంగీకరిస్తున్నాయి. 58.3శాతం జనాభా ఉన్న పెద్ద రాష్ట్రానికి 46 శాతం రెవెన్యూతో లోటు బడ్జెట్ రాష్ట్రంగానూ, 41.7 శాతం జనాభా ఉన్న చిన్న రాష్ట్రానికి 54 శాతం రెవిన్యూతో మిగులు బడ్జెట్ రాష్ట్రంగానూ విభజించడంతో అవశేష ఆంధ్రప్రదేశ్ కష్టాలు మొదలయ్యాయి. మొత్తం మీద 2.49 లక్షల అప్పుల ఊబిలో ఆంధ్రప్రదేశ్ కూరుకుపోయింది. ఈ పరిస్థితుల్లో ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణం రాష్ట్ర ప్రభుత్వానికి తలకు మించిన భారమవుతుంది. ఏపీ నుంచి నిరుద్యోగులు లక్షలాదిగా పొట్టచేత పట్టుకుని ఇతర ప్రాంతాలు, దేశాలు పోతూంటే అక్కడి స్థానికుల నుంచి వ్యతిరేకత వ్యక్తమౌతున్నది. మనవారు ఇతర రాష్ట్రాలకు పోతున్నట్లే ఇతర రాష్ట్రాలవారికి సైతం రాష్ట్రంలో ఉద్యోగావకాశాలు పెరిగే విధంగా ఇక్కడ అభివృద్ధి జరిగినప్పుడే మనకి గౌరవం. రాష్ట్ర విభజనకు ముందు దక్షిణాది రాష్ట్రాలలో అగ్రభాగాన ఉన్న మన తలసరి ఆదాయం రాజధాని కోల్పోవడంతో కనిష్ఠ స్థాయికి పడిపోయింది. చేయని తప్పుకు ఆంధ్రరాష్ట్రం శిక్ష అనుభవించవలసి వస్తోంది. 29 రాష్ట్రాలలో ఒకటిగా కాకుండా, ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్‌ను చూడడం కేంద్రం బాధ్యత. ఎన్నికల ప్రయోజనాలతో ముడిపెట్టి చూడకుండా ఒక శాశ్వత పరిష్కారం కనుగొనవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది.

దేశ రెండవ రాజధానిగా అమరావతిని కేంద్రప్రభుత్వం ప్రకటించి, ఒక అద్భుత ఆధునిక నగరంగా ప్రపంచ ప్రమాణాలతో కేంద్ర నిధులతో అభివృద్ధిచేయాలి. అప్పుడు మాత్రమే రైతులు స్వచ్ఛందంగా ఇచ్చిన 33 వేల ఎకారాల భూమిలో ఒక మహానగర నిర్మాణం సాధ్యమవుతుంది. ఏడు దశాబ్దాల క్రితమే రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ హైదరాబాద్‌ను భారతదేశ రెండవ రాజధానిగా అభివృద్ధి చేయాలని సూచించారు. అనేక కేంద్రప్రభుత్వ సంస్థలతో హైదరబాద్ ఇప్పటికే అభివృద్ధి చెందింది. అంబేడ్కర్ ఆలోచనా స్ఫూర్తితో నేటి అవసరాలకు అనుగుణంగా ఉత్తర, దక్షిణ భారతదేశాన్ని అనుసంధానించే వారధిగా, ప్రపంచ ప్రఖ్యాత బౌద్ధక్షేత్రంగా భాసిల్లిన అమరావతిని దేశరెండవ రాజధానిగా ప్రకటిస్తే స్వాతంత్ర్యానంతరం అది ఒక అద్భుత నిర్ణయంగా మిగిలిపోతుంది. కృష్ణానదీ తీరంలో నౌకాయానం, విదేశీవాణిజ్యం నెరపిన చారిత్రక నేపథ్యంతో దేశానికే ఈస్ట్రన్ గేట్‌వేగా ఈ ప్రాంతం దేశ రెండవరాజధానిగా అన్నివిధాల అనుకూలమైనది. తూర్పుతీరంలో స్వర్ణచతుర్భుజి ప్రాంతంలో చెన్నై-కొల్‌కతా 16 నెంబర్ జాతీయ రహదారిపై ఉండడమే కాకుండా, కేంద్ర ప్రభుత్వం ఆమోదించి నిర్మాణంలో ఉన్న బెంగుళూరు-అనంతపురం-విజయవాడ హైవే సహా మొత్తం ఆరు హైవేల కూడలి అమరావతి. విజయవాడ-ముంబాయి, పూనె-హైదరాబాద్‌లతో అనుసంధానమై, రాయపూర్-విజయవాడ 221 నెంబర్ హైవే, నాలుగు రాష్ట్రాల మీదుగా నిర్మాణంలో ఉన్న రాంచి-విజయవాడ హైవేలన్నీ విజయవాడకు అనుసంధానించబడి ఉన్నాయి. ఇక రైల్వేలైన్ల పరంగా చూసినపుడు చెన్నై-కోల్‌కత బెంగుళూరు-కొల్‌కత, హైదరాబాద్-కొల్‌కత, వాడి-విజయవాడలకు ఉత్తర దక్షిణ భారత వారధిగా అమరావతి అన్ని విధాల అర్హమైనది. సుప్రీం కోర్టు బెంచ్ ఇక్కడ ఏర్పాట చేస్తే కేరళ, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణలతో పాటు ఒరిస్సా రాష్ట్ర ప్రజలకూ న్యాయం చేరువవుతుంది. నూతనంగా నిర్మించ తలపెట్టే అనేక కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు ఇక్కడ నెల కొల్పవచ్చు. దేశ విభజనలో పంజాబ్ రాష్ట్రం రెండు ముక్కలై పశ్చిమ ప్రాంత పంజాబ్‌ను పాకిస్థాన్‌కు కోల్పోవడం జరిగింది. ఆ విధంగా పంజాబ్ రాజధాని లాహోర్ నగరం పశ్చిమ పంజాబ్ (పాకిస్థాన్)లో ఉండిపోయింది. నేటి హర్యాణ-పంజాబ్ ఉమ్మడి రాజధానిగా ఉన్న చండీఘర్ ప్రథమ భారత ప్రధాని పండిట్ నెహ్రూ తన 'డ్రీమ్ సిటీ' గాపేర్కొని కేంద్ర నిధులతో ఆనాటి ప్రపంచ ప్రమాణాలతో ఒక అద్భుత సుందర నగరంగా నిర్మించారు. నేడు అత్యధిక తలసరి ఆదాయం ఉన్న నగరాలలో చండీఘర్ ఒకటి.

ఢిల్లీని మించిన రాజధానిని ఆంధ్రప్రదేశ్‌లో నిర్మిస్తామని ప్రధానమంత్రి మోదీ చేసిన వాగ్దానానికి సార్థకత చేకూరితేనే ఆంధ్రుల మనసు శాంతిస్తుంది. 33వేల ఎకరాల భూమిని స్వచ్ఛందంగా ఇచ్చిన రైతులకు న్యాయం జరుగుతుంది. యమునా తీరంలో హస్తినాపురం, కృష్ణాతీరంలో అమరావతి భారతదేశానికి రెండు కళ్ళుగా ఉండి, దేశ ఐక్యత వెల్లివిరుస్తుంది. అమరావతి శంకుస్థాపనకు పార్లమెంటు నుంచి పవిత్రమైన మట్టిని, యమునా నది పవిత్రజలాల్ని తెచ్చిన మోదీ అమరావతిని దేశ రెండవ రాజధానిగా ప్రకటించడం ద్వారా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారు.

■ అవధానుల హరి

ప్రాంతీయ విజేతలే నిర్ణేతలు

■ రాజ్‌దీప్ సర్దేశాయి



దీపశిఖ

బీజేపీయేతర, కాంగ్రెసేతర 'తృతీయ ఫ్రంట్' ప్రభుత్వ ఏర్పాటు ఒక ప్రశస్థ ఆలోచనే. అయితే అది ఆచరణలో సాధ్యమేనా? 1990వ దశకం మధ్య సంవత్సరాల్లో అటువంటి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ చాలా ప్రయత్నించారు. అయితే ఒక 'కిచిడీ' ప్రభుత్వం వల్ల దేశానికి మేలు జరుగుతుందా? అని ఆ మాజీ ప్రధాన మంత్రిని ప్రశ్నించాము. 'బీజేపీయేతర, కాంగ్రెసేతర తృతీయ ఫ్రంట్ ప్రభుత్వం ఆక్షేపణీయమా అనేది నాకు తెలియదు. అయితే అది ఏర్పడడం అనివార్యం' అని వీపీసింగ్ స్పష్టంగా సమాధానమిచ్చారు తృతీయ ఫ్రంట్ రాజకీయాల తొలి చిహ్నం విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్. 1989లో నేషనల్ ఫ్రంట్‌ను నిర్మించి, ఆశ్చర్య జనకంగా బయటినుంచి బీజేపీ, వామపక్షాల మద్దతుతో ఆయన ప్రధానమంత్రి పదవిని అధిష్టించారు. రాజీవ్ గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తొలగించడమే నేషనల్ ఫ్రంట్ ఏకాంశ ఎజెండాగా ఉండేది. ఇప్పుడు వీస్తున్న రాజకీయ పవనాల్లో విన్పిస్తున్న ప్రశ్న ఏమిటంటే 2019లో మోదీకి వ్యతిరేకంగా అటువంటి రాజకీయ కూటమి ఆవిర్భవిస్తుందా?

ఉత్తరప్రదేశ్‌లో రెండు లోక్‌సభా స్థానాలకు ఇటీవల జరిగిన ఉపఎన్నికల ఫలితాలు భావి రాజకీయాలకు సూచకంగా ఉన్నాయి. బద్ధ శత్రువులైన సమాజ్‌వాదీ పార్టీ, బహుజన సమాజ్ వాదీ పార్టీలు ఈ ఉప ఎన్నికలలో చేతులు కలిపాయి. ఎస్పి అభ్యర్థులకు బిఎస్పి బేషరతు మద్దతునివ్వడం వల్లే మోదీ ప్రత్యర్థులకు ఈ అపూర్వ విజయం సాధ్యమయింది. దేశంలోకెల్లా అత్యధిక జనాభా, అత్యధిక లోక్‌సభా స్థానాలు గల ఉత్తరప్రదేశ్‌లో మోదీ మహాశక్తిని అడ్డుకోవడంలో ఎస్పి, బిఎస్పిలు సఫలమయ్యాయి. ప్రాంతీయ పార్టీల 'ఫెడరల్ ఫ్రంట్' నేర్పాటు చేయాలన్న తన ఆకాంక్షను బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఇప్పటికే బాహాటంగా వ్యక్తం చేశారు. ఒడిషా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బిజూ జనతాదళ్ తో సహా ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాలలోని పలు ప్రాంతీయ పార్టీలతో ఒక ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు మమత లక్ష్యంగా ఉన్నది. తెలంగాణలో ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు కూడా ఒక ప్రాంతీయ కూటమిని నిర్మించాలని ప్రగాఢంగా ఆకాంక్షిస్తున్నారు. గతంలో తృతీయ ఫ్రంట్ రాజకీయాల పతాకధారిగా వెలుగొందిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఇటువంటి ఆలోచనల్లోనే ఉన్నారు. మోదీ ప్రభుత్వం నుంచి తెలుగు దేశం పార్టీ మంత్రులు వైదొలిగారు. భావి కార్యాచరణకు అనుసరించాల్సిన మార్గాల గురించి చంద్రబాబు నిశితంగా పరిశీలిస్తున్నారు. ఇదిలావుండగా దేశంలో రాజకీయ పరిస్థితులు వేగంగా మారిపోతోన్న నేపథ్యంలో యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ రంగంలోకి దిగి మోదీని వ్యతేకిస్తున్న పార్టీల నాయకులకు ఇటీవల ఒక విందు నిచ్చారు.

1989లో కాంగ్రెస్ పట్ల తీవ్ర వ్యతిరేకతే అటు మితవాద పక్షాలను, ఇటు వామపక్షాలను ఒక సమైక్య వేదిక మీదకి తీసుకువచ్చాయి. ఇప్పుడు బీజేపీ పట్ల వ్యతిరేకత గాక, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పట్ల తీవ్ర వ్యతిరేకతే వివిధ రాజకీయపక్షాలను ఏకీకరిస్తోంది. ఇది ఎవరూ కొట్టివేయలేని వాస్తవం. దేశ రాజకీయాలలో ప్రధాని మోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షాల గుత్తాధిపత్యం అంతకంతకూ పెరిగిపోతుండడం బీజేపీయేతర రాజకీయ పక్షాలను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తోంది. ఈ కారణంగానే అవి ఏకమవుతున్నాయి. ఏకం కానిపక్షంలో తమకు మనుగడ ఉండదని అవి భయపడుతున్నాయి. 1996లో 13 రోజుల వాజపేయి ప్రభుత్వం లోక్‌సభ విశ్వాసాన్ని పొందలేక పతనమయింది. బాబ్రీ మసీదు కూల్చివేత అనంతరం బీజేపీ 'మతతత్వ రాజకీయాల'ను వివిధ రాజకీయ పక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఆ పార్టీతో ఎటువంటి సంబంధాలు కలిగివున్నా తమకు నష్టం జరగగలదని అవి భావించాయి. ఇప్పుడు అవి బీజేపీని హిందూత్వ పార్టీ అయినందువల్ల వ్యతిరేకించడం లేదు. మోదీ-షాల నాయకత్వంలోని బీజేపీ ఎన్నికల వ్యూహాల నెదుర్కొని మనుగడ సాగించలేమని ప్రతి రాజకీయ పార్టీ భయపడుతోంది. ఈ భయమే ప్రతిపక్షాలను ఏకం చేస్తోంది. ఇటువంటి భయం విపక్షాల్లోనేగాకుండా బీజేపీ మిత్రపక్షాల్లో కూడా ఉన్నదనేది గమనార్హం.

శివసేనే ఇందుకొక తార్కాణం. హిందూత్వ విషయంలో భావ సారూప్యత ఉన్నందునే శివసేనను, మరే పార్టీ కంటే ముందుగా బీజేపీకి సన్నిహితం చేశాయి. ఇప్పుడు బీజేపీ నాయకత్వాన్ని శివసేన తీవ్రంగా విమర్శిస్తోంది. వ్యక్తులను కేంద్రంగా చేసుకొని ఆ విమర్శలు సాగుతున్నాయి. శివసేన-బీజేపీ మధ్య విభేదాలు భావజాలపరమైనవి కావనేది స్పష్టం. కేంద్రంలోని అధికార పార్టీ తమ ప్రయోజనాలను ప్రాధాన్యమివ్వడం లేదని మహారాష్ట్ర మాజీ అధికార పక్షం భావిస్తోంది. సరే, మమతా బెనర్జీ, నవీన్ పట్నాయక్, కేసీఆర్ నాయకత్వంలోని పార్టీలు ఒకప్పుడు బీజేపీకి మిత్రపక్షాలుగా ఉన్నాయి. 1990ల్లో బీజేపీని ప్రతి రాజకీయ పక్షమూ ఒక 'అంటరాని పార్టీ'గా పరిగణించింది. అటువంటి 'అస్పృశ్యత' సిలువ భారాన్ని బీజేపీ ఇంకెంత మాత్రం మోయడం లేదు. ఈ ప్రాంతీయ పార్టీలకు చెందిన ప్రతి ముఖ్యమంత్రీ బీజేపీ ఎన్నికల యంత్రాంగపు శక్తిసామర్థ్యాలకు భయపడుతున్నారు. మోదీ-షా రాజకీయ ఆకాంక్షలు వారిని మరింతగా భయపెడుతున్నాయి. దేశవ్యాప్తంగా 21 రాష్ట్రాలలో బీజేపీ అధికార కేతనం ఎగురవేయడం వెనుక ఈ నాయక ద్వయం అనుసరించిన వ్యూహాలే కారణమన్న వాస్తవాన్ని ఈ రాజకీయ పార్టీలు విస్మరించలేవు. ఉత్తరప్రదేశ్‌లో అఖిలేశ్ యాదవ్, మాయావతిలు ఎట్టకేలకు చేతులు కలపడానికి కారణం మనుగడ కోసం ఆరాటమే. మోదీని అడ్డుకోకపోతే తమ పార్టీలకు అస్తిత్వముండబోదని గుర్తించడం వల్లే ఇటీవలి ఉప ఎన్నికలలో వారు కలసికట్టుగా పనిచేసి విజయం సాధించారు. మోదీని ఓడించి తీరాలన్న ప్రతిపక్షాల ప్రగాఢ కోరిక ఫలిస్తుందా? దేశ రాజకీయాలను మార్చివేయగలుగుతుందా? వివిధ రాజకీయపక్షాలకు వచ్చిన ఓట్లను ప్రాతిపదికగా తీసుకొంటే ఈ ప్రశ్నకు సానుకూల సమాధానం లభిస్తుంది. 2014 సార్వత్రక ఎన్నికలలో బీజేపీకి 31 శాతం ఓట్లు వచ్చాయి. ఈ ఓట్లలో అత్యధిక భాగం ఉత్తర, పశ్చిమ భారత రాష్ట్రాలలో లభించినవే. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీకి 19శాతం ఓట్లు దక్కాయి. మరింత స్పష్టంగా చెప్పాలంటే బీజేపీ, కాంగ్రెస్‌లు పోలయిన మొత్తం ఓట్లలో సగం ఓట్లను గెలుచుకున్నాయి. దీన్నిబట్టి ఇతర రాజకీయపక్షాలకు లభించిన ఓట్ల వాటా గణనీయమైనదేనని చెప్పక తప్పదు. వ్యూహాత్మక పొత్తుల సహాయంతో మరింత అధిక సంఖ్యలో సీట్లను గెలుచుకోవడానికి ఆస్కారమున్నది. 2014లో ఎస్పి, బీఎస్పిల మధ్య పొత్తు ఉన్నట్లయితే ఉత్తరప్రదేశ్‌లో బీజేపీకి దాదాపు 35 సీట్లు తగ్గివుండేవని స్పష్టంగాచెప్పవచ్చు.



2019 సార్వత్రక ఎన్నికల అనంతరం భారతీయ జనతా పార్టీ ప్రాబల్య 'జాతీయ' రాజకీయ శక్తిగా ఉండగలుగుతుంది. అయితే ప్రధాన రాజకీయ చర్చ మాత్రం తమ తమ స్వరాష్ట్రాలలో విజయాన్ని సాధించిన ప్రాంతీయ పార్టీల మీదే జరుగుతుంది!

చట్టసభల్లో సంఖ్యాబలం పెంచుకోవడానికి ఎన్నికల పొత్తులు తోడ్పడతాయి. అయితే నాయకుల పట్ల ప్రజలు చూపించే ఆదరాభిమానాలు కూడా రాజకీయాలలో నిర్ణయాత్మక ప్రభావాన్ని చూపుతాయి. మోదీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఏకం కావడాన్ని ప్రజలు సానుకూలంగా చూడవలసివున్నది. విపక్షాల స్వార్థ రాజకీయాలకు మోదీ బలి అవుతున్నారన్న భావం ప్రజల్లో కలగకుండా ఉండాలి. 1971లో ప్రతిపక్షాల ఐక్యతను ఇందిరాగాంధీ చాలా చతురంగా తనకు అనుకూలంగా ఉపయోగించుకున్నారు. అభివృద్ధి నిరోధక శక్తులు తాను అమలపరుస్తున్న ప్రగతిశీల విధానాలను వ్యతిరేకిస్తున్నాయని ఆమె ఆరోపించారు. ఆనాటి ప్రతిపక్షాల ఐక్యతపై తన ఆక్షేపణను ఆమె ఒక శక్తిమంతమైన నినాదం రూపంలో వ్యక్తం చేశారు: 'వో కెహ్తే హై ఇందిరా హటావో, మే కెహ్తా హూ గరీబీ హటావో'. ఈ 'గరీబీ హటావో' నినాదం ప్రజలను విశేషంగా ఆకట్టుకొంది. ఆసేతుహిమాచలం అసంఖ్యాక ఓటర్లు ఆమెకు మద్దతుగా ఓటు వేశారు. మరి ఇందిర చాణక్య రాజకీయాలకు మోదీనే నిజమైన వారసుడని చెప్పవచ్చు.


ఇక మరో ముఖ్యమైన విషయం మోదీ నియంతృత్వ వ్యవహార శైలికి ఎంతగా భయపడుతున్నప్పటికీ బీజేపీని వ్యతిరేకిస్తున్న రాజకీయ పక్షాలేవీ కాంగ్రెస్ పార్టీని విశ్వసించడం లేదు. ఈ కారణంగానే రాహుల్ నాయకత్వంలో ఒక జాతీయ స్థాయి సంకీర్ణాన్ని ఏర్పాటు చేయడం కాంగ్రెస్‌కు కష్టమైపోతోంది. రాహుల్ నాయకత్వాన్ని ఒక మమతా బెనర్జీ, ఒక శరద్ పవార్ ఆమోదించే అవకాశం లేదు. ప్రధానమంత్రి పదవికి తమ ఉమ్మడి అభ్యర్థిగా ఏ ఒక్క నాయకుడిపైనా ప్రతిపక్షాలకు ఏకాభిప్రాయం లేదు. మోదీకి ఇప్పటికీ మరే నాయకుడికి లేని ప్రజాదరణ ఉన్నదనేది విపక్షాలు విస్మరించలేని వాస్తవం. ప్రజాబలం విషయంలో మోదీకి సమానుడైన నాయకుడు ఏ పార్టీలోనూ లేడు. మరి ఇటువంటి పరిస్థితుల్లో నిస్సహాయ ప్రతిపక్షాలకు మార్గాంతరమేమిటి? ప్రాంతీయ స్థాయిలో అంటే ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రంలో బలంగా ఉన్న రాజకీయపక్షం బీజేపీ, మోదీతో సమర్థంగా తలపడాలి. కాంగ్రెస్ సైతం పరిమిత సంఖ్యలో మాత్రమే రాష్ట్రాలపై దృష్టిని కేంద్రీకరించాలి. 2019 సార్వత్రక ఎన్నికల అనంతరం బీజేపీ ప్రాబల్య 'జాతీయ' రాజకీయ శక్తిగా ఉండగలుగుతుంది. అయితే ప్రధాన రాజకీయ చర్చ మాత్రం తమ తమ స్వరాష్ట్రాలలో విజయాన్ని సాధించిన ప్రాంతీయ పార్టీల మీదే జరుగుతుంది!

తాజా కలం: ఇటీవల ఒక కార్పొరేట్ సమావేశంలో ఒక పారిశ్రామిక వేత్త ఇలా అనడం విన్పించింది: 'మేము ఏ ప్రభుత్వాన్ని అయినా ఆమోదిస్తాము గానీ తృతీయ ఫ్రంట్ ప్రభుత్వాన్ని అంగీకరించలేము. అలా అంగీకరించడమంటే భారత్ పురోభివృద్ధి కథముగియడమే అవుతుంది'. కొన్ని వారాలక్రితం ఈ పారిశ్రామికవేత్తే కోల్‌కతాలో బెంగాల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌లో మాట్లాడుతూ భావి భారతనాయకురాలిగా మమతా బెనర్జీ విశిష్టతలను ఘనంగా ప్రశంసించారు మరి!

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

నిజంగానే అది చీకటి కాలమా?

■ వి. శ్రీనివాస్



సారాంశం

సింగపూర్‌లో జరిగిన ఒక సదస్సులో కాంగ్రెస్ యువ నేత రాహుల్‌గాంధీ ప్రసంగం తర్వాత సభికుల్లోంచి ప్రసేన్‌జిత్ అనే వ్యక్తి ఒక ప్రశ్న సంధించారు. "మీ కుటుంబసభ్యుల పాలనలో ఉన్నప్పుడు భారత్ తలసరి రాబడిలో వృద్ధి ప్రపంచ సగటు కంటే తక్కువగా ఎందుకుంది? మీ కుటుంబ సభ్యులు భారత ప్రధాని పదవి నుంచి తొలిగిపోయిన తర్వాత ప్రపంచ సగటుకంటే భారత్ తలసరి ఆదాయం చాలా ఎక్కువగా ఎందుకు పెరిగింది?" ఈ ప్రశ్న అడిగిన ప్రసేన్‌జిత్ తనను తాను "ఏషియా రీబోర్న్" అనే పుస్తక రచయితగా పరిచయం చేసుకున్నాడు. తన పుస్తకాన్ని యావత్ ఆసియాకు సంబంధించిన సమగ్ర రాజకీయ, ఆర్థిక చరిత్రగా చెప్పుకున్నారు. బసు ప్రశ్నకు రాహుల్ ఉక్కిరిబిక్కిరై, సమాధానం చెప్పుకోలేక తడబడినట్టుగా సోషల్ మీడియాలో వార్తలు, వీడియోలు హోరెత్తాయి. రాహుల్ నిజంగానే తడబడ్డారా? దీటుగా సమాధానం చెప్పలేకపోయారా? తడబడితే అందుకు కారణమేమిటీ? బసు లేవనెత్తిన అంశంలో నిజముందని రాహుల్ భావించారా? నెహ్రూ-గాంధీ హయాంలో కంటే కూడా భారత్ కాంగ్రెసేతర ప్రధానుల హయాంలోనే బాగా అభివృద్ధి చెందిందా? అభివృద్ధిని ఎలా చూడాలి? రాహుల్-బసు ఉదంతం అనేక కొత్త ప్రశ్నలకు ఆస్కారం ఇచ్చింది. ఆ ప్రశ్నలకు సమాధానాలు చెప్పుకోవాల్సి సందర్భాన్నీ కల్పించింది.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలి దశాబ్దాల్లో భారత్‌ను పునర్ నిర్మించడానికి ప్రథమ ప్రధాని నెహ్రూ మిశ్రమార్థిక విధానాలను ఆనుసరించారు. ఆయన అనుసరించిన ఆర్థిక వ్యూహాలు, అనుసరించిన విలువలు ఆ తర్వాత దశాబ్దాల్లో ఆయన వారసులుగా అధికారంలోకి వచ్చిన ఇందిరా, రాజీవ్‌గాంధీ కొనసాగించారు. ఈ విధానాలే దేశానికి చేటుచేశాయన్నది ప్రస్తుతం సాగుతున్న ప్రచారం. అప్పట్లోనే భారత్ స్వేచ్ఛా ఆర్థిక విధానాలను అనుసరించి ఉంటే దేశం ఇప్పటికే అమెరికా అయిపోయేదన్న ప్రాతిపదిక ఆధారంగా ఈ ప్రచారం సాగుతోంది. తన చరిత్రపై తనకే అవిశ్వాసం కలిగేలా భారత్‌ను నమ్మించడానికి బృహత్ ప్రయత్నాలు జరుగుతున్నాయి. అందులో భాగమే బసు ప్రశ్న.

భారత్ మిశ్రమార్థిక వ్యవస్థను అనుసరించడానికి నెహ్రూ ఆలోచనా విధానం ఎంత కారణమో అప్పటి చారిత్రక వాస్తవ పరిస్థితుల అంతే కారణం. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలోనే ప్రభుత్వం ప్రైవేట్ కాపిటల్‌కు పెద్ద పీట వేసే అవకాశాలు లేవు. దేశంలో భారీ పెట్టుబడులకు ప్రైవేట్ వ్యక్తులు సిద్ధంగా లేరు. ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు గుమ్మరించి చేపట్టిన ప్రాజెక్టులు, మౌలికవసతుల కల్పన, పబ్లిక్ సెక్టార్ సంస్థల ఏర్పాటు.. ఆ తర్వాత కాలంలో బలమైన పెట్టుబడిదారు వర్గం తయారయ్యేందుకు కూడా దోహదం చేసింది. ఈ రోజు కుబేరుల జాబితాలో వెలిగిపోతున్న అనేక కుటుంబాలు ఈ నేపథ్యంలో లబ్దిపొందినవే. నెహ్రూ మిశ్రమార్థిక విధానాల్లో సోషలిజం మొగ్గ ఎక్కువగా ఉంది. ఇది విస్తృత ప్రజానీకం అభివృద్ధికి కూడా ఉపయోగపడింది. ప్రపంచంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా, అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థగా భారత్‌కు ఈ రోజు ప్రపంచంలో ఉన్న గుర్తింపునకు కారణం గత పాతికేళ్ల ఆర్థిక చరిత్రలో లేదు. స్వాతంత్ర్యం వచ్చిన తొలి మూడునాలుగు దశాబ్దాల్లో దీనికి బీజం పడింది. భవిష్యత్ అవకాశాలను అందుకోవడానికి వీలుగా అతిపెద్ద మధ్య తరగతి వర్గం విస్తరించి సన్నద్ధం కావడానికి దోహదం చేసిన సమయం అది. అతికొద్ది మందికి, స్వల్ప వర్గాలకు మాత్రమే పరిమితమైన సామాజిక, ఆర్థిక, రాజకీయ మూలధనాన్ని విస్తృత శ్రేణి ప్రజలకు సమకూర్చేందుకు దోహదం చేసిన కాలం అది. 1990 తర్వాత ఆర్థిక రంగంలో వచ్చిన మార్పులను అందిపుచ్చుకున్న మధ్య తరగతి ఎగువ మధ్య తరగతి వర్గాలన్నీ నెహ్రూ-గాంధీ హయాంలో రూపుదిద్దుకున్నవే. ఆర్థిక విధానాలు మాత్రమే కాదు, వందల సంవత్సరాలపాటు వలసపాలనలో ఉన్న దేశంలో ప్రజల్లో స్వతంత్ర భావనలు, లౌకిక, ప్రజాస్వామ్య విలువల పట్ల అవగాహన పెరిగేందుకు అవసరమైన వాతావరణ నిర్మాణం కోసం కూడా నెహ్రూ-గాంధీ ప్రయత్నించారు.

దేశ అభివృద్ధికి కొలమానం తలసరి ఆదాయం ఒకటే అయితే అధిక వృద్ధి రేటు సంపద పంపిణీలో ప్రతిఫలిస్తుందా అన్నది కూడా ప్రశ్న. తలసరి ఆదాయం అనేది గణాంకాల మాయ. 100 మందిలో ఏడాదికి కోటి రూపాయలున్నవారు 10 మంది. కేవలం లక్ష రూపాయలనున్నవారు 90 మంది ఉంటే తలసరి రాబడి 10.90 లక్షల రూపాయలకు చేరుతుంది. 90 మంది సామాన్యుల రాబడి కాగితాలపై పది రెట్లు పెరిగిపోతుంది.



స్వాతంత్ర్యం వచ్చిన తొలి నాళ్లలో రూపుదిద్దుకున్న విధానాల్లో ప్రభుత్వాల ప్రమేయం ఉంది. నాయకుల పాత్ర ఉంది. చట్టసభలు, మేధావుల వాటా ఉంది. అర్థవంతమైన చర్చలు జరిగాయి. పారిశ్రామికవేత్తలు స్వయంగా విధానాల రూపకల్పనలో భాగం పంచుకోవడం మొదలైన తర్వాత అన్ని రకాల నైతికవిలువలను మార్కెట్ తొక్కిపారేసింది. సంక్షేమం అనేది నిషిద్ధ పదంగా మారింది. అందుకే నెహ్రూ ఈ కాలానికి సరిపడని వారయ్యారు.

వాస్తవిక జీవితం అధ్వాన్నంగానే ఉంటుంది. అధిక వృద్ధి రేటుతో భారత్ దూసుకుపోతున్న గతకొన్నేళ్లలోనే దేశంలో ఆర్థిక అసమానతలు అసాధారణంగా పెరిగిపోయాయి. కుబేరుల సంఖ్య కంటే రెట్టింపు పేదల సంఖ్య పెరుగుతోంది. అధిక వృద్ధి రేటుకు భారత్ చెల్లిస్తున్న మూల్యం కూడా భారీగానే ఉంది. బ్యాంకుల్లో పేరుకుపోయిన దాదాపు 10 లక్షల కోట్ల రూపాయల మొండి పద్దులు గాలికి ఆవిరైపోలేదు. ప్రైవేట్ ఆస్తులుగా ఘనీభవించి ఉన్నాయి.

ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోని ప్రజల కష్టార్జితం, ప్రభుత్వ ఖజానా, పబ్లిక్ సెక్టార్‌లోని అమూల్యమైన ఖనిజ వనరులు.. వీటన్నింటినీ ముడుపుకడుతున్నాం. నెహ్రూ హయాంలో వృద్ధి రేటు అతి తక్కువగానే ఉండొచ్చు. సంపద పంపిణీలో అసాఽధారణ అంతరాలు లేవు. క్రోనీ కాపిటలిజం కంటే ప్రభుత్వ నియంత్రణలోని ఆర్థిక వ్యవస్థ ఏమాత్రం అభివృద్ధి నిరోధకం కాదు.

ప్రణాళిక బద్ధమైన అభివృద్ధే ఆహారధాన్యాల్లో భారత్ స్వయం సమృద్ధికి దోహదం చేసింది. తలసరి ఆహారధాన్యాల లభ్యత నెహ్రూ-గాంధీల హయంతో పోలిస్తే ఇప్పుడు తగ్గింది. పౌష్టికాహార లోపం అతిపెద్ద శాపంగా మారి లక్షలాది కుటుంబాలను వెన్నాడుతోంది. అవకాశాలు ఎంతలా పెరిగిపోయాయో వాటిని అందుకోలేనంత దూరానికి అసంఖ్యాక ప్రజలను నెట్టేస్తున్నారు. వ్యవసాయం సంక్షోభంలో పడింది. రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. అనాలోచితమైన పెద్ద నోట్ల రద్దు దెబ్బతో అవ్యవస్థీకృత రంగంలోని లక్షాలది మంది ఉపాధి కోల్పోయారు. ఆర్థిక వృద్ధికి అత్యంతకీలకంగా చెబుతున్న జిఎస్‌టిని ప్రపంచ బ్యాంకే అత్యంత క్లిష్టమైన వ్యవస్థ అని ఈసడిస్తోంది. నెహ్రూ లేకుండా ఉంటే నీరవ్ మోదీలు, చోక్సీలు, విజయ్‌మాల్యాలు నాలుగు దశాబ్దాల క్రితమే తయారయ్యేవారు. కొత్త ఆర్థిక విధానాలు ప్రభుత్వ ఆస్తులను అభివృద్ధి పేరుతో ప్రైవేట్ సంస్థలు వ్యక్తులకు దఖలు పరుస్తుంటే నిరసనల్లేవు.

ప్రభుత్వ నియంత్రణ ఆర్థిక వృద్ధికి అవరోధమైతే చైనా అభివృద్ధిని ఏ విధంగా వ్యాఖ్యానిస్తారు? ప్రపంచాన్ని ఈ రోజు చైనా శాసిస్తోంది. ఆ దేశంలోని కీలకమైన ఉత్పత్తి సంస్థలన్నీ ప్రభుత్వ రంగంలోనే ఉన్నాయి. చైనా ప్రపంచ శక్తిగా ఎదగడంలో పబ్లిక్ సెక్టార్‌దే కీలక పాత్ర. ఆ దేశంలో కుబేరుల సంఖ్య అమెరికాను మించి ఉండటంలో కూడా పబ్లిక్ సెక్టార్ పాత్ర ఉంది. నిజానికి భారత్ 1990లో అనుసరించిన విధానాలకు ప్రభుత్వాలతో నిమిత్తం లేదు. నాయకులతో ప్రమేయం లేదు. ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకు బోర్డు రూముల్లో తయారైన విధానాలు, వారి ఖార్ఖానాల్లో తయారైన మేనేజర్లు దేశానికి దిశానిర్దేశం చేశారు. వారే దేశాన్ని నడిపించడం మొదలెట్టారు. లాభాపేక్ష మాత్రమే ఉన్న వ్యాపారులు చట్టసభల్లోకి ప్రవేశించి విధానకర్తల అవతారం ఎత్తిన సమయం ఇది. స్వాతంత్ర్యం వచ్చిన తొలి నాళ్లలో రూపుదిద్దుకున్న విధానాల్లో ప్రభుత్వాల ప్రమేయం ఉంది. నాయకుల పాత్ర ఉంది. చట్టసభలు, మేధావుల వాటా ఉంది. అర్థవంతమైన చర్చలు జరిగాయి. పారిశ్రామికవేత్తలు స్వయంగా విధానాల రూపకల్పనలో భాగం పంచుకోవడం మొదలైన తర్వాత అన్ని రకాల నైతికవిలువలను మార్కెట్ తొక్కిపారేసింది. సంక్షేమం అనేది నిషిద్ధ పదంగా మారింది. అందుకే నెహ్రూ ఈ కాలానికి సరిపడని వారయ్యారు. ■

పట్టించుకోరనుకోవద్దు!

- మాట్లాడకుండా ఊడిగం చేయాలా?
- నిజం మాట్లాడితే శత్రువులే వస్తారు
- అయినా సత్యమే గెలుస్తుంది
- నేనైనా, జనసేన కార్యకర్తయినా తప్పు చేస్తే ఖండించాల్సిందే
- సమాజాన్ని సమగ్రంగా చూడాలి
- నిశ్శబ్ద విప్లవం తీసుకొద్దాం.. భయం వదిలేయండి
- ప్రవాసాంధ్రులకు పవన్ కల్యాణ్ పిలుపు


విజయవాడలో ప్రవాస తెలుగు ప్రతినిధులతో సమావేశమైన పవన్ కల్యాణ్

అమరావతి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): “రాజకీయాల్లో ఎవరికీ వ్యక్తిగత శత్రువులు ఉండరు. సత్యం మాట్లాడితేనే శత్రువులు వస్తారు. ఒకటి గమనించాలి. సత్యం మాత్రమే గెలుస్తుంది. సమకాలీన రాజకీయాలు ఎలా తయారయ్యాయి అంటే.. మాట్లాడకుండా వారికి ఊడిగం చేయాలని కోరుకుంటున్నారు. అది ఇక కుదరదు” అని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. ఆమెరికా, ఇంగ్లండ్, సింగపూర్, మలేసియా, యూఏఈల నుంచి వచ్చిన ప్రవాసాంధ్రులతో విజయవాడలోని ఒక హోటల్‌లో గురువారం పవన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్టీ ఎన్నారై విభాగం ఎప్పటికప్పుడు ప్రవాస తెలుగు ప్రజలకు తోడ్పాటుగా ఉంటుందని, అలాగే విదేశాల్లో ఉన్న తెలుగువారు కూడా రాష్ట్రానికి ఏమి చేయాలో ఆలోచించాలని పవన్ కోరారు. ‘స్వాతంత్ర్య పోరాట యోధుల్లా అన్నీ విడిచి పెట్టి రావాల్సిన పనిలేదు. ఐటీ రంగం అభివృద్ధికి మీ సహకారం అవసరం. మీ కుటుంబ బాధ్యతలు చూసుకుంటూ సమాజానికి ఏ విధంగా సేవ చేయాలో, సామాజిక మార్పు ఎలా తీసుకురావాలో ఆ విధంగా చేయండి. కుల ప్రాతిపదికగా రాజకీయాలు చేస్తున్నారు. అది సరికాదు. సమాజాన్ని సమగ్రంగా చూసే విధానం రావాలి. నేను తప్పు చేసినా.. జనసేన కార్యకర్త తప్పు చేసినా వెనకేసుకురావద్దు’ అని సూచించారు.

బాధ్యతగల వ్యవస్థ కావాలి

‘మెరుగైన జీవితం కోసం విదేశాలకు వెళ్లి కష్టపడి వృద్ధిలోకి వస్తున్నవారు మన ఎన్నారైలు. ఎన్నారైలు అనగానే డబ్బులు పిండేద్దాం అనుకుంటున్నారు. ఆ పద్ధతి పోవాలి. మీ నుంచి జనసేన పార్టీకి కావాల్సింది మేథో సహకారం’ అని పవన్ స్పష్టం చేశారు. ‘మనం పన్నులు కడుతున్నపుడు ప్రభుత్వం తన బాధ్యతలు నిర్వర్తించాలి కదా? ఈ ధోరణిలో మార్పు తీసుకొద్దాం. ముందుగా మీలోని భయాన్ని తీసేయండి. బాధ్యతగల పాలనా వ్యవస్థ కావాలని ఈ తరం ఆశిస్తోంది... తీసుకొద్దాం! ఆ మార్పు సహజంగా రావాలి. నిశ్శబ్ద విప్లవం తీసుకొద్దాం. విప్లవం అంటే రక్తపాతం కాదు, బయటకు వచ్చి గొడవలు చేయాల్సిన పని లేదు. మీ పనులు చేసుకుంటూనే సమాజం కోసం ఆలోచన చేయండి’ అని సూచించారు. ఎక్కడా పోరాటాన్ని ఆపబోమని, రాజకీయ, సామాజిక, ఆర్థిక మార్పు కోసం పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. ‘ఒక మహానుభావుడు చెప్పినట్లు .. బలంగా అనుకొని ఒకరు వెన్ను నిటారుగా నిలిపితే... వంగిపోయిన వెన్నులు కూడా నిటారుగా నిలబడతాయి. మనం బలంగా అనుకొందాం. మార్పు సాధిద్దాం. మీ అండదండలు కావాలి’ అన్నారు.

కేంద్ర నిధులన్నీ ఏమయ్యాయి?



గుంటూరులో అతిసారతో 10 మందికిపైగా చనిపోవడాన్ని పవన్ ప్రస్తావించారు. “ఎంత బాధాకరం! ఇలాంటి పరిస్థితుల్లో మన తరపున ఏమి చేయగలం? అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ విదేశాల్లో ఎలా ఉంది? అక్కడి నిపుణుల సలహాలు ఏమిటో ఎన్నారైలుగా మీరు ఆలోచన చేయండి. అయితే.. రాజకీయ నాయకులు అంత సులభంగా చేయనివ్వరు. 20 ఏళ్ల క్రితం ‘తమ్ముడు’ సినిమా 100 రోజుల వేడుక చేస్తే అయ్యే ఖర్చుతో నల్లగొండ జిల్లాలో ఆర్వో ప్లాంట్ల ద్వారా సురక్షిత తాగు నీరు ఇద్దామని వెళ్తే అక్కడి రాజకీయ నాయకులు నీకేం పని అన్నట్లు మాట్లాడారు. అయినా ప్రజలకు అండగా ఉండాలి. గుంటూరు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం కేంద్రం నుంచి వచ్చిన నిధులన్నీ ఖర్చు చేశామన్నారు. ఏమైపోయాయి?” అని పవన్ ప్రశ్నించారు. ధర్మం అనేది ఒకటి ఉంటుందని, నోట్ల రద్దు తర్వాత జనం ఎన్నో ఇబ్బందులు పడితే... ఉత్తరప్రదేశ్‌కు ఎక్కువ నోట్లు పంపారని, జనం గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు.

పోరాటాలతోనే హోదా సాధ్యం: జగన్


నిరవధిక నిరాహారదీక్ష చేస్తున్న సుబ్రహ్మణ్యంను పరామర్శిస్తున్న జగన్

పొన్నూరు, మార్చి 15: ఉద్యమాలు, పోరాటాల ద్వారానే కేంద్రప్రభుత్వం దిగి వచ్చి రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చి తీరుతుందని వైసీపీ అధ్యక్షుడు జగన్ అన్నారు. ప్రజాసంకల్పయాత్రలో భాగంగా గురువారం గుంటూరు జిల్లా పొన్నూరు మండలంలో ఆయన పాదయాత్ర నిర్వహించారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పూల సుబ్రహ్మణ్యం నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న శిబిరాన్ని జగన్ సందర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం వల్లభరావుపాలెం వరకు పాదయాత్ర కొనసాగింది. ఉదయం ఎనిమిదిన్నరకు ప్రారంభమైన పాదయాత్రను పదిన్నరకు ముగించి హైదరాబాద్‌కు వెళ్లిపోయారు.

తొందరొద్దు.. అదును చూసి చేయండి

- ఆమరణ దీక్షపై పవన్‌కు వామపక్షాల సూచన


పవన్‌తో భేటీ అయిన మధు, రామకృష్ణ

అమరావతి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం ఆమరణ దీక్ష చేస్తానన్న జనసేన అధినేత పవన్‌కు... తొందరపడొద్దని వామపక్షాలు సూచించాయి. తగిన ప్రణాళిక సిద్ధం చేసుకున్నాక... ఒక కార్యాచరణను ప్రకటించడం మంచిదని హితవు పలికాయి. దీనికి.. పవన్ కూడా సానుకూలంగానే స్పందించారు. హోదాతో సహా ప్రజా సమస్యలపై ఐక్యంగా ఉద్యమిద్దామని వామపక్షాలను పవన్ కోరగా... ఆ పార్టీలు కూడా సముఖత వ్యక్తం చేశాయి. విజయవాడలోని జనసేన పార్టీ తాత్కాలిక కార్యాలయంలో గురువారం పవన్ కల్యాణ్‌తో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ఆ పార్టీల నేతలు సమావేశమయ్యారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ పవన్ ఆహ్వానం మేరకు సమావేశమయ్యామన్నారు. పొత్తులపై ఇప్పుడేమీ మాట్లాడలేదన్నారు.

హోదా ఇవ్వొద్దని ఆర్థిక సంఘం చెప్పలేదు: కేంద్రం

న్యూఢిల్లీ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఏ రాష్ట్రానికి కూడా ప్రత్యేక హోదా ఇవ్వొద్దని 14వ ఆర్థిక సంఘం నిర్దిష్టంగా సిఫారసు చేయలేదని కేంద్ర ప్రణాళికశాఖ మంత్రి రావు ఇంద్రజిత్‌సింగ్ స్పష్టం చేశారు. కానీ పన్నుల వాటాల్లో ప్రత్యేక హోదా కలిగిన రాష్ట్రాలు, సాధారణ రాష్ట్రాల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తీసేసిందని అన్నారు. 2015-20 మధ్య రాష్ట్రాలకు కేంద్ర పన్నుల వాటాను 32 శాతం నుంచి 42 శాతానికి పెంచిందని వివరించారు. దీంతో రాష్ట్రాలకు మరిన్ని నిధులు అందుతున్నాయని, రాష్ట్రాల రెవెన్యూ లోటును భర్తీ చేసే ఉద్దేశంతో ఆర్థికసంఘం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. రాజ్యసభలో టీడీపీ ఎంపీ సీఎం రమేశ్ అడిగిన ఓ ప్రశ్నకు ఈ మేరకు ఆయన గురువారం లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

టీడీపీ కార్యాలయంలో జైరాం!

న్యూఢిల్లీ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ జైరాం రమేశ్ గురువారం టీడీపీ కార్యాలయాన్ని సందర్శించడం చర్చనీయాంశమైంది. సుజనా చౌదరితో ఆయన కొద్దిసేపు చర్చలు జరిపి వెళ్లిపోయారు. కేంద్ర మంత్రిగా రాజీనామా చేసిన సుజనాకు, రాజ్యసభలో చేయాల్సిన ప్రకటనకు సంబంధించి తాను కొన్ని అంశాలు సూచించినట్లు జైరాం తెలిపారు. అయితే సుజనా ప్రసంగ పాఠాన్ని జైరాం అడిగారని, ఆయన నిరాకరించడంతో వెళ్లిపోయారని టీడీపీపీ పార్టీ కార్యాలయం వర్గాలు తెలిపాయి.



తాత, తండ్రికి చెడ్డ పేరు తీసుకురాను

- అసెంబ్లీలో నారా లోకేశ్ ప్రకటన
- పవన్ వ్యాఖ్యలకు కౌంటర్

అమరావతి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): తన తాత ఎన్టీఆర్, తండ్రి చంద్రబాబు అంత పేరు తెచ్చుకుంటానో లేదో కానీ వారికి చెడ్డ పేరు మాత్రం తీసుకురానని ఐటీ, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. ఎన్టీఆర్ మనవడి అవినీతి అంటూ పవన్ కల్యాణ్ చేసిన ఆరోపణలకు జనసేన అధినేత పేరును ప్రస్తావించకుండానే గురువారం సభలో ఆయన కౌంటర్ ఇచ్చారు. సీఎం చంద్రబాబు ఎమ్మెల్యేగా అసెంబ్లీలోకి అడుగుపెట్టి 40 ఏళ్లయిన సందర్భంగా ప్రవేశపెట్టిన అభినందన తీర్మానంపై జరిగిన చర్చలో లోకేశ్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. కుటుంబం కంటే రాష్ట్రాభివృద్ధి ముఖ్యమని భావించే చంద్రబాబు తనకు రోల్ మోడల్ అని చెప్పారు. హుద్‌హుద్ తుఫాను సమయంలో బ్రహ్మణి సీమంతానికి వచ్చిన చంద్రబాబు కేవలం 5 నిమిషాలే ఉండి.. కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో ఫోన్‌లో మాట్లాడుతూ వెళ్లిపోయారని గుర్తు చేసుకున్నారు. అలిపిరి దాడి సమయంలో తామెంతో ఆందోళన చెందుతుంటే.. ఆయనే ఫోన్ చేసి ధైర్యం చెప్పారన్నారు. టీడీపీ కార్యకర్తలను వెంటాడి చంపినప్పుడు.. బాధిత కుటుంబాలకు అండగా నిలిచారని, 64 ఏళ్ల వయస్సులోనూ 24 ఏళ్ల కుర్రాడిలా 2,817 కిలోమీటర్లు పాదయాత్ర చేశారని లోకేశ్ చెప్పారు. ప్రజాసేవ లక్ష్యంగా నిరంతరం శ్రమిస్తున్న చంద్రబాబు విజయానికి తన తల్లి భువనేశ్వరి సహకారం కీలకమైందని చెప్పారు. .



శోభన్‌బాబులా ఉండేవారు!

‘1978లో సినిమా టిక్కెట్లకు మంత్రి సిఫారసు కోసం అప్పుడు సినిమాటోగ్రఫి మంత్రిగా ఉన్న చంద్రబాబు వద్దకు వెళ్లాను. అప్పట్లో ఆయన హెయిర్ స్టయిల్, డ్రస్ సినీ నటుడు శోభన్‌బాబును తలపించేలా ఉండేది. అప్పట్లో మహిళల మనసు దోచేలా ఉండేవారు’ అని బీజేపీ శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్ చమత్కరించగా... సభ్యులు బల్లలు చరుస్తూ హర్షధ్వానాలు చేశారు.

పదవులకు వన్నె తెచ్చారు

ఏ పదవి చేపట్టినా దానికి చంద్రబాబు వన్నె తెచ్చారని చర్చలో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. ముందు చూపుతో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, సుపరిపాలన తెచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని శాసనసభా వ్యవహారాల మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. చంద్రబాబూ తానూ ఒకేసారి శాసనసభకు వచ్చామని ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి గుర్తు చేసుకున్నారు. చంద్రబాబు గొప్ప పాలనాదక్షుడని మరో ఉపముఖ్యమంత్రి చినరాజప్ప ప్రశంసించారు. ఈ సందర్భంగా స్పీకర్ కోడెల శివప్రసాదరావు మాట్లాడుతూ..‘ నేను ఒకసారి నేపాల్ వెళ్లాను. భూకంపంతో దెబ్బ తిన్న నేపాల్ పునర్ నిర్మాణంలో జాప్యం జరగడంపై అక్కడి నేతలను ప్రశ్నించగా.. చంద్రబాబు లాంటి నాయకులు మాకు లేరు కదా అని ఆవేదన వ్యక్తం చేసినట్లు’ తెలిపారు.



అన్న.. కాంగ్రెస్‌కు తాకట్టుపెట్టారు ఈయన ఎవరికి తనఖా పెడతారో?

- చిరంజీవి వల్ల కాపులు పాతికేళ్లు వెనక్కి
- బీజేపీ పావుగా మారిన పవన్ కల్యాణ్
- అభివృద్ధిని ఓర్వలేక బురదజల్లుడు
- నారాయణ, చినరాజప్ప, కళా, ప్రత్తిపాటి, ఆది ధ్వజం

అమరావతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): విభజన చట్టంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని టీడీపీ, రాష్ట్ర ప్రజలందరూ ముక్తకంఠంతో గళమెత్తి.. కేంద్రంపై పోరాడుతుంటే.. ఆ పోరాటాన్ని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నీరు గార్చే ప్రయత్నం చేస్తున్నారని ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, మంత్రులు పి.నారాయణ, కిమిడి కళావెంకట్రావు, ప్రత్తిపాటి పుల్లారావు, ఆదినారాయణరెడ్డి విరుచుకుపడ్డారు. గురువారం సచివాలయం వద్ద, మంగళగిరిలో వారు వేర్వేరుగా విలేకరులతో మాట్లాడారు. ‘చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ పెట్టి కాపులందరి ప్రయోజనాలను కాంగ్రెస్‌కు తాకట్టు పెట్టారు. ఇప్పుడు తమ్ముడు పార్టీ పెట్టాడు.. ఎవరికి తాకట్టుపెడతారోనని వారంతా భయపడుతున్నారు. చిరంజీవి వల్ల పాతికేళ్లు వెనక్కి వెళ్లామని కాపులంతా బాధపడుతున్నారు. టీడీపీ ప్రభుత్వం వారికి అండగా నిలిచింది. కాపులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసింది.. రిజర్వేషన్ కోసం అసెంబ్లీలో బిల్లు ఆమోదించి కేంద్రానికి పంపింది’ అని నారాయణ అన్నారు. ఈ నాలుగేళ్లు పవన్ ఎక్కడకు వెళ్లారని ప్రశ్నించారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్టు చదవడం కాదని.. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలిచారు. బీజేపీ ఆయన్ను పావుగా వాడుకుంటోందన్నారు. లోకేశ్‌పై ఆరోపణలు సరికాదన్నారు. కేంద్రం కుట్రలో భాగంగానే పవన్ తమపై ఆరోపణలు చేశారని చినరాజప్ప ఆరోపించారు. ఎవరు ఇచ్చినా డబ్బు తీసుకుని ఓట్లు తనకు వేయాలని చెప్పడం అవినీతిని ప్రోత్సహించడం కాదా అని ప్రశ్నించారు. పోరాడి ఢిల్లీని లొంగదీసుకోవాలని రాష్ట్ర ప్రజలు ఆలోచిస్తుంటే.. పవన్ ఢిల్లీకి లొంగిపోయారని కళావెంకట్రావు వ్యాఖ్యానించారు. టీడీపీపై బురదజల్లిస్తున్న శక్తులు ఢిల్లీలోనే ఉన్నాయని ప్రజలు విశ్వసిస్తున్నారని చెప్పారు. పక్కాగా సిద్ధం చేసి ఇచ్చిన స్క్రిప్టు చదివి టీడీపీ ప్రభుత్వంపై పవన్ ఆధారాల్లేని ఆరోపణలు చేశారని ప్రత్తిపాటి పుల్లారావు మంగళగిరిలో ఆరోపించారు. రాజకీయం అంటే సినిమా అనుకుంటున్న పవన్.. తనకు దురద పుట్టిందని చంద్రబాబుపై బురదజల్లుతున్నారని ఆదినారాయణరెడ్డి విరుచుకుపడ్డారు. పవన్ అపరిపక్వతతో మాట్లాడుతున్నారని, గబ్బర్‌సింగ్ గురి తప్పాడని అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద టీడీపీ అధికార ప్రతినిధి డొక్కా మాణిక్యవరప్రసాద్ వ్యాఖ్యానించారు. ఏపీలో జగన్, పవన్‌తో కలిసి బీజేపీ డ్రామాలు ఆడుతోందని ఎమ్మెల్యే సుగుణమ్మ ఆరోపించారు.పంది బురదలో దూరి ఆ బురదను అందరికీ జల్లినట్లు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే బడేటి బుజ్జి ధ్వజమెత్తారు. మాజీ మంత్రి పీతల సుజాత, ఎమ్మెల్యే లు అనిత, మీసాల గీత, బోడె ప్రసాద్, వైవీ ఆంజనేయులు, జలీల్‌ఖాన్, ఆనందరావు, ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న కూడా పవన్‌పై విరుచుకుపడ్డారు. పవన్ కల్యాణ్ బీజేపీ డైరెక్షన్‌లో, జగన్ ప్రొడక్షన్‌లో యాక్ట్ చేస్తున్నారని కాపు కార్పొరేషన్ చైర్మన్ చలమశెట్టి రామానుజయ ధ్వజమెత్తారు. నేత చందు సాంబశివరావు, టీడీపీ రాష్ట్ర కార్యక్రమాల కమిటీ సభ్యుడు కృష్ణమూర్తి కూడా పవన్‌పై ధ్వజమెత్తారు.

ఎంత ప్యాకేజీ ముట్టింది?: మోత్కుపల్లి

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం చంద్రబాబుపై విమర్శలు చేసిన జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌కు ఎంత ప్యాకేజీ ముట్టిందో చెప్పాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు మోత్కుపల్లి నర్సింహులు . డిమాండ్ చేశారు. గురువారం బేగంపేటలోని తన నివాసంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ పవన్‌కల్యాణ్‌తో బీజేపీ డ్రామా ఆడిస్తోందని విమర్శించారు.

మళ్లీ అదే కుట్ర

- పాత్రధారులే మారారు
- టీడీపీని దెబ్బతీయడానికే నాడు విభజన
- వైసీపీ, టీఆర్ఎస్‌తో కాంగ్రెస్ లాలూచీ
- ఇప్పుడు వైసీపీ, పవన్‌లతో బీజేపీ
- ఈ కుట్రల్ని ప్రజలే తిప్పికొడతారు
- పవన్‌కు అత్తారింటికి దారితెలీదు
- ఆయనకు రోజూ కొత్తదనం కావాలి
- ఇవాళ మాట్లాడింది రేపు మాట్లాడరు
- లాబీల్లో మంత్రులు, ఎమ్మెల్యేల చర్చ

అమరావతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన సమయంలో జరిగిన కుట్రే పునరావృతమవుతోందని తెలుగుదేశం పార్టీ అనుమానిస్తోంది. టీడీపీని, ముఖ్యమంత్రి చంద్రబాబును దెబ్బతీసే లక్ష్యంతోనే విభజన, అనంతర పరిణామాలు చోటు చేసుకున్నాయని గుర్తుచేస్తున్నారు. ‘నాడు జాతీయ పార్టీగా ఉన్న కాంగ్రెస్.. వైసీపీ, టీఆర్ఎస్‌తో లోపాయకారీ అవగాహనకు వచ్చి రాష్ట్రాన్ని ముక్కలు చేసింది. తెలుగుదేశం పార్టీనే లక్ష్యంగా చేసుకుని కుట్ర జరిగిందని అప్పట్లోనే ప్రజల్లోకి తీసుకెళ్లాం. వారే తీర్పు చెప్పారు. ఇప్పుడు కూడా అదే కుట్ర.. కాకపోతే ఆయా పాత్రల్లోకి ప్రస్తుతం ఉనికిలో ఉన్న పార్టీలు వస్తున్నాయి’ అని పేర్కొంటున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఒకపక్క తమ మిత్రపక్షంగా ఉంటూనే.. వైసీపీతోనూ టచ్‌లో ఉందని, ఎన్నికల అనంతర మద్దతుకు ఒప్పందం కూడా కుదిరిందని వారు అంటున్నారు. ఇప్పుడు జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా అదే బాటలో వెళ్తున్నారని చెబుతున్నారు. రాష్ట్రం కోసం పోరాడే తెలుగుదేశం పార్టీని ఏకైక లక్ష్యంగా చేసుకుని ఈ మూడు పార్టీలు కుట్ర చేస్తున్నాయని.. అందులో భాగమే టీడీపీపై పవన్ దాడి అని అభిప్రాయపడుతున్నారు. పవన్ విమర్శలపై గురువారం శాసనసభ లాబీల్లో మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేల మధ్య చర్చ జరిగింది. హోదా కోసం, ఇతర హామీల అమలుకోసం తెలుగుదేశం పార్టీ కేంద్రంపై పోరాడుతుంటే.. పవన్ టీడీపీని విమర్శించడం ఏమిటని మంత్రులు కళావెంకట్రావు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, అమరనాథ్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి తదితరులు పేర్కొన్నారు. రాజకీయ లబ్ధి కోసం.. రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఆయా పార్టీలు వ్యవహరిస్తున్నాయని మంత్రి కాల్వ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆయా పార్టీల ఉమ్మడి లక్ష్యం టీడీపీయేనని, అయితే ఈ కుట్రలను ప్రజలు తిప్పికొడతారని సీనియర్ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చేయాల్సిన సాయం చేయకపోగా.. పవన్‌ను టీడీపీపైకి ఉసిగొల్పిందని ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న మండలిలో ఆరోపించారు. పవన్‌కు వ్యక్తిగతంగా, రాజకీయంగా కొత్తదనం కావాలని మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. ఈరోజు మాట్లాడింది రేపు మాట్లాడరని ఎద్దేవా చేశారు. పవన్‌కు అత్తారింటికి దారి తెలీదు.. ఏ అత్త ఇంటికి వెళ్లాలో కూడా తెలియదని మంత్రి ఆదినారాయణరెడ్డి వ్యాఖ్యానించారు. మిత్రపక్షంగా ఉన్నప్పుడు సహనంతో ఉండాల్సిన అవసరం ఉందని.. అందుకే కేంద్రం చేస్తుందేమోనని వేచి చూశామన్నారు. చివరి బడ్జెట్‌లో కూడా ఏపీకి అన్యాయం చేయడంతో పోరాటం చేస్తున్నామని, ఈ పోరాటానికి మద్దతివ్వకుండా.. నీరుకార్చేలా మాట్లాడారని ధ్వజమెత్తారు.

గవర్నర్‌తో లాభం లేదు



గవర్నర్ నరసింహన్‌తో ఆంధ్రప్రదేశ్‌కు ప్రయోజనం లేకపోగా.. నష్టం జరుగుతోందని సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి విమర్శించారు. రాష్ట్రంలో ప్రత్యేక హోదా కోసం పెద్దఎత్తున ఆందోళనలు జరుగుతుంటే, ప్రజలంతా హోదా కావాలని అడుగుతుంటే.. గవర్నర్‌గా కేంద్రానికి ఆ విషయం చెప్పాల్సిన బాధ్యతను కూడా నెరవేర్చడం లేదని ఆక్షేపించారు.

పవన్ వెనుక కాదు.. పవన్‌తోనే ఉన్నాం

- బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్ వ్యాఖ్య
- అసెంబ్లీ లాబీల్లో ఇదే చర్చ
- ఉత్సాహంగా బీజేపీ ఎమ్మెల్యేలు

అమరావతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జనసేన అధిపతి పవన్ కల్యాణ్ ఉన్నట్టుండి టీడీపీ సర్కారుపై విరుచుకుపడటానికి కారణమేమిటి? దీని వెనుక బీజేపీ హస్తముందా? గురువారం అసెంబ్లీలో ఎక్కడ చూసినా ఇదే చర్చ. ‘పవన్ వెనక మీ పార్టీ ఉందంటున్నారే’ అని టీడీపీ ఎమ్మెల్సీ బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్‌తో నేరుగా అన్నారు. దీనికి ఆయన స్పందిస్తూ... ‘పవన్ వెనకాల కాదు, పవన్‌తోనే బీజేపీ ఉంది’ అని సూటిగా చెప్పారు. ఇక... పవన్ వెనుక బీజేపీ ఉందని రాష్ట్ర మంత్రులు పలువురు గురువారం బహిరంగంగానే ఆరోపించారు. అసెంబ్లీ లాబీల్లో కూడా టీడీపీ, బీజేపీ ఎమ్మెల్యేల మధ్య దీనిపైనే చర్చలు జరిగాయి. పవన్ వెనుక హస్తం మీదేనా అని టీడీపీ సభ్యులు ప్రశ్నించగా... బీజేపీ సభ్యులు ముసిముసి నవ్వులు నవ్వారు. అయితే... గతంతో పోలిస్తే వారిలో కొత్త ఉత్సాహం కనిపించింది. ఇన్ని రోజులూ తాము ఆత్మ రక్షణలో ఉండగా... పవన్ విమర్శలతో టీడీపీ ఆత్మ రక్షణలో పడిందని వారు వ్యాఖ్యానించారు.

67సార్లు ఢిల్లీకి బాబు

సీఎం చంద్రబాబు 2014 మే 30వ తేదీ నుంచి మొత్తం 67సార్లు ఢిల్లీ వెళ్లారని టీడీపీ ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, నెరవేర్చాల్సిన హామీల గురించే ఇందులో ఎక్కువ పర్యటనలు ఉన్నాయన్నారు. ఈ పర్యటనల సందర్భంగా రాష్ట్రపతిని ఐదుసార్లు, ప్రధానమంత్రిని 12సార్లు, హోం మంత్రిని 13సార్లు, ఆర్థికమంత్రిని 12సార్లు, ఉపరితల రవాణా శాఖా మంత్రిని పదిసార్లు, జలవనరుల శాఖ మంత్రిని తొమ్మిది సార్లు.. కలిశారని తెలిపారు.

ఆధారాల్లేకుండా లోకేశ్‌పై

ఆరోపణలు సరికాదు

- కుట్రలు చేయడం బీజేపీకి తెలీదు: విష్ణుకుమార్‌రాజు

అమరావతి, సంగడిగుంట, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ‘ఆధారాలు లేకుండా లోకేశ్‌పై ఆరోపణలు చేయడం పవన్ కల్యాణ్‌కు తగదు. ఆధారాలు ఉంటేనే లోకేశ్‌పై ఆరోపణలు చేయాలి. ఆధారాల్లేకుండా ఎవరి మాటలో పట్టుకుని అనడం సరికాదు.’ అని బీజేపీ శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్ రాజు వ్యాఖ్యానించారు. గురువారమిక్కడ బీజేఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇసుక మాఫియాపై తొలుత చెప్పింది తానేనని..ఇసుక రీచుల్లో రౌడీయిజం పెరిగిందని ఆరోపించారు. ఎమ్మెల్యేగా ఉంటూ అధికారుల అవినీతిపై ఏసీబీకి ఫిర్యాదు చేసింది తానేనని చెప్పారు. కుట్రలు చేయడం బీజేపీకి తెలీదని స్పష్టం చేశారు. గుంటూరులోని వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని మాజీ మంత్రి, బీజేపీ ఎమ్మెల్యే మాణిక్యాలరావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యా సంస్థల నిర్మాణానికి కేంద్రం ఇస్తున్న నిధులు టీడీపీ నేతలకు కనపడడం లేదా అని ప్రశ్నించారు.

పవన్ చెప్పింది నిజం..

అవినీతి పెరిగింది!

- కేసులకు భయపడే హోదా తాకట్టు: ముద్రగడ

రౌతులపూడి, మార్చి 15: చంద్రబాబు అవినీతిపై జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మాట్లాడింది నూటికి వెయ్యి శాతం నిజమని కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రౌతులపూడిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓటుకు నోటు కేసుకు భయపడి కేంద్రానికి ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టారని ఆరోపించారు. 29సార్లు ఢిల్లీకి వెళ్లింది పబ్లిసిటీ కోసమేనని.. విదేశీ పర్యటనలు బ్లాక్‌మనీని దాచుకోవడానికి అని విమర్శించారు. అసెంబ్లీలో హోదాపై మొసలి కన్నీరు కార్చడం కాదని.. హోదాపై ఆయనకు చిత్తశుద్ధి ఉంటే పవన్, జగన్, ముద్రగడలు చంద్రబాబు వెంట నడవటానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఓటుకు నోటు కేసులో కేసీఆర్ కాళ్లు పట్టుకుని హైదరాబాద్ వదిలి విజయవాడ పారిపోయి వచ్చారని విమర్శించారు. రాజకీయాల్లోకి వచ్చే ఆలోచన లేదని కాపుల కోసం ఉద్యమం కొనసాగిస్తానని చెప్పారు.

ఎన్డీయేకు రామ్‌రామ్!

(మొదటి పేజీ తరువాయి)

బడ్జెట్ తుది ఆమోదం పొందేలోపు రాష్ట్రానికి ఏవైనా ప్రకటిస్తారేమోనని ఆశగా ఎదురు చూసింది. కానీ... ఆశించింది జరగలేదు. కేంద్ర బడ్జెట్‌ను కూడా బుధవారం సభ్యుల ఆందోళనల నడుమే హడావుడిగా ఆమోదించేశారు. పార్లమెంటు సమావేశాలను శుక్రవారం నిరవధికంగా వాయిదా వేసే అవకాశముందని టీడీపీ వర్గాలకు సమాచారం అందింది.

తాము కోరినవేవీ బడ్జెట్‌లో చేర్చకుండా ఫైనాన్స్ బిల్లును ఆమోదించడంతో... ఇంకా వేచి ఉండటంలో అర్థం లేదని టీడీపీ వర్గాలు భావిస్తున్నాయి.

ఇంకెందుకు ఉండటం...

బీజేపీ నాయకత్వం తమను ఇతరులతో తిట్టించే పని కూడా మొదలుపెట్టిందని టీడీపీ వర్గాలు పేర్కొంటున్నాయి. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆకస్మికంగా రాష్ట్ర ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు గుప్పించడం వెనుక బీజేపీ ఉందని బలంగా భావిస్తున్నారు. బీజేపీ తన ఎత్తులు తాను వేస్తున్న తర్వాత ఇంకా ఎన్డీయే కూటమిలో ఉండటం అర్థం లేనిదని అభిప్రాయపడుతున్నారు. సీఎం గురువారం నిర్వహించిన సమావేశంలో ఈ అంశాలన్నీ ప్రస్తావనకు వచ్చాయి. కూటమి నుంచి బయటికి రావాలన్న అభిప్రాయానికి భేటీలో పాల్గొన్న మంత్రులు మద్దతు పలికారు. మునిసిపల్ మంత్రి నారాయణ మాత్రం ఇంకా కొంత కాలం వేచి చూస్తే బాగుంటుందని, దేశవ్యాప్తంగా సమస్యలు ఎదుర్కొంటున్న బీజేపీ ఇక్కడ తన వైఖరిని మార్చుకొనే అవకాశం లేకపోలేదని అన్నారు. అత్యధికులు బయటకు రావడానికే మొగ్గు చూపడంతో ఆ దిశగానే నిర్ణయం తీసుకున్నారు. “మనం పోయిన ఎన్నికల ముందు బీజేపీతో పొత్తు పెట్టుకొని ఎన్డీయే కూటమిలో చేరాం. రాష్ట్రానికి కేంద్రం చేసిన అన్యాయాన్ని బీజేపీ సరిదిద్దుతుందని ఆశించాం. కానీ, దానికి విరుద్ధంగా జరుగుతోంది. గట్టిగా అడిగితే కుట్రలకు దిగుతున్నారు. ప్రధాని ఫోన్ చేసినప్పుడు న్యాయం కోసం ఎదురు చూస్తామని... కూటమిలోనే ఉన్నానని చెప్పాను. అయినా ఫలితం కనిపించడం లేదు. ప్రజలు ఏం కోరుకొంటున్నారో అదే చేద్దాం. బయటకు వచ్చేద్దాం” అని చంద్రబాబు అన్నట్టు తెలిసింది. దీంతో ఎన్డీయే కూటమితో టీడీపీ బంధానికి చెల్లుచీటీ రాసినట్ల అయింది.

జగన్‌తోనే పవన్

(మొదటి పేజీ తరువాయి)

జగన్‌కే మా పార్టీ ఎమ్మెల్యేల మద్దతు ఉంటుంది’ అని హామీ ఇచ్చినట్లు వరప్రసాద్ చెప్పారు. ప్రజారాజ్యం పార్టీలో కలిసి పనిచేసిన చనువుతో పవన్ తనతో మాట్లాడారని తెలిపారు. ప్రత్యేక హోదా సాధన విషయంలో జనసేన, వైసీపీ పార్టీలు పరస్పర మద్దతుతో కలిసి పోరాడతాయని ప్రకటించారు. తమకు 24 శాతం ఓటు బ్యాంకు ఉందని జనసేనా ధీమాగా ఉందని, గతంలో ప్రజారాజ్యం పార్టీకి ఉన్న ఓటు బ్యాంకుతో పోల్చి ఈ అంచనాకు వచ్చారని తెలిపారు.

ఆపై ఖండన...: గురువారం ఉదయం చేసిన వ్యాఖ్యలను సాయంత్రానికి వరప్రసాద్ ఖండించారు. ‘పవన్ కల్యాణ్‌తో తాను సంభాషించినట్లుగా కొన్ని టీవీ చానళ్లు ప్రచారం చేశాయి. నేను ఆయనతో మాట్లాడని అంశాలను దురుద్దేశపూర్వకంగా ప్రచారం చేశారు. నా వ్యాఖ్యలను వైసీపీ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉపయోగించుకోవడాన్ని ఖండిస్తున్నాను” అని ఒక ప్రకటన విడుదల చేశారు.



ఇంటర్మీడియెట్.. విద్యార్థి జీవితంలో కీలకమైన దశ. ఇక్కడ తీసుకునే నిర్ణయాలు, వేసే అడుగులు భవిష్యత్ గమ్యాన్ని నిర్దేశిస్తాయి. ఇంజనీరింగ్, మెడిసిన్ వంటి ప్రొఫెషనల్ కోర్సులు చదవాలన్నా, మరేదైనా కెరీర్‌ను లక్ష్యంగా పెట్టుకోవాలన్నా అందుకు ప్రయాణం ఈ దశ నుంచే మొదలవుతుంది. ప్రస్తుత కార్పొరేట్ సంస్కృతిలో ఇంటర్మీడియెట్ విద్య ఖరీదైన వ్యవహారంగా మారింది. ఇటువంటి పరిస్థితులలో కార్పొరేట్ కాలేజీలకు దీటుగా ఉచితంగా నాణ్యమైన విద్యను అందించడంతోపాటు అన్ని రంగాల్లో విద్యార్థి సమగ్ర అభివృద్ధికి బాటలు వేస్తున్నాయి.. రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలు. 2018-19 విద్యా సంవత్సరానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోని రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో సంబంధిత వివరాలను చూద్దాం..

ఆర్‌జేసీ సెట్

ఉచితం... ఉత్తమం

గురుకుల ఇంటర్

ప్రతిభావంతులకు చేయూతనిచ్చే ఉద్దేశంతో రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలకు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా గ్రామీణ, పేద, ప్రతిభావంతులైన విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని ఈ కళాశాలలను ఏర్పాటు చేశారు. ఆశ్రమ తరహాలో ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థులను ఉన్నత శిఖరాల దిశగా నడిపించడమే లక్ష్యంగా ఈ గురుకులాలు సాగుతుంటాయి. ఆయా కాలేజీల్లో ప్రవేశానికి తెలంగాణలో టీఎస్‌ఆర్‌జేసీ - సెట్, ఆంధ్రప్రదేశ్‌లో ఏపీఆర్‌జేసీ - సెట్ పేరుతో రాత పరీక్షను నిర్వహిస్తారు. అందులో సాధించిన ర్యాంకు ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు. ఇందుకు సంబంధించి రెండు తెలుగు రాష్ట్రాల్లో అర్హత, రాత పరీక్ష వంటి అంశాలు ఒకే విధంగా ఉంటాయి.

అర్హత

2018 మార్చిలో నిర్వహించిన / కొనసాగుతున్న 10వ తరగతి పరీక్షలో మొదటి ప్రయత్నంలో ఉత్తీర్ణులై ఉండాలి. గతంలో ఉత్తీర్ణులైనవారు అనర్హులు. ఓసీ విద్యార్థులు జీపీఏ 6, బీసీ / ఎస్సీ / ఎస్టీ / మైనార్టీ విద్యార్థులు 5 జీపీఏ సాధించి ఉండాలి. అన్ని కేటగిరీల విద్యార్థులు ఇంగ్లీష్ సబ్జెక్ట్‌లో 4 జీపీఏ సాధించి ఉండటం తప్పనిసరి.

రాత పరీక్ష ఇలా

- రాత పరీక్షలో సాధించిన ర్యాంక్ ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో కూడా రాత పరీక్ష ఒకే విధంగా ఉంటుంది. విద్యార్థులు ఎంచుకున్న గ్రూప్‌ను బట్టి రాత పరీక్ష వేర్వేరుగా ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో 150 ప్రశ్నలు ఉంటాయి. వీటికి 150 నిమిషాల్లో సమాధానాలను గుర్తించాలి. అన్ని గ్రూపు పరీక్షల్లోనూ 3 సబ్జెక్టులు ఉంటాయి. ఒక్కో సబ్జెక్టుకు 50 మార్కులు చొప్పున కేటాయించారు. ఏ గ్రూప్‌లో పరీక్ష రాసినప్పటికీ ఇంగ్లీష్ సబ్జెక్టు తప్పనిసరి. ఈ విభాగం ప్రశ్నలన్నీ జనరల్ ఇంగ్లీష్ అంశం నుంచే ఉంటాయి.
- ఎంపీసీ గ్రూప్‌లో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో 50 మార్కులకు మ్యాథ్స్, 50 మార్కులకు ఫిజికల్ సైన్స్, 50 మార్కులకు ఇంగ్లీష్ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలొస్తాయి.
- బైపీసీ విద్యార్థులకైతే ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్, ఇంగ్లీష్ అంశాల్లో ఒక్కో సబ్జెక్టులో 50 చొప్పున ప్రశ్నలు ఉంటాయి.
- ఎంఈసీ, సీఈసీ విద్యార్థులకు మ్యాథ్స్, సోషల్ స్టడీస్, ఇంగ్లీష్ సబ్జెక్టుల్లో 50 చొప్పున ప్రశ్నలడుగుతారు.
- ఈఈటీ, సీజీడీటీ వృత్తి విద్య కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే రాత పరీక్షలో ఈఈటీకి సంబంధించి 50 మార్కులకు మ్యాథ్స్, 50 మార్కులకు ఫిజికల్ సైన్స్, 50 మార్కులకు ఇంగ్లీష్ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలొస్తాయి.
- సీజీడీటీ పరీక్షలో ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్, ఇంగ్లీష్ సబ్జెక్ట్‌ల్లో 50 చొప్పున ప్రశ్నలు ఉంటాయి.

సన్నద్ధత

- ప్రశ్నపత్రం తెలుగు / ఇంగ్లీష్‌లో ఉంటుంది. 10వ తరగతి సిలబస్ ఆధారంగా ప్రశ్నలు ఉంటాయి.
- వెబ్‌సైట్‌లో మాదిరి ప్రశ్నపత్రాలు అందుబాటులో ఉన్నాయి. వాటి ద్వారా ప్రశ్నల సరళిపై అవగాహన పొందొచ్చు.
- సిలబస్‌ను, గత ప్రశ్నపత్రాలను పరిశీలిస్తూ ప్రిపేర్ కావడం మంచిది.
- అన్ని టాపిక్స్‌ను ఒకేసారి చదవొద్దు. రోజుకో టాపిక్‌ను నేర్చుకోవడం ప్రయోజనకరం.
- ప్రతి పాఠ్యాంశం చివర్లో ఉన్న ముఖ్యాంశాలు, ఖాళీలు, బహుళైచ్ఛిక ప్రశ్నలు, అతి స్వల్ప సమాధాన ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి.
- ముఖ్యమైన అంశాలను నోట్స్ రూపంలో పొందుపరచుకోవడం ప్రయోజనకరం.
- ఇంగ్లీష్‌లో పార్ట్ ఆఫ్ స్పీచెస్, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్, ఇడియమ్స్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూషన్స్, సినానిమ్స్, యాంటోనిమ్స్ వంటి వ్యాకరణ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- జీవశాస్త్రం, మ్యాథమెటిక్స్‌లో ప్రతి పాఠ్యాంశం నుంచి ప్రశ్నలు రావొచ్చు.

గురుకుల కాలేజీల ప్రత్యేకతలు

- గురుకులాల్లో ప్రవేశం పొందిన వారికి రెండేళ్లపాటు ఉచిత విద్యను అందిస్తారు.
- ఎంసెట్ / నీట్ / జేఈఈ పరీక్షల కోసం ఇంటిగ్రేటెడ్ కోచింగ్ ఉంటుంది. ఉచితంగా స్టడీ మెటీరియల్ అందించడంతోపాటు మోడల్ పరీక్షల ఆధారంగా ప్రిపరేషన్ స్థాయిని తెలుసుకుంటారు.
- ఆర్ట్స్, కామర్స్ విద్యార్థులను సీఏ, ఐసీడబ్ల్యూఏ వంటి కోర్సుల్లో రాణించే తరహాలో శిక్షణనిస్తారు. ఎంఈసీ, సీఈసీ విద్యార్థులకు సీపీటీ మాదిరి పరీక్షలను కూడా నిర్వహిస్తారు.
- ఇంటర్మీడియట్‌లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు లక్ష రూపాయల వరకూ నగదు బహుమతులు అందజేస్తారు.
- చదువుతోపాటు విద్యార్థుల క్రమశిక్షణకు గురుకుల కళాశాలల్లో ప్రాధాన్యం ఇస్తారు.
- రోజువారీ వ్యాయామ విద్యతోపాటు విద్యార్థుల ఆసక్తిని అనుసరించి ఆయా క్రీడల్లో ప్రత్యేక శిక్షణ ఇచ్చి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడానికి ప్రోత్సహిస్తారు. ఈ పోటీల్లో రాణించిన విద్యార్థులకు లభించే సర్టిఫికెట్లు భవిష్యత్తులో ఉన్నత చదువులు, ఉద్యోగాల్లో ఉపయోగపడతాయి.
- ఏటా ఒకసారి విజ్ఞాన, విహార యాత్రకు విద్యార్థులను అధ్యాపకులు తీసుకెళ్తారు. తద్వారా విద్యార్థుల్లో విజ్ఞానం, మనోవికాసం పెంపొందడానికి అవకాశం ఉంటుంది.
- ప్రతి జూనియర్ కళాశాలలో మంచి గ్రంథాలయాలు ఉన్నాయి. పాఠ్యపుస్తకాలతోపాటు జనరల్ స్టడీస్, రిఫరెన్స్ పుస్తకాలు, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు వీటిలో ఉంటాయి.

తెలంగాణ

తెలంగాణలో మొత్తం 8 రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలు ఉన్నాయి. వీటిలో రెండు బాలుర కాలేజీలు, ఆరు బాలికల కాలేజీలు. బోధన మాధ్యమం ఇంగ్లీష్‌లో ఉంటుంది. మొత్తం సీట్లు 840. ఇందులో ఎంపీసీలో 420, బైపీసీలో 360, ఎంఈసీలో 60 సీట్లు ఉన్నాయి. అభ్యర్థులు ఎంపిక చేసుకున్న గ్రూప్‌లోనే ప్రవేశం లభిస్తుంది. కోర్సులో చేరిన తర్వాత గ్రూపులు మారడం సాధ్యం కాదు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 4, 2018.
- పరీక్ష ఫీజు: రూ. 150
- రాత పరీక్ష తేదీ: మే 6, 2018.
- హాల్ టికెట్ల డౌన్‌లోడింగ్: ఏప్రిల్ 28 - మే 2 మధ్య
- వెబ్‌సైట్: http://tsrjdc.cgg.gov.in/

కాలేజీ - గ్రూప్ - సీట్లు

కాలేజీ	కేటగిరీ	ఎంపీసీ	బైపీసీ	ఎంఈసీ
టీఎస్‌ఆర్ జూనియర్ కాలేజ్ - హసన్‌పర్తి, వరంగల్ జిల్లా.	జనరల్ గర్ల్స్	90	60	30
టీఎస్‌ఆర్ జూనియర్ కాలేజ్ - సర్వేల్, యాదాద్రి భువనగిరి జిల్లా.	జనరల్ బాయ్స్	90	60	30
టీఎస్‌ఆర్ స్కూల్ (జూనియర్ కాలేజ్‌గా అప్‌గ్రేడ్) - బాల్‌నగర్, మహబూబ్‌నగర్ జిల్లా.	జనరల్ గర్ల్స్	40	40	-
టీఎస్‌ఆర్ స్కూల్ (జూనియర్ కాలేజ్‌గా అప్‌గ్రేడ్) వైరా, ఖమ్మం జిల్లా.	జనరల్ గర్ల్స్	40	40	-
టీఎస్‌ఆర్ స్కూల్ (జూనియర్ కాలేజ్‌గా అప్‌గ్రేడ్) - సిద్ధిపేట.	జనరల్ గర్ల్స్	40	40	-
టీఎస్‌ఆర్ స్కూల్ (జూనియర్ కాలేజ్‌గా అప్‌గ్రేడ్) - రామన్నపేట, యాదాద్రి భువనగిరి జిల్లా.	జనరల్ గర్ల్స్	40	40	-
టీఎస్‌ఆర్ స్కూల్ (జూనియర్ కాలేజ్‌గా అప్‌గ్రేడ్) - వికారాబాద్.	జనరల్ గర్ల్స్	40	40	-
టీఎస్‌ఆర్ స్కూల్ (జూనియర్ కాలేజ్‌గా అప్‌గ్రేడ్) - కీసరగుట్ట, మేడ్చల్ జిల్లా.	జనరల్ బాయ్స్	40	40	-

ఆంధ్రప్రదేశ్

ఆంధ్రప్రదేశ్‌లో 10 రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలు ఉన్నాయి. ఇందులో బాలురకు 4, బాలికలకు 2, మైనార్టీ బాలురకు 2, మైనార్టీ బాలికలకు 1 కేటాయించారు. మిగతా ఒకటి కో ఎడ్యుకేషన్ విధానంలో ఉంటుంది. బోధన మాధ్యమం ఇంగ్లీష్. మైనార్టీ గురుకులాల్లో ఉర్దూ, ఇంగ్లీష్ మీడియంల్లో బోధిస్తారు.

కాలేజీ - గ్రూప్ - సీట్లు

కాలేజీ	కేటగిరి	ఎంపీసీ	బైపీసీ	సీఈసీ	ఎంఈసీ
ఇవి కోస్తా జిల్లాల విద్యార్థులకు మాత్రమే (శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు)					
ఏపీఆర్ జూనియర్ కాలేజీ, తాడిపూడి - విజయనగరం జిల్లా	బాలికలు	60	40	-	30
ఏపీఆర్ జూనియర్ కాలేజీ, విజయపురి సౌత్, నాగార్జునసాగర్, గుంటూరు జిల్లా	బాలురు	68	51	39	42
ఏపీఆర్ జూనియర్ కాలేజీ వెంకటగిరి, నెలూరు జిల్లా	బాలురు	60	40	-	30
ఏపీఆర్ జూనియర్ కాలేజీ, నిమ్మకూరు, కృష్ణా జిల్లా	కో-ఎడ్యుకేషన్	50	30	30	25
ఇవి రాయలసీమ జిల్లాల విద్యార్థులకు మాత్రమే (చిత్తూరు, అనంతపురం, కడప, కర్నూలు)					
ఏపీఆర్ జూనియర్ కాలేజీ, బసవాసి కర్నూలు జిల్లా	బాలికలు	60	40	-	30
ఏపీఆర్ జూనియర్ కాలేజీ, గ్యారంపల్లి - చిత్తూరు జిల్లా	బాలురు	60	40	-	30
ఏపీఆర్ జూనియర్ కాలేజీ, కొడిగెనహళ్లి, అనంతపురం జిల్లా	బాలురు	50	30	30	25
ఏపీఆర్ జూనియర్ కాలేజీ, విజయపురి సౌత్, నాగార్జునసాగర్, గుంటూరు జిల్లా.	బాలురు	12	9	6	3

- ఏపీఆర్ జూనియర్ కాలేజీ, నిమ్మకూరు, కృష్ణా జిల్లా, ఏపీఆర్ జూనియర్ కాలేజీ, విజయపురి సౌత్, నాగార్జునసాగర్ స్టేట్ వైడ్ కాలేజీలు. ఇందులో ఇరు ప్రాంతాల విద్యార్థులకు నిర్దేశించిన కోటాలో సీట్లను కేటాయిస్తారు.
- ఏపీఆర్ జూనియర్ కాలేజీ, నిమ్మకూరులో ఈఈటీ (ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్), సీజీడీటీ (కమర్షియల్ గార్మెంట్ డిజైన్ మేకింగ్) వృత్తి విద్య కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ కోర్సుల్లో కోస్తా జిల్లా విద్యార్థులకు 21 సీట్లు, రాయలసీమ విద్యార్థులకు 9 సీట్ల చొప్పున కేటాయిస్తారు.

ప్రత్యేక నోటిఫికేషన్

మైనార్టీ బాలబాలికల కోసం ప్రత్యేకంగా కళాశాలలు ఏర్పాటు చేశారు. వీటిలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో మైనార్టీ కళాశాలలోనూ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూప్‌లు ఉన్నాయి. గుంటూరు, కర్నూలులల్లో బాలుర కోసం; వాయల్పాడు (చిత్తూరు జిల్లా)లో బాలికలకు మైనార్టీ జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేశారు. వీటిలో 10వ తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు. ఇందుకోసం ప్రత్యేకంగా నోటిఫికేషన్ విడుదల చేస్తారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 10, 2018.
- పరీక్ష ఫీజు: రూ. 150
- రాత పరీక్ష తేదీ: మే 10, 2018.
- వెబ్‌సైట్: https://aprjdc.apcfss.in/

- ఫిజికల్ సైన్స్‌ను కొంత విశ్లేషణాత్మకంగా ప్రిపేర్ కావాలి. వివిధ భావనలకు సూత్రాలను అన్వయించి సమస్యలను సాధించడం నేర్చుకోవాలి. ప్రతి అధ్యాయంలోని సూత్రాలు, స్థిరాంకాలు, ముఖ్య రసాయన ఫార్ములాలు, వివిధ పట్టికలను నేర్చుకోవాలి.
- సోషల్ స్టడీస్‌లో చరిత్ర, భూగోళశాస్త్రం నుంచి ఎక్కువ ప్రశ్నలు రావచ్చు. చరిత్రలో సంవత్సరాలపై అధికంగా దృష్టి సారించాలి. భూగోళశాస్త్రంలో శీతోష్ణస్థితి, క్షేత్రీయ అమరిక సంబంధిత అంశాలను నేర్చుకోవాలి. పౌర శాస్త్రం, ఆర్థిక శాస్త్రంలో అన్ని అంశాలు ముఖ్యమైనవే.

లోకో పేరెంట్ వ్యవస్థ

గురుకులాల్లో 'లోకో పేరెంట్' విధానం అమల్లో ఉంటుంది. దీని ప్రకారం తరగతిలోని ప్రతి 15-20 మంది విద్యార్థులకు ఒక అధ్యాపకుడు 'లోకో పేరెంట్'గా వ్యవహరిస్తూ, ఇటు అధ్యాపకుని పాత్ర, అటు తల్లిదండ్రుల పాత్రను పోషిస్తారు. ఎలాంటి శారీరక, మానసిక రుగ్మతలు రాకుండా ఆరోగ్యానికి, విద్యావ్యాసంగానికి అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తుంటారు. ఆయా విద్యార్థుల గురించి అన్ని విషయాలనూ శ్రద్ధగా పరిశీలిస్తారు. వారు ఆసక్తిగా చదువుకునేందుకు అవసరమైన వాతావరణాన్ని కల్పిస్తారు.

- గురుకుల విద్యాలయాల్లో విద్యార్థుల దినచర్య ఉదయాన్నే 5 గంటలకు ప్రారంభమవుతుంది. అనుభవజ్ఞులైన ఫిజికల్ డైరెక్టర్ పర్యవేక్షణలో యోగా, మాస్ డ్రిల్, తదితర వ్యాయామ కార్యక్రమాలు నిర్వహిస్తారు. తద్వారా విద్యార్థుల్లో శారీరక దారుఢ్యం, ఏకాగ్రత, మానసిక సామర్థ్యం పెంపొందించడానికి కృషిచేస్తారు. తర్వాత ప్రతిభ, నైపుణ్యం, అనుభవం, అంకితభావం గల అధ్యాపకుల ద్వారా తరగతుల్లో బోధన ఉంటుంది. పరీక్షల్లో వచ్చిన మార్కులను ప్రోగ్రెస్ రిపోర్టు ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు లోకో పేరెంట్స్ తెలియజేస్తారు. సంబంధిత అధ్యాపకులు విద్యార్థుల స్థాయిని తెలుసుకుంటూ, అవసరమనుకున్న వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తారు.

జాబ్ కార్నర్

ఈఎస్‌ఐసీలో ప్రొఫెసర్లు

న్యూఢిల్లీలోని ఎంప్లాయీస్ స్టేట్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) - ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాల భర్తీ కోసం గత ఏడాది (2017) విడుదల చేసిన ప్రకటనలను రద్దు పరచి వాటి స్థానంలో తాజా ప్రకటన చేసింది. రద్దు చేసిన ప్రకటనల వివరాలను వెబ్‌సైట్‌లో చూడవచ్చు. వీటితోపాటు కర్ణాటక గుల్బర్గాలో మరో 35 పోస్టులను కూడా భర్తీ చేయనుంది. గతంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేసుకోనవసరం లేదు.

- మొత్తం ఖాళీలు: **221** (ప్రొఫెసర్ 50, అసోసియేట్ ప్రొఫెసర్ 80, అసిస్టెంట్ ప్రొఫెసర్ 91)
- కేంద్రాలవారీ ఖాళీలు: హైదరాబాద్ 40, కర్ణాటక 50, ఢిల్లీ 15, హర్యానా 56, బెంగళూరు 29, కోల్‌కతా 31
- అర్హత: పోస్టును అనుసరించి డాక్టొరేట్ / ఎండి / ఎంఎస్ / పీజీ / డీఎన్‌బీ పూర్తిచేసి ఉండాలి.
- వయసు: 50 ఏళ్లు మించకూడదు.
- ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
- ఇంటర్వ్యూ కేంద్రాలు: హైదరాబాద్, బెంగళూరు, కోల్‌కతా, ఢిల్లీ
- దరఖాస్తు ఫీజు: రూ.225 (ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ మహిళలకు మినహాయింపు వర్తిస్తుంది)
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఏప్రిల్ 2
- వెబ్‌సైట్: www.esic.nic.in/recruitment

కేంద్రీయ విద్యాలయలో టీచర్లు

కేంద్రీయ విద్యాలయం - విజయవాడ, నెల్లూరు కేంద్రాల్లో ఒప్పంద ప్రాతిపదికన ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.


- విజయవాడ కేంద్రంలోని ఉద్యోగాలు: ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లు, ప్రైమరీ టీచర్లు, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్లు.
- నెల్లూరు కేంద్రంలోని ఉద్యోగాలు: పీజీటీలు, టీజీటీలు, ప్రైమరీ టీచర్లు, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్, యోగా ఇన్‌స్ట్రక్టర్, కౌన్సిలర్, ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్ (డ్యాన్స్), స్పోర్ట్స్ కోచ్, ఆర్ట్స్ & క్రాఫ్ట్స్ ఇన్‌స్ట్రక్టర్, నర్సులు.
- అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ / పీజీ / బీఈడీ / డీఈడీ / బీసీఏ / ఎంసీఏ / బీఈ / బీటెక్ / పీజీ డిప్లొమా పూర్తిచేసి ఉండాలి. ఉపాధ్యాయ ఉద్యోగాలకు సీటెట్ అర్హత ఉండాలి.
- ఎంపిక: స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా
- స్క్రీనింగ్ టెస్ట్: విజయవాడలో మార్చి 21న
- ఇంటర్వ్యూలు: విజయవాడలో మార్చి 22, 23న నెల్లూరులో మార్చి 27, 28, 31
- నెలవారీ వేతనం: పీజీటీలకు రూ.27,500 టీజీటీలకు రూ.26,250 పీఆర్‌టీ & ఇతర ఉద్యోగాలకు రూ.21,250 కౌన్సిలర్లకు రూ.25,000 కాగా నర్సులకు రోజుకి రూ.750 చెల్లిస్తారు.
- విజయవాడ ఉద్యోగాల దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 17 (www.kv2vijayawada.edu.in)
- నెల్లూరు ఉద్యోగాల దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 24 (www.kvnellore.ac.in)

ఏపీలో మిడ్ లెవెల్ ప్రొవైడర్లు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ జోన్లవారీగా ఉన్న హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాల్లో 'మిడ్ లెవెల్ ప్రొవైడర్' ఉద్యోగాల భర్తీ కోసం మహిళల నుంచి దరఖాస్తులు కోరుతోంది. ఒప్పంద ప్రాతిపదికన నియామకాలు జరుగనున్నాయి.

- మొత్తం ఖాళీలు: **1500**
- జోన్లవారీ ఖాళీలు: గుంటూరు 345, విశాఖపట్నం 345, రాజమహేంద్రవరం 350, కడప 460
- ఒప్పంద వ్యవధి: ఏడాది.
- అర్హత: బీఎస్సీ (నర్సింగ్) పూర్తిచేసి ఉండాలి. అదనపు అర్హతలకు ప్రాధాన్యం ఉండదు.
- వయసు: జనరల్ అభ్యర్థులకు 35 ఏళ్లు, ఎస్సీ / ఎస్టీ వర్గాలకు 40 ఏళ్లు మించకూడదు.
- ఎంపిక: మెడికల్ ఎగ్జామినేషన్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. ఎంపికైన అభ్యర్థులు కమ్యూనిటీ హెల్త్ విభాగంలో ఆర్నెల్ల బ్రిడ్జ్ ప్రోగ్రామ్‌ను పూర్తిచేయాల్సి ఉంటుంది. ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ నిర్వహించే ఈ కోర్సు ఖర్చులను పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుంది. కౌన్సిలింగ్, స్టడీ మెటీరియల్ ఫీజులను చెల్లించడమే కాకుండా ఉచిత భోజన, వసతి సౌకర్యాలను కల్పిస్తుంది.
- ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తును జోన్ పరిధిలోని ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకుల కార్యాలయానికి పంపుకోవాలి.
- దరఖాస్తు ఫీజు లేదు.
- దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: మార్చి 27
- వెబ్‌సైట్: cfw.ap.nic.in

విద్యా సమాచారం



బిట్‌శాట్ దరఖాస్తులకు మార్పులు

బిట్‌శాట్ 2018 ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ దరఖాస్తులో సమాచారాన్ని అవసరమైతే మార్చుకోవచ్చు. ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో ఏవైనా పొరపాట్లు దొర్లితే మార్చి 19లోగా వాటిని సవరించుకోవడానికి బిట్స్ అవకాశం కల్పిస్తోంది. పుట్టిన తేదీ, జెండర్, రిజిస్టర్డ్ ఈమెయిల్ ఐడీ మినహా, మిగతా సమాచారంలో మార్పులు చేసుకోవచ్చు.

నీట్ దరఖాస్తులో మార్పులకు అవకాశం

నీట్ యూజీ 2018 ఆన్‌లైన్ దరఖాస్తులకు మార్పులు చేర్పులు చేసుకోవడానికి మార్చి 17 వరకు సమయం ఉంది. ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో ఏవైనా తప్పులు దొర్లితే నీట్ వెబ్‌సైట్ ద్వారా లాగిన్ అయ్యి, మార్పులు చేయవచ్చు. మార్పులు చేసుకోవడానికి ఇదే చివరి అవకాశమని సీబీఎస్‌ఈ ప్రకటించింది. అభ్యర్థులు ఐడీ సమాచారం, పుట్టిన తేదీ, జెండర్, స్టేట్ కోడ్, కేటగిరీ, డిజెబిలిటీ స్టేటస్, మీడియం, పరీక్ష కేంద్రం, ఇంటర్‌లో సాధించిన మార్కుల శాతం, తల్లిదండ్రుల పేర్లు తదితర సమాచారాన్ని అవసరమైతే మార్చుకోవచ్చు.

జేఈఈ మెయిన్ అడ్మిట్ కార్డులు

జేఈఈ మెయిన్ 2018 పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు jeemain.nic.in వెబ్‌సైట్ ద్వారా అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దేశవ్యాప్తంగా ఉన్న ఎన్ఐటీలు, ఐఐఐటీలు, కేంద్ర ప్రభుత్వ నిధులతో కొనసాగే సంస్థల్లో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి జేఈఈ మెయిన్ ర్యాంకులను పరిగణనలోకి తీసుకుంటారు. జేఈఈ మెయిన్ పరీక్షలు ఏప్రిల్ 8 (పేపర్, పెన్ పరీక్ష), ఏప్రిల్ 15, 16 (కంప్యూటర్ ఆధారిత పరీక్ష) తేదీల్లో జరగనున్నాయి.

ఏపీ ఈసెట్ దరఖాస్తులు ప్రారంభం

ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ ఈసెట్ 2018) దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. sche.ap.gov.in/ecet ద్వారా ఏప్రిల్ 14లోగా దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్షను మే 3న నిర్వహించనున్నారు. లేటరల్ ఎంట్రీ పద్ధతిలో సెకండియర్ ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి ఏపీ ఈసెట్ పరీక్షను నిర్వహిస్తారు.

సొగసు

లంగావోణీ కాదు.. లెహంగా చోళీ

తెలుగు సంవత్సరాదికి స్వాగతం పలికేందుకు తెలుగింటి ఆడపడుచులు సిద్ధమవుతున్నారు. అది కూడా సంప్రదాయ, ఆధునికతలను జోడించి మరీ. ఆ క్రమంలో లంగావోణీలు కాస్తా లెహంగా చోళీలుగా మారాయి. అదెలాగంటారా... ఇదిగో ఇక్కడ కనిపిస్తున్న బుట్టబొమ్మల్లా..



గులాబీ రంగు లెహంగా చోళీకి లేసులతో, రేషమ్ వర్క్‌తో స్పెషల్ లుక్ తెచ్చారు. గులాబీ, నారింజ రంగుల మేళవింపులో... నెట్, సిల్క్, షిఫాన్ మెటీరియల్స్ వాడి డిజైన్ చేశారు. లేస్ బోర్డర్ ఇవ్వడంతో కొత్త కళ వచ్చింది.

ధర: రూ.3,809

పసుపు రంగు ప్యూర్ నెట్ ఫ్యాబ్రిక్‌తో డిజైన్ చేసిన లెహంగా చోళీ ఇది. లోపలి వైపు ప్యూర్ శాంటూన్ ఫ్యాబ్రిక్ వాడారు. బ్లౌజ్‌కు భగల్ పురి జార్జెట్, ప్యూర్ నైలాన్ నెట్ వోణీ ఇచ్చారు.

ధర: రూ.6,099

పింక్ మల్బరీ సిల్క్ లెహంగాకు అదే మెటీరియల్ బ్లౌజ్ కుట్టారు. వోణీగా నెట్ మెటీరియల్ వాడారు. రిచ్ డిజైన్‌తో ఉన్న ఈ లెహంగా చోళీని సంప్రదాయబద్ధంగా పండుగలకి వేసుకోవచ్చు. పార్టీలకు వేసుకున్నా మోడ్రన్ ట్రెడిషనల్ లుక్ మీ సొంతం అవుతుంది.

ధర: రూ.2,849

తెలుపు, గులాబీ రంగుల ఆర్ట్ సిల్క్ డిజైనర్ లెహంగా చోళీ ఇది. దీనికి లోపలి వైపు శాంటూన్, దుపట్టాకు షిఫాన్, లెహంగాకు ఆర్ట్ సిల్క్ ఫ్యాబ్రిక్ వాడారు. బ్లౌజ్‌ను సిల్క్ ఫ్యాబ్రిక్‌తో కుట్టారు.

ధర: రూ.5,400

న్యూస్‌మేకర్



నేపాల్ వేగుచుక్క!

నేపాల్ రాచరికపు పీడన నుంచి ఎగిసిన విప్లవోద్యమంలో వెలుగురేఖ విద్యాదేవీ భండారి. పితృస్వామ్య నేపాల్ రాజకీయాలను తలదన్ని రెండోసారి అధ్యక్షురాలిగా ఎంపికైన తొలి మహిళ ఆమె. నెలసరి సమయంలో మహిళలు ఇంటికే పరిమితమవ్వాలనే పురాతన హిందూ సంప్రదాయాన్ని బహిష్కరించి... వరకట్నానికి వ్యతిరేకంగా చట్టం తీసుకొచ్చి నేపాల్ మహిళలకు ఆశాదీపంగా నిలిచారు. నేపాల్ విప్లవోద్యమంలో చురుగ్గా పాల్గొని, రెండోసారి అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన విద్యాదేవీ భండారి గురించి మరిన్ని ఆసక్తికరమైన విశేషాలు!

భోజ్‌పూర్‌లోని మానె భాంజ్యాంగ్‌లో 1961లో జన్మించిన విద్యాదేవి విద్యార్థి దశలోనే ఉద్యమాలకు నాయకత్వం వహించింది. అతి పిన్న వయసులోనే రాజకీయాల్లోకి ప్రవేశించినా ప్రత్యక్ష రాజకీయాల్లోకి ఆమె ప్రవేశం 1980లో సిపిఎన్(కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్) సభ్యత్వంతో మొదలైంది. ఆ తర్వాత విమెన్ వింగ్‌కు ఛైర్ పర్సన్‌గా ఎంపికైంది. తర్వాత సెంట్రల్ కమిటీ మెంబర్‌గా, పార్టీ వైస్ ఛైర్‌పర్సన్‌గా అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రధాని ఖడ్గా ప్రసాద్‌కు విశ్వాసపాత్రురాలిగా పేరు పొందింది. అప్పట్లో నేపాల్ కమ్యూనిస్ట్ మూవ్‌మెంట్‌కు ఊతమిచ్చి ఓ వెలుగు వెలిగిన కమ్యూనిస్ట్ నేత మదన్ భండారీని విద్యాదేవి పెళ్లాడారు. అయితే 1993లో మదన్ అనుమానాస్పద రీతిలో మరణించారు. భర్త మరణంతో కుంగిపోకుండా ఆమె ప్రజాసేవకే అంకితమయ్యారు. దశాబ్దాల నేపాల్ రాచరిక పాలనలో తనకంటూ ప్రత్యేక పంథా ఏర్పరుచుకుని ముందుకు సాగారు. మహిళా గెరిల్లా దళాలను నడిపించడం దగ్గరి నుంచి, మహిళా రైతుకూలీల్లో చైతన్యం తేచ్చేదాకా ఆమె పోరాటం అనన్య సామాన్యం.

అక్టోబరు 28, 2015న విద్యాదేవి తొలిసారిగా నేపాల్ అధ్యక్షురాలిగా ఎంపికయ్యారు. ఈ ఎన్నికల్లో ఆమె 549 పార్లమెంటరీ ఓట్లలో ఏకంగా 327 ఓట్లు గెలుచుకుని అధ్యక్ష పీఠాన్ని అధిరోహించారు. ఫోర్బ్స్ విడుదల చేసిన 'ప్రపంచంలోని వంద మంది అత్యంత ప్రతిభావంతమైన మహిళల' లిస్టులో 52వ స్థానాన్ని పొందారు. నేపాల్‌కు తొలి మహిళా అధ్యక్షురాలిగానే కాక, నేపాల్ తొలి మహిళా రక్షణ మంత్రిగా పని చేసిన ఘనత ఆమెది. రెండోసారి కూడా ఆమె భారీ మెజారిటీతో గెలిచి, సరికొత్త అధ్యాయాన్ని సృష్టించారు.

విద్యాదేవికి ఇద్దరు పిల్లలు (ఉషాకిరణ్, నిశాకుసుమ్). 56 ఏళ్ల వయసులో కూడా మహిళల హక్కుల కోసం విద్య నిరంతరంగా కృషి చేస్తున్నారు. 2006లో మావోయిస్టు తిరుగుబాటు అంతమై, నేపాల్ రాజకీయ ముఖచిత్రం కొత్త రూపు సంతరించుకున్న తరుణంలో పార్లమెంటులో మహిళల గొంతు వినిపించటం కోసం ఆమె ఎంతో ప్రయత్నించారు.



సమ్మర్ జ్యూస్

శక్తినిచ్చే గ్రీన్ డ్రింక్

కావలసినవి:

మంచి నీళ్లు - ఒక కప్పు, కీరదోసకాయ (చిన్న ముక్కలుగా తరిగి) - ఒకటి, పాలకూర - కొద్దిగా, నిమ్మకాయలు (రసం) - రెండు, గ్రీన్ యాపిల్స్ (మధ్య భాగాన్ని తీసి, చిన్న ముక్కలుగా తరగాలి) - రెండు, అల్లం (పొట్టు తీసి) - చిన్న ముక్క, పార్స్లీ ఆకులు (కొత్తిమీర ఆకుల్లా ఉంటాయి.) - కొన్ని.

తయారీ:

- జ్యూసర్‌లో గ్రీన్ యాపిల్స్, కీరదోసకాయ, పాలకూర, అల్లం, పార్స్లీ ఆకులు వేసి గ్రైండ్ చేయాలి.
- తరువాత నిమ్మరసం వేసి మరోసారి తిప్పాలి.
- గ్రీన్ జ్యూస్ అనగానే ఆరోగ్యం కోసం అనుకుంటారు. కానీ సమ్మర్‌లో శరీరానికి ఇది చేసే మేలు చాలా ఉంది.
- రుచి కోసం కాస్త మిరియాల పొడి, కొద్దిగా క్రష్డ్ ఐస్ వేసుకుని తాగేయండి.

స్కిన్‌కేర్

ఎండలో బయటకు వెళ్తున్నారా?

మండుతున్న ఎండల్లో మాయిశ్చరైజర్లు, సన్‌స్క్రీన్ లోషన్స్ చర్మానికి రాసుకోకుండా బయటకు అడుగు పెట్టొద్దు అంటున్నారు సౌందర్య నిపుణులు. ఎందుకలాగంటే...

- వేసవిలో చర్మం పొడిబారిపోతుంది. కాబట్టి దాన్ని రీజనరేట్ చేయాలంటే వారానికి రెండు సార్లు ఫేస్ స్క్రబ్, మాస్క్‌లు వేసుకోవాల్సిందే. చర్మ తత్వాన్ని బట్టి వాటిని ఎంపిక చేసుకోవాలి. దీనివల్ల మృతకణాలు పోతాయి. చర్మం ఉత్తేజితమవుతుంది. మాయిశ్చరైజర్లు, టోనర్స్ వల్ల చర్మం పొడిబారకుండా ఉంటుంది.
- ఎస్‌పిఎఫ్ (సన్ ప్రొటెక్షన్ ఫ్యాక్టర్) ఉన్న మాయిశ్చరైజర్లు వాడేముందు ఫేషియల్ ఆయిల్‌ను ఉపయోగించాలి.
- క్వినోవా పొట్టును పేస్టుగా చేసి, శరీరానికి ఎండ తగిలే ప్రాంతంలో రాసుకోవాలి. ఇలా చేస్తే చర్మం పొలుసులుగా అవ్వకుండా ఉంటుంది.
- విటమిన్-సి ఉన్న సీరమ్స్, మాయిశ్చరైజర్లలోని యాంటాక్సిడెంట్లు చర్మాన్ని తాజాగా ఉంచుతాయి.
- రాత్రి పడుకునే ముందు శరీరానికి ప్రైమ్‌రోజ్ ఆయిల్ రాసుకుంటే మంచిది. ఇందులో ఫ్యాటీ యాసిడ్స్ చర్మంలో ఉండే సహజమైన తేమను, సాగే గుణాన్ని కోల్పోకుండా కాపాడతాయి. లావెండర్ ఆయిల్ కూడా చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.
- వేసవిలో చర్మ సంరక్షణకు సంబంధించి విటమిన్-సి సీరమ్స్ తప్పనిసరి. ఇవి చర్మాన్ని వాయుకాలుష్యం బారినపడనీయవు.
- చర్మసౌందర్యంలో తినే ఆహారం పాత్ర కూడా కీలకమే. వేసవి కాలంలో నూనె పదార్థాల జోలికి వెళ్లకూడదు. డెయిరీ ఉత్పత్తులకు దూరంగా ఉండాలి. కేవలం పళ్లు, కూరగాయలే తీసుకోవాలి. ఎక్కువ నీళ్లు తాగడం వల్ల చర్మం డీ-హైడ్రేట్ కాకుండా ఉంటుంది.



పేరెంటచ్

ముందే సిద్ధం చేయాలి!

కొందరు పిల్లలు బాగా చదివినప్పటికీ మొదటి పరీక్ష బాగా రాయలేరు. దాంతో పరీక్ష బాగా రాయలేదని తెగ బాధపడుతుంటారు.

"ఎంత చదివితే మాత్రం ఏముందిలే! బాగా రాయలేనప్పుడు చదివిందంతా వృధాయే కదా! ఆ తర్వాత పరీక్షలు మాత్రం బాగా రాయగలుగుతానన్న గ్యారెంటీ ఏముంది?" అనుకుంటూ లోలోపల కుంగిపోతుంటారు. ఆ దిగులుతో మిగతా పరీక్షలు కూడా బాగా రాయలేకపోతారు. పరీక్ష బాగా రాయలేదన్న విషయాన్ని అమ్మానాన్నలకు చెప్పే ధైర్యమూ ఉండదు. ఆ బాధంతా మనసులో పెట్టుకుని పైకి మామూలుగా కనిపించే ప్రయత్నం చేస్తుంటారు. ఫలితాలు వచ్చాక అమ్మానాన్నలకు ఏం సమాధానం చెప్పాలా? అని ఆలోచిస్తుంటారు. అంతే తప్ప అయిందేదో అయ్యింది, మిగతా పరీక్షలైనా బాగా రాద్దామన్న ఆలోచన వారికి రాదు. ఎవరో ఒకరికి అసలు నిజం చెబితే కదా ధైర్యం చెప్పే ప్రయత్నం చేస్తారు.

సాధారణంగా పిల్లలు పరీక్షల మూడ్‌లో ఉన్నారని వారిని పేరెంట్స్ డిస్టర్బ్ చేయరు. అయితే పిల్లలను నిలదీసున్నట్టుగాక, పరీక్ష రాసి వచ్చిన తర్వాత కాసేపు ఎలా రాశారనే విషయాన్ని వారితో చర్చించడం వల్ల పేరెంట్స్‌కు కూడా ఒక అవగాహన వస్తుంది. ఒక పరీక్ష బాగా రాయలేకపోతే, ఆ బాధ నుంచి పిల్లలు వెంటనే బయటకు తీసుకొచ్చి, తర్వాత జరగబోయే పరీక్షకు పిల్లల్ని సంసిద్ధం చేయాలి. దానివల్ల పిల్లలు బెంగపడకుండా ధైర్యంగా ఉంటారు.

నవ్య నివేదన

శుక్రవారం 16 మార్చి 2018



నూకాలమ్మ తల్లి

ఉత్తరాంధ్ర కల్పవల్లి



ఉత్తరాంధ్ర జిల్లాల్లో భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా అత్యంత ప్రసిద్ధి గాంచిన అమ్మవారు విశాఖ జిల్లా అనకాపల్లి నూకాంబిక. ప్రతి సంవత్సరం పాల్గుణ బహుళ అమావాస్య (సరిగ్గా ఉగాదికి ముందు వచ్చే కొత్త అమావాస్య) సందర్భంగా అమ్మవారి జాతర ప్రారంభం అవుతుంది. నెల రోజులపాటు ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచే కాకుండా, ఉభయ గోదావరి జిల్లాల నుంచి కూడా భక్తులు ఈ ఉత్సవ దినాల్లో విశేష సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. అంతేకాదు, అనకాపల్లి, ఆ చుట్టుపక్క ప్రాంతాలవారు ఉద్యోగ, వ్యాపారాల రీత్యా ఎక్కడ నివసిస్తున్నా, కొత్త అమావాస్య జాతరకు ఇక్కడికి చేరుకుంటారు. ఉత్సవాలు ముగిసిన తరువాత కూడా కనీసం మూడు నెలలపాటు భక్తుల రద్దీ ఆలయంలో కనిపిస్తూ ఉంటుంది.

ఎప్పుడు?: ఈ నెల 16వ తేదీ నుంచి ఏప్రిల్ 14 వరకూ

ఎక్కడ?: విశాఖపట్నం జిల్లా అనకాపల్లిలో

ఎలా వెళ్ళాలి?: తెలుగు రాష్ట్రాల్లోని దాదాపు అన్ని ప్రధాన నగరాలు, పట్టణాల నుంచి అనకాపల్లికి నేరుగా ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులున్నాయి. అలాగే విశాఖపట్నం వెళ్ళే దాదాపు అన్ని రైళ్ళూ అనకాపల్లిలో ఆగుతాయి.

విశేష దినాలు: జాతరలో ఆది, మంగళ, గురువారాలను భక్తులు విశేషమైనవిగా భావిస్తారు. ఆ రోజుల్లో, ముఖ్యంగా ఆదివారాల్లో వేల మంది అమ్మవారిని దర్శించుకోవడానికి వస్తారు.

దైవమార్గం

మన కోసం దేవుడు

"కోరికలు అనంతం, కాని వాటిని తీర్చే వనరులేమో చాలా పరిమితం. అందుకే సమాజంలో ఘర్షణ, అసంతృప్తి!" అంటుంది అర్థశాస్త్రం. పేద, గొప్ప అనే తేడా లేకుండా అందరి జీవితంలోనూ 'చింతించడం' అనేది అంతర్భాగమైన ఆధునిక జీవనశైలి ఈనాడు మనది. ఒక చింత తీరిపోతే, మరో చింత ఆ వెంటనే 'లాగ్ ఆన్' అవుతున్న రోజులివి. ఒక గొప్ప ధనికుడు కేవలం తన చింతలు భరించి, తన బదులు చింతించడానికి పెద్ద జీతంతో ఒకతన్ని కుదుర్చుకున్నాడట. మరునాడు రావడం రావడమే అతను దిగులుగా ఉండడం చూసి, "ఏమిటి నీ బాధ?" అని అడిగాడు ధనికుడు. "ఇంత జీతం నువ్వసలు నాకిస్తావా లేక ఎగ్గొడతావా? అని చింతగా ఉందన్నా"డట అతను!!

దేవుడు మాత్రం విశ్వాసికి బైబిల్ లో చాలా అనూహ్యమైన వాగ్దానంతో కూడిన 'ఆఫర్' ఇచ్చాడు. "మీ చింతలన్నీ నా మీద వేయండి. నేను మీ కోసం చింతిస్తాను" అన్నాడు దేవుడు (1 పేతురు 5 :7). మనల్ని ఆపదలో కాపాడే వాడు, అవసరాలు తీర్చేవాడు మాత్రమే కాదు, మన బాధలు, భారాలు కూడా వహించి మన కోసం చింతించే దేవుడినంటూ తన అపారమైన ప్రేమలోని ఒక సరికొత్త కోణాన్ని ఈ వాక్యంలో ఆయన ఆవిష్కరించాడు.



'చింతించడం' అనే మానసిక దుఃస్థితికి 'అవిశ్వాసం' అనే ఆత్మీయ రుగ్మత మూలకారణమని అర్థం చేసుకోవాలి. దేవుని శక్తికి సంబంధించిన సంపూర్ణమైన అవగాహన లేకపోవడం, మన జీవితాలు దేవుని ప్రణాళికల మేరకు కాకుండా మన అభీష్టాల మేరకు సాగాలన్న స్వార్థం, కనబడని అహంకారమే మన జీవితాన్ని అశాంతికీ, చింతలకూ బానిసను చేస్తున్నాయి. 'ఏమి తినాలి?, ఏమి తాగాలి?' లాంటి ప్రాథమిక విషయాల పైన దృష్టితో కాకుండా దేవుని ప్రణాళికలు తనలో నెరవేరాలన్న అత్యున్నతమైన ఆత్మీయస్థాయిలో జీవించాలి. అదే అశాంతికీ, అనవసరమైన చింతలకూ విరుగుడు!" అని యేసు ప్రభువు బోధించాడు. ఈ లోకంలో ఆయన అలాగే జీవించాడు కూడా (మత్తయి 6:31-34).

తల్లి తన నిత్యావసరాలనూ, నిద్రనూ సైతం మానుకొని మరీ పాలు పట్టడం మొదలు టైం ప్రకారం తన అవసరాలన్నీ తీరుస్తుందని ఒక పసికందు నిబ్బరంగా, చింతలేకుండా ఉంటుంది. సరిగ్గా అదే- విశ్వాసి సొంతం కావాలి. 'నా చింతలు, నా భారమంతా నా తల్లితండ్రులదే!' అన్న ఒక పసికందు విశ్వాసమే దేవుడు మనందరి నుండి కోరుకునే అత్యున్నత స్థాయి విశ్వాసం. ఆయన కృప ద్వారా సమయోచితమైన సహాయం మనకు దొరకడానికి దేవుడు మనల్ని కనికరించాడన్న ధైర్యమే 'విశ్వాస'మని బైబిల్ నిర్వచిస్తోంది (హెబ్రీ 4 :16). భయంకరమైన ఆపదల్లో కూడా ఆ కృపను దావీదు అపారంగా అనుభవించాడు. అందుకే, "ఆయన నన్ను శాంతికరమైన జలాల వద్ద నడిపిస్తా"డంటూ అంతటి శ్రమల్లోనూ దేవుణ్ణి కీర్తించాడు (కీర్తన 23 :2). "నేనున్నానులే! నువ్వు ముందువెళ్ళు" అన్న దేవుణ్ణి- "కాదు నీ వెంటే ఉన్నాను, నా వెంట రా!" అన్న దేవుని అద్భుత కృపనూ దావీదు అనుభవించాడు. అదే కృపను మనమూ అనుభవించవచ్చు.

● సుశీల్ సందేశ్

నవజీవనవేదం

మనది కర్తవ్యం! ఆయనదే భారం!

ఒక్కొక్కసారి మన జీవితం ఎలా ఉంటుందంటే మన కర్తవ్యం నిర్వర్తించడానికి కూడా కష్టమైపోతుంది. ఏం చేయాలో తెలియదు? కుటుంబంలో, ఉద్యోగ జీవితంలో, సమాజంలో ఎదురయ్యే సమస్యలు ఎలా ఉంటాయంటే ఏది కర్తవ్యమో తెలియదు. అటువంటప్పుడు ఈ ప్రార్థనను నమ్ముకోవాలి.

గీతాచార్యుడు బోధ చేసెనని సాగింపంగ కర్తవ్యము
చేతోవేదన రచ్చకీడ్చుటె నను ఈ చింతన్ భరింపంగలేను
ఏతన్మాత్రపు బాధ్యతల్ గడపలేవే నీవు
నా చేతంబున్ భవదీయ నామము వరించెన్ నేను నిస్సంగుడన్

శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలో చెప్పాడు నిమిత్తమాత్రంగా నువ్వు చేసే పని చేయవయ్యా, మిగతాది నేను చూసుకుంటాను అని. ప్రకృతిపరంగా జరిగేవి జరుగుతూ ఉంటాయి. ఎవరి మనస్సును ఎవరు మారుస్తారు. మన మనసును మనం మార్చుకోవడమే కష్టం. ఇక ఎదుటి వాళ్ల మనసుని ఎలా మారుస్తాం. మార్చడం సాధ్యమా! అందుకని నీ కర్తవ్యమేదో నీవు చేయవయ్యా, మిగిలింది నాకు వదిలేయి అని చెబుతాడు భగవంతుడు. చేసిన పని ఏమవుతుందో ఏమో అని మథనపడుతూ కూర్చోకూడదు. ఈ మథనపడటం మూలంగానే మనిషికి ఆందోళన, అశాంతి పెరుగుతున్నాయి. రకరకాల వ్యాధులకు దారి తీస్తున్నాయి.

మనకు తోచిందే కర్తవ్యం కదా! అందుకే తోచింది చేశాము. ఎందుకంటే అన్ని సమస్యలు అందరితో చెప్పుకోలేం కదా. మన సమస్య వేరు. వాళ్ల సమస్య వేరు. మనమే నిర్ణయం తీసుకోవాలి. మనసుకు వేదన కలుగుతుంది ఏమవుతుందో.... ఏమవుతుందో అని. ఇవన్నీ భరించలేను. సృష్టికర్త భగవంతుడే కదా! ఆయన చూసుకోలేడా ఇవన్నీ. 'మరి నువ్వేం చేస్తావు' అని భగవంతుడు అడిగితే 'నీ నామస్మరణతో గడుపుతా దేనితో సాంగత్యం పెట్టుకోను' అనాలి. దీనికి కట్టుబడి ఉంటే ఆ భగవంతుడే అన్నీ చూసుకుంటాడు.

భగవంతుడు భగవద్గీతలో స్పష్టంగా చెప్పాడు.... 'నన్ను స్మరించండి! నేను చూసుకుంటాను' అని. 'నువ్వు చేయగలిగిందేదో చేయి, నన్ను స్మరించు'. భగవంతుణ్ణి రక్షణ కోరుతున్నామంటే ఆయనింట్లోకి మనం వెళ్లిపోవాలి. ఆయనింట్లోకి మనం వెళ్లిపోవడం అంటే మన మనస్సులోకి ఆయన రావడం! భగవాన్ నామస్మరణ చేస్తూనే వచ్చిన పరిస్థితిని తట్టుకుని నిలబడటం అలవాటు చేసుకోవాలి. తప్పనిసరై ఒక శాపం వల్ల తొండ రూపం ధరించాల్సి వస్తే నేనెందుకు ధరించాలి. వాణ్ణి చంపేస్తా అని అనలేదు నృగమహారాజు. **తస్మాత్ అపరిహార్యే అర్థే నత్వం శోచితుమర్హసి** అని భగవద్గీత రెండో అధ్యాయంలో చెప్పిన విషయాన్ని నృగమహారాజు ఒంటపట్టించుకుని ఆచరించాడు. శాపం వల్ల తొండ రూపం ధరించాల్సి వస్తుందని తెలిసింది. పెద్ద కొడుకుని పిలిచి రాజ్యం అప్పగించాడు. ఊర్వశి నన్ను కాదన్నందుకు నువ్వు నపుంసకుడివి అవుతావు అని అర్జునుడిని శపించింది. ఆ శాపాన్ని అర్జునుడు నర్తనశాలలో ఉపయోగించుకున్నాడు. ఆ శాపం అర్జునుడికి వరం అయింది. రకరకాల పరిస్థితులు కొని తెచ్చుకున్న కర్ణుడికి వరాలు కూడా శాపాలయ్యాయి. దైవభక్తి ఉన్నవాడికి ప్రతికూల పరిస్థితులు కూడా అనుకూల పరిస్థితులుగా మారిపోతాయి.

రోజూ శివ నామాన్ని జపించే వాడి జీవితం ఎలా ఉంటుందంటే మహాకవి 'ధూర్జటి' శ్రీకాళహస్తీశ్వరశతకంలో ఇలా చెబుతున్నాడు.

పవి పుష్పంబగు, నగ్ని మంచగు, నకూపారంబు భూమీస్థలం
బవు, శత్రుండతి మిత్రుడౌ, విషము దివ్యాహారమౌ నెన్నగా
నవనీ మండలి లోపలన్ శివ శివేత్యా భాషణోల్లాసికిన్
శివ! నీ నామము సర్వవశ్యకతమౌ, శ్రీకాళహస్తీశ్వరా!



శివుని నామం జపిస్తే వజ్రం పువ్వులా మెత్తగా, అగ్ని మంచులా చల్లగా, సముద్రం భూమిలా నివాస యోగ్యంగా, శత్రువు మిత్రునిగా మారిపోతాడు. విషం సైతం పరమాన్నంగా మారుతుంది. అందుకే దేవుని స్మరణ మరువద్దు.

● డా. గరికిపాటి నరసింహారావు

ధర్మపథం

రైతుల కోసం యజ్ఞం

మనది వ్యావసాయిక దేశం. రైతు కష్టార్జితం మీద బతికే దేశం. రైతులే దేశానికి వెన్నెముకగా నిలిచిన దేశం. జీవ నదీజలాలు ఉప్పొంగి ప్రవహించే దేశం. రైతు క్షేమమే రాజ్యక్షేమమని భగవాన్ బుద్ధుడు ఎప్పుడో ప్రకటించాడు.

'దీర్ఘనికాయం'లోని 'కూటదంత సూత్రం'లోని మహావిజితుని కథే ఇందుకు నిదర్శనం.

మహావిజితుడు మహాచక్రవర్తి. అఖండ భరత ఖండాన్ని పాలించే రాజు. దేశంలో క్రమంగా కరవు కాటకాలు వచ్చిపడ్డాయి. దొంగలు, బందిపోట్లు చెలరేగి పోయారు. ధనవంతులు అందిన కాడికి ధనాన్ని నేలమాళిగల్లో దాచుకుంటున్నారు. పేదలు, రైతులు ఆకలితో అల్లాడిపోతున్నారు. పంటలు పండక, పండిన పంట పన్నులకు చాలక ఆకలితో చావు దారిపడుతున్నారు. రాజుగారి కోశాగారం ఖాళీ అయింది. ఈ దుర్భర పరిస్థితులు పోవాలంటే! మార్గం ఏమిటి? అని రాజు ఆలోచించాడు. యజ్ఞం చేసి వేలాది జంతువుల్ని బలిగా సమర్పిస్తే వర్షాలు పడతాయని పురోహితులు చెప్పారు. రాజు మహాయజ్ఞం కోసం సిద్ధపడ్డాడు. వేలాది జంతువుల్ని సిద్ధం చేశారు.

ఈ విషయం తెలిసి ఒక పండితుడు రాజు దగ్గరకు వెళ్లాడు. "రాజా! దేశం, దేశంలోని రైతులు, ప్రజలు, ధనాగారం సుభిక్షంగా ఉండాలంటే చేయాల్సిన పనులు ఇవి కాదు. పన్నుల భారాన్ని తగ్గించండి. రైతులు రుణాల కింద పడి నలిగిపోతున్నారు. రుణాలన్నీ రద్దు చేయించండి. రైతులకు నాగళ్ళు, పారలు, విత్తనాలు ఉచితంగా అందించండి. పడిన వర్షపు నీరు వృథాపోకుండా చెరువులు తవ్వించి కాల్వల ద్వారా అందించండి. అప్పుడు రైతు కోలుకుంటాడు. పండిన ధాన్యానికి సరైన విలువ కట్టండి. అలాగే చిన్న చిన్న వ్యాపారులకు ఆర్థిక సహాయం అందించండి. మీ దగ్గర పనిచేసే ఉద్యోగులకు నెలనెలా జీతాలు సక్రమంగా చెల్లించండి. ఇలా చేస్తే దేశం సుభిక్షంగా మారుతుంది. మీ ధనాగారం కూడా నిండుతుంది. యజ్ఞం పేరుతో వేలాది పశువుల్ని బలిచేసి, వ్యవసాయాన్ని మరింత కుంటుపరచకండి! రాజా! ఇదీ రాజులు చేయాల్సిన యజ్ఞం!!

ఈ యజ్ఞంలో రక్తం ప్రవహించదు. జంతు సంపద నాశనం కాదు. వేలాది చెట్లు యజ్ఞసమిధలుగా, యూపాలు (స్తంభాలు)గా మారవు. వన రక్షణ జరుగుతుంది" అని చెప్పాడు. మహారాజు బలియజ్ఞాన్ని ఆపి జలయజ్ఞాన్ని ప్రారంభించాడు. రైతు సంక్షేమానికి పూనుకున్నాడు. ఇది కూటదంతునికి బుద్ధుడు చెప్పిన కథ. బుద్ధుడు చెప్పిన ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అశోకుడు ఆచరణలో చూపాడు! బౌద్ధం అంటే ధార్మిక, నైతిక మార్గమే కాదు, సామాజిక వికాస మార్గం కూడా!

● బొర్రా గోవర్ధన్

శ్రీ రమణ కథామృతం

శరణాగతి!



(గత సంచిక తరువాయి)

శ్రీభగవాన్ మౌలిక బోధ ఆత్మవిచారమే. అంటే ఆత్మను స్వయంకృషి వల్ల అనుభవసిద్ధం చేసుకోవడం. అదే జరిగితే, మన సుఖదుఃఖాలకి మూలకారణమైన 'మనస్సు' అణగిపోతుంది. వారు బోధించిన ఈ పద్ధతి అందరికీ సులభసాధ్యం కాదు. సహజంగానే వైరాగ్యమున్న వారికీ, ప్రపంచం పట్ల ఆకర్షణ లేని వారికి మాత్రమే ఇది సాధ్యమవుతుంది ఎంతో అభ్యాసం తరువాత. మరి ఇతరుల మాట ఏమిటి? తనకంటే ఉన్నతమైన శక్తి ఒకటి ఉందని గ్రహించి దానికి బేషరతుగా వశమైపోవడమే ఆ రెండో మార్గం. దీనినే శరణాగతి అంటారు. పైకి ఇది తేలికగానే కనిపిస్తుంది. ఈ విషయమైన శ్రీరమణులు భక్తులకు బోధించిన విషయమిది. (సశేషం)

● పింగళి సూర్యసుందరం

డైలీ సుడోకు - 133

			7		9	4	5	
9				2	6	1		7
4					3		2	
2	7						4	1
	9		4					6
1		4	3	9				5
	5	2	1		7			

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు-132 సమాధానం

3	1	5	6	7	4	2	9	8
2	9	4	3	8	1	6	7	5
6	8	7	2	9	5	1	3	4
8	7	9	1	5	6	3	4	2
1	3	6	4	2	9	5	8	7
5	4	2	7	3	8	9	6	1
4	2	1	9	6	7	8	5	3
7	6	8	5	1	3	4	2	9
9	5	3	8	4	2	7	1	6



సందర్భం

ఉగాది పండుగ వచ్చేస్తోంది. కొత్త ఏడాదితో పాటు కొత్త ఉత్సాహం తెచ్చేస్తోంది. అసలేమిటీ ఉగాది? ఎందుకీ పండుగ?

పండగొచ్చింది!



బ్రహ్మ సృష్టిలో ప్రళయం అయిపోయిన తరువాత తిరిగి ఆరంభించే అధ్యాయాన్ని 'బ్రహ్మకల్పం' అని అంటూ ఈ ప్రారంభకాలాన్ని 'కల్పాది' అని వ్యవహరిస్తారు. ప్రతీ కల్పంలోను మొదట వచ్చే 'ఆది' సమయమే 'ఉగాది' పండుగ. దీన్ని గురించి 'సూర్య సిద్ధాంతం' అనే జ్యోతిష గ్రంథంలో స్పష్టంగా చెప్పారు. నాటి నుండి నేటి వరకు ఈ పద్ధతినే అనుసరిస్తూ ప్రతీ తెలుగు సంవత్సర ఆరంభ దినం నాడు మనం ఉగాది పర్వదినం జరుపుకొనే ఆచారం ఏర్పడింది. 'యుగాది' అన్న సంస్కృత పదం ఉచ్చారణాభేదం వల్ల 'ఉగాది' అనే తెలుగు మాటగా ఏర్పడింది.

సృష్టి ప్రభవం అయిన ఈ మొదటి సంవత్సరం నుండి చరితార్థంగా 'ప్రభవ' అని నామకరణం చేశారు. అక్కడి నుంచి 'క్షయ' నామ సంవత్సరం క్రమంలో 60 నామాలతో సంవత్సర గమనం సాగుతుంది. కనుకనే మనం జన్మించిన మొదలు ఈ నామ చక్రం మనకు 60 సంవత్సరాల వయస్సుకు చేరినపుడు తిరిగి అదే సంవత్సరంతో పూర్తి అవుతుంది. అప్పుడు షష్టిపూర్తి జరుపుకొంటాం.

వేదాలను హరించిన సోమకుడు అనే రాక్షసుని వధించి శ్రీ మహావిష్ణువు తిరిగి పునరుద్ధరించిన రోజుగా కూడా ఉగాది ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నది. తెలుగు సంవత్సరం చైత్రం నుండి శిశిరం వరకు ఆరు ఋతువులుగా విభజితం అయింది. సంవత్సరం పొడవునా అనేక ఒడుదొడుకులు అనుభవించిన ప్రకృతిలోని చెట్లు శిశిర ఋతువులో ఆకులు రాల్చి జడత్వాన్ని పొందుతాయి. చైత్రమాసంలో క్రొత్త చిగుర్లు తొడిగి చైతన్యవంతంగా కనిపిస్తాయి. ఈ విధంగా ప్రకృతిలో సంభవించే నూతన వత్సరం చైత్రమాసం. అందుకే ఈ మాసారంభానికి ఉగాది అని పేరు వచ్చినదని కూడా చెప్పుకోవచ్చు.

ఉగాది పర్వదినాన 'అభ్యంగనం, పుణ్యకాల సంకల్పం, ఉగాది పచ్చడి సేవనం, ధర్మకుంభం, సృష్టి క్రమ వర్ణన, కల్పాది వైవస్వత మన్వంతర వివరాలతో కూడిన పంచాగ శ్రవణం' అనే ముఖ్యమైన విధులను అనుసరించాలని పెద్దల మాట!

ఉగాది పచ్చడి సేవనం

ఉగాది నాడు అత్యంత ముఖ్యమైన కార్యక్రమం ఉగాది పచ్చడి స్వీకరణ. దీనిని పరగడుపునే స్వీకరించాలి. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడికి ఎంతో ప్రాముఖ్యం ఉంది.

తీపి, వగరు, చేదు, కారం, పులుపు, ఉప్పు రుచులు కలసిన ఉగాది పచ్చడి మన సొంతం. ప్రతీ మనిషి తన జీవితంలో ఎదుర్కొనే వివిధ అనుభవాలకు ప్రతీకగా దీన్ని భావిస్తారు. ఈ పచ్చడి తయారు చేయడానికి చెరకు, మామిడికాయలు, వేప పువ్వు, అరటి పళ్ళు, లవణం, చింతపండు, బెల్లం, పచ్చి మిరప మొదలైనవి వాడతారు. మామిడి పూత, అశోక చిగురులు కలిపి సేవించే సంప్రదాయం మనకు ఇప్పటికీ కనిపిస్తూ ఉంటుంది.

అభ్యంగనం

సూర్యోదయానికి పూర్వమే నువ్వులనూనె తలకి పట్టించి ఉసిరిక, పెసరపిండి, ప్రానిపసుపు, బావంచాలు, కచ్చూరాలు మొదలైన వాటిని ఉపయోగించి శిరస్నానం కుంకుళ్ళతో చేయాలి. ఈ దినం వేడినీటి స్నానం శ్రేష్ఠం. అనంతరం తిలకం దిద్దుకుని, నూతన వస్త్రాలు ధరించి సంకల్పం చెప్పుకోవాలని 'ధర్మసింధువు' తెలియచేస్తోంది.

పుణ్యకాల సంకల్పం

సూర్యోదయానికి ఒక ముహూర్తకాలం (20 నిమిషాలు) మాత్రమే పాడ్యమి ఉన్నా సరే ఆ రోజునే పండుగ సందర్భ నూతన సంకల్పం చెప్పుకొని ప్రారంభించాలి. సూర్యునికి అర్ఘ్యం, దీపం, ధూపం, పుష్పాంజలి సమర్పించాలని శాస్త్ర వచనం.

ధర్మకుంభం

ఉగాది రోజు రానున్న రోజులలో పూర్ణ మనోరథసిద్ధి, సకల సౌభాగ్యాలు కలుగుతాయనే సంకల్ప బలంతో పంచలోహాల పాత్రగాని, మట్టి కుండగాని కలశంగా తీసుకుని సుగంధ జలం, చందనం, పుష్పాక్షతలు వేసి ఆవాహన చేసి, పుణ్యాహ మంత్రాలతో బియ్యం పోసిన ఒక పళ్ళెంలో కలశం ఉంచి నూతన వస్త్రం చుట్టి ఉపరిభాగాన నారికేళం పెట్టాలి. కుంకుమ, పసుపు చందనాలు సమర్పించి పురోహితునకు గానీ, గురువునకు గానీ, లేక గుడిలోని ఇష్ట దైవానికి గానీ దానమిచ్చి వారి ఆశీర్వాదం పొందాలి. దీనినే 'ధర్మఘట దానం' లేక 'ప్రపాదానం' అంటారు. ఈ విధి నేటికీ పల్లెలలో ఆచరిస్తున్నారు.

పంచాంగ శ్రవణం

మహాపర్వదినములైన కల్పాది తిథులు, మన్వంతర తిథులు, దశావతార పుణ్యతిథులు మొదలైన వాటిని పంచాంగంలోని తిథి, వార, నక్షత్ర, యోగ, కరణాలనే అయిదు అంగాల కలయికగా చూపిస్తారు. ఈ విధమైన పంచ అంగాల శ్రవణం వల్ల భవిష్యత్తులో మనకు రానున్న విశేషాలు, పండుగలు, గ్రహణాలు, వర్ష వివరాలు, కాల నిర్ణయాలు మొదలైనవి తెలుసుకోవడం జరుగుతుంది. ఇది ఉగాది రోజున విశేష విధిగా భావించాలి. కనుక హైందవ సాంప్రదాయములో పంచాంగ శ్రవణం ఉగాది తిథి రోజున ప్రాముఖ్యత సంతరించుకుంది.

తిథేశ్చ, శ్రియమాప్నోతి వారాధాయుష్య వర్ధనమ్
నక్షత్రాద్ధరతే పాపం, యోగాద్రోగ నివారణమ్
కరణాత్కార్య సిద్ధిస్తు, పంచాంగ ఫలముత్తమమ్
కాల విత్కర్మ కృద్ధీమాన్ దేవతానుగ్రహం భవేత్ !!

తిథి వల్ల సంపద, వారం వల్ల ఆయుష్శు, నక్షత్రం వల్ల పాపపరిహారం, యోగం వల్ల వ్యాధి నివృత్తి, కరణము వల్ల కార్యానుకూలత సిద్ధిస్తాయి. కాలం తెలిసి కర్మం చేసే ఆస్తికులు భగవత్ అనుగ్రహం పొంది సుఖం అనుభవిస్తారు. రామాయణాది పవిత్ర గ్రంథ పఠనం వల్ల వచ్చే విశేష ఫలం ఈ పంచాంగ శ్రవణం వల్ల కూడా పొందవచ్చు.

భూమి, స్వర్ణం, ఏనుగులు, గోవులు, సర్వ లక్షణయుక్తమైన కన్యను ఉత్తముడైన పాత్రునకు దానం చేస్తే కలిగినంత ఫలితంతో సమానం. శాస్త్రవిధిగా పంచాంగ శ్రవణం చేయడం వల్ల సూర్యుని ద్వారా శౌర్య తేజస్సులు, చంద్రుని ద్వారా భాగ్య వైభవాలు, కుజుని ద్వారా సర్వ మంగళాలు, బుధుని ద్వారా బుద్ధి వికాసము, గురుని ద్వారా గురుత్వం, జ్ఞానం, శుక్రుని ద్వారా సుఖం, శని దేవుని ద్వారా దుఃఖ రాహిత్యం, రాహువు ద్వారా ప్రాబల్యము, కేతువు ద్వారా తన వర్గంలో ప్రాముఖ్యత కలుగుతాయని శాస్త్ర వచనం.

● డాక్టర్ దేవులపల్లి పద్మజ

సందేశం


దేవుడు చూస్తున్నాడు!



ఒక మనిషి జీవితంలో అతని ఉత్తమ గుణాలు, నైతిక విలువలు గొప్ప నిధి కన్నా ఎంతో విలువైనవి. ఈ ఉత్తమ గుణాలు అతనిలో కేవలం దైవభీతితో మాత్రమే సాధ్యమవుతాయి. నేను చేస్తున్న ప్రతి పనినీ అల్లాహ్ చూస్తున్నాడు. ఒకరికి మంచి చేస్తే అల్లాహ్ ప్రసన్నుడవుతాడు, ఒకరికి చెడు చేస్తే అల్లాహ్ క్రోధుడవుతాడనే విశ్వాసం అతనిని మంచి దారి వైపు నడిపిస్తుంది. అల్లాహ్ 'దివ్య ఖుర్‌ఆన్'లో ఇలా తెలియపరిచారు: సత్కార్యం అంటే 'మనిషి అల్లాహ్‌నూ, అంతిమ దినాన్నీ, దూత లనూ, అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాన్నీ, ఆయన ప్రవక్తలనూ హృదయపూర్వకంగా విశ్వసించడం! ఇంకా అల్లాహ్‌పై ప్రేమతో తాము ఎక్కువగా ఇష్టపడే ధనాన్ని బంధువులు, అనాథలు, నిరుపేదలు, బాటసారులు, సహాయం కోసం అర్థించే వారి కోసం ఖర్చుచేయడం మంచిది. ఇంకా నమాజును స్థాపించేవారు, జకాత్ ఇచ్చేవారు, వాగ్దానం చేస్తే దానిని నిలబెట్టుకొనేవారు, సత్యానికీ, అసత్యానికీ సంఘర్షణ తలెత్తినప్పుడు ధైర్యం కోల్పోని సత్పురుషులు వాస్తవంగా సత్యసంధులు... అల్లాహ్ పట్ల భయభక్తులు కలిగిన వారు వీరే. (దివ్య ఖుర్‌ఆన్ 2:177). మీరు అమితంగా ప్రేమించే వస్తువులను అల్లాహ్ మార్గంలో ఖర్చుపెట్టనంత వరకు మీరు సత్కార్య స్థాయికి చేరుకోలేరు. మీరు ఖర్చు చేసేదంతా అల్లాహ్‌కు బాగా తెలుసు. (దివ్య ఖుర్‌ఆన్ 3:92)

ఇద్దరు వ్యక్తులు ఉన్నారు. వారిలో ఒకడు తన కట్టడాన్ని దైవభీతి, దైవప్రసన్నతలనే పునాదులపై నిర్మించాడు. రెండోవాడు తన కట్టడాన్ని నీటి ప్రవాహానికి లోతట్టు భాగం మట్టి కొట్టుకుపోయి డొల్లగా మారిన నదీతీరంపై నిర్మించాడు. ఆ తర్వాత అది కాస్త అతణ్ణి తీసుకొని, నేరుగా నరకాగ్నిలో పడిపోయింది. మరి ఆ ఇద్దరిలో ఎవరు శ్రేష్ఠులు? ఆలోచించండి! అలాంటి దుర్మార్గులకు అల్లాహ్ ఎన్నటికీ సన్మార్గం చూపడు. వారు నిర్మించిన ఈ పునాదులు లేని కట్టడం వారి హృదయాల్లో ఎల్లప్పుడూ అపనమ్మకాన్నే పెంచి పోషిస్తుంది. వారి హృదయాలు ముక్కలు ముక్కలుగా పగిలిపోతే తప్ప (ఈ అపనమ్మకపు రోగం వారిని వదిలిపెట్టదు)! అల్లాహ్ సర్వం తెలిసిన వాడు, వివేకవంతుడు (దివ్య ఖుర్‌ఆన్ 9-109-110).

● మహమ్మద్ వహీదుద్దీన్



MEGA POWERSTAR
MYTHRI MOVIE MAKERS
AUDIO RELEASED
PRE RELEASE EVENT
ON 18TH MARCH 2018
AT RK BEACH, VIZAG
రంగస్థలం
SUKUMAR



A.K.Entertainments India Pvt Ltd.
నేడే విడుదల
కిరాక్ పార్టీ
SCREENPLAY SUDHEER VARMA
DIALOGUES CHANDOO MONDETI



BLUE PLANET Entertainments
T G VISHWA PRASAD PRESENTS
people MEDIA FACTORY
AUDIO SUPERHIT
ADITYA MUSIC
MLA
KIRAN REDDY BHARATH CHOWDARY UPENDRA MADHAV
VIVEK KUCHIBHOTLA
Enjoy Full Songs on YouTube /adityamusic



సిద్ధి విఘ్నేశ్వర క్రియేషన్స్
SathishReddy & Mouryani
నెల్లూరి పెద్దారెడ్డి
FEEL GOOD MOVIE
నేడే విడుదల
madhura audio
నైజాం: శ్రీలక్ష్మి గాయత్రి ఫిలింమ్స్ - 9391176659, ఆంధ్రప్రదేశ్: SDM మేకర్స్ - 8185976768 వైజాగ్: వి.జె.ఆర్. మూవీస్ - 9010563355,
ఈస్ట్, వెస్ట్, కృష్ణా, గుంటూరు, నెల్లూరు: మీనా ఎంటర్‌ప్రైజెస్ - 8885747277,
అనంతపూర్, చిత్తూరు, కడప: విజయలక్ష్మి పిక్చర్స్ - 9908306257, కర్నూలు: మహేశ్వర్ రెడ్డి - 8341271808



SRI SURYA THEJA MOVIE
COMING SOON
రాణి చాణక్యదేవి
PRODUCER: VISWESWARA RAO.G STORY- SCREN PLAY - DIRECTION: CH.SHANKAR DORA
MUSIC: THRINAY CAMERA: ANAND EDITOR: SATHYA FIGHTS: DEVARAJ



NIRMANI FILMS
నేడే విడుదల
వాడేనా
MANILAL MACHHI & SON'S SAI SUNEEL NIMMALA
Nijam Peacock Movies 77991 72022, Ceeded Gayathri films 9985225439
Nellore Sri Lakshmi films 9573122277 Guntur Niharika films 7660950669
Vizag Janardhan films 9848281899 Krishna, East and West SDM Makers 8185976768, 8885747277



యుద్ధభూమి
1971 భారత సరిహద్దు
A.N.BALAJI MAJOR RAVI
1971 BEYOND BORDERS
ఈ నెల విడుదల



శ్రీ శ్రీరా రామలింగేశ్వర స్వామి ఆశీస్సులతో
SAI KRISHNA FILMS PRESENTS
SAI VADAPALLI VENKATESHWARA CREATIONS
జాతర కాత్త ముందే
మొదలయ్యింది సామీ...
గొంతులు తెగాల్సిందే...
రక్తం పారాల్సిందే...
దండుపాళ్యం 3
A FILM BY SRINIVAS RAJU
PRODUCER SRINIVAS MEESALA
CO-PRODUCER SAI KRISHNA PENDYALA
నేడే విడుదల


TRIDENT ARTS
NORTHSTAR ENTERTAINMENT PVT. LTD.
HIGHLY ACCLAIMED AWARD WINNING FILM
ఉగాది శుభాకాంక్షలతో నేడే విడుదల
LADY SUPERSTAR Nayanthara in
కర్తవ్యం
PRODUCERS
SHARRATH MARAR - R. RAVINDRAN
WRITTEN & DIRECTED BY
GOPI NAINAR
EXECUTIVE PRODUCER M.SRINIVASA RAO
PETER HEIN GHIBRAN RUBEN OMPRAKASH LALGUDI N ILAYARAJA GULABI SRINU
RAJESH M. MURTHY UMA DEVI RAVI RANGANATHAN RAJU RAJA KRISHNAN NAREN-MURTHY S. KALAI SELVAN PRO. SKN
SINDHU GRAFIX PAVAN KUMAR

రైల్వేజోన్‌పై కేంద్రం దొంగాట

▸▸ ఇంకా పరిశీలనలోనే ఉందన్న పీయుష్

▸▸ జోన్‌ను వ్యతిరేకించడం లేదన్న ఒడిసా

న్యూఢిల్లీ, మార్చి 15(ఆంధ్రజ్యోతి):విభజన చట్టంలోని హామీల అమలు, ప్రత్యేకహోదా సాధన కోసం ఏపీ ఎంపీలు, ప్రజలు పోరాటం చేస్తుంటే...మరోవైపు కేంద్ర ప్రభుత్వంలో ఎలాంటి కదలికా లేదు. పైగా రాష్ట్రానికి చెందిన అంశాలపై దాటవేత ధోరణి అవలంబిస్తున్న తీరు గురువారం మరోసారి బయటపడింది. రైల్వేజోన్‌పై ఒడిసా అభ్యంతరం వ్యక్తం చేస్తుందంటూ ఇన్నాళ్లూ కేంద్రం చెబుతున్న మాటలూ అబద్ధమని తేలాయి. టీడీపీ ఎంపీలకు అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా వైసీపీ ఎంపీ వరప్రసాద్‌తో రైల్వేమంత్రి మాట్లాడటం విమర్శలకు దారితీయడంతో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసిన కేంద్ర రైల్వే మంత్రి పీయుష్ గోయాల్ ఖండించే ప్రయత్నం చేశారు. అసలు టీడీపీ ఎంపీలు అపాయింట్‌మెంట్ కోరలేదని బుకాయించారు. రైల్వేజోన్‌పై స్పష్టత ఇచ్చేందుకూ పీయుష్ గోయల్ నిరాకరించారు. విలేకరులు ప్రశ్నలు వేస్తుంటే అర్ధాంతరంగా వెళ్లిపోయారు. జోన్ అంశాన్ని ఇంకా పరిశీలిస్తున్నామని నిబంధనల మేరకు నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఎప్పటిలోగా నిర్ణయం తీసుకుంటారో చెప్పలేకపోయారు. జోన్ ఏర్పాటుపై విభజన చట్టంలో కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదంటూ ఆ పార్టీపై నింద వేసేందుకు ప్రయత్నించారు. ఈ అంశంపై పార్లమెంట్‌లోనూ బయటా చాలాసార్లు చెప్పాను అని సమాధానం దాటవేశారు.

మేమెందుకు అడ్డుపడతాం: బీజేడీ ఎంపీలు

విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ఏర్పాటు చేసే అవకాశమే లేదని, ఈ విషయంపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని కేంద్రమంత్రి పీయుష్ గోయల్ తమకు స్పష్టం చేసినట్లు బీజేడీ ఎంపీలు వెల్లడించారు. ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్ కింద కొత్త డివిజన్లు ఏర్పాటు చేసే విషయంపై రెండురోజుల క్రితం మంత్రిని కలుసుకోవడానికి వెళ్లినప్పుడు విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు ప్రస్తావనకు వచ్చిందని బీజేడీ ఎంపీలు ప్రతాప్ కేసరీదేవ్, ఎన్.భాస్కర్‌రావు ఢిల్లీలో గురువారం విలేకరులకు తెలిపారు. ఒడిసా ప్రభుత్వానికి కానీ సీఎంకు కానీ విశాఖ రైల్వేజోన్ ఏర్పాటుపై వ్యతిరేకత, అభ్యంతరం లేదని పేర్కొన్నారు. ఒడిసా ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నామనడం రాజకీయ విన్యాసంగా ఆరోపించారు. తమతో అసలు చర్చలే ఆరంభించలేదని స్పష్టం చేశారు.

మెకాన్ నివేదిక అందాక స్టీల్ ఫ్యాక్టరీపై నిర్ణయం

కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటును సాధ్యం చేయడానికి మెకాన్ సంస్థ నివేదిక అందిన తర్వాత తుది నిర్ణయం తీసుకుంటామని కేంద్ర ఉక్కు శాఖ మంత్రి చౌదరి బీరేంద్ర సింగ్ స్పష్టం చేశారు. పార్లమెంటు భవనంలోని ఉపరాష్ట్రపతి కార్యాలయంలో వెంకయ్యనాయుడు సమక్షంలో చౌదరి బీరేంద్ర సింగ్‌తో ఏపీ బీజేపీ అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు గురువారం సమావేశమయ్యారు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై చర్చించారు. ఇప్పటికే ముసాయిదా తయారైందని, నివేదిక రూపొందించే ప్రక్రియ చివరి దశకు చేరుకుందని చెప్పారు. ఈ సందర్భంగా వెంకయ్య పలు సూచనలు, సలహాలు ఇచ్చినట్లు తెలిసింది. సమావేశంలో కేంద్ర ఉక్కు శాఖ కార్యదర్శి అరుణా శర్మ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మీ ఆటలు సాగవు!

(మొదటి పేజీ తరువాయి)

తప్పుపట్టారు. మోదీ ఇబ్బంది పెడితే నేను భయపడాలా? వేరే వాళ్లు రెచ్చగొడితే నేను భయపడి పిరికిపందలా ఉండాలా? అని ప్రశ్నించారు.

ఇప్పుడు ఎందుకు ఇవ్వరు?

"ఏపీకి పార్లమెంటు సాక్షిగా అన్యాయం, అవమానం జరిగిందని రాష్ట్రం, దేశం అంతా గగ్గోలు పెట్టింది. పురుడుపోసి తల్లిని చంపేశారని మీరన్నారు. ఇప్పుడు కేంద్ర ఆర్థిక మంత్రిగా ఉన్న జైట్లీ ఆ నాడు ప్రతిపక్ష హోదాలో మాట్లాడుతూ తాము వస్తే ప్రత్యేక హోదా పదేళ్లు ఇస్తామని చెప్పారు. ఇప్పుడేమైంది? ఎందుకివ్వడం లేదు? తల్లిని బతికించమనే అడుగుతున్నాను. ఇవన్నీ అడిగితే మాపై ఎదురు దాడి చేస్తారా?" అంటూ కేంద్రంపై చంద్రబాబు మండిపడ్డారు. "మాకు పార్లమెంటు సాక్షిగా అన్యాయం చేశారు. దాని సాక్షిగానే న్యాయం చేయాలి. లేదంటే... ఐదు కోట్ల మంది ఏపీ ప్రజలు చూస్తూ ఊరుకోరు" అని హెచ్చరించారు.

నాటకాలు నా దగ్గరా...

రాష్ట్రంలో ఉన్న కొందరితో రహస్య ఒప్పందాలు చేసుకుంటున్నారంటూ బీజేపీపై చంద్రబాబు విమర్శలు గుప్పించారు. వైసీపీని నమ్మితే భవిష్యత్తు అంధకార మవుతుందని... జీవితాలనే తాకట్టు పెడతారని తెలిపారు. "40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న నా దగ్గరే ఇలా చేస్తున్నారు. పోలవరంలో నాటకాలాడతారు. రేపు ఇంకా నాటకాలాడుతారు. ఇబ్బందులు పెడుతారు. అయినంత మాత్రాన భయపడతామా? ఆ అవసరమే లేదు. ఏం జరిగినా ప్రతీరోజూ ప్రజలకు తెలియజేస్తాను. మీలో చైతన్యం తీసుకొస్తాను. ఈ గడ్డపై పుట్టిన ప్రతీ ఒక్కరూ ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ఎవరైనా కేసులు, వ్యక్తిగత ప్రయోజనాలకోసం లాలూచీ పడితే మనం ఉపేక్షించవద్దు. వీళ్ల ఆటల సాగవు. సాగనివ్వను" అని తేల్చి చెప్పారు.


నన్ను బలహీనపరిస్తే ఏమొస్తుంది...

"ఈ క్లిష్ట సమయంలో మనకు చేసిన అన్యాయంపై కేంద్రాన్ని, నరేంద్రమోదీని నిలదీయాలి. హక్కులపై పోరాడాలి. కానీ జనసేన అధినేత ఏం చేస్తున్నారు? హక్కుల కోసం పోరాడుతున్న నన్ను బలహీనపరచాలని చూస్తారా? దానివల్ల నీకొచ్చే లాభం ఏమిటి? రాష్ట్ర ప్రయోజనాలకు ఒరిగే మేలు ఏమిటి?" అని పవన్ కల్యాణ్‌ను చంద్రబాబు ప్రశ్నించారు. నాలుగేళ్లు ఏమీ మాట్లాడకుండా... ఎప్పుడూ కనబడని అవినీతి, ఇతర విషయాలు ఇప్పుడే కనబడుతున్నాయా అని నిలదీశారు. ఇదేం చోద్యమని ప్రశ్నించారు.

రెచ్చగొడితే...మరింత రెచ్చిపోతాం...

హక్కుల సాధన కోసం ఎవ్వరికీ భయపడేది లేదని చంద్రబాబు తెలిపారు. ఎవరైనా తమపైకి రెచ్చగొట్టి పంపితే మరింత రెచ్చిపోతామే తప్ప భయపడేది లేదన్నారు. "నిజం నిప్పులాంటిది. దానితో చెలగాటం మంచిది కాదు. మీరు ఎంత రెచ్చగొడితే మేం అంత రెచ్చిపోతాం. వెనక్కు తగ్గేది లేదని ఎన్డీయే ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నా" అని సూటిగా చెప్పారు. "రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై చర్చ జరగాలి. గ్రామాల్లోని రచ్చబండలో, బస్సుల్లో ప్రతిచోటా దీనిపై మాట్లాడుకోవాలి. ఒకరు పది మందికి, ఆ పదిమంది వంద మందికి, వందమంది వెయ్యి మందికి... ఇలా మహోద్యమంలా నడవాలి" అని పిలుపునిచ్చారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన వారిని బుద్ధి చెప్పేదాకా ఇది ఆగదన్నారు. కేంద్రం తీరుపై నాలుగేళ్లు ఓపిక పట్టానని, రాష్ట్రానికి మొండిచేయి చూపించడంతో భరించలేకపోయానని తెలిపారు. "నాకు మోదీతో గొడవేముంది? నాకు పదవులు అవసరంలేదు. విమర్శించే వారందరికీ సమాధానం చెబుతాను. కానీ... నన్ను విమర్శిస్తూ రాష్ట్రానికి అన్యాయం చేసిన వారిని బలపరుస్తున్నారు. ఇదే సమస్య. మీకు రాజకీయ ప్రయోజనాలుంటే ఎన్నికల్లో తేల్చుకోండి. రాష్ట్రప్రయోజనాలతో రాజకీయాలు చేస్తే ప్రజలు ఉపేక్షించరు. ఇప్పటికే దగా పడ్డాం. ఆ కసి ప్రజల్లో ఉంది. అది ఇంకా చల్లారలేదు" అని తెలిపారు.





తమ్ముళ్లూ... చెప్పండి!

'తమ్ముళ్లూ చెప్పండి... నేను చేసింది కరెక్టేనా?' అంటూ చంద్రబాబు ప్రశ్న! 'ఔను.. కరెక్టే' అంటూ జనం సమాధానం! కేంద్రం, వైసీపీ, జనసేన అధిపతి పవన్ కల్యాణ్ తీరుపై విరుచుకుపడుతూ... అందుకు ప్రజామోదం కోరేందుకు చంద్రబాబు ప్రయత్నించారు. ప్రశ్నలు అడుగుతూ... వారి నుంచి సానుకూల సమాధానాలు రాబట్టారు. జనం కూడా ఉత్సాహంగా చేతులు ఎత్తుతూ చంద్రబాబుకు మద్దతు పలికారు. 'కేంద్ర మంత్రివర్గం నుంచి వైదొలిగాం. వెనక్కి వెళ్లాలా... ముందుకే వెళ్లాలా?' అని ప్రశ్నించారు. 'ముందుకే' అని జనం బదులిచ్చారు. 'బీజేపీ ఏమీ చేయలేక... నాపైకి ఇతరులను రెచ్చగొడుతోంది. నేను చేసింది తప్పా, కరెక్టా' అని మరోసారి ప్రశ్నించారు. 'కరెక్టే' అని సభికులు చేతులెత్తారు.

లాలూచీ పడితే గుణపాఠం తప్పదు

అంతకుముందు, తన నలభై ఏళ్ల రాజకీయ ప్రస్థానంపై అసెంబ్లీలో ప్రసంగించినప్పుడు కూడా చంద్రబాబు ఈ అంశాన్ని ప్రస్తావించారు. తాత్కాలిక రాజకీయాల కోసం ప్రజల మనోభావాలతో ఆడుకుంటే భవిష్యత్తులో కేంద్రం చాలా ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. "ఏ రాజకీయ పార్టీనైనా లాలూచీపడితే ప్రజలే గుణపాఠం చెప్తారని. ప్రజలు ఎంత ఎమోషనల్‌గా ఉంటారో అంత సెంటిమెంట్‌గా ఉంటారు. ఎవరెవరు ఎక్కడ లాలూచీ పడుతున్నారో చెప్పడానికి ఇది సమయం కాదు. త్వరలో అన్నీ చెబుతాను" అని తెలిపారు. మిత్రధర్మం ప్రకారమే నాలుగేళ్లపాటు కేంద్రంతో సయోధ్య ద్వారా రాష్ట్రానికి కావాల్సినవి సాధించుకునేందుకు ప్రయత్నించానని తెలిపారు. "నలభై ఏళ్లలో ఎన్నో రాజకీయాలు చూశాను. నాకు దేశం, రాష్ట్రం ముఖ్యం" అని కేంద్రాన్ని హెచ్చరించారు. తానూ మనిషేనని, యంత్రాన్ని కానని... కన్నీళ్లు వస్తాయని అన్నారు. ఎన్టీఆర్ తనకు మెంటార్ అయితే.... ప్రజలే హైకమాండ్ అన్నారు.

టీడీపీపై మహా కుట్ర

▸▸ ఇందులో కొందరు పెద్దలు.. స్థానికులు

▸▸ పవన్ కల్యాణ్ పావు కావడం దురదృష్టకరం

▸▸ ఎంపీలతో టెలికాన్ఫరెన్స్‌లో చంద్రబాబు వ్యాఖ్య

అమరావతి, మార్చి 15(ఆంధ్రజ్యోతి):తెలుగుదేశం పార్టీకి వ్యతిరేకంగా మహా కుట్ర జరుగుతోందని ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. గురువారం తమ పార్టీ ఎంపీలు, వ్యూహ కమిటీ సభ్యులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. 'టీడీపీని దెబ్బతీసే పథక రచనలో చాలామంది పెద్దలు ఉన్నారు. స్థానికంగా కూడా కొందరు భాగస్వాములు అయ్యారు. ఈ కుట్రలను ప్రజలు అర్థం చేసుకొంటారు. భాగస్వాములు ఎవరైనా వారిని తిరస్కరిస్తారు. ఎన్నో కుట్రలను టీడీపీ సమర్థంగా ఎదుర్కొని విజేతగా నిలిచింది. టీడీపీకి ప్రజలే రక్షణకవచం. పార్టీని, రాష్ట్రాన్ని వారే కాపాడుకొంటారు' అన్నారు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చేసిన ఆరోపణలు అర్థరహితమని, గతంలో వైసీపీ అధ్యక్షుడు జగన్ చేసిన పసలేని విమర్శలే ఇప్పుడు ఆయన చేస్తున్నారని అన్నారు. 'టీడీపీ పాలనలో రాష్ట్రం అవినీతిలో ప్రథమ స్థానంలో నిలిచిందని ఒక సంస్థ నివేదిక ఇచ్చిందని పవన్ ఆరోపించారు. ఆ నివేదిక టీడీపీకి ముందు కాంగ్రెస్ హయాంలోనిది. ఆ తర్వాత వచ్చిన అదే సంస్థ నివేదిక టీడీపీ హయాంలో అవినీతి గణనీయంగా తగ్గిందని పేర్కొంది. కానీ, జగన్ మీడియాలో వక్రీకరణలు వచ్చాయి. పాత నివేదిక పట్టుకొని అవినీతి పెరిగిందని అనడం హాస్యాస్పదం. టీడీపీ అధికారంలోకి వచ్చాక ఎర్ర చందనం స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపాం. స్మగ్లింగ్‌ను తగ్గించాం. ఎన్‌కౌంటర్లు కూడా జరగాయి. నాపై అనేకమంది మానవహక్కుల సంఘాలకు ఫిర్యాదులు పంపారు. నేను అమెరికా పర్యటనకు వెళ్లినప్పుడు ఇవే ఆరోపణలతో నన్ను అరెస్టు చేయాలని కూడా వైసీపీ నేతలు ఫిర్యాదులు చేశారు. అలాంటిది పవన్ కల్యాణ్ ఎర్రచందనంపై ఆరోపణలు చేయడం ఎవరి స్క్రిప్టో తెలుస్తోంది' అని ఆయన వ్యాఖ్యానించారు. పవన్ ఆరోపణలపై ఒక చానల్ అభిప్రాయం సేకరిస్తే అవి అవాస్తవాలని 82 శాతం చెప్పారని, కేవలం 18 శాతం మందే వాస్తవాలని చెప్పారని ఆయన తెలిపారు. ఫాతిమా కళాశాల విద్యార్థుల సమస్యలపై తాను అనేకసార్లు కేంద్రంతో మాట్లాడానని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సమావేశాలు కూడా నిర్వహించానని చంద్రబాబు గుర్తుచేశారు. 'లోకేశ్‌ను ఎప్పుడూ కలవలేదని శేఖర్‌రెడ్డే చెప్పారు. అతని వ్యాపారాలన్నీ తమిళనాడుకు చెందినవి. తమిళనాడు ప్రభుత్వ సిఫారసుతో ఆయన్ను టీటీడీ బోర్డు సభ్యునిగా పెట్టాం. ఐటీ దాడులు జరిగిన వెంటనే ఆ పదవి నుంచి తొలగించాం. ఆ ఉదంతంతో లోకేశ్‌కు ముడి పెట్టడం కుట్ర రాజకీయాలకు పరాకాష్ట. తెలుగుదేశం పార్టీని దెబ్బ తీయాలని మహా కుట్ర జరుగుతోంది. ఉన్నత విద్యాభ్యాసం చేసి.. వ్యాపారాన్ని, కుటుంబాన్ని వదులుకొని ప్రజాసేవకు సిద్ధపడ్డ యువకుడిపై ఇలాంటి ఆరోపణలు చేయడం దివాళాకోరుతనం. కొందరు పెద్దలు నిన్నటిదాకా జగన్, విజయసాయితో డ్రామాలు ఆడారు. అది వికటించేసరికి ఇప్పుడు ఈ కొత్త డ్రామాకు తెరలేపారు. తమిళనాడు తరహా నాటకాలు ఇక్కడ చెల్లుబాటు కావు. ఇక్కడి ప్రజలకు రాజకీయ చైతన్యం ఎక్కువ. ఈ నాటకాల స్క్రిప్టులు ఎక్కడి నుంచి వచ్చాయో అందరికీ తెలుసు. ఎంతకాలం ఈ నాటకాలు ఆడతారో ఆడనివ్వండి. చివరకు ప్రజలే తమ తీర్పు ఇస్తారు' అని ఆయన అన్నారు. కేంద్రంపై ఒత్తిడి పెంచాల్సిన కీలక సమయంలో తనకు సహకరించాల్సిందిపోయి తనపై దాడి చేయడం ఏమిటని చంద్రబాబు విస్మయం వ్యక్తం చేశారు. ఇటువంటి సమయంలో టీడీపీని బలహీనపరిస్తే వచ్చే ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. 'ఈ విమర్శల వల్ల రాష్ట్రానికి ఏమైనా ప్రయోజనం కలుగుతుందా? రాష్ట్రానికి న్యాయం చేయాలని నేను కోరితే వీరంతా నన్ను విమర్శించడం ఏమిటి? ఒక కుట్రలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు. అందులో భాగంగానే నాపైనా... లోకేశ్‌పైనా నిందలు వేస్తున్నారు. ఈ కుట్రలో పవన్ కల్యాణ్ పావు కావడం బాధాకరం. లాలూచీ రాజకీయాలకు పవన్ తోడ్పాటు ఇవ్వడం దురదృష్టకరం. మన లక్ష్యాన్ని మనవాళ్లే దెబ్బ తీస్తున్నారు. విమర్శలు ఉంటే ఎన్నికల సమయంలో చేయండి... ఇప్పుడుకాదు. నా చేతులను బలపర్చండి' అని చంద్రబాబు అన్నారు. పవన్‌పై వ్యక్తిగత విమర్శలు చేయవద్దని పార్టీ నేతలకు ఆయన సూచించారు. మన విమర్శలు హుందాగా ఉండాలని, ఆవేశకావేశాలకు లోనుకావద్దని చెప్పారు.

నేడు వైసీపీ అవిశ్వాసం!

మద్దతివ్వాలని పార్టీలకు జగన్ లేఖ

న్యూఢిల్లీ, మార్చి 15(ఆంధ్రజ్యోతి):కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు వైసీపీ సిద్ధమైంది. గురువారం ఉదయం 11 గంటలకు స్పీకర్ కార్యాలయంలో నోటీసు అందజేసింది. దీనిపై 16వ తేదీ వేయడం విశేషం. ప్రస్తుతం లోక్‌సభలో వైసీపీకి ఐదుగురు సభ్యులే ఉన్నారు. అవిశ్వాస తీర్మానంపై చర్చ జరగాలంటే 50 మంది సభ్యులు మద్దతు తప్పనిసరి. ఈ నేపథ్యంలో ఇతర పార్టీల మద్దతు కూడగట్టేందుకు వైసీపీ ఎంపీలు ఆయా కార్యాలయాలకు వెళ్లారు. వారి మద్దతు కోరుతూ..తమ అధ్యక్షుడు జగన్ రాసిన లేఖలను ఆయా పార్టీల లోక్‌సభాపక్ష నేతలకు అందించారు. మధ్యాహ్నం జరిగిన లోక్‌సభ సభావ్యవహారాల సలహా సంఘం(బీఏసీ) సమావేశంలో వైసీపీపీ నేత మేకపాటి రాజమోహన్‌రెడ్డి అవిశ్వాసం నోటీసును స్పీకరు దృష్టికి తీసుకొచ్చారు. ఆపై ఆయన మీడియాతో మాట్లాడుతూ..అవిశ్వాస తీర్మానం నోటీసుపై స్పీకర్ ఏ సమాధానమూ చెప్పలేదన్నారు. స్పీకర్ నిర్ణయమేంటో శుక్రవారం సభలో తెలుస్తుందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ఎన్డీయేతర పార్టీల మద్దతు కూడగట్టేందుకు జగన్ లేఖలు రాశారని తెలిపారు. వామపక్షాలు, ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీలు సభలో మద్దతు తెలిపేందుకు సుముఖత వ్యక్తం చేశారని చెప్పారు. అదే విధంగా కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, అన్నాడీఎంకే, ఎస్పీ, ఎన్సీపీ, ఆర్జేడీ, బీజేడీ తదితర పార్టీల నేతలకు లేఖలు ఇచ్చామన్నారు. వాటిపై తమ పార్టీ పెద్దలతో మాట్లాడి సమాధానమిస్తామని వారు వెల్లడించినట్లు చెప్పారు. రాష్ట్ర విభజన అప్రజాస్వామ్యంగా జరిగిందని, ఆ సమయంలో ఇచ్చిన హామీలు, చట్టం పేర్కొన్న అంశాల అమలు ఎన్డీఏ ప్రభుత్వం చేయకపోవడతో అవిశ్వాస తీర్మానం పెట్టాల్సి వచ్చిందని, మద్దతు తెలపాలని జగన్ తన లేఖలో కోరారన్నారు. టీఎంసీ తమకు మద్దతిచ్చే అవకాశాలున్నాయని మేకపాటి చెప్పారు. ఎన్డీయే పక్షాలను మద్దతు కోరకూడదని తొలుత నిర్ణయించినా రాష్ట్ర అవసరాల దృష్ట్యా టీడీపీ లోక్‌సభ పక్ష నేత తోట నరసింహాన్ని కలిసి మద్దతు కోరినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం వారు మద్దతు ఇవ్వాల్సి అవసరం కూడా ఉందన్నారు. పార్లమెంటు సమావేశాలు ప్రారంభం కాకముందే తాము కేంద్రంపై మార్చి 21న అవిశ్వాసం పెడతామని చెప్పామని, సభల్లో పార్టీల నిరసనల నేపథ్యంలో సమావేశాలు కుదించే అవకాశం కనబడుతున్నందున.. తామూ ముందుగానే నోటీసు ఇచ్చినట్లు వివరించారు. వైసీపీ ప్రత్యేకంగా ఏమీ అడగడం లేదని, విభజన సమయంలో చట్టంలో పేర్కొన్నవి, రాజ్యసభలో అప్పటి ప్రధాని ఇచ్చిన ప్రత్యేక హోదా హామీని అమలు చేయాలని మాత్రమే డిమాండ్ చేస్తోందన్నారు. అప్పటి నుంచి ఇప్పటి దాకా అదే రీతిలో పోరాటం చేస్తున్నామని, టీడీపీలా డిమాండ్లు మార్చలేదన్నారు.

మేమూ మద్దతిస్తాం

▸▸ చంద్రబాబు కీలక నిర్ణయం

అమరావతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి):కేంద్ర ప్రభుత్వంపై వైసీపీ ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వాలని తెలుగుదేశం పార్టీ నిర్ణయించింది. గురువారం అసెంబ్లీలో మంత్రులతో సమావేశమైన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. "రాష్ట్రానికి రావాల్సిన వాటిని సాధించేందుకు ఎవరు, ఎలాంటి పోరాటం చేసినా మద్దతు ఇద్దాం. అందులో భాగంగానే వైసీపీ అవిశ్వాస నోటీసుకూ మద్దతు పలుకుదాం" అని తీర్మానించారు. అయితే... విపక్ష వైసీపీకి మద్దతు ఇవ్వడమేమిటని కొందరు మంత్రులు ప్రశ్నించారు. "ఇక్కడ రాజకీయాలు ముఖ్యం కాదు. కేంద్రంపై ఒత్తిడి తేవడం కీలకం. ప్రతి అవకాశాన్నీ వినియోగించుకొందాం. మనం స్పష్టంగా ఉంటున్నాం. అందుకే మద్దతు ఇవ్వాలని అనుకొంటున్నాం" అని ముఖ్యమంత్రి చెప్పారు. టీడీపీనే అవిశ్వాసం నోటీసు ఇస్తే ఎలా ఉంటుందని కొందరు మంత్రులు అడిగారు. ఎన్డీయే కూటమి నుంచి అధికారికంగా బయటకు రాకుండా అవిశ్వాసం నోటీసు ఇవ్వడం సరికాదని, బయటకు వచ్చిన తర్వాత స్వేచ్ఛగా వ్యవహరించవచ్చని సీనియర్ మంత్రులు చెప్పారు. అసలు అవిశ్వాసం నోటీసును సభలో తీసుకుంటారా... దానికి మద్దతు సరిపోతుందా అన్నది చూడాల్సి ఉందని, పార్టీ తరపున మాత్రం మద్దతు పలుకుదామని నిర్ణయించారు. రాష్ట్రం నుంచి ఉన్న మొత్తం 25 మంది లోక్‌సభ సభ్యుల్లో వైసీపీకి ఐదుగురు ఎంపీలున్నారు. టీడీపీకి 17 మంది సభ్యులున్నారు. బీజేపీకి ఇద్దరు ఎంపీలు ఉన్నారు. అరకు ఎంపీ గీత మధ్యస్థంగా ఉంటున్నారు.



లోక్‌సభలో స్పీకర్ పోడియం దగ్గర టీడీపీ, ఇతర పార్టీల ఎంపీల ధర్నా



ఏపీ ఎంపీలను వారిస్తున్న రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్

సుజనా, అశోక్ ప్రసంగాలకు కాంగ్రెస్ అడ్డుపుల్ల

ఉభయ సభల్లో అరుపులు, నిరసనలు

▸▸ అసంపూర్తిగా సుజనా వ్యక్తిగత వివరణ

▸▸ కాంగ్రెస్ నిరసనల నడుమే అశోక్ ప్రసంగం

న్యూఢిల్లీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ, లోక్‌సభల్లో కేంద్ర మాజీ మంత్రులు అశోక్ గజపతిరాజు, సుజనా చౌదరి ప్రసంగాలను కాంగ్రెస్ పార్టీ అడ్డుకుంది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోవడం, విభజన హామీలను అమలు చేయనందుకు నిరసనగా వీరిద్దరూ కేబినెట్ నుంచి వైదొలగిన విషయం తెలిసిందే. తామెందుకు రాజీనామాలు చేసిందీ సభలో వ్యక్తిగత వివరణ ఇచ్చే హక్కు వారికి ఉంది. దానికి అనుగుణంగా గురువారం రాజ్యసభలో సుజనా ప్రసంగించారు. ఉదయం సభ ప్రారంభం కాగానే ఛైర్మన్ వెంకయ్యనాయుడు ఆయనకు మాట్లాడే అవకాశమిచ్చారు. కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు మద్దతుగా నిలిచి దేశ సేవ చేయడానికి సంపూర్ణ సహకారం అందించినందుకు ప్రధానమంత్రికి, మంత్రివర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై విశ్వాసంతో కేంద్ర మంత్రిగా అవకాశం ఇచ్చినందుకు పార్టీ అధ్యక్షుడు చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇచ్చే అంశంపై ప్రజల భావోద్వేగాలు తీవ్రస్థాయికి చేరాయని..ఆర్థిక హేతుబద్ధత కంటే సరైన భావోద్వేగాలే ముఖ్యమని గుర్తించాలని సూచించారు. 'విభజన బిల్లు ఆమోదం పొందిన తీరు అందరికీ తెలుసు. హడావుడిగా అన్యాయంగా, అశాస్త్రీయంగా విభజించారు' అని వ్యాఖ్యానించగానే.. కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం తెలిపారు. తమ స్థానాల్లో నిలబడి ప్రసంగానికి అంతరాయం కలిగించారు. ఆయన అలా అనరాదని కేవీపీ, ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని జైరాం రమేశ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన సమయంలో ఆస్తులు, అప్పుల అసమతుల్యత, సిబ్బంది, ఆర్థిక వనరుల పంపిణీ గురించి సభలో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ చేసిన వ్యాఖ్యలను గుర్తుచేస్తున్నానని అనగానే..ఛైర్మన్ ఆయన్ను నిలువరించారు. పత్రంలో ఉన్న వాక్యాలనే చదవాలని సూచించారు. అందులో లేనివి మాట్లాడితే రికార్డుల నుంచి తొలగిస్తానని ఛైర్మన్ హెచ్చరించారు. చివరకు కొంత భాగాన్ని రికార్డుల్లో నుంచి తొలగించారు కూడా. అదే సమయంలో కాంగ్రెస్ ఎంపీలు వెల్‌లోకి రావడంతో సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. కాంగ్రెస్ ఎంపీలు వెల్‌లోకి రావడంపై వెంకయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్నం రెండు గంటలకు సభ తిరిగి ప్రారంభమయ్యాక టీడీపీ సభ్యులు ఇతర పార్టీల ఎంపీలు వెల్‌లోకి రావడంతో సభను గంటపాటు వాయిదా వేశారు. మధ్యాహ్నం 3 గంటలకు తిరిగి మొదలయ్యాక.. సుజనా తన ప్రసంగాన్ని కొనసాగించబోగా..డిప్యూటీ ఛైర్మన్ పీజే కురియన్ అనుమతించలేదు. ఉదయం ప్రసంగం ఎందుకు అసంపూర్తిగా ఆగిపోయిందో తనకు తెలియదని, మరోసారి మాట్లాడాలనుకుంటే ఛైర్మన్‌ను కలవాలని సూచించారు. టీడీపీ ఎంపీలు వెల్‌లోకి రావడంతో శుక్రవారానికి వాయిదా వేశారు.

లోక్‌సభలో టీడీపీ ఎంపీల నిరసనల హోరు

ప్రత్యేక హోదా సాధనే ధ్యేయంగా టీడీపీ లోక్‌సభలో ఆందోళన కొనసాగిస్తోంది. వరుసగా తొమ్మిదోరోజూ లోక్‌సభ జరగకుండా స్తంభింపజేసింది. ఉదయం స్పీకర్ రాకముందే టీడీపీ ఎంపీలు తోట నరసింహం, అశోక్ గజపతిరాజు, మురళీమోహన్, అవంతి శ్రీనివాస్, నిమ్మల కిష్టప్ప, రవీంద్రబాబు, గల్లా జయదేవ్, మాగంటి బాబు, కొనకళ్ల నారాయణ, మాల్యాద్రి, కేశినేని నాని, రామ్మోహన్‌నాయుడు, శివప్రసాద్, జేసీ దివాకర్‌రెడ్డి ప్లకార్డులతో వెల్‌లోకి వచ్చారు. శివప్రసాద్ ముస్లిం వేషధారణలో లోక్‌సభకు వచ్చారు. స్పీకర్ సభాకార్యక్రమాలు ప్రారంభించేందుకు సిద్ధమవుతుండగా ఎంపీలు ఏపీని ఆదుకోవాలంటూ నినాదాలిచ్చారు. వైసీపీ ఎంపీలు పోడియం చుట్టూ చేరి నిరసన తెలిపారు. రెండు పార్టీలకు సంబంధం లేకుండా బుట్టా రేణుక విడిగా ఆందోళనకు దిగారు. సభ మొత్తం గందరగోళంగా మారడంతో స్పీకర్ మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. తిరిగి మొదలయ్యాక అశోక్ గజపతిరాజుకు మాట్లాడేందుకు అవకాశం ఇచ్చారు. టీడీపీ, అన్నాడీఎంకే, తృణమూల్, టీఆర్ఎస్, వైసీపీ ఎంపీలు ఆందోళన చేయకుండా నిశ్శబ్దంగా వెల్‌లో నిలబడ్డారు. కాంగ్రెస్ సభ్యులు మాత్రం ఆయన ప్రసంగాన్ని అడ్డుకోవాలని చూశారు. పెద్దఎత్తున నినాదాలు చేశారు. గందరగోళం నడుమే అశోక్ ప్రసంగాన్ని ముగించారు.



ఉన్నత వ్యక్తుల హామీలు అమలు కావా?

▸▸ లోక్‌సభలో అశోక్‌గజపతి రాజు ప్రసంగం

న్యూఢిల్లీ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఉన్నత స్థాయి వ్యక్తులు సర్వోన్నత సభలో ఇచ్చిన హామీలను కూడా అమలుచేయకపోవడం ప్రజలకు ఆందోళన కలిగిస్తుందని టీడీపీ ఎంపీ అశోక్‌గజపతి రాజు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేసిన కారణాలను ఆయన గురువారం లోక్‌సభలో వివరించారు. 'అశాస్త్రీయ పద్ధతిలో విభజించిన తరువాత ఏపీ తీవ్ర కష్టనష్టాలకు లోనైంది. సంస్థలు, మౌలిక సదుపాయాలు, రాజధాని లేకపోగా కరువులు, తుఫాన్లు రాష్ట్రాన్ని పట్టిపీడించాయి. దీనివల్ల అతి తక్కువ తలసరి ఆదాయం గల రాష్ట్రంగా మారింది. విభజన జరిగిన పద్ధతి ప్రపంచంలో ఏ ప్రజాస్వామ్య దేశంలో చేయని విధంగా తీవ్ర ఒత్తిడికి గురిచేసింది. ఆ సమయంలో అందరి ఆందోళనలను పరిష్కరించే దిశగా విస్తృత చర్చలు జరగలేదు' అని తెలిపారు. స్వర్గీయ ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీకి జాతీయ దృక్పథం ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వాలకు ప్రత్యామ్నాయంగా కూటములు ఏర్పరిచిన ఘనత టీడీపీకే ఉన్నదని చెప్పారు. వివిధ రాజకీయ సిద్ధాంతాలున్నవారిని ఒకే వేదికపైకి తేవడం అంత సులభం కాదని, అయినా ఆ ప్రయత్నం సాగితీరుతుందని వ్యాఖ్యానించారు. దేశానికి కేంద్ర మంత్రి స్థాయిలో సేవ చేసే అవకాశం కొద్ది మందికే లభిస్తుందన్నారు. పౌర విమాన రంగాన్ని ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగంగా తీర్చిదిద్దడంలో తన సహచరులతో సమష్టిగా పనిచేసే అదృష్టం తనకు లభించిందంటూ అశోక్ ముగించారు.





అవిశ్వాస తీర్మానానికి మద్దతు తెలపాలని కాంగ్రెస్ పక్ష నేత ఖర్గే, టీడీపీ లోక్‌సభాపక్ష నేత తోట నరసింహంను కోరుతున్న వైసీపీ ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, మేకపాటి

భారత్‌లో జిఎస్‌టి.. గజిబిజి గందరగోళం: ప్రపంచబ్యాంక్

న్యూఢిల్లీ: భారత్‌లో జిఎస్‌టి అమలు అత్యంత సంక్లిష్టంగా ఉందని వరల్డ్ బ్యాంక్ నివేదిక పేర్కొంది. అంతేకాదు, ప్రపంచంలో 115 దేశాలు ఇదే తరహా పరోక్ష పన్నుల విధానాన్ని అవలంభిస్తుండగా.. అధిక మొత్తంలో జిఎస్‌టి వసూలు చేస్తున్న దేశాల్లో ఇండియా రెండో స్థానంలో ఉందని అంటోంది. దేశ వ్యాప్తంగా ఏకరీతి పరోక్ష పన్నుల విధానాన్ని అమలు చేసేందుకు రూపొందించిన జిఎస్‌టి జూలై 1 నుంచి అమలులోకి వచ్చింది. భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చాక పన్ను చట్టాల్లో ఇదే అతిపెద్ద సంస్కరణ. జిఎస్‌టిలో పన్ను విధింపును ఐదు శ్లాబులు (0, 5, 12, 18, 28 శాతాలు)గా విభజించారు. పైగా కొన్ని విక్రయాలపై పన్ను మినహాయింపునివ్వడంతోపాటు ఎక్స్‌పోర్టర్లతో పలు వ్యాపారాలకు ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ సౌకర్యం కల్పించారు.

పారిపోతారు.. పారా హుషార్

91 మంది డిఫాల్టర్ల జాబితా.. విదేశాలకు ఉడాయించకుండా చర్యలు

న్యూఢిల్లీ : భారీ ఎత్తున బ్యాంకుల నుంచి అప్పులు తీసుకోవడం, ఎగవేయడం, విదేశాలకు పరారు కావడం.. ఈ షరామామూలు వ్యవహారానికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. బ్యాంకు రుణాలను ఉద్దేశ్యపూర్వకంగా ఎగవేసిన జాబితాలో ఉన్న 91 మందితో ఒక జాబితాను తయారు చేసి వారు దేశం విడిచి పారిపోకుండా చర్యలకు ఉపక్రమించింది. రుణాలు తీర్చగలిగే సత్తా ఉన్నప్పటికీ తీర్చకుండా ఎగవేస్తున్న సంస్థలను విల్‌ఫుల్ డిఫాల్టర్ (ఉద్దేశ్యపూర్వక ఎగవేతదారు)గా పరిగణిస్తారు. ఈ జాబితాలో దాదాపు 400 కంపెనీలున్నాయి. ఈ కంపెనీల ప్రమోటర్లు, డైరెక్టర్లతోనే ప్రభుత్వం ఇప్పుడు ప్రత్యేక జాబితా తయారు చేసింది. కంపెనీల రుణాలకు వీరు గ్యారంటీగా ఉన్నారు. నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీల పరారీ అంతకుముందు విజయ్ మాల్యా పరారీతో ప్రభుత్వం పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తోంది. ప్రభుత్వం కనుసన్నల్లోనే ఎగవేతదారులు దేశం విడిచి పారిపోతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం డిఫాల్టర్ల విషయంలో కఠిన చర్యలకు ఉపక్రమించింది.

నీరవ్ మోదీ కేసు దరిమిలా ప్రభుత్వం ఆదేశాల మేరకు 50 కోట్ల రూపాయల పైబడిన బకాయిలున్న సంస్థల ప్రమోటర్లు, డైరెక్టర్ల పాస్‌పోర్ట్ వివరాలను సేకరించాలని బ్యాంకులను ప్రభుత్వం ఆదేశించింది. దేశం విడిచి పారిపోతే సదరు వ్యక్తుల ఆస్తులను ప్రభుత్వం జప్తు చేసుకునేందుకు వీలుగా చట్టాన్ని కూడా తెచ్చారు.

దేశదేశాల్లో..

భారీ ఎత్తున బ్యాంకులను ముంచి విదేశాలకు పరారైన వాళ్లు లండన్ నుంచి సెయింట్ కీట్స్ వరకు వేరు వేరు దేశాల్లో ఉన్నారు. వీళ్లను స్వదేశానికి రప్పించడానికి లీగల్ మార్గాల్లో ప్రభుత్వం ఏళ్లగా ప్రయత్నాలు చేస్తోంది. చట్టం నుంచి తప్పించుకున్న దాదాపు 31 మంది బడాచోరులను దేశానికి రప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టుగా ప్రభుత్వం బుధవారం నాడు పార్లమెంట్‌లో స్వయంగా చెప్పింది. నేరాలకు పాల్పడినవాళ్లను దేశం విడిచి పారిపోకుండా చర్యలు తీసుకోవడం చాలా అవసరం.

పారిపోయిన తర్వాత మళ్లీ దేశానికి రప్పించాలంటే అంతర్జాతీయ చట్టాల ప్రకారం పెద్ద తతంగమే ఉంటుంది. వారు నేరం చేసినట్టుగా నిర్ద్వంద్వంగా ప్రభుత్వం రుజువు చేయాల్సి ఉంటుంది. సాక్ష్యాలను సమర్పించాల్సి ఉంటుంది.

ఆర్‌పి ఇన్ఫో డైరెక్టర్ల అరెస్ట్

బ్యాంకులను 515 కోట్ల రూపాయల మేర వంచించిన కేసులో ఆర్‌పి సిస్టమ్స్ డైరెక్టర్లను సిబిఐ అధికారులు అరెస్ట్ చేశారు. కోల్‌కతా కేంద్రంగా ఉన్న ఈ కంపెనీపై కెనరా బ్యాంక్ కేసులు నమోదు చేసింది. డైరెక్టర్లు శివాజీ పంజా, కౌస్తవ్ రాయ్‌ని అదుపులోకి తీసుకున్నట్టు సిబిఐ వెల్లడించింది.

పిఎన్‌బి బ్రాడీహౌజ్‌లో మరో కేసు

నీరవ్ మోదీ స్కామ్‌లో కేంద్ర బిందువుగా ఉన్న పిఎన్‌బి బ్రాడీహౌజ్ శాఖలో మరో ఎల్‌ఒయు కుంభకోణం బయటపడింది. చంద్రి పేపర్స్ అనే సంస్థకు 9 కోట్ల రూపాయల విలువైన ఎల్‌ఒయులను అక్రమంగా జారీ చేసినట్టుగా సిబిఐ దర్యాప్తులో వెల్లడైంది. ఈ తొమ్మిది కోట్ల రూపాయల ఎల్‌ఒయు స్కామ్‌లోనూ గోకుల్‌నాథ్ శెట్టి, మనోజ్ కారత్ నిందితులుగా ఉన్నారు. వీరిద్దరే నీరవ్ మోదీ 13,000 కోట్ల రూపాయల స్కామ్‌లోనూ సూత్రధారులుగా ఉన్న విషయం తెలిసిందే. ఈ కేసులో చంద్రిక పేపర్స్ అండ్ అల్లాయిడ్ ప్రొడక్ట్స్, దాని డైరెక్టర్లు ఆదిత్య రాశి వసియా, ఈశ్వర్ దాస్ అగర్వాల్ కూడా నిందితులుగా ఉన్నారు.



ఎగుమతులు ఓకే!

▸ ఫిబ్రవరిలో 4.5 శాతం వృద్ధి .. వాణిజ్య లోటు తగ్గుముఖం



న్యూఢిల్లీ: భారత ఎగుమతి వాణిజ్యం వృద్ధి బాటలో పయనిస్తోంది. గత నెలకు దేశ ఎగుమతుల విలువ 4.5 శాతం పెరిగి 2,580 కోట్ల డాలర్లకు చేరుకున్నాయని కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి రీటా టియోటియా తెలిపారు. ఫిబ్రవరిలో భారత్‌లోకి దిగుమతైన వస్తు, సేవల విలువ కూడా 10.4 శాతం పెరిగి 3,780 కోట్లుగా నమోదైంది. దాంతో వాణిజ్య లోటు (ఎగుమతుల ఆదాయం కంటే దిగుమతుల చెల్లింపులు అధికంగా ఉండటం) 1,200 కోట్ల డాలర్లకు పరిమితమైంది. జనవరిలో 1,630 కోట్ల డాలర్లతో పోలిస్తే లోటు భారీగా తగ్గిందనే చెప్పుకోవచ్చు. పెట్రోలియం, రసాయనాలు, వెండి, ముత్యాలు, మెషీన్ టూల్స్ దిగుమతులు భారీగా పెరగడంతో జనవరిలో వాణిజ్య లోటు 56 నెలల గరిష్ఠ స్థాయిని తాకింది.

గత కొన్ని నెలలుగా దేశ ఎగుమతి వాణిజ్యం సానుకూల వృద్ధిని కనబరుస్తోందని రీటా ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గడిచిన 11 నెలల కాలానికి (ఏప్రిల్ 2017- ఫిబ్రవరి 2018) ఎగుమతులు 11 శాతం వృద్ధి చెంది 27,370 కోట్ల డాలర్లకు చేరుకోగా.. దిగుమతులు 21 శాతం పెరిగి 41,687 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. గత నెలలో చమురు దిగుమతులు 32 శాతం పెరుగుదలను నమోదు చేసుకున్నాయి. ఇక ఎగుమతుల విషయానికొస్తే.. రసాయనాలు, ఇంజినీరింగ్, పెట్రోలియం ఉత్పత్తుల రంగాలు మెరుగైన వృద్ధిని సాధించాయి.



'బిగ్ సి'లో సామ్‌సంగ్ ఎస్ 9, ఎస్9 ప్లస్

▸ విడుదల చేసిన సమంత, బాలు చౌదరి

హైదరాబాద్ : సామ్‌సంగ్ ఎస్9, ఎస్9 ప్లస్ స్మార్ట్‌ఫోన్లను హైదరాబాద్.. కూకట్‌పల్లి బాలాజీ నగర్ బిగ్ సి షోరూమ్‌లో టాలీవుడ్ నటి సమంత, బిగ్ సి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ యం బాలు చౌదరి, సామ్‌సంగ్ వైస్ ప్రెసిడెంట్ ఉదయ్ భట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా బాలు చౌదరి మాట్లాడుతూ.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మార్కెట్లోకి సామ్‌సంగ్ సరికొత్త స్మార్ట్‌ఫోన్లయిన ఎస్9, ఎస్ 9 ప్లస్‌లను బిగ్ సి ద్వారానే విడుదల చేయటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ స్మార్ట్‌ఫోన్ల కొనుగోళ్లపై హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లేదా పేటీఎం మాల్ ద్వారా రూ.6,000 క్యాష్‌బ్యాక్ అందిస్తున్నట్లు చెప్పారు. అంతేకాకుండా ఇఎంఐతో ఎస్9, ఎస్9 ప్లస్‌లను కొనుగోలు చేయవచ్చని పేర్కొన్నారు. భారత మార్కెట్ కోసం ఈ స్మార్ట్‌ఫోన్లను ప్రత్యేకంగా రూపొందించినట్లు సామ్‌సంగ్ వైస్ ప్రెసిడెంట్ ఉదయ్ భట్ తెలిపారు. ఈ స్మార్ట్‌ఫోన్ల ధరలు రూ. 57,900 నుంచి రూ. 72,900 మధ్య ఉన్నాయని తెలిపారు.

రొయ్యల దాణాలో అత్యంత విలువైన బ్రాండ్‌గా వాటర్‌బేస్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : ఆంధ్రప్రదేశ్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ది వాటర్‌బేస్ లిమిటెడ్.. రొయ్యల దాణా విభాగంలో ఆసియాలోనే అత్యంత విలువైన వ్యాపార బ్రాండ్ అవార్డును గెలుచుకుంది. సింగపూర్‌లో జరిగిన ఆసియన్ బ్రాండ్ అండ్ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ది వాటర్‌బేస్ లిమిటెడ్ సిఇఒ రమాకాంత్ వి ఆకుల ఈ అవార్డును అందుకున్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఈ అవార్డును అందుకోవటంతో కంపెనీ మరో మైలురాయిని చేరుకుందని ఈ సందర్భంగా రమాకాంత్ అన్నారు.

సన్ మొబిలిటీతో ఎపిఇడిబి ఒప్పందం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : సన్ మొబిలిటీతో ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఎపిఇడిబి) అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందంలో భాగంగా సన్ మొబిలిటీ.. ఎలక్ట్రిక్ వాహనాల (ఇవి) చార్జింగ్ సదుపాయాలతో పాటు అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయనుంది. స్మార్ట్ బ్యాటరీస్ పేరుతో సొంతంగా ఎలక్ట్రిక్ బ్యాటరీలను ఉత్పత్తి చేయటమే కాకుండా తొలుత పైలెట్ ప్రాజెక్ట్ ప్రాతిపదికన విశాఖపట్నంలో ఈ సేవలను ప్రారంభించనున్నట్లు సన్ మొబిలిటీ తెలిపింది. ఆ తర్వాత వచ్చే మూడు నుంచి ఐదేళ్ల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా ఈ సర్వీసులను అందుబాటులోకి తీసుకురానున్నట్లు కంపెనీ వెల్లడించింది.

భారత్ ఎగుమతి సబ్సిడీలపై అమెరికా కొర్రీలు

▸ డబ్ల్యుటిఒకు ట్రంప్ సర్కారు ఫిర్యాదు



వాషింగ్టన్ : ఎగుమతులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను అమెరికా అడ్డుకోవాలని చూస్తోంది. భారత ఎగుమతి సబ్సిడీ పథకాలను ట్రంప్ ప్రభుత్వం ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) వద్ద సవాలు చేసింది. భారత ప్రభుత్వం కల్పిస్తున్న అర డజను సబ్సిడీ ప్రోత్సాహక పథకాల ప్రయోజనాలతో ఎగుమతిదారులు తమ ఉత్పత్తులు, సేవలను చౌకగా అమెరికా మార్కెట్లో విక్రయించగలుగుతున్నారని యుఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ (యుఎస్‌టిఆర్) రాబర్ట్ లైట్‌హైజర్ ఆరోపించారు. ఈ పరిణామం అమెరికా కార్మికులు, తయారీదారులకు హాని చేస్తోందని ఆయన అన్నారు. డబ్ల్యుటిఒతో పాటు అందుబాటులో ఉన్న అన్ని మార్గాల్లో పరస్పర సహకారం ద్వారా వాణిజ్యాన్ని ప్రోత్సహించడంలో అమెరికా హక్కులను అమలు చేసే విషయంలో భాగస్వామ్య దేశాలు కూడా జవాబుదారీగా ఉండాలని అమెరికా కోరుకుంటోందని ఆయన పేర్కొన్నారు. భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విజయ్ గోఖలే తొలిసారిగా అమెరికాలో పర్యటించనున్న నేపథ్యంలో లైట్‌హైజర్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. అమెరికా పర్యటనలో భాగంగా గోఖలే యుఎస్‌టిఆర్‌తోనూ భేటీ కానున్నారు.

ఏటా 700 కోట్ల డాలర్ల ప్రయోజనాలు

స్టీల్, ఫార్మా, రసాయనాలు, ఐటి, టెక్స్‌టైల్స్, రెడీమేడ్ దుస్తులతోపాటు పలు రంగాలకు చెందిన ఎగుమతిదారులకు భారత ప్రభుత్వం పలు సుంకాలు, పన్నులు, రుసుముల నుంచి మినహాయింపు కల్పిస్తోందని రాబర్ట్ ఆరోపించారు. ఏటా ఇండియన్ కంపెనీలు సబ్సిడీ పథకాల ద్వారా ఏటా 700 కోట్ల డాలర్ల మేర ప్రయోజనాలు పొందుతున్నాయని, దాంతో వారికి పోటీలో అనుచిత స్థాయిలో లాభం చేకూరుతోందని అంటోంది. గత ఆర్థిక సంవత్సరం (2016-17)లో అమెరికాకు భారత్ 4,221 కోట్ల డాలర్ల విలువైన వస్తు, సేవలను ఎగుమతి చేసింది. అదే సమయంలో అమెరికా నుంచి భారత్‌కు దిగుమతులు 2,230 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి.

అమెరికాతో చర్చిస్తాం: రీటా

ఎగుమతిదారులకు సబ్సిడీ ప్రయోజనాల విషయంలో అమెరికాతో చర్చించి, వాటి ఆవశ్యకతను వివరిస్తామని కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి రీటా టియోటియా అన్నారు. ఈ విషయంలో డబ్ల్యుటిఒలోని వివాద పరిష్కార వ్యవస్థ ద్వారా భారత్‌తో అమెరికా సంప్రదింపులు కోరుతోందన్నారు. భారత్ కూడా అమెరికాతో సమగ్రంగా సంప్రదింపులు జరుపుతామని, మన పరిస్థితిని వివరిస్తామన్నారు. భారత్‌తో వివాదం పరిష్కారం విషయంలో అమెరికా కూడా సానుకూల వైఖరితోనే ఉందని భావిస్తున్నామని రీటా పేర్కొన్నారు. భారత్ వరుసగా మూడేళ్లపాటు గరిష్ఠ పరిమితికి మించి ఎగుమతి సబ్సిడీలు కల్పిస్తూ వచ్చిందని, ఇక ప్రోత్సాహకాలిచ్చేందుకు అర్హత కోల్పోయిందంటూ అభివృద్ధి చెందిన దేశాలు పలు వేదికలపై ఈ విషయాన్ని లేవనెత్తాయి.

ఆందోళనలో ఎగుమతిదారులు

ప్రభుత్వం కల్పిస్తున్న సబ్సిడీలను అమెరికా ప్రభుత్వం డబ్ల్యుటిఒలో సవాలు చేయడంతో భారత ఎగుమతిదారుల్లో ఆందోళన మొదలైంది. కేంద్రం ఈ సబ్సిడీలను క్రమంగా ఉపసంహరించుకోవాలని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్ఐఇఒ) డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ అభిప్రాయపడ్డారు. మన ఎగుమతిదారులకు అమెరికా అతిపెద్ద మార్కెట్ అని, దేశ ఎగుమతుల్లో యుఎస్ మార్కెట్ వాటా 14 శాతంగా ఉందన్నారు.

చైనాపై మరిన్ని చర్యలు

చైనా నుంచి దిగుమతులను అడ్డుకునేందుకు ట్రంప్ సర్కారు మరిన్ని చర్యలు చేపట్టే అవకాశం ఉంది. చౌకగా దిగుమతవుతున్న వస్తువుల కారణంగా అమెరికా వ్యాపారాలు కుదేలవుతున్నాయని శ్వేత సౌధం (వైట్ హౌజ్) పేర్కొంది. చైనాతో అమెరికా వాణిజ్య లోటు 50 వేల కోట్ల డాలర్ల స్థాయిలో ఉంది.

పిఎన్‌బి ఎల్‌ఒయులు మినహా అన్నీ సక్రమమే : ఎస్‌బిఐ

న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) కుంభకోణం నేపథ్యంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు (పిఎస్‌బి) తమ లెటర్ ఆఫ్ అండర్ టేకింగ్స్ (ఎల్‌ఒయు)ను కూలంకషంగా పరిశీలించుకుంటున్నాయి. ఇప్పటి వరకు జరిగిన ఈ పరిశీలనలో ఒక్క పిఎన్‌బి జారీ చేసిన ఎల్‌ఒయులు తప్ప, మిగతా పిఎస్‌బిలు జారీ చేసిన ఎల్‌ఒయులన్నీ సక్రమంగానే ఉన్నట్టు తేలినట్టు ఎస్‌బిఐ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. కొంత మంది పిఎన్‌బి అధికారులు, సిబ్బందితో కుమ్మక్కవడం ద్వారా వజ్రాల వ్యాపారులు నీరవ్ మోదీ, గీతాంజలి గ్రూప్ కంపెనీల అధినేత మెహుల్ చోక్సీ నకిలీ ఎల్‌ఒయుల ద్వారా పిఎన్‌బిని రూ.12,968 కోట్ల మేరకు ముంచిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మిగతా పిఎస్‌బిలన్నీ తమ శాఖల ద్వారా జారీ చేసిన ఎల్‌ఒయుల సాధికారితను క్షుణ్ణంగా పరిశీలించుకున్నాయి. దీంతో దీనిపై చర్చించేందుకు అన్ని పిఎస్‌బిల చీఫ్ టెక్నికల్ అధికారులు (సిటిఒ), చీఫ్ రిస్క్ అధికారుల (సిఆర్ఒ)తో ఎస్‌బిఐ గురువారం ఒక సమావేశం నిర్వహించింది. ప్రతి బ్యాంక్ ఇప్పటి వరకు జారీ చేసిన తమ ఎల్‌ఒయులు, లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌ఒసి)ల ఆధారిత లావాదేవీలను క్షుణ్ణంగా పరిశీలించాయి. అన్నీ సక్రమంగానే ఉన్నట్టు తేలిందని ఎస్‌బిఐ డిప్యూటీ ఎండి ఎంఎస్ శాస్త్రి చెప్పారు. స్విఫ్ట్ మెసేజ్‌లు, స్విఫ్ట్-కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్స్ అనుసంధానం విషయంలో మరిన్ని భద్రతా చర్యలు తీసుకోవాలని కూడా ఈ సమావేశంలో పిఎస్‌బిలు నిర్ణయించాయి. ఆర్‌బిఐ ఎల్‌ఒయుల జారీనే రద్దు చేసిన నేపథ్యంలో పిఎస్‌బిలు ఈ సమావేశం ఏర్పాటు చేయడం విశేషం.

ఆంధ్రప్రదేశ్‌తో బెల్‌ఫ్రిక్స్ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో బ్లాక్‌చెయిన్ డెవలప్‌మెంట్ స్టార్టప్ బెల్‌ఫ్రిక్స్ గ్లోబల్ అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. భారత్‌లో ఫిన్‌టెక్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్‌కు ఈ ఒప్పందం దోహదపడుతుందని బెల్‌ఫ్రిక్స్ తెలిపింది. ఒప్పందంలో భాగంగా ప్రభుత్వానికి సంబంధించి రోజువారీ కార్యకలాపాలను మరింత సులభతరం చేసేందుకు బ్లాక్‌చెయిన్ ఆధారిత సొల్యూషన్లను బెల్‌ఫ్రిక్స్ అభివృద్ధి చేయనుంది. భారత మార్కెట్ కోసం బ్లాక్‌చెయిన్ సొల్యూషన్స్‌ను అభివృద్ధి చేయటంలో ఉన్న సామర్థ్యాలకు ఈ ఒప్పందం ఒక నిదర్శనమని సంస్థ ఫౌండర్, సిఇఒ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఇదే తరహా సొల్యూషన్ల అభివృద్ధి కోసం బ్యాంకింగ్ సంస్థలు, విద్యా సంస్థలతో కూడా జట్టు కట్టినట్లు చెప్పారు.

భూముల ధరలు తగ్గాలి..

▸ అమెరికా స్థాయిలో 'బెజవాడ' ధరలు

▸ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు

న్యూఢిల్లీ : దేశీయ రియల్ ఎస్టేట్ మార్కెట్ క్రమంగా గాడిన పడుతోందని ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు చెప్పారు. అయితే దేశంలోని చిన్న చిన్న నగరాల్లో ఇళ్ల స్థలాల ధరలు కొండెక్కడంపై ఆందోళన వ్యక్తం చేశారు. విజయవాడ ఇళ్ల స్థలాల ధరలు అమెరికాలోని వాషింగ్టన్, న్యూయార్క్ నగరాల స్థాయిలో ఉండడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. క్రెడాయ్ వార్షిక సదస్సులో ఉపరాష్ట్రపతి ఈ విషయాలు చెప్పారు. మోసకారుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని క్రెడాయ్ సభ్యులను హెచ్చరించారు. ఎగవేతదారులు, రాత్రికి రాత్రి బిచాణా ఎత్తివేసే రియల్టీ కంపెనీలు, వ్యక్తులను దూరంగా ఉంచేందుకు క్రెడాయ్ సంస్థ తన సభ్యుల కోసం స్వీయ ప్రవర్తనా నియమావళి రూపొందించి పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దేశంలో వ్యవసాయం తర్వాత నిర్మాణ రంగం, రియల్ ఎస్టేట్ రంగాలే ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. రియల్టీ రంగం కోలుకోవడం ఆర్థిక వ్యవస్థకూ మేలు చేస్తుందన్నారు.

గొంతు నొక్కేలా ఉండకూడదు

రియల్ ఎస్టేట్ రంగంలో నియంత్రణ సంస్థ అవసరమైనా, ఆ సంస్థ నిబంధనలు పరిశ్రమ గొంతు నొక్కేలా ఉండకూడదని ఉప రాష్ట్రపతి స్పష్టం చేశారు. 'ఈ రంగంలో నియంత్రణ సంస్థ అవసరం ఉంది. అయితే ఆ నియంత్రణ సంస్థ నిబంధనలు పరిశ్రమ గొంతు నొక్కేలా ఉండకూడదు. అలా అని నియంత్రణలు లేకపోతే ఈ రంగంలోనూ అనేక మంది విజయ్ మాల్యాలు, నీరవ్ మోదీలను చూడాల్సి వస్తుంది' అన్నారు. రెరా చట్టంలో పేర్కొన్న నిబంధనల అమలుకు క్రెడాయ్ సభ్యులు సిద్ధంగా ఉన్నారని ఆశిస్తున్నట్టు చెప్పారు.

దేశంలో భూముల ధర ఎక్కువగా ఉండడంతోనే ఇళ్ల ధర ఎక్కువగా ఉందన్నారు. చిన్న చిన్న నగరాల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉన్నట్టు చెప్పారు. 'విజయవాడ వంటి నగరాల్లో అయితే భూముల ధర న్యూయార్క్, వాషింగ్టన్ నగరాల స్థాయిలో ఉన్నాయి. అందుకే ఇళ్ల ధర పెరిగిపోతోంది' అన్నారు. ఎక్కువ భూములు మధ్యవర్తుల దగ్గర ఉండడమూ ఇందుకు కారణమన్నారు. వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా రియల్టీ మార్కెట్‌లోనూ ధరలు దిద్దుబాటు కావలసిన అవసరం ఉందన్నారు.



ఇళ్లకు ఇప్పటికీ కొరతే

దేశంలో పెరిగిపోతున్న గృహ కొరతపైనా ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. 'ప్రస్తుతం దేశవ్యాప్తంగా 1.9 కోట్ల ఇళ్లకు కొరత ఉంది. 2030 నాటికి ఇది 3.8 కోట్లకు పెరగనుంది' అన్నారు. అందుబాటు ధరల్లో ఇళ్లను నిర్మించడంలో ప్రైవేటు రంగమూ చురుకైన పాత్ర వహించాలని కోరారు.

బ్యాంకింగ్ మోసాలపై పార్లమెంట్‌లో చర్చ జరగాలి

బ్యాంకింగ్ రంగంలో చోటు చేసుకుంటున్న మోసాలపై పార్లమెంట్‌లో అర్థవంతమైన చర్చ జరగాలని ఉప రాష్ట్రపతి కోరారు. దురదృష్టవశాత్తూ పార్లమెంట్‌లో ఇప్పటి వరకు దీనిపై ఎలాంటి చర్చ జరగడం లేదన్నారు. 'ఎంపిలు, ప్రభుత్వం, సభాధ్యక్షులూ దీనిపై చర్చ జరగాలని భావిస్తున్నారు. అయినా చర్చ మాత్రం జరగడం లేదు. అదే దురదృష్టకరం' అన్నారు. ఎవరి హయాంలో ఈ మోసాలు జరిగాయనే దాంతో నిమిత్తం లేకుండా బ్యాంకింగ్ మోసాలపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని వెంకయ్య నాయుడు కోరారు.

శ్రీ సిటీలో చైనా కంపెనీ సోలార్ పార్కు

▸ 1500 మందికి ఉద్యోగ అవకాశాలు



శ్రీసిటీ (సత్యవేడు) : చిత్తూరు జిల్లాలోని శ్రీ సిటీలో ఒక చైనా కంపెనీ సోలార్ పార్కు ఏర్పాటు చేస్తోంది. చైనా ఎలక్ట్రానిక్స్ టెక్నాలజీ గ్రూప్ కార్పొరేషన్ (సిఇటిసి) అనుబంధ సంస్థ సిఇటిసి రెన్యూవబుల్ ఎనర్జీ టెక్నాలజీ కంపెనీ రూ.320 కోట్ల పెట్టుబడితో 18 ఎకరాల్లో ఫొటోవోల్టాయిక్ మాడ్యూల్స్ తయారీ కోసం ఈ పార్కు ఏర్పాటు చేస్తోంది. 200 మెగావాట్ల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు చేసే ఈ పార్కుకు గురువారం భూమి పూజ జరిగింది. 'రూ.320 కోట్ల పెట్టుబడితో 18 ఎకరాల విస్తీర్ణంలో ఈ యూనిట్ ఏర్పాటు చేస్తున్నాం. 18 నెలల్లో పార్కు ఏర్పాటు పూర్తి చేస్తాం. దీని ద్వారా 1500 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి' సిఇటిసి ఇఇఒ ల్యూయిలెహంగ్ చెప్పారు. శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నా రెడ్డి మాట్లాడుతూ చైనాకు సంబంధించి రాష్ట్రానికి వచ్చిన మొదటి భారీ కంపెనీ సిఇటిసి అని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి సంస్థ సిఇఒ కృష్ణ కిశోర్, శ్రీసిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

22 నుంచి 'స్మార్ట్ అర్బనేషన్' సదస్సు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ మరో జాతీయ సదస్సుకు వేదికవుతోంది. ఈ నెల 22 నుంచి రెండు రోజుల పాటు 'స్మార్ట్ అర్బనేషన్' పేరుతో ఐదో స్మార్ట్ సిటీ సదస్సు నిర్వహిస్తున్నట్టు స్మార్ట్ సిటీస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎస్‌సిసిఐ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రతాప్ పడోడె విలేకరులతో చెప్పారు. దేశ విదేశాల నుంచి 1,500 మందికిపైగా ప్రతినిధులు హాజరవుతారు. నలభైకి పైగా స్టార్టప్ కంపెనీలు కూడా ఈ సదస్సులో స్మార్ట్ సిటీస్‌కు సంబంధించి తమ సరికొత్త ఆలోచనలను ఈ సదస్సులో ఆవిష్కరించబోతున్నాయి. స్మార్ట్ సిటీల అభివృద్ధిలో ఉన్న అవకాశాలు, ఎదురవుతున్న సవాళ్లపై 50 మందికిపైగా ప్రముఖుల ప్రసంగాలూ ఉంటాయి. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్మార్ట్ సిటీస్ ప్రాజెక్టుతో 30 శాతం వరకు ఇంధనం ఆదా అవుతుందని పడోడె చెప్పారు. ఆయా నగరాల పౌరులు సిద్ధంగా లేకపోతే ఏ నగరాన్నీ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడం సాధ్యం కాదన్నారు. మన దేశంలో కొన్ని నగరాలను స్మార్ట్ సిటీలుగా అభివృద్ధి చేయడంలో ఎదురవుతున్న ఇబ్బందులను రాంకీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ రెడ్డి వివరించారు.

ఎన్‌హెంప్‌కో కంపెనీ విస్తరణ

రూ.5.5 కోట్లతో 'అనంత'లో సమగ్ర యూనిట్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : బెంగళూరు కేంద్రంగా పని చేసే నమ్రత హెంప్ (ఎన్‌హెంప్‌కో) అనే స్టార్టప్ కంపెనీ విస్తరణకు సిద్ధమైంది. ఇందులో భాగంగా అనంతపురం జిల్లా ఆలమూరు గ్రామంలో 'కనబిస్ సటివ' అనే హెంప్ మొక్కల (మాదక ద్రవ్యంగా పనికిరాని ఒక రకమైన గంజాయి మొక్క) సమగ్ర యూనిట్ ఏర్పాటు చేయాలని భావిస్తోంది. కంపెనీ వ్యవస్థాపకులు, ఎండి హర్షవర్ధన్ రెడ్డి ఈ విషయం చెప్పారు. ఇందుకోసం రూ.5.5 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనున్నట్టు వెల్లడించారు. ఈ మొక్కల గింజల నుంచి తీసే నూనెతో కంపెనీ ఇప్పటికే బెంగళూరులోని యూనిట్‌లో 22 రకాల బాడీ వెల్‌నెస్ ఉత్పత్తులు తయారు చేసి ఆన్‌లైన్‌లో విక్రయిస్తోంది. ప్రస్తుతం ఇందుకు అవసరమైన గింజలను హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటోంది.

స్థానికంగా సాగు

రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ మొక్కల సాగును ప్రోత్సహించడం ద్వారా స్థానికంగానే ఈ గింజలు సమకూర్చుకోవాలని కంపెనీ భావిస్తోంది. ఇందు కోసం ముందుగా అనంతపురం జిల్లాలో ప్రయోగాత్మకంగా 15 ఎకరాల్లో హెంప్ సాగు చేపట్టేందుకు అవసరమైన అనుమతుల కోసం కంపెనీ ప్రయత్నిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అనుమతిస్తే రాష్ట్రం మొత్తానికి తమ కార్యకలాపాలు విస్తరిస్తామని హర్షవర్ధన్ చెప్పారు. 'కొద్దిపాటి నీటి వనరులతో ఎలాంటి భూముల్లో అయినా ఈ హెంప్ మొక్కలను సాగు చేయవచ్చు. 70 నుంచి 110 రోజుల్లో పంట చేతికి వస్తుంది. ఏటా మూడు పంటల సాగుతో రైతులు ఎకరాకు కనీసం రూ.2 లక్షల వరకు ఆదాయం పొందవచ్చు' అన్నారు. అనంత యూనిట్‌లో ఈ మొక్కల సాగుతో పాటు ప్రాసెసింగ్ యూనిట్, గిడ్డంగులు, ఆర్ అండ్ డి యూనిట్, టెస్టింగ్ సెంటర్ కూడా ఏర్పాటు చేస్తామని కంపెనీ ఎండి చెప్పారు.

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం	వెండి	రూపాయి డాలర్	ముడి చమురు
33685.54	10360.15	30475	38330	64.93	65.12
↓ 150.20	↓ 50.75	↓ 50	↓ 115	↓	↑

ముంబై 10 గ్రాములు (99.9 స్వచ్ఛత)



ప్రారంభ ధర రూ.1.33 కోట్లు

భారత మార్కెట్లోకి అప్‌డేటెడ్ మసెరాటి 'ఘిబ్లి'

న్యూఢిల్లీ : ఇటలీకి చెందిన లగ్జరీ కార్ల కంపెనీ మసెరాటి భారత మార్కెట్లోకి తన సెడాన్ 'ఘిబ్లి' మోడల్‌లో అప్‌డేటెడ్ వెర్షన్‌ను విడుదల చేసింది. దీని ప్రారంభ ధర 1.33 కోట్ల రూపాయలు (ఎక్స్‌షోరూమ్). ఈ మోడల్‌లో మూడు వేరియంట్లు అందుబాటులో ఉన్నాయి. వీటి ధర వరుసగా రూ.1.33 కోట్లు, రూ.1.38 కోట్లు, రూ.1.42 కోట్లుగా ఉంది. అద్భుతమైన డిజైన్, అత్యాధునిక టెక్నాలజీతో కొత్త వేరియంట్లను తెచ్చినట్లు మసెరాటి ఇండియా ఆపరేషన్స్ హెడ్ బోజాన్ జంకులోస్కి తెలిపారు. 2018 ఘిబ్లిలో 3.0 లీటర్ వి6 ఇంజన్ ఉంది. 6.3 సెకన్ల వ్యవధిలోనే 0 నుంచి 100 కిలో మీటర్ల వేగాన్ని అందుకుంటుంది. గరిష్ఠంగా గంటకు 250 కిలో మీటర్ల వేగంతో వెళుతుంది. ఎలక్ట్రిక్ పవర్ స్టీరింగ్, అడ్వాన్స్‌డ్ డ్రైవింగ్ అసిస్టెన్స్ సిస్టమ్, అడాప్టివ్ ఫుల్ ఎల్ఈడీ హెడ్‌లైట్స్, ఇంటిగ్రేటెడ్ వెహికల్ కంట్రోల్ సిస్టమ్ తదితర ఫీచర్లు ఈ కారులో ఉన్నట్లు కంపెనీ తెలిపింది.



హోండా నుంచి సరికొత్త
లివో, డ్రీమ్ యుగా, సిబి షైన్ ఎస్‌పి

న్యూఢిల్లీ : హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్ఎంఎస్ఐ) తన లివో, డ్రీమ్ యుగా, సిబి షైన్ ఎస్‌పి మోడళ్లలో 2018 ఎడిషన్లను మార్కెట్లోకి విడుదల చేసింది. 110 సిసి ఇంజన్ కలిగిన లివో ప్రారంభ ధర 56,230 రూపాయలుండగా.. డ్రీమ్ యుగా (110 సిసి) ధర 52,741 రూపాయలు, సిబి షైన్ ఎస్‌పి (125 సిసి) ప్రారంభ ధర 56,230 రూపాయలు (ఎక్స్‌షోరూమ్)గా ఉన్నట్లు కంపెనీ తెలిపింది. వివిధ రకాల కొనుగోలుదారుల అవసరాలను ఈ మూడు బైకులు తీర్చుతాయని, కొత్తగా బైక్‌ను కొనాలనుకునే వారి అంచనాలకు అనుగుణంగా ఈ బైకులను తీర్చిదిద్దామని హెచ్ఎంఎస్ఐ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (అమ్మకాలు, మార్కెటింగ్) యద్వీందర్ సింగ్ గులేరియా తెలిపారు. తక్కువ మెయింటెనెన్స్ సీల్ చెయిన్, హోండా ఈకో టెక్నాలజీ టైర్లు ఈ బైకుల్లో ఉన్నాయని, ఫలితంగా మైలేజీ మరింతగా పెరుగుతుందని ఆయన చెప్పారు.



రూ.21 కోట్ల సమీకరణకు క్యాప్‌స్టన్ పబ్లిక్ ఇష్యూ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన సెక్యూరిటీ, ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ కంపెనీ క్యాప్‌స్టన్ ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ వచ్చే వారంలో తొలి పబ్లిక్ ఇష్యూ (ఐపిఒ)కు రానుంది. ఈ ఇష్యూ ద్వారా కంపెనీ 21.19 కోట్ల రూపాయల నిధులు సమీకరించాలనుకుంటోంది. ఇష్యూ తర్వాత ఎన్ఎస్ఇ ఎమర్జ్‌లో షేర్లను లిస్ట్ చేయనున్నారు. ఇష్యూ ద్వారా సమీకరించే నిధులను కంపెనీ వ్యాపార విస్తరణకు, రుణాలు తీర్చేందుకు, ఇతర నిర్వహణ కార్యకలాపాలకు వినియోగించనున్నారు. ఇష్యూలో భాగంగా 23,04,000 ఈక్విటీ షేర్లను 10 రూపాయల ముఖ విలువతో ఒక్కో షేరును 92 రూపాయల ధరకు ఆఫర్ చేయాలని ప్రతిపాదించారు. ఆఫర్ ఫర్ సేల్, షేర్ జారీ ద్వారా 26.5 శాతం వాటాను విక్రయించనున్నట్లు గురువారం నాడిక్కడ కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డిఎస్ రావు తెలిపారు.

గడచిన ఆర్థిక సంవత్సరంలో కంపెనీ 90 కోట్ల రూపాయల రాబడి, 3 కోట్ల రూపాయల లాభాన్ని ఆర్జించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2017-18)లో 117 కోట్ల రూపాయల రాబడి, 6 కోట్ల రూపాయల లాభాన్ని నమోదయ్యే అవకాశం ఉందని కంపెనీ అంచనా వేస్తోంది. ప్రస్తుతం కంపెనీలో 6,500 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. క్లయింట్లు 400కు పైగా ఉంది. దక్షిణాది రాష్ట్రాల్లో తమ సర్వీసులను మరింతగా విస్తరించే యోచనలో ఉన్నట్టు కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ కె శ్రీకాంత్ తెలిపారు.

బ్యాంకు షేర్లలో అమ్మకాల ఒత్తిడి

» వెంటాడిన వాణిజ్య యుద్ధ భయాలు

» 150 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్

ముంబై : దేశీయ స్టాక్ మార్కెట్లలో వరుసగా మూడో రోజూ నష్టాలు కొనసాగాయి. లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్ (ఎల్ఒయు) మోసానికి సంబంధించిన తాజా ఆందోళనలు, వాణిజ్య యుద్ధ భయాల నేపథ్యంలో స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదొడుకుల మధ్య ట్రేడయ్యాయి. గురువారం బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 150 పాయింట్ల నష్టంతో 33685.54 పాయింట్ల వద్ద ముగిసింది. బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి పెరిగింది. యస్ బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఎస్‌బిఐ షేర్లలో అమ్మకాలు జోరుగా సాగాయి. పిఎన్‌బికి చెందిన బ్రాడీ హౌస్ శాఖ చంద్రి పేపర్ అండ్ అల్లాయిడ్ ప్రొడక్ట్స్‌కు 9 కోట్ల రూపాయల విలువైన ఎల్ఒయులు మోసపూరితంగా జారీ చేసినట్లు సిబిఐ తాజాగా కేసు నమోదు చేసింది. ఈ నేపథ్యంలో బ్యాంక్ షేర్లలో అమ్మకాలు పెరిగాయి. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ కీలకమైన 10400 పాయింట్ల స్థాయి దిగువకు చేరింది. గురువారం నాటి ట్రేడింగ్‌లో 50.75 పాయింట్ల నష్టంతో 10360.15 పాయింట్ల వద్ద ముగిసింది. ప్రపంచ మార్కెట్లలో మిశ్రమ ట్రెండ్ నేపథ్యంలో దేశీయ మార్కెట్లు సంకుచిత శ్రేణిలో కన్సాలిడేట్ అవుతాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. భారత ఆర్థిక వ్యవస్థ 2019 ఆర్థిక సంవత్సరంలో 7.3 శాతం వృద్ధిని నమోదు చేసుకుంటుందన్న ప్రపంచబ్యాంక్ అంచనాల నేపథ్యంలో దీర్ఘకాలిక సానుకూల సెంటిమెంట్‌కు అవకాశం ఉందని, అయితే అంతర్జాతీయ వాణిజ్యానికి సంబంధించిన ఆందోళనలు, రానున్న కాలంలో వివిధ రాష్ట్రాల్లో ఎన్నికలు మార్కెట్ల గమనంపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఆయన చెప్పారు.



- బ్యాంకింగ్ షేర్లలో యస్ బ్యాంకింగ్ అత్యధికంగా 2.04 శాతం నష్టపోయింది. ఆర్‌బిఎల్ 1.76 శాతం, ఐసిఐసిఐ బ్యాంక్ 1.60 శాతం, యాక్సిస్ బ్యాంక్ 1.23 శాతం, ఎస్‌బిఐ 1.13 శాతం, ఫెడరల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడాలు 1.07 శాతం వరకు నష్టపోయాయి.
- హెచ్‌యుఎల్, టాటా స్టీల్, ఐటిసి, సన్‌ఫార్మా, హెచ్‌డిఎఫ్‌సి, టిసిఎస్, ఎల్ అండ్ టి, భారతి ఎయిర్‌టెల్, టాటా మోటార్స్, ఎన్‌టిపిసి, అదానీ పోర్ట్స్, మారుతి సుజుకీ షేర్లు 1.48 శాతం వరకు నష్టాలు చవిచూశాయి.
- గీతాంజలి జెమ్స్ షేరులో డౌన్‌ట్రెండ్ కొనసాగుతోంది. ఈ షేరు 4.78 శాతం నష్టంతో 12.95 రూపాయలకు దిగింది.
- యూరియా సబ్సిడీని 2020 నాటి వరకు పెంచే ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోదం తెలిపిన నేపథ్యంలో నాగార్జునా ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ షేరు 9.82 శాతం, నేషనల్ ఫెర్టిలైజర్స్ 5.15 శాతం, రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్ 4.11 శాతం, కోరమాండల్ ఇంటర్నేషనల్ 5.37 శాతం మేర పెరిగాయి.

భారత్ డైనమిక్స్ ఐపిఒ 1.30 రెట్లు ఓవర్ సబ్‌స్క్రిప్షన్

రక్షణ రంగంలోని భారత్ డైనమిక్స్ పబ్లిక్ ఇష్యూ ముగింపు రోజైన గురువారం నాడు 1.0 రెట్లు ఓవర్‌సబ్‌స్క్రైబ్ అయింది. ఈ ఇష్యూ ద్వారా కంపెనీ 960 కోట్ల రూపాయలు సమీకరించనుంది. ఇష్యూ ద్వారా 2,24,51,953 షేర్లను ఆఫర్ చేయగా.. 2,92,42,115 షేర్లకు బిడ్స్ వచ్చాయి.



బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	31,460	---	31,320	31,330	30,460
క్రితం ముగింపు	31,510	31,450	31,370	31,380	30,540
22 క్యారెట్లు	29,130	---	28,810	29,080	29,000
క్రితం ముగింపు	29,170	29,200	28,860	29,150	29,080
వెండి (కిలో)	39,500	---	39,300	39,700	41,400
క్రితం ముగింపు	39,600	40,000	39,500	39,800	41,600

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 3.90 — నెక్ (100 గుడ్లు)



హైదరాబాద్	330.00	చిత్తూరు	363.00
వరంగల్	332.00	చెన్నై	370.00
విజయవాడ	317.00	నమక్కల్	360.00
గోదావరి	317.00	బెంగళూరు	365.00
విశాఖపట్నం	325.00	ముంబై	370.00

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	70.00	విజయవాడ	71.00
కరీంనగర్	71.00	గుంటూరు	71.00
వరంగల్	70.00	ఒంగోలు	73.00
మహబూబ్‌నగర్	70.00	చిత్తూరు	71.00
కర్నూలు	70.00	నెల్లూరు	71.00
విశాఖపట్నం	74.00	అనంతపురం	72.00
గోదావరి	71.00		



ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో..)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	59.07	68.50
పౌండ్	82.57	95.76
యూరో	73.12	84.80
ఆస్ట్రేలియా డాలర్	46.54	53.85
బహ్రెయిన్ దినార్	159.98	183.34
కువైట్ దినార్	178.88	222.68
ఒమని రియాల్	156.67	179.24
సౌదీ రియాల్	15.71	18.61
సింగపూర్ డాలర్	45.08	53.39
యుఎఇ దిరమ్	16.08	18.79

10300 వద్ద మద్దతు

టెక్ వ్యూ

నిఫ్టీ గురువారం క్రితం స్థాయిల వద్ద ఫ్లాట్‌గా ప్రారంభమై 10400 స్థాయిలకన్నా దిగువకు జారి నెగిటివ్ ట్రెండ్‌లోకి వెళ్లింది. చివరకు డే కనిష్ఠ స్థాయిలో ముగిసింది. నిఫ్టీ 10500 నిరోధ స్థాయి వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమైంది. బ్యాంక్ నిఫ్టీ 25000 స్థాయిల వద్ద నిరోధాన్ని ఎదుర్కొంటోంది.

- నిఫ్టీ కరెక్షన్‌కు గురైతే తదుపరి ప్రధాన మద్దతు 10300. ఈ స్థాయి వద్ద విఫలమైతే షార్ట్‌టర్మ్ కరెక్షన్‌కు అవకాశం ఉంటుంది.
- దిగువన 10200, 10000 స్థాయిల వద్ద ప్రధాన మద్దతు ఉంటుంది.
- నిఫ్టీ రికవరీ అయి ఇంట్రాడే మైనర్ నిరోధ స్థాయి 10440 ఎగువన నిలదొక్కుకుంటే మరింత అప్‌ట్రెండ్‌కు అవకాశం ఉంటుంది.
- ఎగువన ప్రధాన నిరోధ స్థాయి 10500.

శుక్రవారం స్థాయిలివే..

నిరోధం : 10430   మద్దతు : 10300

■ వి.సుందర్ రాజా

మిడ్‌సెషన్ మెరుగు

తిథి : ఫాల్గుణ కృష్ణ చతుర్దశి **నక్షత్రం :** శతభిషం

ఆశ్లేష, జ్యేష్ఠ, రేవతి నక్షత్ర జాతకులు, మీన, కర్కాటక రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ : 10360.15 (-50.75)

ట్రెండ్ మార్పు వేళలు: మధ్యాహ్నం 12.23, 2.03 గంటలు

ధోరణి : గ్రహగతులను బట్టి మార్కెట్ నిస్తేజంగా ప్రారంభమై 10.30 గంటల నుంచి 12.30 గంటల వరకు మెరుగ్గా ఉండి, తదుపరి మార్కెట్ ముగిసే వరకు నిస్తేజంగా ఉండవచ్చు.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ 10.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా ఎగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 12.15 గంటల సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 12.30 వరకు ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని మార్కెట్ ముగిసే సమయానికి క్లోజ్ చేసుకోవలసి ఉంటుంది.

ఆస్ట్రో వ్యూ

నిరోధం : 10400, 10435

మద్దతు స్థాయిలు : 10320, 10285

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి www.thefinanciala strologer.blogspot.in

బిఎస్ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు (BSE)

ADITYA SPIN. 8.66(8.25)2220
AGRO TECH FO 657.2(646.4)1346
AISHWARYA TE 6.44(6.17)4052
ALPHAGEO (I) 765.45(766.2)836
ALU FLUORIDE 106.65(106.6)16868
AMAR RAJA BA 793.55(805.45)22881
ANDHRA BANK 43(41.25)973035
ANDHRA CEMEN 10.53(10.03)95122
ANDHRA PETRO 58.05(56.9)36072
ASTRA MICRO 86.1(86.25)139531
AUROB.PHARMA 572.8(578.3)188481
AVANTEL LTD 541.5(547.3)1839
AVANTI FEEDS 2379.7(2409)13825
B.N.RATHI SE 40.9(38.8)33849
BALAJI AMINE 626.5(609)8611
BAMBINO AGRO 225.3(223.65)481
BARTRONICSIN 12.08(11.98)18761
BHAGIRA.CHEM 291(283.3)41
BHAGYA INL 49(47.5)74438
BHARATFIN 1063.3(1059.4)13365
BNR UDYOG 26.25(28.6)895
CAMBRIDGE 70.15(71.3)23079
CAT TECHN. .97(.99)1160
CCHHL 13.52(13.65)14207
CCL PRODUCTS 294.8(289.45)2286
CELESTIAL 15.45(15)22738
CIL SECURITS 27.85(27.3)229
COROM INTER 527.7(500.8)23647
CUBEX TUBING 23(23.45)8310
CYBERMATE 3.04(3.1)24875
CYIENT 629.55(630)2431
DANLAW TECH. 73.6(73)1597
DECAN CEMENT 552.25(549.5)331
DHAN ROTO SP 49(48.95)523
DIAMONPOWER 11.68(11.82)47684
DIVI'S LAB. 1086.1(1053.75)77912
DIVYA.GRANIT 94.8(94)237
DQ ENT 13(13.15)1309694
DR.REDDY'S 2183.2(2181.2)32592
EMPEE SUGARS 3.17(3.32)50349
EVEREST ORG. 136(136.2)374
FACOR ALLOYS 2.71(2.75)236628
FIRSTOBJ 15.2(15.8)6150
GATI LTD. 105.15(102.1)102624
GAYATRI BIO 7(6.9)1200
GAYATRI PROJ 201.45(204.75)310992
GENNEX LAB 3.94(3.98)194481
GMR INFRASTR 18.5(18.05)2791155
GODAVARI DRU 33(34)3169
GOLDST INFRA 203.6(195.3)13697
GOLDSTONE EN 14.02(13.36)5276
GRANULES (I) 112.65(110.15)71646
GVK POWERINF 16(15.65)951403
HBL P SYS 50.55(48.75)110611
HERITGFOOD 761(711.8)94474
HIND.FLUROCA 10(10.16)1200
I.C.S.A. IND 3.26(3.12)30766
IKF TECHNO .61(.6)130177
INCAP LTD. 82.2(84)851
IPAPPM 302.5(304.55)18708
IVRCL LTD 3.73(3.84)243088
KAKATIYA CEM 270.9(273.65)4618
KALLAM SPG. 32.05(31.95)26008
KARAN WOO-SN 1.82(1.91)2200
KAVERI SEED 493.75(493.45)21227
KCP LTD 117.2(117.5)5169
KERNEX MICRO 38.7(38.2)53385
KNR CONST 294.7(292.1)10296
KREBS BIOCHM 189.05(194.45)1208
LANCO INFRA 1.16(1.11)2542435
LOKESH MACH 59.05(58.4)19781
LOTUS CHOC 51.3(50)1387
MADHUCON PRJ 24.5(24.75)37777
MOLD-TEK TEC 54.95(54.6)9917
MOSCHIP SEMI 37.05(35.45)131344
MSR INDIA 48.35(47.55)54761
N C L IND. 229.35(227.7)9670
NACLIND 44.35(42.85)105005
NATCO PHARM 786.85(775.25)34215
NCC 126.45(125.8)219360
NEHA INTER. 6.8(6.38)12862
NETTLINX LTD 75.25(74.5)25810
NEULAND LAB. 702.05(696.5)6899
NIHAR INFO 13.48(12.85)2451
NILE LTD. 756(699.1)13237
NTL 3.7(3.63)481
OIL COUNTRY 39.3(37.8)3042
PADMALAYA TE 3.1(3.26)24607
PALRED 74.4(73)2700
PANYAM CEMEN 44.35(43.5)20449
PENNAR STEEL 55.9(55.65)80017
PFL INFOTECH 8.27(8.19)1116
PHYTOCHEM I. 63.9(61.95)3755
PITTI LAMIN. 87.6(87)1668
POKARNA LTD 194.75(195.25)5303
PRAJAY ENGS. 12.59(12.56)18048
PREMIER EXPL 362.1(359)12137
PRISM CEMENT 115.9(116.95)376033
RAIN 390.35(388.8)358025
RAJ PACKAGIN 40(40.95)9724
RAJVIR IND 43(43.55)2
REG.CERAMIC 5.1(5.11)4714
RESTILE CER. 7.97(7.65)8098
SAGAR CEM. 906.75(914.95)133
SAMKRG PIST. 290.1(289.75)13175
SAMPRE NUTRI 53(52.35)6060
SANGHI IND. 124.6(122.3)29430
SATVAH.ISPAT 19.7(20.25)13606
SAVEN TECHNO 25.4(25.55)24395
SMPL 1.26(1.26)45859
SMS PHARMACE 79.65(78)21440
SREE RAYALA 153.15(152.85)657
STEEL EXCH 26.3(25.05)14390
SUJANA INDUS .69(.72)87760
SURANATP 4.93(5)12936
SURYACHAKRA .9(.9)54308
SURYAVA SPIN 6.92(6.6)65
SURYLAK.COTT 70.05(71.4)5827
SUVEN LIFE S 183.05(177.35)36683
TAJ GVK HOTL 161.15(160.3)183591
TANLA 34.7(33.95)125966
TRANSCORP IN 34.5(33)8267
TRANSGENE BI 2.29(2.23)12333
TRANSPORT CO 266.45(261.8)21049
USHER AGRO 5.11(5.25)76194
VICEROY HOTE 15.2(14.4)44059
VIJAY TEXTIL 44.95(44.65)303
VIMTA LABS 201.45(193.05)4498
VIRAT CRANE 63.65(63.2)10034
VIRINCHI 108.75(107.5)40614
VISAKA IND. 693(682.35)7930
VISTA PHARMA 42.3(42.2)7640
VIVIMED LABS 78.75(76.45)90171
VST INDUS. 2975(2947.2)88
WATERBASE 305.75(310.45)442313
XLENERGY 2.33(2.4)6274
YBRANTDIGI 5.15(5.19)140908
ZEN TECH 129.55(132.4)22061
ZENOTECH 45.65(43.5)15522

ఎన్ఎస్ఇ-500 (NSE)
షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా

AARTIDRUGS 565.35(541.5)34429
AARTIIND 1166.5(1189.9)52920
ABAN 165.2(164.1)665942
ABB 1373.1(1390.25)55919
ABFRL 147.35(150.1)1026865
ABGSHIP 9.2(9.05)14301
ACC 1603.15(1612)227343
ADANIENT 167.05(163.75)13195532
ADANIPORTS 382.15(382.1)1818766
ADANIPOWER 28.1(27.3)14966688
ADANITRANS 183.5(184.05)1092977
AEGISCHEM 246.7(237.8)314368
AHLUCONT 380.15(380.1)47436
AIAENG 1437.9(1424.15)3782
AJANTPHARM 1379.8(1378)201455
AKZOINDIA 1793(1813.45)2969
ALBK 51(49.75)5150249
ALLCARGO 161.45(158.7)200822
ALOKTEXT 2.95(3)4583127
AMARAJABAT 793.75(804.9)817146
AMBUJACEM 242.3(243.9)3060758
AMTEKAUTO 25.55(24.7)1259612
ANANTRAJ 55.75(52.65)1706630
ANDHRABANK 42.95(41.3)13444214
APARINDS 735.85(741.1)15164
APLLTD 540.1(540.1)22579
APOLLOHOSP 1096(1090.15)186303
APOLLOTYRE 266.45(267)2765849
ARVIND 400.4(398.65)5698415
ASHIANA 167.1(163.85)41007
ASHOKA 227.9(225.3)589293
ASHOKLEY 150.55(149.7)13458378
ASIANPAINT 1160.8(1137)1146702
ASTRAL 869(874.05)16234
ASTRAZEN 968.4(964.45)4180
ATUL 2684.55(2620)5270
AUROPHARMA 572.3(577.8)1683255
AVANTIFEED 2371(2401.05)86365
AXISBANK 529.65(536.15)3932830
BAJAJ-AUTO 2948.75(2950.55)181457
BAJAJCORP 470(469.9)19520
BAJAJELEC 612.45(621.3)1007007
BAJAJFINSV 5034.5(5111.6)82293
BAJAJHIND 10.75(10.5)2869874
BAJAJHLDNG 2729.75(2684.05)37650
BALKRISIND 1057.55(1048.2)256992
BALLARPUR 12.95(13.05)917606
BALMLAWRIE 229.5(223.7)190795
BALRAMCHIN 86.95(89.2)3836317
BANKBARODA 143.75(145.75)13300363
BANKINDIA 103.7(103.05)17268108
BASF 2042.85(2065.8)2538
BATAINDIA 710.95(707.35)506172
BBTC 1274.6(1295.5)158188
BEML 1100.3(1103.7)1078081
BERGEPAINT 250.05(247.9)326393
BFUTILITIE 418.7(416.7)593095
BGRENERGY 110.4(108.5)106890
BHARATFIN 1063.5(1058.4)600795
BHARATFORG 738.6(740.65)946301
BHARTIARTL 416.5(416.05)675000
BHARTIARTL 420.45(422.6)3277154
BHEL 87.05(86.5)5919232
BHUSANSTL 41.95(41.95)2970784
BIOCON 600.5(605.75)1512731
BIRLACORPN 798.1(752.6)224000
BLISSGVS 198.25(182.2)728417
BLUEDART 4158.1(4158.25)17036
BLUESTARCO 803.15(800.95)71709
BOMDYEING 262.9(245.6)6106782
BOSCHLTD 18025.2(18284.3)36190
BPCL 462.05(462.8)1828571
BRFL 48.5(49.85)145824
BRIGADE 274.15(274.4)109165
BRITANNIA 4868.25(4823.75)303199
CADILAHC 385.1(388.7)512230
CANBK 264.45(259.6)12724448
CAPF 646.8(648.4)393121
CARERATING 1355.25(1336.85)10069
CASTEXTECH 4.6(4.4)838118
CASTROLIND 205.1(206.35)2128631
CCL 294.1(290.35)65754
CEATLTD 1606.2(1600.25)381722
CENTRALBK 86.5(75.7)28733329
CENTURYPLY 332.1(323.95)304274
CENTURYTEX 1197.05(1210.05)470639
CERA 3299.05(3256.9)37381
CESC 970.65(968.75)855029
CHAMBLFERT 166.35(162.95)795413
CHENNPETRO 356.65(361.75)261202
CHOLAFIN 1479.2(1465.4)164727
CIPLA 571.15(577.9)849222
CLNINDIA 564.45(565.8)6493
COALINDIA 295.5(293.1)4487868
COLPAL 1042.35(1034.6)138329
CONCOR 1243.25(1246.3)219190
COROMANDEL 536.9(501.1)220724
CORPBANK 30.6(30.3)340803
COX&KINGS 251.25(249.5)128911
CRISIL 1960.9(1956.7)4138
CUB 179.35(181.55)485194
CUMMINSIND 783(777.15)189472
CYIENT 628.2(632.4)66438
DABUR 325.05(325)2053015
DALMIABHA 2869.7(2882.5)296773
DBCORP 332.6(330.95)12784
DBREALTY 58.45(55.7)1237847
DCBBANK 163.75(164)495745
DCMSHRIRAM 476.05(482.25)93552
DEEPAKFERT 329.2(323.25)437709
DELTACORP 309.5(312)1835100
DEN 93.45(90.8)222420
DENABANK 20.6(19.8)2177819
DHANUKA 589.9(579.85)37993
DHFL 515.45(521.7)1972293
DISHTV 69.35(71.45)5111209
DIVISLAB 1084.55(1054.85)1000506
DLF 225.45(220.95)5972448
DREDGECORP 681.65(664.65)824265
DRREDDY 2182.75(2181.45)335767
DYNAMATECH 1778.5(1791.45)914
ECLERX 1305.45(1322.1)27094
EDELWEISS 269.95(269.85)1270838
EICHERMOT 28695.55(28846.65)25262
EIDPARRY 298.55(293.4)107895
EIHOTEL 168.3(167.45)369054
ELECTCAST 28.7(28.15)374442
ELGIEQUIP 282.7(284.6)10764
EMAMILTD 1050.05(1058.2)57464
ENGINERSIN 165.85(169.65)1203663
EROSMEDIA 184.1(182.9)660478
ESCORTS 847.3(844.15)1158506
ESSDEE 49.35(49.15)13713
ESSELPACK 251.45(253.75)111297
EVEREADY 406.4(379.1)204263
EXIDEIND 217.55(214.6)1243756
FCONSUMER 59.75(59.25)8586828
FDC 274.25(282.65)45908
FEDERALBNK 93.65(94.9)5914770
FINCABLES 683.05(689.9)66508
FINPIPE 674.75(661.25)39746
FLFL 402.1(388.25)154659
FORTIS 160.25(158.8)13938064
FSL 50.9(50.6)5007091
GAIL 450.35(458)1924467
GATI 105.35(101.9)670004
GDL 204.45(205.3)72237
GEPIL 841.8(828.85)8858
GESHIP 357.4(359.75)484752
GET&D 387.9(380.05)67838
GILLETTE 6608.25(6596.35)2554
GLAXO 2291.55(2289.35)9241
GLENMARK 553.8(552.3)407472
GLOBOFFS 26.95(27.3)22049
GMDCLTD 128.1(128.2)150300
GMRINFRA 18.45(18)35692847
GODFRYPHLP 907.15(867.05)130398
GODREJCP 1072.9(1086.5)167938
GODREJIND 549.3(550.2)423488
GODREJPROP 754.7(759.5)53646
GPPL 137.45(138.95)1286372
GRANULES 112.7(110.25)1474670
GREAVESCOT 117.15(118.05)765644
GREENPLY 334.85(332.95)41151
GRINDWELL 495.6(495.95)512889
GRUH 560.55(563.15)125039
GSFC 126.3(124.15)2629334
GSKCONS 6521.75(6572.55)38984
GSPL 190.9(192.3)505880
GUJFLUORO 779.3(778.85)37680
GUJGASLTD 850.7(838.2)78666
GULFOILLUB 945(949.2)61334
GVKPIL 15.9(15.65)3892766
HATHWAY 35.15(34.75)440748
HAVELLS 520.75(517.1)1590047
HCC 32.4(31.95)4283283
HCL-INSYS 57.6(55.15)3433298
HCLTECH 959.15(965.05)1295077
HDFC 1830(1844.7)1548960
HDFCBANK 1880.8(1864.5)1467731
HDFCBANK 1900(1850)130933
HDIL 43.05(44.5)19617518
HEIDELBERG 154.7(153.05)342511
HEROMOTOCO 3640.8(3639.35)198082
HEXAWARE 380.25(391.9)1184536
HFCL 27.25(26.95)7373596
HIMATSEIDE 345.65(341)34313
HINDALCO 224.9(226.7)6730350
HINDCOPPER 74.15(65.75)15549918
HINDPETRO 371.55(375.4)1822993
HINDUNILVR 1299.95(1316.9)536838
HINDZINC 318.45(320.6)4495797
HMT 31.05(31)2935
HMVL 229(232.05)42544
HONAUT 15913.1(15853.6)502
HOTELEELA 18.7(18.25)664313
HSIL 403.1(403.6)39481
HTMEDIA 90.3(88.95)548019
IBREALEST 209.3(209.05)6274057
IBULHSGFIN 1237.95(1226.9)1002782
ICICIBANK 301.45(306.05)13282019
ICRA 3674.9(3679.85)6350
IDBI 78.85(73.7)101262394
IDEA 80.15(81.25)7297956
IDFC 51.25(51.15)3283026
IFBIND 1331.45(1356.7)5876
IFCI 22(21.95)8050867
IGARASHI 802.85(797.65)23721
IIFL 801.4(814.3)205716
IL&FSTRANS 69.3(66.75)722060
INDHOTEL 133(130.75)2160425
INDIACEM 150.75(153.35)2098021
INDIANB 304.6(303.95)1879644
INDOCO 258(249.45)120582
INDUSINDBK 1741.75(1733.35)604484
INEOSSTYRO 890.25(880)3493
INFRATEL 337.9(339.15)1354562
INFY 1182.5(1180.8)3050750
INGERRAND 704.4(711)16564
INOXLEISUR 266.55(261.05)34985
INOXWIND 120.75(120.7)229140
INTELLECT 184.15(178.95)405961
IOB 18.25(18.15)619501
IOC 192.05(395.05)26369935
IPAPPM 303.9(305.35)34603
IPCALAB 671.1(667.75)102001
IRB 217.8(220.25)1739376
ITC 265.55(268.05)5557668
J&KBANK 60.35(61.05)740052
JAGRAN 163.55(163.75)903290
JAICORPLTD 150.85(141.35)6325624
JBCHEPHARM 298.05(301.65)204639
JBFIND 145.65(145.3)1115700
JCHAC 2514.45(2488.65)5664
JETAIRWAYS 721.9(714)2891483
JINDALPOLY 356.4(351.5)80479
JINDALSTEL 230.7(230.25)6442807
JISLJALEQS 112.3(110.95)5543566
JKCEMENT 1041.1(1010.95)38559
JKIL 306.6(301.05)50996
JKLAKSHMI 439.85(423.95)234426
JKTYRE 155.2(153.75)476548
JMFINANCIL 133.35(135)629729
JPASSOCIAT 19.2(16.35)239432167
JPINFRATEC 10.2(9.95)22440988
JPPOWER 6.3(6.6)10779054
JSWENERGY 78.95(78.85)1008099
JSWHL 1700.65(1670.25)3312
JUBILANT 852.9(843.1)593018
JUBLFOOD 2147.1(2078.95)1520066
JUSTDIAL 450.65(444.3)1476228
JYOTHYLAB 357.95(359)48840
KALPATPOWR 459.65(458.7)116953
KANSAINER 503.45(499.1)264765
KEC 392.75(384.1)1009122
KESORAMIND 122.3(121.75)504189
KIRLOSENG 364.8(364.15)5460
KITEX 246.55(249.05)30250
KOLTEPATIL 338(329.25)242330
KOTAKBANK 1085.65(1081.75)1368171
KPIT 231.3(229.2)4113934
KRBL 454.95(447.05)124358
KSCL 493.95(493.95)421004
KSK 10.85(10.35)687372
KTKBANK 123.65(122.5)2521559
KWALITY 98.1(99.95)3675745
L&TFH 162.05(162.5)3759345
LAKSHVILAS 104.45(103.65)571165
LAOPALA 649(649)22887
LAXMIMACH 6836.15(6415.3)22714
LICHSGFIN 523.2(518)2143101
LITL 1.15(1.1)2896694
LT 1295.1(1303.25)1178352
LUPIN 776.65(781.55)834688
M&M 734.85(728.2)1249262
M&MFIN 435.5(435.5)1669782
MAGMA 156.9(160.3)63496
MAHINDCIE 221.95(222.2)72881
MAHLIFE 445.65(438)12919
MANAPPURAM 107.8(105.35)3717060
MANPASAND 380.2(379.15)96259
MARICO 301.1(304.2)1628521
MARKSANS 36.5(35.6)3152542
MARUTI 8837.55(8846.3)313431
MAYURUNIQ 496.2(501.75)15030
MCDOWELL-N 3189.35(3113.65)399534
MCLEODRUSS 148(149.9)563169
MERCK 1489(1492.55)6405
MHRIL 290.1(293)189861
MINDACORP 192.15(185.45)333133
MINDTREE 843.65(799.55)3644018
MMTC 62.1(51.75)11671555
MOIL 204.55(200.15)297567
MONSANTO 2589.85(2593.65)10869
MOTHERSUMI 314.05(320.15)2180927
MOTILALOFS 1147.45(1164.65)39375
MPHASIS 881.35(866.15)211633
MRF 71737.95(71281.65)3803
MRPL 118.25(119)514266
MTNL 20.75(20.05)2706076
MUTHOOTFIN 397.6(398.1)874137
NATCOPHARM 789.15(774.35)318339
NATIONALUM 65.8(64.1)5658195
NAUKRI 1263.55(1286)139299
NAVKARCORP 167.7(158.05)315089
NCC 126.35(125.75)3775071
NETWORK18 57.4(57.4)1660242
NHPC 26.8(26.8)9506792
NIITTECH 988.8(932.45)2872756
NITINFIRE 4.75(4.9)613645
NLCINDIA 96.5(95.45)243790
NMDC 124.3(124.6)2917365
NTPC 169.9(169.7)3652747
OBEROIRLTY 541.7(543.65)394117
OFSS 3922.7(3940.65)21312
OIL 337.7(340.85)649869
OMAXE 226.3(225.95)746793
ONGC 180.3(180.6)5145739
ORIENTBANK 100.85(101.15)6731574
ORIENTCEM 144.4(143.7)34721
ORISSAMINE 1662.95(1632.7)9407
PAGEIND 21183.55(21444.1)15891
PARSVNATH 16.55(15.8)469286
PCJEWELLER 366.1(366.85)3030946
PEL 2450.85(2456.15)197015
PERSISTENT 844.35(840.1)61678
PETRONET 237.4(238.1)1495516
PFC 88.05(86.7)10005593
PFIZER 2176.75(2197.15)8143
PFS 28(26.25)2224869
PGHH 9449(9446.45)2022
PHOENIXLTD 618.2(644.25)281433
PIDILITIND 909.55(906.25)435607
PIIND 856.15(861.05)32699
PNB 98.55(99.3)42911688
POLARIS 472.8(472.25)69847
POWERGRID 194.8(194.35)3449728
PRAJIND 84.9(81.9)1676207
PRESTIGE 299.75(303.35)84212
PRISMCEM 116.45(116.95)849501
PTC 96.9(96.7)4246357
PUNJLLOYD 18.25(17.85)1213938
PURVA 150.05(142.7)671903
PVR 1312.25(1327.1)103703
RADICO 335.15(331.9)943013
RAIN 390.8(388.7)2417704
RAJESHEXPO 759.1(777.7)124089
RALLIS 234.35(233.15)85862
RAMCOCEM 750.25(751)297680
RAMCOSYS 420.75(421.85)32551
RATNAMANI 906.9(887.2)5649
RAYMOND 942.1(944.7)287913
RCF 80(76.4)6339720
RCOM 23.6(23.8)45481906
RECLTD 128.95(127.8)3336384
REDINGTON 144.4(144.5)173813
RELAXO 630.2(624.55)20987
RELCAPITAL 445.85(447.75)4074422
RELIANCE 911.8(929.05)5811424
RELINFRA 449.45(452.25)1861678
RENUKA 15.45(15.4)1974092
REPCOHOME 575.65(565.65)311448
RIIL 471.2(457.7)1700529
RKFORGE 750.05(758.1)34139
RNAVAL 35.95(36.25)3260396
ROLTA 63.7(62.65)1147092
RPOWER 39.95(39.75)5506254
RTNPOWER 5.85(5.7)3117848
RUCHISOYA 16.75(16.8)489973
SADBHAV 379.8(378.05)70632
SADBHIN 134.55(130.85)62541
SAIL 75.3(72.65)15288023
SANOFI 5174.1(5224.25)3684
SBIN 253.7(257.05)18339890
SCHAEFFLER 5399.4(5470.45)2893
SCHNEIDER 117.3(117.1)168432
SCI 68.6(64.4)2206099
SHARDACROP 380.45(375.05)107028
SHILPAMED 462.55(447.05)44879
SHK 266.15(267.4)20138
SHOPERSTOP 541.2(540.55)106902
SHREECEM 16815.65(16970.1)8378
SHRIRAMCIT 2095.35(2000.55)50305
SIEMENS 1132.6(1129.2)128463
SIMPLEXINF 528.3(536)17790
SINTEX 18.65(18.2)4865411
SITINET 15.3(15.05)139388
SJVN 34.95(35)600557
SKFINDIA 1739.2(1721.2)104940
SMLISUZU 765.6(753.65)19697
SNOWMAN 49.55(48.45)654031
SOBHA 529.55(533.9)413141
SOMANYCERA 662.85(662.25)14462
SONATSOFTW 314.75(312.35)213247
SOUTHBANK 25.65(25.4)7148703
SPARC 410.6(409.45)124317
SREINFRA 83.65(82)2200936
SRF 1877.75(1869)66461
SRTRANSFIN 1460.65(1376.15)1421211
STAR 711.55(691.9)694501
STCINDIA 149.15(142.05)30505
SUNDARMFIN 1664.3(1661.75)7218
SUNDRMFAST 613.6(610.25)635793
SUNPHARMA 516.45(520.1)3013808
SUNTV 920.7(931.6)1665722
SUPREMEIND 1200.8(1200.1)15023
SUVEN 183(177.2)249764
SUZLON 11.65(11.45)25595686
SWANENERGY 184.7(187.25)501778
SYMPHONY 1798.05(1779.8)22046
SYNDIBANK 61.2(60.7)7561945
SYNGENE 569.85(571.75)290859
TAKE 164(165.05)111519
TATACHEM 683.35(688.9)485178
TATACOFFEE 121.75(124.25)1279780
TATACOMM 639.3(639.25)282531
TATAELXSI 1037.65(1010.3)507111
TATAGLOBAL 279.6(278.5)2877987
TATAMOTORS 353.1(354.05)4331145
TATAMTRDVR 196.15(197.35)1945237
TATAPOWER 80.25(80.4)3876762
TATASPONGE 1003.35(1007)89141
TATASTEEL 611.75(620.55)7510951
TBZ 101.5(99.2)164685
TCS 2869.7(2886.9)1174453
TECHM 631.85(639.1)5855371
TECHNO 340.8(343.85)36190
TEXRAIL 89.15(90.05)411677
THERMAX 1179.2(1161.85)68543
THOMASCOOK 275.3(268.05)2016873
TIDEWATER 6407.3(6271.5)3551
TIMKEN 746.5(749.6)14493
TITAN 872.5(865)2486538
TNPL 372.9(354.9)155891
TORNTPHARM 1279.8(1296.55)188495
TORNTPOWER 252.65(250.95)708131
TREEHOUSE 10.7(10.2)253146
TRIDENT 68.95(68.55)349661
TRITURBINE 114.95(113.85)32565
TTKPRESTIG 6608.4(6638)1875
TTML 6.4(6.1)1086669
TV18BRDCST 67.4(67.7)14995904
TVSMOTOR 643.65(642.45)665551
TVSSRICHAK 3397.8(3433.5)2656
TVTODAY 512(534.95)640665
UBL 1023.55(1018)270427
UCOBANK 23.65(23.45)833922
UFLEX 361(351.5)236240
ULTRACEMCO 4189.4(4230.25)188385
UNICHEMLAB 349.9(344.15)77861
UNIONBANK 101.25(102)8990739
UNITECH 6.25(6.05)21212939
UPL 721.15(718.35)683615
VAIBHAVGBL 717.35(692)73556
VAKRANGEE 236.95(226.4)11523595
VEDL 316.95(318.95)9166951
VIDEOIND 15.8(15.4)5328132
VIJAYABANK 56.9(56.65)893689
VINATIORGA 803.5(794.1)12121
VIPIND 312.6(318.5)497813
VOLTAS 640.35(640.85)1384611
VRLLOG 396.6(401.9)103438
VSTIND 2969.6(2964.6)443
VTL 1290.1(1309.55)18348
WABAG 508.85(502.75)121719
WABCOINDIA 7570.3(7574.7)2497
WELCORP 158.65(156.35)325745
WELSPUNIND 61.5(61.4)664690
WHIRLPOOL 1589.45(1565.95)46087
WIPRO 293.4(293.85)4942929
WOCKPHARMA 777.65(793.7)1984376
WONDERLA 353.85(355.25)80678
ZEEL 570.4(576.6)948246
ZEELEARN 38.4(37.6)267049
ZENSARTECH 925.25(894.7)10937
ZYDUSWELL 1231.75(1241.7)6580

సభాపర్వం



అంగన్‌వాడీల్లో.. చిన్నారులకు బయోమెట్రిక్

- 4 జిల్లాల్లో ఇప్పటికే అమలు
- 2 నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా అమలు
- గుడ్డు సైజు తగ్గితే వెనక్కి: మంత్రి
- 180 సంచార పశు వైద్యశాలలు





అమరావతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు కూడా బయోమెట్రిక్ ఏర్పాటు చేస్తున్నామని మహిళాశిశు సంక్షేమ మంత్రి పరిటాల సునీత వెల్లడించారు. ఇప్పటికే నాలుగు జిల్లాల్లో అమలు చేస్తున్నామని, మరో రెండు నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా బయోమెట్రిక్ అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. గురువారం శాసన మండలి ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యుల ప్రశ్నలకు మంత్రి బదులిచ్చారు. ఇప్పటి వరకూ ప్రభుత్వం ఏ జిల్లాలో కూడా మదర్ కమిటీలను నియమించలేదని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. గుడ్డు సైజును కూడా భారీగా తగ్గిస్తున్నారని చెప్పారు. గుడ్డు సైజుల్లో ఎలాంటి తేడా లేదని మంత్రి స్పష్టం చేశారు. 45 గ్రాముల కంటే తక్కువ బరువున్న గుడ్లను వెనక్కి పంపిస్తున్నామని చెప్పారు. కాగా.. రాష్ట్రంలో 180 సంచార పశు వైద్య శాలల ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి ఆదినారాయణరెడ్డి చెప్పారు. 10 లక్షల పశువులకు బీమా కోసం రూ.50 కోట్లు కేటాయించామన్నారు.

ఎమర్జెన్సీ రోగులకూ చాన్సివ్వాలి

ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లో 20 నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారా రోగులు, ఉద్యోగులకు సేవలు అందిస్తున్నామని మంత్రి యనమల రామకృష్ణుడు చెప్పారు. కొన్ని రోగాలకు మాత్రమే ఆ ఆసుపత్రుల్లో వైద్యం చేస్తున్నారని, ఎమర్జెన్సీ రోగులకు అక్కడ వైద్యం చేయించుకునే అవకాశం కల్పించాలని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి కోరారు. పరిశీలిస్తామని యనమల హామీఇచ్చారు.

మిగులు విద్యుత్ రాష్ట్రంగా ఏపీ: కళా

అమరావతి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పదేళ్ల కాంగ్రెస్ పాలనలో విద్యుత్ సరఫరా, ఉత్పత్తి విషయంలో రాష్ట్రం లోటులో ఉంటే సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన నెలలోనే.. దాన్ని భర్తీచేసి మిగులుకు చేరామని విద్యుత్‌శాఖ మంత్రి కిమిడి కళా వెంకట్రావు అన్నారు. గురువారం అసెంబ్లీలో 344 నియమం కింద 'ఇంధన రంగంలో నూతన ప్రేరణలు, పొదుపు' అంశంపై చర్చ చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో మెరుగైన విద్యుత్ సరఫరా, ఉత్పతి కోసం ఏడీబీ నుంచి రూ.15వేల కోట్ల రుణం తీసుకుంటున్నామని చెప్పారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చే నాటికి రాష్ట్రంలో 22వేల మిలియన్ యూనిట్ల విద్యుత్ కొరత ఉందని, ఈ సమస్యను తమ ప్రభుత్వం నెలలోనే అధిగమించిందని చెప్పారు. 2019నాటికి 29 రాష్ట్రాల్లో విద్యుత్ సరఫరాలో నష్టం సగటు 18శాతంగా ఉండేలా కేంద్రం చర్యలు తీసుకుంటోందని.. ఏపీలో ఇప్పటికే ఇది 9.11శాతంగా ఉండటం చాలా గొప్ప విషయమని ఆయన వివరించారు.

రాష్ట్రంలో డ్రైవర్ల కొరత లేదు

రాష్ట్రంలో డ్రైవర్ల కొరత వల్ల వాహనాలు ఎక్కడా నిలిచిపోలేదని రవాణా మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో ఏపీకి చెందిన వారు చాలా మంది హైదరాబాద్‌లో లైసెన్సులు తీసుకున్నారని, వారు ఇప్పుడు ఏపీలో పనిచేస్తున్నారని చెప్పారు. గురువారం అసెంబ్లీలో స్వల్పకాలిక ప్రశ్నపై ఆయన సమాధానమిచ్చారు. రాష్ట్రంలో ఎల్‌ఎల్‌ఆర్‌ల జారీకి ప్రత్యేక మేళాలు నిర్వహిస్తున్నామన్నారు. 8 లక్షల మంది డ్రైవర్లకు బీమా వర్తింపజేస్తున్నామన్నారు. ఇదే అంశంపై ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర మాట్లాడుతూ.. వాహనాల విక్రయాలు ఏటా 10 శాతం పెరుగుతుంటే, డ్రైవర్ల సంఖ్య మాత్రం తగ్గిపోతోందన్నారు. డ్రైవర్లను సంఘటిత రంగంలోకి తీసుకురావాలని కోరారు.

7.7 లక్షల మందికి నైపుణ్యాభివృద్ధి

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకూ 7.7లక్షల మందికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇప్పించినట్లు యువజన సర్వీసుల మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఇంజనీరింగ్ కళాశాలల్లో 1.99 లక్షల మందికి, డిగ్రీ కళాశాలల్లో 3.3 లక్షల మందికి, నాన్ అకడమిక్ రంగంలో 1.7 లక్షల మందికి శిక్షణ ఇప్పించామన్నారు. 2017-18లో 6 లక్షల మందికి నైపుణ్య శిక్షణ ఇప్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

అసెంబ్లీకి 3 రోజుల ఉగాది సెలవులు

అమరావతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఉగాది సందర్భంగా అసెంబ్లీ సమావేశాలకు శనివారం నుంచి సోమవారం వరకు మూడు రోజులు సెలవులు ఇవ్వనున్నారు. అనంతపురం జిల్లాకు చెందిన మంత్రి కాల్వ శ్రీనివాసులు, శాసనమండలి చీఫ్ విప్ పయ్యావుల కేశవ్ గురువారం ఇక్కడ శాసనసభా వ్యవహారాల మంత్రి యనమల రామకృష్ణుడును కలిశారు. రాయలసీమలో ఉగాది పెద్ద పండగని, వేడుకగా చేసుకొంటారని, ఆ రోజు సమావేశాలకు రాలేమని, సోమవారం కూడా అదనంగా సెలవు ఇవ్వాలని కోరారు. ఈ విషయం సీఎంకు వివరించడంతో ఆయన ఓకే చెప్పారు. దీని బదులు వచ్చే వారంలో శనివారం అదనంగా సమావేశాలు నిర్వహించనున్నారు.

భృతి కోసం వెయ్యి కోట్లు

- 10 లక్షల మంది నిరుద్యోగులు
- త్వరలోనే అమలుకు చర్యలు
- అసెంబ్లీలో మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి





అమరావతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుమారు 10 లక్షల మంది నిరుద్యోగ యువత ఉన్నారని యువజన సంక్షేమశాఖ మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. నిరుద్యోగ భృతి కోసం గతేడాది బడ్జెట్‌లో రూ.500 కోట్లు, తాజా 2018-19 బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు పెట్టినట్లు వివరించారు. అలాగే.. వారందరికీ వివిధ రంగాల్లో శిక్షణ ఇప్పించి, ఉపాధి కల్పించే దిశగా కార్యక్రమాలు అమలుచేస్తున్నామన్నారు. నిరుద్యోగ భృతి అమలుకోసం మంత్రుల బృందాన్ని ప్రభుత్వం నియమించిందని, వారి నివేదికను అనుసరించి త్వరలోనే భృతిని అమల్లోకి తీసుకొస్తామని తెలిపారు. యువతకు ఆర్థిక సాయం అంశంపై వైసీపీ సభ్యులు రాజన్న దొర, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, జగ్గిరెడ్డిలు లేవనెత్తిన ప్రశ్న గురువారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో చర్చకు రాగా మంత్రి సమాధానమిచ్చారు. కాగా మూడున్నరేళ్లు అయినా కచ్చితంగా ఎంతమంది నిరుద్యోగులు ఉన్నారో తేల్చలేకపోవడం దురదృష్టకరమని బీజేపీ శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్ రాజు అన్నారు. చివరి బడ్జెట్ కాబట్టి నిరుద్యోగ భృతికి నిధులు కేటాయించారని విమర్శించారు. విద్యార్థినులపై వేధింపులను అరికట్టేందుకు అన్ని రకాలు చర్యలు తీసుకుంటున్నట్లు ఉపముఖ్య మంత్రి ఎన్.చినరాజప్ప తెలిపారు. ర్యాగింగ్ నిరోధక చట్టాన్ని కళాశాలలు, పాఠశాలల్లో అమలుచేస్తున్నామన్నారు. షీ టీమ్‌లను తిప్పినా పాఠశాలల వద్ద విద్యార్థినులపై వేధింపులు ఆగడం లేదని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తంచేశారు.

బుడగ జంగాల కులమేంటి?

బుడగ జంగాలకు కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో దయనీయ స్థితిని ఎదుర్కొంటున్నారని సభ్యులు ప్రభాకర్ చౌదరి, ఎస్వీ మోహన్‌రెడ్డి, సూర్యారావు, బోడె ప్రసాద్ ఆవేదన వ్యక్తంచేశారు. సాంఘిక సంక్షేమ మంత్రి నక్కా ఆనంద్‌బాబు స్పందిస్తూ.. వైఎస్ ప్రభుత్వం ఇచ్చిన 144 జీవో వల్ల బుడగ జంగాల విషయంలో గందరగోళం ఏర్పడిందన్నారు. దీనిపై ఏకసభ్య కమిషన్ వేశామని తెలిపారు.

ప్రతి ఇంటి ముందు సీసీ రోడ్డు

2019 నాటికి ప్రతి ఇంటి ముందు సీసీ రోడ్డు నిర్మిస్తామని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి లోకేశ్ తెలిపారు. 2014 నుంచి ఇప్పటివరకూ గ్రామాల్లో 15 వేల కి.మీ. సీసీ రోడ్లు నిర్మించిన ఘనత టీడీపీకి దక్కుతుందన్నారు. 2019 నాటికి ప్రతి ఇంటికి కుళాయి ద్వారా రక్షిత తాగునీరు అందిస్తామని తెలిపారు. ఫ్లోరైడ్ రహిత గ్రామాలను తీర్చిదిద్దుతామని చెప్పారు.

ప్రజలందరికీ పాదాభివందనం

- ఈ 40 ఏళ్లలో ఎన్నో సంక్షోభాలు అవకాశాలుగా మలుచుకున్నా
- ఇదో అరుదైన అనుభవం.. అనుభూతి
- ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

అమరావతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): 'ఇదో అరుదైన అనుభవం.. అరుదైన అనుభూతి. రాజకీయ నాయకుడిగా కాదు... ప్రజాసేవకుడిగా మాట్లాడుతున్నాను.. 40 ఏళ్ల రాజకీయ జీవితం పూర్తి చేసుకున్న సందర్భాన్ని గుర్తు చేసుకుంటే చాలా తృప్తినిస్తోంది. తోటి సభ్యులు, మిత్రులంతా వివిధ సందర్భాల్లో నాతో పనిచేసిన అనుభవాలను గుర్తుచేశారు. పాత జ్ఞాపకాలన్నీ గుర్తొచ్చాయి. ఈ అవకాశాన్ని ఇచ్చిన తెలుగు ప్రజలందరికీ పాదాభివందనం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు భావోద్వేగంతో అన్నారు. ఆయన అసెంబ్లీలో అడుగుపెట్టి 40 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం ప్రవేశపెట్టిన అభినందన తీర్మానంపై పలువురు సభ్యులు మాట్లాడిన అనంతరం ముఖ్యమంత్రి ప్రసంగించారు.

జీవిత విశేషాలు పంచుకున్న సీఎం..

తన తల్లిదండ్రుల కంటే ఎన్టీఆర్‌నే గొప్పగా గుర్తుపెట్టుకుంటానని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ సందర్భంగా తన జీవిత విశేషాలను పంచుకున్నారు. 'ప్రజలు అనునిత్యం అండగా ఉన్నారు.. ఆశీర్వదించారు.. సహకరించారు.. అదే సమయంలో ఎన్టీఆర్ నుంచి ఎంతో నేర్చుకున్నాను. క్రమశిక్షణ, కఠోర శ్రమ, నిరంతరం ప్రజల గురించి ఆలోచన, ఇంకా చేయాలనే తపన, ధైర్యంగా ముందుకెళ్లే చొరవ నేర్చుకున్నాను. ఆయన జీవితం నాకెంతో స్ఫూర్తిదాయకం' అని తెలిపారు. పార్లమెంటులో టీడీపీ ప్రధాన ప్రతిపక్షంగా ఉండటం, దేవెగౌడ, గుజ్రాల్‌లను ప్రధానులుగా నియమించిన సందర్భం, రాష్ట్రపతిగా అబ్దుల్ కలాంను ఎన్నుకోవడం వంటి వాటిని గుర్తు చేసుకున్నారు.

పనిలోనే ఆనందం..


'నేను కష్టపడితే ఐదు కోట్ల మంది సుఖపడతారు. నేను కష్టపడకపోతే వారు కష్టపడతారు. పాదయాత్రలో 208 రోజులు ఎన్నో అనుభవాలు చూశాను. ఆడబిడ్డల అవస్థలు చూసి అందరికీ గ్యాస్ ఇచ్చాం. నాకు అలసట లేదు. పనిలోనే ఆనందం వెతుక్కుంటాను. ఎంత పనిచేస్తే అంత ఎనర్జీ చార్జి అవుతుంది. చంద్రగిరి ప్రజలు తొలిసారి నన్ను గెలిపించారు. తర్వాత కుప్పం నియోజకవర్గానికి వెళ్లాను. ఏడాదికి ఒక్కసారే వెళ్లినా వాళ్లంతా బ్రహ్మాండంగా గెలిపించారు. ఆ రెండు నియోజకవర్గాల ప్రజలకు ధన్యవాదాలు.'

నాలా ఎవరూ కష్టపడి ఉండరు..

'40 ఏళ్లలో ఎన్నో అనుభవాలు, ఎన్నెన్నో అవకాశాలు, మరెన్నో అవరోధాలు, సంక్షోభాలు.. ఇంకా చాలా సువర్ణ అధ్యాయాలు. నా జీవితంలో నేను కష్టపడినట్లు మరే రాజకీయ నాయకుడూ కష్టపడ్డారని నేననుకోను. నాకు ఎదురైనన్ని సవాళ్లు ఎవరికీ వచ్చి ఉండవు. సంక్షోభాలను అవకాశాలుగా మలచుకున్నాను. నాకు భయం లేదు.. స్వార్థం లేదు.. నన్ను నమ్ముకున్న ప్రజల కోసం ఎలాంటి త్యాగాలైనా చేస్తాను. నా బాధ్యతల్లో లోపముంటే సవరించుకుంటూ ముందుకు పోవడమే తప్ప వెనక్కి చూడలేదు. కార్యకర్తలు నన్ను తమ కుటుంబం కంటే ఎక్కువగా ఆదరించారు. కష్టాల్లో తోడుగా ఉన్నారు. కుటుంబం కంటే ఎక్కువగా కార్యకర్తలతోనే గడిపాను. నా ఎదుగుదలకు కారణం వారే.'

ఎన్నో ఒడిదుడుకులు..

'మధ్యతరగతి కుటుంబంలో పుట్టాను. ప్రభుత్వ బడిలో చదువుకున్నాను. వాగుల్లో, వంకల్లో నడిచి వెళ్లి మరీ చదివాను. విద్యార్థి నాయకుడిగా ఎదిగాను. ఊళ్లో అనేక కార్యక్రమాలు చేశాను. దివిసీమ ఉప్పెన, నెల్లూరు, చిత్తూరుల్లో తుఫానులు వచ్చినప్పుడు.. పాత బట్టలు, వస్తు సామగ్రి సేకరించి పంపిణీ చేసినప్పుడు విద్యార్థిగా నాకెంతో ఆనందంగా ఉండేది. ఎస్వీయూ వీసీ పిలిచి నువ్వు బాగా పనిచేస్తున్నావు. లెక్చరర్ ఉద్యోగానికి దరఖాస్తు చేస్తే ఉద్యోగమిస్తామన్నారు. లెక్చరర్‌గా జాయిన్ అవడానికి సిద్ధంగా లేనని, ఎమ్మెల్యే అవుతున్నానని, పోటీ చేస్తున్నానని చెప్పాను. ఇంత నమ్మకమేంటని ఆయన అడిగారు. మీకు ఎమ్మెల్యేగా కనబడతానని చెప్పాను. చిన్న వయసులోనే ఎమ్మెల్యే అయ్యాను. 1980లో మంత్రినయ్యాను. 1983 వరకు కొనసాగాను. మంత్రిగా ఉన్నప్పుడే ఎన్టీఆర్ కుమార్తె భువనేశ్వరిని పెళ్లిచేసుకున్నాను. మద్రాసులో వివాహం జరిగింది. ఆ రోజు చిత్తూరు జిల్లా నుంచి అందరినీ పెళ్లికి పిలిచాను. ఎన్టీఆర్ కాబట్టి చాలా మంది పెళ్లికి వచ్చారు. లోకేశ్ వివాహ సమయంలో లుంబినీ పార్కులో పేలుళ్లు జరిగాయి. ఎంతో బాధాకరమైన ఘటన. అది విన్న వెంటే బట్టలు మార్చుకుని బయటకు వెళ్లిపోయాను.'



నా వెనుక సతీమణే..

'40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో.. భువనేశ్వరి తన తండ్రి అధికారంలో ఉన్నప్పుడు గానీ, నేను సీఎంగా ఉన్నప్పుడు గానీ ఏనాడూ సీఎం కుమార్తెగా, భార్యగా ఆలోచించలేదు. సామాన్య మహిళగానే ఆలోచించి తన పని తాను చూసుకుని ముందుకెళ్లారు. నేనింత ధైర్యంగా పనిచేయగలుగుతున్నానంటే అందుకు ప్రధాన కారణం ఆమే. నాకే సమస్యలూ రాకుండా చూసుకోవడంతో పాటు లోకేశ్ చదువు వ్యవహారమంతా ఆమే చూసుకున్నారు. కంపెనీ, ఇంటి బాధ్యతలు ఎంతో సమర్థంగా నిర్వహించారు. ఒకరినొకరు అర్థం చేసుకుంటూ ముందుకెళ్తున్నాం. లోకేశ్, బ్రాహ్మణిని బాగా చదివించాలని నా సతీమణి పట్టుబట్టారు. వారిని స్టాన్‌ఫర్డ్‌కు పంపించడంలో ఆమె కృషే ఉంది. జీవితంలో భువనేశ్వరి కోరుకునేది కొద్దిగా వారితో సమయం కేటాయించాలని. ఆ కోరిక మాత్రం నెరవేర్చలేకపోతున్నాను. అవినీతి నిర్మూలన చేయాలంటే సంస్కరణలు తేవాలి. నగదు లావాదేవీలు అరికడితేనే అవినీతి తగ్గుతుందని ప్రధాని మోదీకి నేనే చెప్పాను. రూ.2 వేల నోట్లు అందుబాటులోకి తెచ్చి ఖర్చు చేయవద్దంటే ఊరుకుంటారా? రాజకీయాల్లో అవినీతిని అంతం చేసే వరకు పోరాటం చేస్తాను.'


నవతరం నాయకులకు.. చంద్రబాబు పాఠ్యగ్రంథం

- ఎమ్మెల్యేగా చట్టసభలో అడుగుపెట్టి 40 ఏళ్లయిన సందర్భంగా అసెంబ్లీ తీర్మానం

అమరావతి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): రాజకీయ జీవితంలో ఎన్నో సవాళ్లు, సంక్షోభాలు ఎదుర్కొని, వాటిని అవకాశాలుగా మలుచుకుని ఈ 40 ఏళ్ల ప్రస్థానంలో దార్శనిక నేతగా ఎదిగారంటూ సీఎం చంద్రబాబును అభినందిస్తూ అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. చంద్రబాబు చట్టసభలో అడుగుపెట్టి 40 ఏళ్లయిన సందర్భంగా మంత్రి యనమల రామకృష్ణుడు గురువారం ఈ అభినందన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

తీర్మానంలోని ముఖ్యాంశాలు...

- దేశంలో అందరికంటే అనుభవజ్ఞుడు. తెలుగుజాతి అందరికంటే ఎక్కువగా అక్కున చేర్చుకున్న నేతగా చరిత్రలో నిలిచిపోతారు.
- కఠోర పరిశ్రమ, క్రమశిక్షణ, విలువలతో కూడిన జీవనశైలి, వ్యక్తిత్వం ఉన్న నాయకుడు.
- నమ్మిన సిద్ధాంతం కోసం ఎంతటివారినైనా ఎదిరించే తత్వం.
- బీసీలకు 33% స్థానిక రిజర్వేషన్ కల్పించారు.
- నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్ ఏర్పాటులో ముఖ్య భూమిక వహించారు.
- ఇద్దరు ప్రధానుల ఎంపికలో ముఖ్యపాత్ర.
- రాష్ట్రపతులుగా కేఆర్ నారాయణన్, అబ్దుల్ కలాం ఎంపికలో ప్రధానపాత్ర.
- ప్రజా సమస్యలు తెలుసుకోవడం కోసం 208 రోజులు 2,817 కిలోమీటర్ల పాదయాత్ర.
- ప్రజాభీష్టం మేరకు ప్రజా రాజధాని ప్రకటన.
- అవినీతి రహిత పాలన కోసం ఈ-గవర్నెన్స్‌ను ప్రవేశపెట్టిన ఆదర్శ ముఖ్యమంత్రి.
- నవతరం రాజకీయ నాయకులకు చంద్రబాబు ఒక పాఠ్యగ్రంథం. ప్రజాజీవితంలోకి రావాలనుకునే వారికి స్ఫూర్తిప్రదాత.
- స్వర్ణాంధ్ర స్వప్నం సాకారం కావాలి. నిండు నూరేళ్లు సంపూర్ణ ఆయురారోగ్యంతో జీవించాలి. ప్రజానేతగా మరిన్ని కీర్తి శిఖరాలను అధిరోహించాలి.



పింఛన్ కోసం 'బతికి'ంచారు

- లైఫ్ సర్టిఫికెట్‌తో మృతురాలికి 14 నెలలుగా పింఛన్
- పిడుగురాళ్ల ట్రెజరీలో వెలుగుచూసిన మోసం

పిడుగురాళ్ల, మార్చి 15: చనిపోయిన మనిషికి లైఫ్ సర్టిఫికెట్ సంపాదించి 14 నెలలుగా పింఛన్ స్వాహా చేస్తున్న వ్యవహారం గుంటూరు జిల్లాలో కలకలం రేపింది. రాజుపాలెం మండలం అనుపాలెం గ్రామానికి చెందిన తల్లం సైదులు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసి 1994లో రిటైరయ్యారు. సైదులు 2005లో మరణించడంతో అప్పటి నుంచి ఆయన భార్య తల్లం తులశమ్మ పెన్షన్ పొందుతున్నారు. తులశమ్మ పెన్షన్ ఐడీ 06027195. బ్యాంక్ అకౌంట్‌నంబరు 10731004862(ఎస్‌బీఐ). అనారోగ్యంతో తులశమ్మ కూడా 2016 డిసెంబరు 24న మరణించారు. అయితే ఆమె పింఛన్ కోసం ఈ విషయాన్ని కుటుంబసభ్యులు దాచిపెట్టారు. 2017 ఫిబ్రవరిలో ఆమె పేరిట లైఫ్ సర్టిఫికెట్ సంపాదించారు. దాన్ని పిడుగురాళ్లలోని ట్రెజరీ కార్యాలయంలో సమర్పించడంతో ఇప్పటికీ ఆమె ఖాతాలో పింఛన్ జమవుతోంది. ఎప్పటికప్పుడు ఏటీఎం కార్డుతో ఆ పింఛన్‌ను స్వాహా చేస్తున్నారు. నెలకు రూ.18,733 చొప్పున ఈ 14 నెలల్లో రూ.2.60 లక్షలకు పైగా ఆమె ఖాతాలో జమ అయ్యింది. 2017 ఆగస్టు 3న కూడా ఆ అకౌంట్ నుంచి రూ.15వేలు డ్రా చేశారు. సాధారణంగా లైఫ్ సర్టిఫికెట్ సమర్పించే సమయంలో పెన్షనర్ ట్రెజరీకి రావాల్సి ఉంటుంది. ట్రెజరీ అధికారులు లైఫ్ సర్టిఫికెట్‌ను పరిశీలించడంతో పాటు, పెన్షనర్ వివరాలను సేకరిస్తారు. మరణించిన తులశమ్మ లైఫ్ సర్టిఫికెట్ తీసుకొనే సమయంలో పిడుగురాళ్ల ట్రెజరీ అధికారులు ఏం చేశారన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఈ వ్యవహారంలో ట్రెజరీ అధికారుల హస్తంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విషయం బయటకు పొక్కడంతో ట్రెజరీ అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. తులశమ్మ బంధువులను హడావుడిగా కార్యాలయానికి పిలిపించి మంతనాలు జరిపారు. విషయం బయటకు రాకుండా చూసేందుకు ప్రలోభాలకు కూడా గురిచేసినట్టు సమాచారం.

డయాలసిస్‌కు బ్రేక్!

- అర్ధంతరంగా నిలిపేసిన నిర్వహణ సంస్థ
- 8 గంటలపాటు రోగులు ఇబ్బందులు
- ఎనిమిది బోధనాస్పత్రుల్లో ఇదే పరిస్థితి
- అధికారుల చొరవతో తప్పిన ప్రమాదం



కర్నూలులో డయాలసిస్ కేంద్రం

అమరావతి, నెట్‌వర్క్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డయాలసిస్ రోగులకు పెను ప్రమాదమే తప్పింది. సర్వీస్ ప్రొవైడర్ అయిన నెఫ్రోప్లస్ సంస్థ 8 బోధనాస్పత్రుల్లో గురువారం ఉదయం డయాలసిస్ సేవలను అర్ధాంతరంగా నిలిపివేసింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 500 మంది రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న డీఎంఈ అధికారులు సమస్యను వెంటనే పరిష్కరించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 8 గంటలపాటు నెలకొన్న హైడ్రామాకు మధ్యాహ్నం 2 గంటలకు తెరపడింది. వివరాల్లోకి వెళితే... రాష్ట్రవ్యాప్తంగా 11 బోధనాస్పత్రుల్లో కిడ్నీ రోగులకు ఉచితంగా డయాలసిస్ సేవలు అందిస్తున్నారు. వాటిల్లో అనంతపురం, కడప, ఒంగోలు, నెల్లూరు బోధనాసుపత్రుల్లో బీబ్రాన్ సంస్థ సేవలు అందిస్తోంది. మిగిలిన ఏడు ఆస్పత్రులతోపాటు విశాఖలోని విమ్స్‌లో నెఫ్రోప్లస్ అనే సంస్థ దీన్ని నిర్వహిస్తోంది. గతంలో ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా రోగులకు డయాలసిస్ సేవలందించేవారు. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిది ఆస్పత్రుల్లో డయాలసిస్ కేంద్రాలను నేషనల్ హెల్త్ మిషన్ నిధులతో నడపాలని నిర్ణయించింది. ఫిబ్రవరి వరకూ అలాగే నడిపించింది. కానీ అర్బన్ ప్రాంతాల్లోని బోధనాస్పత్రుల్లో డయాలసిస్ సేవలకు నేషనల్ హెల్త్ మిషన్ నిధులు ఇవ్వలేమని చెప్పింది. దీంతో ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు గతంలో మాదిరిగానే ఎనిమిది డయాలసిస్ కేంద్రాలను ఎన్టీఆర్ వైద్యసేవ పరిధిలోకి తీసుకురావాలని భావించారు. ఈ మేరకు మార్చి 1 నుంచి 8 కేంద్రాలను ఎన్టీఆర్ వైద్య సేవ పరిధిలోకి తీసుకురావాలని నెఫ్రోప్లస్ సంస్థకు సూచించింది. నిబంధనల ప్రకారం డయాలసిస్ కేంద్రాలు ఆస్పత్రుల సూపరింటెండెంట్ పర్యవేక్షణలో నడుస్తాయి. ఎన్టీఆర్ వైద్యసేవ నుంచి మార్చి 1న నెఫ్రోప్లస్‌కు సమాచారం వచ్చింది. కానీ ఆ సంస్థ ప్రతినిధులు సూపరింటెండెంట్లకు సమాచారం ఇవ్వలేదు. కేంద్రంలో ఉన్న సంస్థ మేనేజర్లు మార్చి 7న సూపరింటెండెంట్ల వద్దకు వ్యక్తిగతంగా వెళ్లి సమాచారం ఇచ్చారు. కానీ ఎన్టీఆర్ వైద్య సేవ నుంచి వచ్చిన ఆర్డర్ మాత్రం అందించడం లేదు. ఆర్డర్ లేకపోవడంతో సూపరింటెండెంట్లు కూడా పట్టించుకోలేదు. దీంతోపాటు మెడికోలు బయోమెట్రిక్ వేయకపోవడంతో నెఫ్రోప్లస్ సంస్థ గురువారం అర్ధాంతరంగా డయాలసిస్ సేవలను నిలిపివేసింది. దీంతో విశాఖ, కాకినాడ, విజయవాడ, గుంటూరు వంటి పెద్దాసుపత్రుల్లో డయాలసిస్ సేవలు నిలిచిపోయాయి.

ఆర్థిక భారం: నెఫ్రోప్లస్

8 ఆస్పత్రుల్లోని డయాలసిస్ కేంద్రాలను మార్చి 1 నుంచి ఎన్టీఆర్ వైద్య సేవ పరిధిలోకి తీసుకువచ్చినట్లు తమకు సమాచారం ఉందని, కానీ మార్చి 7నే పూర్తి ఆర్డర్లు అందాయని నెఫ్రోప్లస్ సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. ఎన్టీఆర్ వైద్య సేవల నుంచి ఆదేశాలువచ్చిన వారం లేదా 10 రోజుల్లో తాము దీన్ని అమలు చేయాలని, లేకుంటే బిల్లులు నిలిచిపోతాయని సంస్థ ప్రతినిధులు అంటున్నారు. ఈ విషయం ఉన్నతాధికారులకు చెప్పినా పట్టించుకోలేదని, గత్యంతరం లేని పరిస్థితుల్లోనే సేవలు నిలిపేశామని చెబుతున్నారు. ఇప్పటికే మార్చి 7 నుంచి గురువారం వరకూ కొన్ని వేల మందికి డయాలసిస్ చేశామని, దానికి సంబంధించిన బిల్లులు వస్తాయో రావో కూడా తెలీదని అంటున్నారు. ఈ సమయంలో ఇంకా తాము డయాలసిస్ సేవలు కొనసాగిస్తే ఆ ఆర్థిక భారం మొత్తం తమ సంస్థ భరించాల్సి వస్తుందని నెఫ్రోప్లస్ సంస్థ ప్రతినిధులు చెప్పారు.

రోగులకే ఇబ్బందులు..

ఏదేమైనా అధికారుల నిబంధనలు, సంస్థ నిర్లక్ష్యం కారణంగా కిడ్నీ రోగులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. డయాలసిస్ సేవలు ప్రతిరోజూ ఉదయం 6 గంటలకు ప్రారంభమై రాత్రి 10 వరకూ కొనసాగుతాయి. ఒక్క మిషన్ ద్వారా రోజుకు 4 రోగులకు డయాలసిస్ చేస్తారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 8 డయాలసిస్ కేంద్రాల్లో సుమారు 1300 మంది సేవలు పొందుతున్నారు. ప్రతి రోజు సుమారు 400 నుంచి 500 మందికి ఈ సేవలు అందించాలి. నెఫ్రోప్లస్ గురువారం తీసుకున్న నిర్ణయం కారణంగా సుమారు 8 గంటలపాటు సేవలు నిలిచిపోయాయి.




ఆదరణ పథకం లోగోను ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు

బడుగులకు 'ఆదరణ'

- 750 కోట్లతో పథకాన్ని ప్రారంభించిన సీఎం
- బీసీలు, చేతివృత్తిదారులకు పనిముట్ల పంపిణీ

అమరావతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ఆదరణ పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. గురువారం విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో బీసీ సంక్షేమ శాఖ ఏర్పాటుచేసిన భారీ కార్యక్రమం ఇందుకు వేదికైంది. పథకాన్ని లాంఛనంగా ప్రారంభించిన అనంతరం సీడీని సీఎం ఆవిష్కరించారు. వెనుకబడిన కులాలు, చేతివృత్తుల వారికి పనిముట్లు, ఉపకరణాలను పంపిణీ చేశారు. అనంతరం 20కిపైగా ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను సీఎం సందర్శించారు. రూ.750 కోట్లతో రెండున్నర లక్షల మందికి ఆదరణ పథకంతో లబ్ధి చేకూరుస్తామని సీఎం చెప్పారు. వచ్చే ఏడాది వెయ్యి కోట్లు కేటాయిస్తామన్నారు. బీసీల సంక్షేమానికి ఈ ఏడాది సబ్‌ప్లాన్ ద్వారా రూ.11 వేల కోట్లు కేటాయించామని చెప్పారు. వృత్తిదారులు నూతన టెక్నాలజీని వినియోగించుకోవాలని, త్వరలో కులం వారీగా, జనాభా దామాషా ప్రకారం కార్యక్రమాలు చేపడుతామని చెప్పారు. బీసీలు తొలి నుంచి టీడీపీ వెన్నంటే ఉన్నారని, వారి సంక్షేమానికి పాటుపడి నిజాయితీని నిరూపించుకుంటామని పేర్కొన్నారు. పథకం అమలులో అవినీతి జరగడానికి వీల్లేదన్నారు. పేదవాడి పొట్ట కొట్టడం నీచమైన, దుర్మార్గమైన పని అనిమండిపడ్డారు. కాల్‌సెంటర్‌కు ఫోన్‌చేసి నిర్మొహమాటంగా వివరాలు ఇవ్వాలని కోరారు. 'మీలో కొందరు రిప్లై ఇవ్వడం లేదు. మీరు నాకంటే బిజీగా ఉంటున్నారు' అని సీఎం చమత్కరించారు. త్వరలో ప్రజలతో టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడతానని చెప్పారు. కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, మంత్రులు అచ్చెన్నాయుడు, పితాని సత్యనారాయణ, దేవినేని ఉమ, బీసీ కులాల ఫెడరేషన్ల అధ్యక్షులు, అధికారులు పాల్గొన్నారు. ఉదయం 10 గంటలకే ప్రారంభమవ్వాల్సిన కార్యక్రమం, సీఎం రాత్రి 7:03 గంటలకు హాజరవడంతో కార్యక్రమానికి వచ్చిన బీసీ గురుకులాల విద్యార్థినులు, వయోవృద్ధులు, వృత్తిదారులు, మహిళలు దాదాపు 9 గంటలు నిరీక్షించారు.

క్వార్టర్స్‌లో సింధు



సా. 4.30నుంచి స్టార్‌స్పోర్ట్స్-2లో..

మెరుగుపడాలి..

క్వార్టర్‌ఫైనల్‌కు తన ఆట తీరు మెరుగుపడాల్సి ఉంటుందని మ్యాచ్ అనంతరం సింధు చెప్పింది. 'నా ఆట ఇంకా మెరుగుపడాల్సి ఉంటుంది. క్లిష్టమైన రెండో రౌండ్‌ను గట్టెక్కినందుకు సంతోషంగా ఉంది. పూర్తి విశ్రాంతి తీసుకుని శుక్రవారం మ్యాచ్‌కు బాగా సన్నద్ధమవుతా' అని తెలిపింది.

మూడు సెట్ల పోరులో థాయ్ ప్రత్యర్థిపై గెలుపు • ప్రణయ్ కూడా ముందంజ

బర్మింగ్‌హామ్: భారత అగ్రశ్రేణి షట్లర్ పీవీ సింధు ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్ క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించింది. ఆమెతోపాటు మరో ఆటగాడు హెచ్‌ఎస్ ప్రణయ్ కూడా తుది ఎనిమిది మందిలో ప్రవేశించాడు. గురువారం జరిగిన ప్రీక్వార్టర్ ఫైనల్లోనూ ఒలింపిక్, వరల్డ్ చాంపియన్‌షిప్ రజత పతక విజేత సింధు మూడు సెట్లపాటు పోరాడాల్సి వచ్చింది. అయితే అనుభవాన్ని రంగరించిన ఆమె 21-13, 13-21, 21-18 స్కోరుతో థాయ్‌లాండ్‌కు చెందిన నిచాన్ జిందాపోల్‌ను చిత్తు చేసింది. పురుషుల రెండో రౌండ్‌లో ప్రపం చ 16వ ర్యాంక్ ప్రణయ్ 21-10, 21-19 స్కోరుతో టామి సుగియార్తొ (ఇండోనేసియా)పై సునాయాసంగా గెలుపొందాడు. బుధవారం అర్ధరాత్రి జరిగిన తొలి రౌండ్‌లో ప్రణయ్ 9-21, 21-18, 21-18 స్కోరుతో ఎనిమిదో సీడ్ చౌ తీన్ చెన్ (తైపీ)పై నెగ్గాడు. సింధు క్వార్టర్‌ఫైనల్లో ఏడోసీడ్ నజోమి ఒకుహరతో తలపడుతుంది. ఒకుహర రెండో రౌండ్‌లో 21-13, 21-15 స్కోరుతో ఫిత్రియాని (ఇండోనేసియా)పై సునాయాసంగా విజయం సాధించింది. సింధుపై ఒకుహర 5-4తో మెరుగైన రికార్డు కలిగి ఉండడం గమనార్హం. అత్యంత హోరాహోరీగా సాగిన వరల్డ్ చాంపియన్‌షిప్ ఫైనల్లో సింధుపై ఒకుహర నెగ్గిన సంగతి తెలిసిందే. జిందాపోల్‌తో గంటా ఏడు నిమిషాల మ్యాచ్‌లో ప్రపం చ మూడో ర్యాంకర్ సింధు తొలి గేమ్‌ను 19 నిమిషాల్లోనే కైవసం చేసుకుంది. అయితే రెండో గేమ్‌లో జిందాపోల్ అద్భుతంగా పోరాడింది. దూకుడుగా ఆడిన ఆమె 7-3 ఆధిక్యం ప్రదర్శించింది. మరోవైపు సింధు ఆట దిగజారింది. దీనిని సద్వినియోగం చేసుకున్న జిందాపోల్ 17-13తో నాలుగు పాయింట్ల ఆధిక్యంతో సింధును ఒత్తిడిలోకి నెట్టింది. అదే ఊపుతో మరో నాలుగు పాయింట్లు చేజిక్కించుకొని గేమ్‌ను సొంతం చేసుకోవడం ద్వారా మ్యాచ్‌లో ఉత్కంఠ రేపింది. రెండో గేమ్ పరాజయ ప్రభావం ఏమాత్రం దరిచేరనీయని సింధు..నిర్ణాయక గేమ్‌లో ఏకంగా 8-4తో ముందంజ వేసింది. కానీ జిందాపోల్ పుంజుకొని 9-9తో స్కోరు సమం చేసింది. అనంతరం 15-12 ఆధిక్యంలోకి దూసుకుపోయి మ్యాచ్‌ను సొంతం చేసుకొనేలా కనిపించింది. కానీ సింధు ఏ మాత్రం ఒత్తిడికి లోను కాకుండా షాట్లలో కచ్చితత్వం ప్రదర్శించింది. 17-18 నుంచి వరుసగా నాలుగు పాయింట్లు రాబట్టి మ్యాచ్‌ను ముగించడం ద్వారా క్వార్టర్‌ఫైనల్‌కు చేరింది.

శ్రీకాంత్ అవుట్



మూడోసీడ్ కిడాంబి శ్రీకాంత్‌కు ప్రీక్వార్టర్ ఫైనల్లో పరాజయం ఎదురైంది. చైనాకు చెందిన 42వ ర్యాంక్ ఆటగాడు హాంగ్ యు జియాంగ్‌తో పోటాపోటీగా జరిగిన రెండో రౌండ్‌లో శ్రీకాంత్ 11-21, 21-15, 20-22 స్కోరుతో కంగుతిన్నాడు. హాంగ్ క్వార్టర్ ఫైనల్లో భారత్‌కు చెందిన ప్రణయ్‌ను ఢీకొంటాడు.

సాత్విక్ జోడీ ఓటమి

పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ షెట్టి జోడీ 16-21, 21-16, 21-23 స్కోరుతో రెండోసీడ్ డెన్మార్క్ జోడీ బొ మథియాస్, మోగిన్‌సెన్ చేతిలో రెండో రౌండ్‌లో ఓటమితో టోర్నీ నుంచి వైదొలగింది.

వహ్‌వా.. జాఫర్

ట్రిపుల్ దిశగా వసీం.. విదర్భ 589/3.. ఇరానీ ట్రోఫీ



జాఫర్ (285 బ్యాటింగ్)

ఉ. 9.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్-2లో...

నాగ్‌పూర్ : నాలుగు పదుల వయస్సులోనూ తనకు సాటిలేదని విదర్భ ఆటగాడు వసీమ్ జాఫర్ నిరూపించాడు. అలుపెరగని ఈ వెటరన్ (425 బంతుల్లో 34 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 285 బ్యాటింగ్) త్రిశతకం దిశగా దూసుకుపోతున్నాడు. ఫలితంగా రెస్టాఫ్ ఇండియాతో ఇరానీ కప్ మ్యాచ్‌లో రెండోరోజు ఆట ఆఖరికి విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 3 వికెట్లకు 589 పరుగుల భారీ స్కోరు చేసింది. 113 పరుగులతో గురువారం ఆట ప్రారంభించిన వసీమ్..తన వ్యక్తిగత స్కోరుకు మరో 172 పరుగులు జోడించాడు. ఇక గణేష్ సతీష్ (120)తో కలిసి మూడో వికెట్‌కు289, అపూర్వ్ వాంఖడే (44 బ్యాటింగ్)తో కలిసి నాలుగో వికెట్‌కు అభేద్యంగా 91 రన్స్ జోడించాడు.

రికార్డుల వెల్లువ: 40 ఏళ్ల వయస్సులో ఓ ఫస్ట్‌క్లాస్ ఇన్నింగ్స్‌లో 250 పరుగులకు పైగా చేసిన మొదటి ఆసియా ఆటగాడిగా ఘనత దక్కించుకున్నాడు. ఇంకా 18వేల పరుగులు చేసిన ఆరో భారత క్రికెటర్‌గా మరో రికార్డు నెలకొల్పాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అత్యధిక పరుగులు (25,834) చేసిన ఆటగాళ్లలో గవాస్కర్ అగ్రస్థానంలో ఉన్నాడు. అలాగే ఇరానీకప్‌లో వరుసగా ఆరు అర్ధసెంచరీలు కొట్టి గుండప్ప విశ్వనాథ్ తర్వాతి స్థానంలో నిలిచాడు. అంతేకాదు..ఇరానీకప్‌లో మురళీ విజయ్ (266) పేరిట ఉన్న అత్యధిక పరుగుల రికార్డును బద్దలుగొట్టాడు.

ఎవరో భారత్ ప్రత్యర్థి..!

- నేడు శ్రీలంక, బంగ్లాదేశ్ మ్యాచ్
- గెలిచిన జట్టు ఫైనల్‌కు • బంగ్లా కెప్టెన్ షకీబల్ రాక



జీవన్ మెండిస్

కొలంబో: ముక్కోణపు టీ20 సిరీస్‌లో భారత జట్టు ఇప్పటికే తుది పోరుకు అర్హత సాధించింది. ఇక శుక్రవారం బంగ్లాదేశ్, శ్రీలంక జట్ల మధ్య జరిగే మ్యాచ్‌లో ఫైనల్ చేరేది ఎవరో తేలనుంది. ఇప్పటి వరకు రెండు జట్లు చెరో రెండు పాయింట్లతో ఉన్నాయి. ఒకవేళ వర్షం కారణంగా మ్యాచ్ రద్దయితే నెట్ రన్‌రేట్ ఆధారంగా లంకకు అదృష్టం కలిసి వస్తుంది.

ఒత్తిడిలో లంక




షకీబ్

ఆతిథ్య జట్టు శ్రీలంక వరసగా రెండు పరాజయాలతో తీవ్ర ఒత్తిడిలో ఉంది. బంగ్లాతో జరిగిన తమ చివరి మ్యాచ్‌లో 200కు పైగా పరుగులు సాధించినా ఫలితం లేకపోయింది. ఆ తర్వాత భారత్ చేతిలోనూ ఓడింది. తమ లోపాలను సరిదిద్దుకుని సమష్టి ఆటతో ఈ మ్యాచ్‌లో రాణించి పరువు కాపాడుకోవాలని లంక భావిస్తోంది.

రాత్రి 7 గంటల నుంచి డీస్పోర్ట్స్‌లో

షకీబ్ జట్టులోకి..

చావో రేవో తేల్చుకోవాల్సిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్ జట్టులోకి అనూహ్యంగా సీనియర్ ఆల్‌రౌండర్, కెప్టెన్ షకీబల్ హసన్ రావడం వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచినట్టయింది. చేతివేలి గాయం కారణంగా ఈ సిరీస్‌లో ఇప్పటిదాకా షకీబల్ ఆడలేకపోయాడు. అతడి రాకతో జట్టు మంచి సమతూకం సాధించినట్టయింది. అయితే బంగ్లా తమ టాప్ ఆర్డర్ నుంచి మరింత నిలకడైన బ్యాటింగ్‌ను ఆశిస్తోంది. భారత్‌తో జరిగిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఈ విభాగం విఫలమైంది.



బోల్టన్ (84)

చేజారిన సిరీస్

రెండో వన్డేలోనూ మిథాలీ సేన ఓటమి

వడోదర : దక్షిణాఫ్రికాపై అదరగొట్టిన మిథాలీ సేన.. స్వదేశంలో ఆస్ట్రేలియాపై చేతులెత్తేసింది. గురువారం జరిగిన రెండో వన్డేలోనూ 60 పరుగులతో ఓటమిపాలై మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను చేజార్చుకుంది. టాస్ కోల్పోయి తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్ జట్టులో బోల్టన్ (84), ఎలిస్ పెర్రీ (70 నాటౌట్), బెత్ మూనీ (56) హాఫ్ సెంచరీలతో సత్తా చాటడంతో నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లకు 287 పరుగులు చేసింది. పేసర్ శిఖా పాండే (3/61) మూడు, లెగ్ స్పిన్నర్ పూనమ్ యాదవ్ (2/52) రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం భారత్ 49.2 ఓవర్లలో 227 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్లు స్మృతి మంధానా (67), పూనమ్ రౌత్ (27), వస్త్రాకర్ (30) మినహా అంతా విఫలమయ్యారు. స్పిన్నర్లు జొనాసెన్ (3/51), వెల్లింగ్టన్ (2/20), పేసర్ పెర్రీ (2/41) భారత్‌ను కట్టడి చేశారు. కెప్టెన్ మిథాలీ రాజ్ (15), దీప్తిశర్మ (45 బంతుల్లో 26) విఫలమయ్యారు. అయితే పూజ (33 బంతుల్లో 30) ఒకింత పట్టుదల ప్రదర్శించడంతో భారత్ స్కోరు 200 దాటింది. మూడో వన్డే ఆదివారం ఇక్కడే జరగనుంది.

భారత్‌కు 100లోపు ర్యాంక్


న్యూఢిల్లీ : ఫిఫా ర్యాంకింగ్స్‌లో భారత జట్టు వందలోపు స్థానాల్లో చోటు సంపాదించుకుంది. తాజా ర్యాంకింగ్స్‌లో భారత జట్టు లిబియాతో సంయుక్తంగా 99వ ర్యాంక్‌లో నిలిచింది. ఇటీవలి కాలంలో భారత జట్టు ఎలాంటి అంతర్జాతీయ మ్యాచ్‌ను ఆడకపోయినప్పటికీ మూడు స్థానాలు మెరుగుపరచుకుని 99వ ర్యాంక్‌కు చేరుకుంది. గత ఏడాది మూడుసార్లు వందలోపు ర్యాంకింగ్ సాధించిన భారత జట్టు 1996లో ఫిబ్రవరిలో అత్యున్నతంగా 94వ ర్యాంక్‌కు చేరుకుంది. ఆసియా దేశాల్లో భారత్ ప్రస్తుతం 13వ స్థానంలో ఉంది. ఆసియా దేశాలైన ఖతార్, ఒమన్, జోర్డాన్, బ్రహెయిన్, నార్త్ కొరియా దేశాలకంటే మెరుగైన ర్యాంకింగ్‌లో ఉంది. ఓవరాల్‌గా ఇరాన్ 33వ ర్యాంక్‌లో, జపాన్ 55 ర్యాంకుల్లో ఉన్నాయి. ఫిఫా ర్యాంకింగ్స్‌లో జర్మనీ అగ్రస్థానంలో నిలవగా, బ్రెజిల్, పోర్చుగల్, అర్జెంటీనా, బెల్జియం, పోలెండ్, స్పెయిన్, స్విట్జర్లాండ్, ఫ్రాన్స్, చిలీ తరువాతి స్థానాల్లో ఉన్నాయి. ఏఎఫ్‌సీ ఆసియా కప్ క్వాలిఫయింగ్ టోర్నీకి అర్హత సాధించిన భారత జట్టు తమ తొలి మ్యాచ్‌లో కిర్గిజ్ రిపబ్లిక్‌తో తలపడుతుంది.

సీవోఏ గుప్పిట్లోకి బీసీసీఐ!

- ఆఫీసు బేరర్ల అధికారాలకు కత్తెర
- సూచనలు చేసిన కమిటీ



వినోద్ రాయ్



సీకే ఖన్నా

న్యూఢిల్లీ: బీసీసీఐని తమ గుప్పిట్లోకి తీసుకునేందుకు కమిటీ ఆఫ్ అడ్మినిస్ట్రేటర్స్ (సీవోఏ) సిద్ధమైంది. తాజాగా ప్రధాన ఆఫీసు బేరర్ల అధికారాలను కత్తిరిస్తూ ఆదేశాలు జారీ చేసింది. బోర్డు తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నా, కార్యదర్శి అమితాబ్ చౌదరి, కోశాధికారి అనిరుధ్ చౌదరి అధికారాలను వినోద్ రాయ్ నేతృత్వంలోని సీవోఏ తన చేతుల్లోకి తీసుకుంది. బోర్డు కార్యకలాపాలన్నీ సీవోఏ అనుమతితోనే సాగాలని తేల్చి చెప్పింది. గతవారం సుప్రీం కోర్టుకు సమర్పించిన మధ్యంతర నివేదికలో ఆఫీసు బేరర్లను తొలగించాలని కోరింది.. ఇప్పుడు వారు ఎటువంటి ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా ఆదేశాలు జారీ చేసింది.

కార్యదర్శికి చెక్

కొత్త సూచనల ప్రకారం సీవోఏ అనుమతి లేకుండా అధికారులు ఎటువంటి పర్యటనలు, సమావేశాల కోసం వసతి సౌకర్యాలను ఏర్పాటు చేసుకునే అధికారం లేదు. అంతేకాకుండా లోధా సంస్కరణల సంబంధిత కేసుల్లో న్యాయసలహాల కోసం బోర్డు నిధులను ఉపయోగించుకోకుండా నిలిపివేసింది. రూ. 25 లక్షలకు పైబడిన చెల్లింపులు, కొత్త నియామకాల విషయంలో ఆఫీసు బేరర్ల అనుమతి అవసరం లేదని పేర్కొంది. కాగా, కొత్త సెంట్రల్ కాంట్రాక్ట్స్‌ను ఆఫీసు బేరర్లు అడ్డుకోవడంపై సీవోఏ హెడ్ వినోద్ రాయ్ కినుక వహించినట్టు తెలుస్తోంది. అంతేకాకుండా భారత ఆటగాళ్ల బీమా గడువు తేదీ కూడా త్వరలో ముగియనుండగా.. బోర్డు నుంచి తగిన స్పందన కొరవడడం కూడా రాయ్‌కు ఆగ్రహం తెప్పించిందని సమాచారం. మరోవైపు పేజ్-3 మాజీ జర్నలిస్టు, ఫిల్మ్ ప్రొడక్షన్ కంపెనీ తరఫున పనిచేస్తోన్న ప్రియా గుప్తాను బోర్డు జీఎం (మార్కెటింగ్)గా ఏడాదికి రూ.1.65 కోట్ల భారీ వేతనానికి నియమిస్తూ సీవోఏ తీసుకున్న నిర్ణయాన్ని కార్యదర్శి అమితాబ్ ప్రశ్నించాడు. ఇది పూర్తిగా నియంతృత్వ పోకడ అని తీవ్రంగా దుయ్యబట్టాడు. కాంట్రాక్ట్‌ల విషయంలో తమను పరిగణనలోకి తీసుకోలేదని, అసలు భారత క్రికెట్‌కు మార్కెటింగ్ అవసరం ఉందా? అని ప్రశ్నించాడు.

ఆఫీసు బేరర్లకు సీవోఏ తాజా సూచనలు

- సీవోఏ సూచనల మేరకు ఆఫీసు బేరర్లు, సీఈవో నడుచుకోవాలి. పరిపాలనలో తమకు సహకరించాలి.
- ఆఫీసు బేరర్లకు, ఉద్యోగులు/సహాయకులు/కన్సల్టెంట్ల మధ్య జరిగే సంప్రదింపుల గురించి సీఈవో, సీవోఏకు తప్పని సరిగా సమాచారం ఉండాలి. సీవోఏకు సమాచారం లేదని భావిస్తే.. పైన పేర్కొన్న వారెవరైనా ఆ కాపీని తమ దృష్టికి తీసుకురావచ్చు.
- సీవోఏ అనుమతి లేకుండా ఆఫీసు బేరర్లు లేదా వారి అసిస్టెంట్లు ఎటువంటి పర్యటన, వసతికి సంబంధించిన ఖర్చులు చేయకూడదు. అనుమతి కోరే ముందు ప్రయాణం, ఖర్చులకు సంబంధించి వివరణాత్మక నివేదికను సమర్పించాల్సి ఉంటుంది. (అమితాబ్ చౌదరి నెలలో 25 రోజుల పాటు బోర్డు ఖర్చులతో ప్రయాణాలు చేస్తున్నాడని, విలాసవంతమైన హోటళ్లలో బస చేస్తున్నాడనే ఆరోపణల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.)
- కేసుల విషయంలో ఆఫీసు బేరర్ల న్యాయసలహా ఖర్చులను బోర్డు భరించదు.
- బోర్డు కేసులకు సంబంధించిన అఫిడవిట్లు, దరఖాస్తులు, ఇతరత్రా విషయాల్లో సంతకాలు చేసే అధికారం సీవోఏకు మాత్రమే ఉంది.
- రూ.25 లక్షలకు పైబడిన కాంట్రాక్ట్‌లు/టెండర్లకు సంబంధించిన వాటి అనుమతి కోసం సీఈవో, సీవోఏ ముందు పెట్టాలి. బోర్డు తరఫున కార్యదర్శి వాటిపై సంతకాలు చేసే అధికారం ఉంది. కాగా, సీవోఏ ఆమోదం పొందిన కాంట్రాక్ట్‌పై కార్యదర్శి.. 5 రోజుల్లోపు సంతకాలు చేయకపోతే వాటిపై సీఈవో సంతకం చేసే విధంగా సీవోఏ సూచిస్తుంది.
- ఇక బోర్డు తరఫున చేసే చెల్లింపులన్నీ కార్యదర్శి, సీఈవోలు కలసి ఆమోదించాలి. ఇద్దరిలో ఎవరు విభేదించినా.. 3 రోజుల తర్వాత అది సీవోఏ ఆమోదం కోసం వస్తుంది. అయితే, సాధారణ చెల్లింపులకు మాత్రం సీవోఏ అనుమతి అవసరం లేదు.
- బోర్డు రాజ్యాంగం ప్రకారం ఆఫీసు బేరర్లు ఏవైనా అధికారాలు ఉపయోగించుకోవాలన్నా.. అందుకు సీవోఏ అనుమతి ఉండాల్సిందే.
- సర్వసభ్య సమావేశాలు, సబ్ కమిటీల ఏర్పాటు, ఏవైనా మీటింగులకు సంబంధించి బోర్డు నోటీసులు విడుదల చేసే ముందు సీవోఏ అనుమతి తీసుకోవాలి. ఆయా సమావేశాల అజెండా, తీసుకున్న నిర్ణయాలను సీవోఏకు నివేదించాలి. సీవోఏ అనుమతి లేకుండా ఎటువంటి నిర్ణయాలను అమలు చేయకూడదు.

తొలి మ్యాచ్‌లో భారత్×పాక్

చాంపియన్స్ ట్రోఫీ హాకీ

న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నీ తొలి మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో భారత్ తలపడనుంది. జూన్ 23 నుంచి జూలై 1 వరకు నెదర్లాండ్స్‌లోని బ్రెడాలో ఈ టోర్నీ జరగనుంది. ఆరు దేశాలు పాల్గొంటున్న టోర్నీ షెడ్యూల్‌ను అంతర్జాతీయ హాకీ సమాఖ్య విడుదల చేసింది. జూన్ 23న పాక్‌తో మ్యాచ్ తర్వాత 24న అర్జెంటీనాతో, 27న ఆస్ట్రేలియాతో, 28న బెల్జియంతో భారత్ ఆడనుంది.



ఇక కలసి ఉండడం కల్లే..!

పేసర్ షమి

కోల్‌కతా: తన భార్య హసీన్ జహాతో ఇక కలసి ఉండే అవకాశాలు లేవని భారత పేసర్ మహ్మద్ షమి అన్నాడు. వివాహేతర సంబంధాలతోపాటు షమీ మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డాడని అతడి భార్య హసీన్ ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. అయితే నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవడానికి తగిన ఆధారాలు తన వద్ద ఉన్నాయని షమి తెలిపాడు. తన సోదరుడితో శారీరక సంబంధం పెట్టుకోవాలని ఆమెను నేను ఒత్తిడి చేసినట్టుగా చెప్పినవన్నీ అబద్ధాలన్నాడు. 'కూతురి భవిష్యత్‌ను కాపాడుకోవడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేశాను. కానీ కోర్టుకు వెళ్లడానికే ఆమె సిద్ధమైంద'ని షమి ఆవేదన వ్యక్తం చేశాడు. ఇక కలసి ఉండే అవకాశాలు లేవన్నాడు. ఫిక్సింగ్ ఆరోపణలపై విచారణకు సహకరిస్తానన్నాడు. కాగా, ఆమె తన మొదటి వివాహం గురించి తన వద్ద దాచిందని వివరించాడు. హసీన్.. తన ఇద్దరు పిల్లలను సోదరి కూతుళ్లని చెప్పిందన్నాడు. వివాహం చేసుకున్న తర్వాత తనకు వాస్తవం తెలిసిందని చెప్పాడు.

వివేక్, శేష్‌నారాయణ్‌లకు ఊరట

అంబుడ్స్‌మన్ ఉత్తర్వులను సస్పెండ్ చేసిన హైకోర్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్ష, కార్యదర్శులు వివేక్, శేష్‌నారాయణ్‌లకు ఊరట లభించింది. వీరిద్దరూ అధ్యక్ష, కార్యదర్శులుగా కొనసాగడానికి అనర్హులంటూ హెచ్‌సీఏ అంబుడ్స్‌మన్ జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి ఈనెల 8న జారీ చేసిన ఉత్తర్వులను ఉమ్మడి హైకోర్టు సస్పెండ్ చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. హెచ్‌సీఏ, విశాక ఇండస్ట్రీస్ మధ్య వ్యాపార ఒప్పందాలు ఉన్నాయంటూ.. విశాక ఇండస్ట్రీస్ డైరెక్టర్‌గా వివేక్ వ్యవహరిస్తున్నారన్న కారణంగా ఆయన్ను అనర్హుడనడం సరికాదని వివేక్ తరఫున సీనియర్ న్యాయవాది శ్రీరఘురామ్ వాదనలు వినిపించారు. పరస్పర విరుద్ధ ప్రయోజనాలు ఉన్నట్లు భావిస్తే సరిదిద్దుకునేలా మార్గదర్శకాలు రూపొందించాల్సి ఉందన్నారు. అలాగే ఆయన హెచ్‌సీఏ అధ్యక్షునిగా ఎన్నిక కాకముందు నుంచే ప్రభుత్వ సలహాదారుగా ఉన్నారని, అయినా ఈ వ్యవహారం అంబుడ్స్‌మన్ పరిధిలోకి రాదని తెలిపారు. మరోవైపు హెచ్‌సీఏలో అవినీతికి సంబంధించిన కేసులో శేష్‌నారాయణ్ నిందితునిగా ఉన్నంత మాత్రాన అనర్హుడనడం సరికాదని ఆయన తరపు న్యాయవాది సతీష్ వాదించారు. శేష్ నారాయణ్‌పై ఇంకా నేరం రుజువు కాలేదని, అది జరిగితేనే ఆయన అనర్హుడవుతాడని పేర్కొన్నారు. అంబుడ్స్‌మన్ ఉత్తర్వులపై అప్పీల్‌కు అవకాశం లేకపోవడంతో హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందన్నారు. ఈ వాదనతో ఏకీభవించిన న్యాయమూర్తి అంబుడ్స్‌మెన్ ఉత్తర్వులను సస్పెండ్ చేసి ప్రతివాదులను కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణ వాయిదా వేశారు.

28 నుంచి విశాఖలో యాటింగ్ ఫెస్టివల్

సముద్రంలో నాలుగు రోజుల పండుగ

విశాఖపట్నం(ఆంధ్రజ్యోతి): దేశంలో తొలిసారిగా యాటింగ్ ఫెస్టివల్‌కు విశాఖ వేదిక కానున్నది. ఈనెల 28 నుంచి 31 వరకు నాలుగు రోజులపాటు నగరంలో యాటింగ్ ఫెస్టివల్ జరగనున్నది. ఇందుకోసం అంతర్జాతీయంగా పేరున్న సంస్థల నుంచి తొమ్మిది క్రూయిజ్‌లు తీసుకువస్తున్నారు. పాశ్చాత్య దేశాలలో పర్యాటకులు సముద్రంలో విహరించేందుకు టూరు ప్యాకేజీలు ఉంటాయి. మన దేశంలో కేరళలో పర్యాటకులు కుటుంబాలతో బోట్లలో గడిపే సదుపాయం ఉంది. అదేమాదిరిగా పర్యాటకులను ఆకర్షించడానికి ఈ యాటింగ్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించి 'వైజాగ్ యాటింగ్ ఫెస్టివల్' వెబ్‌సైట్ రూపొందించారు. ఫెస్టివల్ నాలుగు రోజులు క్రూయిజ్‌లలో సముద్ర విహారం ఉంటుంది. సాయంత్రం ఆర్కే బీచ్ సమీపానికి క్రూయిజ్‌లు తీసుకువస్తారు. క్రూయిజ్‌లతోపాటు స్థానికంగా కొన్ని బోట్లను అలంకరిస్తారు. రాత్రిపూట క్రూయిజ్‌లలో మ్యూజికల్ పార్టీలు ఏర్పాటుచేస్తారు. క్రూయిజ్‌లలో పర్యటించాలన్న ఆసక్తి వున్న వ్యక్తులు, కుటుంబాలు, కంపెనీలు ముందుగా రిజర్వు చేసుకునే సదుపాయం కల్పించారు. కంపెనీలు క్రూయిజ్‌ను రిజర్వు చేసుకుని తమ సంస్థ ప్రచారానికి వినియోగించుకోవచ్చు. కాగా బోట్లలో పర్యటించడానికి నగరానికి చెందిన వంద మందిని లాటరీ ద్వారా ఎంపిక చేసి రోజుకు 25 మందికి అవకాశం ఇస్తారు. ఫెస్టివల్ నిర్వహణకు ఈవెంట్ సంసకు పర్యాటక శాఖ రూ.మూడు కోట్లు విడుదల చేయనున్నది. అయితే ఫెస్టివల్‌పై పర్యాటక శాఖ, నిర్వాహకులు గోప్యత పాటించడంపై విమర్శలు వస్తున్నాయి.

ఏపీ జోడీకి టీటీ స్వర్ణం

హైదరాబాద్(ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): ఆలిండియా సివిల్ సర్వీసెస్ టేబుల్ టెన్నిస్ టోర్నీలో ఏపీ అధికారిణులు శ్రీమతి బేబీ సరోజిని, శ్రీమతి ఎస్.సత్యవతి జోడీ స్వర్ణం సాధించారు. హరియాణాలోని పంచకులలో జరిగిన పోటీల ఫైనల్స్‌లో ఏపీ జోడీ 3-1 గేమ్‌ల తేడాతో మధ్యప్రదేశ్ జోడీపై గెలుపొందింది. ఆలిండియా సివిల్ సర్వీసెస్ క్రీడలలో ఏపీ జోడీ స్వర్ణం సాధించడం ఇదే ప్రథమం. కాగా శ్రీమతి బేబి సరోజిని అంతకుముందు వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం సాధించింది.



కోల్‌కతా టెస్టు ఎంతో నేర్పింది



కోల్‌కతా : ఒకటిన్నర దశాబ్దం క్రితం ఈడెన్ గార్డెన్స్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టులో చరిత్రాత్మక ఇన్నింగ్స్ తనకు జీవితంలో ఎంతో నేర్పిందని వివిఎస్ లక్ష్మణ్ వివరించాడు. ఆ ఇన్నింగ్స్ తనతో పాటు పలు వురి జీవితాలనే మార్చివేసిందని, క్లిష్ట సమయాల్లో ఎలా వ్యవహరించాలో నేర్పిందన్నాడు. ఒక ప్రముఖ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో లక్ష్మణ్ పలు అంశాలను స్పృశించాడు. 2001లో ఈడెన్ గార్డెన్స్‌లో లక్ష్మణ్ ఆడిన అద్భుత ఇన్నింగ్స్ ఇప్పటికీ పలువురి మదిలో తాజాగానే ఉందని చెప్పాడు. చేజారుతుందనుకున్న టెస్టును లక్ష్మణ్ తన మరపురాని ఇన్నింగ్స్(281)తో భారత్‌కు విజయాన్నందించాడు. అతనికి ద్రావిడ్(180) మద్దతుగా నిలిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 171 పరుగులకు ఆలౌట్ అయిన తరువాత ఆస్ట్రేలియా 445 పరుగులు సాధించడంతో ఆ టెస్టు చేజారినట్టేనని అందరూ భావించారు. అయితే లక్ష్మణ్, ద్రావిడ్‌ల భాగస్వామ్యం(376) భారత్‌ను బరిలో నిలిపింది. రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 271 పరుగులకే కుప్పకూలడంతో ఇండియా 171 పరుగుల తేడాతో గెలుపొందడం ఇప్పటికీ తనకు గుర్తుందన్నాడు. తనకే కాదు సహచరులందరికీ ఆ టెస్టు చిరస్మరణీయమన్నాడు. ఆ విజయం తమ దృక్పథాన్నే మార్చివేసిందన్నాడు. ఆసీస్ దిగ్గజ బౌలర్ షేన్ వార్న్ తాను మరీ అంత చెత్తగా బౌలింగ్ చేయలేదని, లక్ష్మణ్ సొగసైన బ్యాటింగే తమ ఓటమికి కారణమని పేర్కొనడం తనకు ఎంతో తృప్తిని కలిగించిందన్నాడు. ఆ తరువాత ఎందరో తమకు ఆ ఇన్నింగ్స్ స్ఫూర్తిగా నిలిచిందని చెప్పడం తనకు మధురానుభూతిని కలిగించిందన్నాడు. క్లిష్ట పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో ఆ ఇన్నింగ్స్ నేర్పిందన్నాడు. ఆ ఇన్నింగ్స్‌తో తన కెరీర్‌ను తీర్చిదిద్దుకున్నానని, ఆ తరువాత వెనుతిరిగి చూసుకునే అవసరమే లేకపోయిందన్నాడు.



ఎర్ర కండువాతో వేలాది మందిని కాపాడారు!

న్యూఢిల్లీ, మార్చి 15: న్యూఢిల్లీలో ఘోర రైలు ప్రమాదం తప్పింది. ఇద్దరు ట్రాక్‌మెన్ల అప్రమతత్తతో వేలాదిమంది ప్రాణాలను రక్షించారు. గురువారం ఉదయం ఇద్దరు ట్రాక్‌మెన్లు ప్రియస్వామి(60), రామ్‌నివాస్(55) తిలక్ బ్రిడ్జి-యమున బ్రిడ్జి మధ్య ట్రాక్ పరిశీలించేందుకు వచ్చారు. అక్కడ ట్రాక్ తొలగిపోయి కనిపించింది. అదే సమయంలో శివ గంగ ఎక్స్‌ప్రెస్ అటువైపు వేగంగా దూసుకొస్తోంది. స్టేషన్ మాస్టర్‌కు సమాచారం అందించడానికి వారివద్ద ఫోన్ లేదు. క్షణం ఆలస్యం చేయకుండా భుజంపై ఉన్న ఎర్రకండువాతో ప్రియస్వామి రైలుకు ఎదురుగా పరుగెత్తాడు. రామ్‌నివాస్ కూడా తన కండువా ఊపాడు. దీంతో లోకోపైలట్ అప్రమత్తమై బ్రేకులు వేయడంతో పెను ప్రమాదం తప్పింది. వీరిద్దరి సమయస్ఫూర్తిని కొనియాడిన ఉత్తర రైల్వే డిప్యూటీ రైల్వే మేనేజర్ ఆర్‌ఏ న్‌సింగ్.. వారికి రివార్డు అందజేయనున్నట్లు తెలిపారు.

కార్తికి సుప్రీం ఊరట

న్యూఢిల్లీ, మార్చి 15: ఐఎన్ఎక్స్ కుంభకోణంలో నిందితుడైన కార్తి చిదంబరానికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఈ నెల 26 దాకా ఆయనను అరెస్ట్ చేయవద్దని ఈడీకి ఆదేశాలు జారీచేసింది. కార్తిని అరెస్ట్ చేయకుండా ఈనెల 22 దాకా ఢిల్లీ హైకోర్టు ఊరటనిచ్చిన కొద్ది గంటలకే సుప్రీంకోర్టు 26వ తేదీ దాకా పొడిగించింది.

నీట్‌లో తప్పుల సవరణకు 17వరకు అవకాశం

న్యూఢిల్లీ, మార్చి 15: నీట్ దరఖాస్తుల్లో పొరపాట్లను సరిదిద్దుకునేందుకు సీబీఎస్ఈ అవకాశం కల్పించింది. గురువారం ఉదయం నుంచే ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. ఈ అవకాశాన్ని వినియోగించుకునేందుకు విద్యార్థులు నీట్ వెబ్‌సైట్ www.cbseneet.nic.inను సంప్రదించాలని సూచించింది. పుట్టిన తేదీ, జెండర్, రాష్ట్ర కోడ్, కేటగిరీ, మాధ్యమం, పరీక్షాకేంద్రం కోడ్, అర్హత వంటి అంశాలలో తప్పులుంటే.. శనివారం రాత్రి 11.50లోపు మార్పులు చేసుకోవచ్చు.

గ్రాట్యుటీ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

న్యూఢిల్లీ, మార్చి 15: తీవ్ర గందరగోళ పరిస్థితుల మధ్యే గ్రాట్యుటీ చట్ట సవరణ బిల్లుకు గురువారం లోక్‌సభ ఆమోదం తెలిపింది. సభ ప్రారంభం కాగానే ప్రతిపక్షాలు నిరసన చేపట్టడంతో ఎలాంటి చర్చ లేకుండానే బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదిస్తున్నట్లు స్పీకర్ సుమిత్రా మహాజన్ ప్రకటించారు. ఈ బిల్లు రాజ్యసభలోనూ ఆమోదం పొందితే పన్ను రహిత గ్రాట్యుటీ పరిమితి రూ.20లక్షలకు పెరగనుంది. కాగా, ప్రత్యేక సహాయ చట్ట సవరణ బిల్లుకూ లోక్‌సభ ఆమోదం తెలిపింది.

తేజస్, శతాబ్దిలలో ఎల్‌సీడీలను తొలగిస్తాం: రైల్వే

న్యూఢిల్లీ, మార్చి 15: తేజస్, శతాబ్ది ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఎల్‌సీడీ టీవీలను తొలగిస్తామని రైల్వే మంత్రిత్వ శాఖ తెలిపింది. గతంలో ఈ రైళ్లలో ఆటోమేటిక్ డోర్స్, జీపీఎస్, స్మోక్ డిటెక్షన్, సీసీటీవీ వ్యవస్థలతోపాటు.. ప్రయాణికుల సౌకర్యార్థం ఎల్‌సీడీ టీవీలను ఏర్పాటు చేశామని పేర్కొంది. చాలా రైళ్లలో ఎల్‌సీడీలను ప్రయాణికులు ధ్వంసం చేశారని, ఈ కారణంగా టీవీలను తొలగించాలని నిర్ణయించామని వెల్లడించింది.

భారత అధికారులకు పాక్ వేధింపులు

న్యూఢిల్లీ, మార్చి 15: పాకిస్థాన్‌లో భారత దౌత్య అధికారులపై వేధింపులు తీవ్రమయ్యాయి. వారి విధులకు తరచూ ఆటంకాలు ఎదురవుతున్నాయి. భారత్ ఫిర్యాదులను పట్టించుకోని పాక్ ఎదురు ఆరోపణలు చేస్తుండడంతో ఇరు దేశాల మధ్య 'దౌత్య యుద్ధం' కొత్త మలుపు తిరిగింది. ఐఎస్ఐ దౌర్జన్యం, వేధింపులపై ఫిర్యాదు చేసినా పట్టించుకోని పాక్.. ఢిల్లీలోని తమ దౌత్య అధికారులు, సిబ్బందిని వేధిస్తున్నారని ఆరోపించింది. దీనిపై మాట్లాడేందుకు భారత్‌లో పాకిస్థాన్ హైకమిషనర్ సోహైల్ మహమూద్‌ను గురువారం వెనక్కి పిలిచింది. కాగా, పాక్ లేవనెత్తిన అభ్యంతరాలను పరిశీలిస్తున్నామని, తమ అధికారుల భద్రతకు భరోసా ఇవ్వాలని భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రవీష్ కుమార్ తెలిపారు.

నేటి నుంచి ఇండియన్ సైన్స్ కాంగ్రెస్

న్యూఢిల్లీ, మార్చి 15: మణిపూర్‌లోని ఇంఫాల్‌లో శుక్రవారం నుంచి జరగనున్న ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌ను ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. వాస్తవానికి హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 105వ సైన్స్ కాంగ్రెస్ జరగాల్సి ఉండగా.. పలు ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో ఇంఫాల్‌లో నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సదస్సుకు దేశవిదేశాలకు చెందిన శాస్త్రవేత్తలు హాజరుకానున్నారు.

'రాజ్యసభ'కు నలుగురు మంత్రుల ఏకగ్రీవం

న్యూఢిల్లీ, మార్చి 15: రాజ్యసభ బరిలో నిలిచిన నలుగురు కేంద్ర మంత్రులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం నామినేషన్ల ఉపసంహరణల అనంతరం బిహార్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో మొత్తం 17 మంది ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయా రాష్ట్రాల ఎన్నికల అధికారులు తెలిపారు. బిహార్ నుంచి కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ ఎన్నికయ్యారు. మహారాష్ట్రలో ప్రకాశ్ జావడేకర్, మధ్యప్రదేశ్ నుంచి థావర్‌చంద్ గహ్లోత్, చమురు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

బాధ్యత మరచిన ఎలక్ట్రానిక్ మీడియా

జే షా కేసులో సుప్రీం కోర్టు చురకలు



న్యూఢిల్లీ, మార్చి 15: జర్నలిస్టులు- ముఖ్యంగా ఎలక్ట్రానిక్ మీడియాలోనూ, వెబ్‌సైట్లలోనూ పనిచేసే పాత్రికేయులు మరింత బాధ్యతాయుతంగా మెలగాలని సుప్రీంకోర్టు హితవు పలికింది. బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా కుమారుడు జే షా - 'ది వైర్' అనే వెబ్‌సైట్ పై వేసిన పరువునష్టం కేసు విచారణ సందర్భంలో అత్యున్నత న్యాయస్థానం కొన్ని వ్యాఖ్యలు చేసింది. మోదీ ప్రధాని అయ్యాక - జే షా నడుపుతున్న టెంపుల్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే పవన విద్యుత్ ఉత్పత్తి సంస్థ ఆదాయం దాదాపు 16వేల రెట్లు పెరిగిందని.. అంతకుముందు ఏడాది కేవలం రూ 50వేల ఆదాయం ఉంటే 2016-17లో ఏకంగా రూ.80.5 కోట్లకు చేరిందని, ఇదెలా సాధ్యమన్నది సుస్పష్టమని సీనియర్ జర్నలిస్టు రోహిణి సింగ్ వైర్‌లో రాసిన ఓ వ్యాసం తీవ్ర దుమారం రేపింది. దీనిపై జే షా రూ.100 కోట్లకు పరువునష్టం దావా వేశారు. వైర్ వ్యాసం ఓ కల్పిత గాథ అని, అందులో నిజం లేదని షా తరఫు న్యాయవాది నీరజ్ కిషన్ కౌల్ వాదించారు. ఇది బాధ్యతారహిత జర్నలిజం అని తీవ్రంగా నిరసించారు. రోహిణి, వైర్ ఎడిటర్ల తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్.. సమాచారం సేకరించకుండా, ప్రశ్నలు వేయకుండా జర్నలిజం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. దీనిపై ఛీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా కల్పించుకుని 'అంటే.. ఏది తోస్తే అది రాసేయడమేనా జర్నలిజం అంటే? రాసే దానికి ఓ ప్రాతిపదిక ఉండక్కరలేదా? ఒక్కోసారి వారు (ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు)చేసేది కోర్టు ధిక్కారం కిందకి కూడా వస్తుంది. ఇదా జర్నలిజం?' అని ప్రశ్నించారు. తలా తోకా లేకుండా ఊహించి రాయడం జర్నలిస్టుల సంస్కృతి కారాదని ఆయన పేర్కొన్నారు. "ఎలక్ట్రానిక్ మీడియా అనేది బాధ్యతాయుతంగా ఉండాలి. కొందరు వ్యక్తులు ఓ ఉన్నతాసనంపై కూర్చొని ధర్మోపన్యాసాలిస్తూ ఉపదేశాలు చేస్తున్నారు. తమను తాము గొప్పగా ఊహించుకుంటున్నారు. ఇది సరికాదు. వారు ఇంకాస్త బాధ్యతాయుతంగా ఉండాలి." అని జస్టిస్ మిశ్రా వ్యాఖ్యానించారు. వెబ్‌సైట్లో ప్రచురితం అయ్యింది కదా.. అని భావించి ఇష్టానుసారం రాయడం, కల్పితాలు అద్దడం జర్నలిజం కాదన్నారాయన. "ఇది మీడియాను నియంత్రించడం కాదు.. నేనే ఎన్నోమార్లు ఈ నియంత్రణలను అడ్డుకున్నాను. తమకు వెబ్‌సైట్లున్నాయి గనక ప్రచురించడం, దాన్ని ఎలక్ట్రానిక్ మీడియాలో చూపడం సరికాదు" అని వివరించారు. కేసు తదుపరి విచారణను ఏప్రిల్ 12కి వాయిదా వేశారు.

పాక్‌లో ఆనందం.. మనకు అసంతృప్తి

'వాల్డ్ హ్యాపీనెస్ రిపోర్ట్'లో దిగజారిన భారత్

మనకంటే మెరుగైన స్థానంలో పాకిస్థాన్



న్యూఢిల్లీ, మార్చి15: క్యాలండర్ మారుతున్నకొద్దీ భారతీయుల్లో ఆనందం ఆవిరవుతోంది. సంతోషం మాయమవుతోంది. ఐక్యరాజ్య సమితి విడుదల చేసిన 'ప్రపంచ సంతోషకర దేశాల జాబితా'లో భారత్ 133వ స్థానంలో నిలిచింది. గత ఏడాదితో పోలిస్తే 2018లో ఈసారి 11 స్థానాలు దిగజారింది. ఐక్యరాజ్య సమితి 'వాల్డ్ హ్యాపీనెస్ రిపోర్టు'లో భారత్ కంటే పాకిస్తాన్ సంతోషంగా ఉండటం గమనార్హం! నిత్యం ఉగ్రవాద దాడులతో రక్తమోడే పాకిస్తాన్.. గత ఏడా ది కూడా జాబితాలో భారత్ కంటే మెరుగ్గానే ఉంది. 2018లో మరో 5 స్థానాలు ఎగబాకి 75వ స్థానంలో నిలిచింది. బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్,శ్రీలంకలు 'హ్యాపీనెస్ ర్యాంకింగ్స్'లో భారత్ కంటే మెరుగైన స్థానాల్లో ఉన్నాయి. చైనా కూడా భారత్ కంటే సంతోషంగానే ఉంది.

ఐక్యరాజ్యసమితికి చెందిన 'సస్టైనబుల్ డెవలప్‌మెంట్ సొల్యూషన్స్ నెట్‌వర్క్' 156 దేశాల్లో నిర్వహించిన అధ్యయనం ప్రకారం.. ఫిన్లాండ్ ప్రపంచంలోనే అత్యంత సంతోషంగా ఉన్న దేశంగా నిలిచింది. జాబితాలో అమెరికా, యూకేలు 18, 19స్థానాల్లో ఉన్నాయి. మొదటి నాలుగు స్థానాల్లో ఫిన్లాండ్, నార్వే, డెన్మార్క్, ఐస్‌లాండ్ నిలిచాయి. ఆదాయం, స్వేచ్ఛ, నమ్మకం, ఔదార్యం, జీవన సాఫల్యత, అవినీతి వ్యతిరేకచట్టాలు, సామాజిక సహకారం అంశాల అధారంగా ఫిన్లాండ్ ప్రజలు అందరి కంటే హ్యాపీగా ఉన్నారని 'జాయ్ రిపోర్టు' తేల్చింది.

-సెంట్రల్ డెస్క్

పరీక్షలో సాయం చేస్తానని అత్యాచారం

పదో తరగతి విద్యార్థినిపై ప్రిన్సిపాల్ అఘాయిత్యం

చండీగఢ్, మార్చి 15: విద్యా బుద్ధులు నేర్పాలిన గురువే పశువు కంటే హీనంగా ప్రవర్తించాడు. పరీక్ష రాసేందుకు రమ్మని పదో తరగతి విద్యార్థిని(16)పై అత్యాచారానికి పాల్పడ్డాడో ప్రిన్సిపాల్. ఈ అమానవీయ ఘటన హరియాణాలోని సోనిపట్ జిల్లా గోహానాలో చోటుచేసుకుంది. బాధితురాలి తండ్రి తెలిపిన వివరాల ప్రకారం.. 'ప్రిన్సిపాల్‌తో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం నా కూతురి శారీరక దృఢత్వ పరీక్ష వేరే విద్యార్థిని రాస్తుందని, అంతవరకు నా కూతుర్ని అతడి(ప్రిన్సిపాల్) బంధువుల ఇంట్లో ఉంచాలని సూచించాడు. పరీక్ష పూర్తయ్యాక వచ్చి తీసుకెళ్లాలని చెప్పడంతో సరేనని వెళ్లిపోయా'నని పోలీసులకు తెలిపాడు. కానీ, తిరిగి వచ్చే సరికి తన కూతురు రోదిస్తూ ప్రిన్సిపాల్ అత్యాచారం చేసిన విషయాన్ని చెప్పడంతో నిర్ఘాంతపోయానని వాపోయాడు. ప్రస్తుతం ప్రిన్సిపాల్, ఇద్దరు మహిళలు పరారీలో ఉన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో కృష్ణా టాప్

▸▸ వెనుకబడిన విశాఖ

అమరావతి, మార్చి 15, (ఆంధ్రజ్యోతి): మీసేవ ఫిర్యాదుల పరిష్కారంలో రాష్ట్రంలో కృష్ణా జిల్లా ప్రథమ స్థానంలో నిలవగా, విశాఖపట్నం చివరి స్థానంలో మిగిలింది. వివిధ శాఖలకు సంబంధించి ఇప్పటివరకు దాదాపు 111 కోట్ల ఫిర్యాదులు మీసేవ ద్వారా వచ్చాయి. వీటిపై ప్రతి 15 రోజులకోసారి..(నెలలో రెండుసార్లు) సీఎం చంద్రబాబు సహా సాధారణ పరిపాలన శాఖ కూడా సమీక్షిస్తోంది. తాజా లెక్కల ప్రకారం మీసేవ ద్వారా వచ్చిన అర్జీల పరిష్కారంలో కృష్ణా, పశ్చిమగోదావరి, విజయనగరం జిల్లాలు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. కృష్ణా జిల్లాలో 81.4లక్షల అర్జీలు రాగా, అందులో పరిష్కారం కావాల్సినవి కేవలం 199 మాత్రమే ఉన్నాయి. ఉపాధి హామీలో వర్మికంపోస్ట్ పిట్స్ నిర్మాణంలో కృష్ణా, తూర్పుగోదావరి, కర్నూలు జిల్లాలు మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. కృష్ణా జిల్లాలో 84.80శాతం వర్మికంపోస్టు యూనిట్లు, తూర్పుగోదావరి జిల్లాలో 78.54శాతం యూనిట్లు పూర్తయ్యాయి. పశ్చిమగోదావరి జిల్లా 10.58 శాతంతో చివరి స్థానంలో ఉంది. మరోవైపు ఉపాధి హామీ పథకంలో కూలీలకు ఆధార్, బ్యాంక్ ఖాతాల నంబర్లు సరిపోకపోవడం వంటి వివిధ కారణాలతో ఆగిన చెల్లింపులను తిరిగి చెల్లించడంలో కూడా కృష్ణా, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలు మొదటి మూడు స్థానాల్లో నిలవడం విశేషం.


సీబీఎస్ఈ అకౌంటెన్సీ ప్రశ్నపత్రం లీక్!

సోషల్ మీడియాలో పేపర్ కాపీలు.. ఖండించిన బోర్డు

న్యూఢిల్లీ, మార్చి 15: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) పన్నెండో తరగతి అకౌంటెన్సీ పరీక్ష ప్రశ్నపత్రం లీకైందంటూ ఢిల్లీలో ప్రచారం సాగింది. గురువారం జరిగిన అకౌంటెన్సీ పరీక్ష రెండో సెట్ ప్రశ్నపత్రం నమూనాలు సోషల్ మీడియా, వాట్సాప్‌లో చక్కర్లు కొట్టాయి. కష్టపడి చదువుకునే విద్యార్థులకు ఇలాంటి ఘటనల వల్ల నష్టం వాటిల్లుతుందంటూ ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా ట్విటర్ ద్వారా సీబీఎస్ఈ తీరుపై మండిపడ్డారు. లీకేజీ వ్యవహారాన్ని సీబీఎస్ఈ ఖండించింది. సోషల్ మీడియా ప్రచారంలో వాస్తవం లేదని, దీనిపై విచారణకు ఆదేశించామని ఒక ప్రకటనలో తెలిపింది.

గుండెపోటుతోనే లాల్‌బహదూర్ శాస్త్రి మృతి

▸▸ భారత ప్రభుత్వం వెల్లడి



ముంబై, మార్చి 15 : గుండెపోటుతోనే భారత మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి చనిపోయారని భారత ప్రభుత్వం వెల్లడించింది. ఇప్పటి వరకు బయటకు రాని శాస్త్రి మరణ రిపోర్టును రిపబ్లిక్ టీవీ సంపాదించింది. గుండెకు రక్త సరఫరా ఆగిపోవడంవల్లే ఆయన మరణించారని పేర్కొన్నారు. 1966 జనవరి 11న తాష్కెంట్‌లో శాస్త్రి మృతి చెందారు.

దేశపు తొలి క్లోనింగ్ అస్సామీ గేదెదూడ జననం



హిసార్, మార్చి 15 : దేశపు మొట్టమొదటి క్లోనింగ్ అస్సామీ గేదెదూడను శాస్త్రవేత్తలు సృష్టించినట్లు గేదెల పరిశోధన కేంద్ర సంస్థ (సీఐఆర్‌బీ) తెలిపింది. 'క్లోన్ దూడను సృష్టించడానికి ప్రత్యేక పద్ధతులు పాటించాం. 2017 డిసెంబర్ 22న సాధారణ ప్రసవం ద్వారా ఈ దూడ పుట్టింది' అని క్లోనింగ్ బృందానికి నేతృత్వం వహించిన పీఎస్ యాదవ్ తెలిపారు. హైటెక్ సచ్ డెయిరీఫాంలోని క్లోనింగ్ లేబొరేటరీకి 100 కిలోమీటర్ల దూరంలోని ఒక పొలంలో ఈ దూడ జన్మించిందని, దీనికి సచ్ గౌరవ్ అని పేరుపెట్టామని ఆయన చెప్పారు. ప్రత్యేకమైన గేదె జాతులను సంరక్షించే బాధ్యతను భారత వ్యవసాయ పరిశోధక మండలి (ఐసీఏఆర్), సీఐఆర్‌బీ పంచుకుంటున్నాయి. దేశంలోని ఈశాన్య ప్రాంతాల్లో మాత్రమే అస్సామీ గేదెలు కనబడుతాయని, వ్యవసాయానికి వాటిని ఉపయోగిస్తారని ఐసీఏఆర్, సీఐఆర్‌బీ డైరెక్టర్ ఇంద్రజిత్ సింగ్ తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107
Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.